
'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి
సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం
ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 167
శుక్రవారం 6-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



**ధరమ్‌వీర్ ధమాకా**
పారాలింపిక్స్ క్లబ్ త్రోలో స్వర్ణం. రజతం గెలిచిన ప్రణవ్
- 17లో


**భారత్‌లోనూ 'సింగపూర్‌లు'**
అదే తమ లక్ష్యమని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 6లో



# ఏఐకి 'ఫ్యూచర్' సిటీనే

## ఫ్యూచర్ సిటీని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఇందులో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూనే భవిష్యత్తును సృష్టిస్తాం
- నాస్కామ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ ఫ్రేమ్‌వర్క్ అమలు
- తెలంగాణ గ్లోబల్ ఏఐ సదస్సును ప్రారంభించిన సీఎం
- పరిశ్రమల ఏర్పాటుకు హైదరాబాద్‌తో సరిపోలే నగరమేదీ దేశంలో లేదని వెల్లడి
- ఫ్యూచర్ సిటీలోని 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు: శ్రీధర్‌బాబు


ఏఐ సిటీ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, నాస్కామ్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, రమాదేవి(ఎమర్జింగ్ టెక్నాలజీస్), ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక రంగంలో అత్యుత్తమ ఆవిష్కరణగా చెప్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు - ఏఐ) టెక్నాలజీకి హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పరిశ్రమల ఏర్పాటుకు హైదరాబాద్‌తో సరిపోలే నగరమేదీ దేశంలో లేదని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఏఐ రంగంలో హైదరాబాద్ కేంద్రంగా భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఏఐని ప్రోత్సహించే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూనే భవిష్యత్తును సృష్టిస్తామన్నారు. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని భారత్ సరిగా అనుసరించలేక పోయిందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో రెండు రోజుల పాటు జరిగే 'తెలంగాణ గ్లోబల్ ఏఐ సదస్సు'ను గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

### నిపుణులు భాగస్వాములు కావాలి..

కొత్తగా నిర్మితమయ్యే ఫ్యూచర్ సిటీని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, అందులో నిపుణులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. 'తెలంగాణ ఏఐ మిషన్', నాస్కామ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు లేకుండా సమాజంలో ఏ మార్పూ సాధ్యం కాదని చెప్పారు. రైలు ఇంజిన్, విమానం ఆవిష్కరణతో ప్రపంచ స్వరూపం మారిపోగా.. కరెంటు, బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్ వంటి ఆవిష్కరణలు ప్రపంచ గతిని మార్చడంలో కీలకపాత్ర పోషించాయని అన్నారు. టీవీ, కంప్యూటర్, ఇంటర్నెట్,

మిగతా 8వ పేజీలో ▶

# భూమి రాళ్లపాలు బతుకు రోడ్డుపాలు!

- అసలే ఇళ్లు, సామగ్రి అంతా నీట మునిగి నష్టపోయిన గిరిజనులు
- దానికితోడు జీవనాధారమైన పొలాలూ రాళ్ల పాలు కావడంపై ఆవేదన
- ఆకేరు వాగు ఉధృతితో వెయ్యి ఎకరాలకు పైగా భూముల్లో ఇసుక, రాళ్ల మేటలు
- అవి సాగుకు పనికొచ్చేలా చేయాలంటే లక్షల రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి
- ఏం చేయాలో, ఎలా బతకాలో తెలియడం లేదంటూ ఆందోళన

2లో

**రాళ్ల కుప్పలు కాదు.. వరి పొలమే!**

ఈ చిత్రంలో కుప్పలుకుప్పలుగా రాళ్లతో నిండి కనిపిస్తున్నది వ్యవసాయ భూమే! ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా వద్ద ఆకేరు వాగు వరద ఉధృతికి.. పొలంలో సారమంతా కొట్టుకుపోయి ఇలా రాళ్లు, రప్పలు మిగిలాయి. ఇకపై ఎలాంటి పంటలూ పండించలేకుండా తయారైంది.



**ఐదు రోజులైనా అదే యాతన**
2లో

## న్యూస్‌రీల్

### ఏ చెట్లు.. ఎన్ని కూలాయి?



ములుగు అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో చెట్లు నేలకూలడంపై అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. రెండు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దాదాపు 70వేల చెట్లకు నష్టం జరిగినట్టుగా ఆ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది.

- వివరాలు 5లో

### ఆ ఖర్చంతా మార్గదర్శి భరించాల్సిందే



మార్గదర్శి యాజమాన్యం చందాదారులందరికీ డిపాజిట్ల నగదు తిరిగి చెల్లించిందా?.. లేదా అనే వివరాలు తెలుసుకునే చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీకి చెబుతూ, దీనికయ్యే ఖర్చంతా సంస్థే భరించాలని హైకోర్టు చెప్పింది.

- వివరాలు 18లో

### మరో 3 రోజులు వానలు

- వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- దాని ప్రభావంతో ఆరు జిల్లాల్లో భారీ వర్షాలకు చాన్స్
- మిగతా చోట్ల మోస్తరు వానలు పడతాయన్న వాతావరణ శాఖ

- వివరాలు 2లో

# 6,000 పోస్టులతో మరో డీఎస్సీ

- పది రోజుల్లో డీఎస్సీ ఫలితాలు
- ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్
- గురుపూజోత్సవ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- 150 మంది టీచర్లకు పురస్కారం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి పొన్నం, కేకే

సాక్షి, హైదరాబాద్: మరో ఆరు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలో డీఎస్సీ వేయబోతున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 17,862 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు జీవో జారీ చేసినట్టు వెల్లడించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం రవీంద్రభారతిలో గురుపూజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ, ప్రగతిశీల సమాజ నిర్మాణంలో టీచర్లది కీలకపాత్ర అని కొనియాడారు. 2007లో ఆంగ్ల మాధ్యమ బోధనపై విమర్శలు వచ్చినా, టీచర్లు సహకరించారని భట్టి గుర్తు చేశారు. ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో ▶

## టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం రాసలీలలు..

- మాట్లాడాలంటూ హోటల్‌కు పిలిచి అఘాయిత్యాలకు తెగబడ్డారు
- భర్త, పిల్లల్ని చంపేస్తానని బెదిరించి దారుణానికి పాల్పడ్డారు
- ఆయన ఆగడాలు భరించలేక ఎమ్మెల్యే లీలలు రహస్య కెమెరాలో రికార్డు చేశా
- పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి సంచలన ఆరోపణలు

14లో

## ఆరుగురు మావోయిస్టులు హతం

**భద్రాద్రి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్**



- భద్రాద్రి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఈ కాల్పుల్లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీకి చెందిన ఆరుగురు మావోయిస్టులు చనిపోయినట్టు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. మృతుల్లో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు.

- వివరాలు 5లో

# స్థానికంగా ఉంటే అనుమతించండి

- 'నివాసం' మార్గదర్శకాలు రూపొందించండి
- వేరే రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాశారని స్థానికత నిరాకరించడం సరికాదు
- వైద్యవిద్య అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జీవో 33లోని 'స్థానికత' నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజే ధర్మాసనం తీర్పు



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసితులైన పిటిషనర్లు 85 శాతం స్థానిక కోటా కింద అర్హులేనని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. అయితే ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని.. అందువల్ల తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. వైద్యవిద్య ప్రవేశాల కోసం ప్రభుత్వం తెచ్చిన జీవో 33లోని నిబంధన 3 (ఏ)ను సవాల్ చేస్తూ దాఖలైన 53 పిటిషన్లపై

మిగతా 14వ పేజీలో ▶



**ఇదంజగత్**




అర్జంటుగా శిక్షలు ఆపండి సార్! వరద మృతుల కన్నా 'మరణశిక్ష' మృతుల సంఖ్య పెరుగుతుంది.

## సీఎం సహాయ నిధికి విద్యుత్ ఉద్యోగుల విరాళం



ఉపముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు, పెన్షన్‌దారులు అంతా కలిసి ఒక రోజు మూల వేతనం సుమారు రూ.15 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు సెప్టెంబర్ నెల ఒక రోజు మూల వేతనాన్ని సీఎం సహాయ నిధికి జమ చేయాల్సిందిగా కోరుతూ గురువారం వినతి పత్రాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రోస్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

**ఎస్‌బీఐ, అరబిందో, ఏఐజీ ఆసుపత్రుల విరాళం రూ.11 కోట్లు**



చెక్ అందజేస్తున్న అరబిందో ఫార్మా

భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏఐజీ ఆసుపత్రుల యాజమాన్యం ముందుకు వచ్చాయి. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సీఎం నివాసంలో ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, డీజీఎం జితేందర్‌శర్మ, ఏజీఎం దుర్గాప్రసాద్‌లు కలిసి ఎస్‌బీఐ ఉద్యోగుల ఒకరోజు వేతనం రూ.5 కోట్ల విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందచేశారు. అరబిందో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ కె.నిత్యానందరెడ్డి, కంపెనీ డైరెక్టర్ మదన్ మోహన్‌రెడ్డిలు సీఎం, డిప్యూటీ సీఎంలను కలసి వరద బాధితులకోసం రూ.5 కోట్ల విరాళాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కు అందచేశారు. అలాగే సీఎం సహాయ నిధికి ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి రూ. కోటి విరాళాన్ని అందచేశారు.



సీఎంకు విరాళం అందజేస్తున్న డి. నాగేశ్వర్‌రెడ్డి

**మల్లు రవి నెల వేతనం విరాళం**

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఒక నెల వేతనాన్ని అందజేశారు. బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు నెల వేతనం రూ.1.9 లక్షలు సీఎంఆర్ ఎఫ్‌కు విరాళంగా అందజేశారు.

**హెటిరో విరాళం రూ.2 కోట్లు**



ఖమ్మం సహకారనగర్: వరద బాధితులను ఆదుకునేందుకు హెటిరో డ్రగ్స్, సింధు ఆస్పత్రుల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.కోటి చొప్పున సాయం ప్రకటించారు. ఈమేరకు ఆయన గురువారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి రూ. కోటి చెక్కును అందించారు.

## నేడు ఖమ్మం జిల్లాకు కేంద్ర మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రానికి వాటిల్లిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏరియల్ సర్వేకు సిద్ధమైంది. ఖమ్మం జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. శివరాజ్ సింగ్ శుక్రవారం ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి నేరుగా ఖమ్మం చేరుకోనుండగా బండి సంజయ్ ఆయనతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. అనంతరం పంట నష్టంతో పాటు ఆస్తి నష్టంపై కేంద్ర, రాష్ట్ర అధికారులతో వారు సమీక్షించనున్నారు.

## ఇంటికన్నె-కేసముద్రం డౌన్ లైన్‌లోనూ నడిచిన రైళ్లు

కేసముద్రం: ఇంటికన్నె-కేసముద్రం డౌన్‌లైన్‌లోనూ గురువారం రైళ్లు నడిచాయి. భారీవర్షాల కారణంగా కేసముద్రం-ఇంటికన్నె, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వేట్రాక్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. తాళ్లపూసపల్లి- మహబూబాబాద్ మధ్య ఇప్పటికే పనులు పూర్తయి బుధవారం నుంచే రైళ్లు నడుస్తున్నాయి. కాగా ఇంటికన్నె-కేసముద్రం మధ్య 418 కిలోమీటర్ వద్ద ట్రాక్‌కు గండిపడిన చోట మరమ్మతు పనులు పూర్తి చేయగా.. బుధవారం అప్‌లైన్‌లో రైళ్లను నడిపించిన విషయం తెలిసిందే. డౌన్‌లైన్ రైల్వేట్రాక్ మరమ్మతు పనులను బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పూర్తిచేశారు.

# వందేళ్ల వంతెన చాన్నాళ్లు
# 12 ఏళ్ల వంతెనకు నూరేళ్లు


బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిలిపేసిన అధికారులు

కాల్వొడ్డులో 36 అడుగులకు పైగా వరదను తట్టుకున్న నిజాం కాలంనాటి వంతెన

నిజాం కాలంలో వందేళ్ల క్రితం ఖమ్మం మున్నేరుపై రాతి కట్టడంగా నిర్మించిన బ్రిడ్జి 36.9 అడుగుల మేర వరదను తట్టుకుని నిలబడింది. అదే మున్నేరుపై ప్రకాశ్‌నగర్ వద్ద పదేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి స్పాన్ మాత్రం పక్కకు జరిగింది. భారీ వరదతో బ్రిడ్జి స్పాన్ బేరింగ్ పైనుంచి పక్కకు జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈనెల 1న ఉదయం 9 నుంచి రాత్రి 12 గంటల వరకు మున్నేరుకు భారీగా వరద వచ్చింది. 36.9 అడుగుల మేర వరద ప్రవాహం ఆరు గంటలపాటు కొనసాగింది. ఈ వరద ప్రవాహంతోనే బ్రిడ్జి స్పాన్ బేరింగ్‌ల పైనుంచి పక్కకు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకొన్ని గంటలు వరద ఇలాగే కొనసాగితే బ్రిడ్జికి ముప్పు వాటిల్లేదని నిపుణులు చెబుతున్నారు.

- ఖమ్మం మయూరి సెంటర్

కాల్వొడ్డు వద్ద నిజాం కాలంలో రాతి కట్టడంగా నిర్మించిన బ్రిడ్జి



మున్నేటి వరదతో కదిలిన ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి స్పాన్

**పదిలంగా వందేళ్ల బ్రిడ్జి..**

అనేకసార్లు భారీగా వరదల తాకిడి తగిలినా ఎక్కడా తొణుకు లేకుండా ఖమ్మం కాల్వొడ్డు వద్ద నిర్మించిన బ్రిడ్జి పదిలంగా నిలిచింది. నిజాంల కాలంలో రాతితో కట్టిన ఈ బ్రిడ్జి వద్ద పలుసార్లు 30 అడుగులకు పైగా వరద ప్రవహించినా చెక్కుచెదరలేదు. గత పదేళ్లుగా బ్రిడ్జి పని అయిపోయిందని, వందేళ్లు దాటినందున ప్రమాదం పొంచి ఉన్నట్లేనని అధికార యంత్రాంగం, ప్రజలు చర్చించుకుంటున్నా.. సగర్వంగా నిలవడం విశేషం. కాగా, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై ఎస్12 స్పాన్ పక్కకు జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు.



బేరింగ్ పైనుండి పక్కకు జరిగిన ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి ఎస్12 స్పాన్

**మూడో బ్రిడ్జిగా నిర్మాణం..**

హైదరాబాద్, సూర్యాపేట, హైదరాబాద్, కోదాడ, విజయవాడ ప్రాంతాల వైపు నుంచి ఖమ్మం నగరంలోకి వచ్చేందుకు మున్నేరుపై మూడు వంతెనల నిర్మాణం జరిగింది. 110 ఏళ్ల క్రితం నిజాం కాలంలో కాల్వొడ్డు వద్ద ఒక బ్రిడ్జి.. కరుణగిరి వద్ద రెండు దశాబ్దాల క్రితం మరో బ్రిడ్జి నిర్మించారు. నానాటికీ రద్దీ పెరగడంతో 2010లో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరుపై మూడో బ్రిడ్జి నిర్మాణానికి నాటి ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. 2013లో ఈ బ్రిడ్జి అందుబాటులోకి రాగా.. గత ఏడాది 30.7 అడుగులు, ఈనెల 1న 36.9 అడుగుల మేర వరద వచ్చింది. తాజా వరదతో బ్రిడ్జి నాణ్యత వెలుగులోకి వచ్చిందన్న చర్చ జరుగుతోంది.

**పచ్చని పొలంలో.. ఇసుక, రాళ్ల మేటలు**



ఈయన పేరు పోతుగంటి సహదేవ్. తిరుమలాయపాలెం మండలం రాకాసితండాకు చెందిన ఈయన నాలుగున్నర ఎకరాల్లో వరిసాగు చేశారు. నెల రోజుల క్రితమే నాట్లు వేయగా.. ఇటీవలే కలుపు తీసి ఎరువులు వేశాడు. కానీ ఆకేరు వరదతో కళ్లముందే పొలం నామరూపాలు లేకుండా పోయింది. అంతా ఇసుక, రాళ్ల మేటలు వేసింది. అదంతా తొలగించాలంటే లక్షల రూపాయలు ఖర్చవుతుందని సహదేవ్ వాపోతున్నారు. భార్య పుస్తెలతాడు కుదువ పెట్టిన డబ్బులతో పంటకు పెట్టుబడి పెట్టానని.. ఆ పంటా పోయి, ఇప్పట్లో పంటలు పండించే పరిస్థితీ లేక.. ఎలా బతకాలో తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమి రాళ్లపాలు

# బతుకు రోడ్డుపాలు!

**అసలే ఇళ్లు, సామగ్రి అంతా నీట మునిగి నష్టపోయిన గిరిజనులు**

**దానికితోడు జీవనాధారమైన పొలాలూ రాళ్ల పాలు కావడంపై ఆవేదన**

తిరుమలాయపాలెం: అకస్మాత్తు వరదలతో ఇళ్లు నీట మునిగి, సామగ్రి అంతా కోల్పోవడమే కాదు.. జీవనాధారమైన పంట పొలాలనూ కోల్పోయిన దుస్థితి నెలకొంది. పచ్చని పంటలతో కళకళలాడే భూములను ఆకేరు వరద రాత్రికి రాత్రే బీడు భూములుగా మార్చేసింది. ఒక్కసారిగా చుట్టుముట్టిన వరదను చూసి కట్టుబట్టలతో పరుగెత్తిన గిరిజనులు.. వరద తగ్గాక వచ్చి చూసేసరికి ఇళ్లు, సామగ్రి అంతా నాశనమయ్యాయి. దాన్ని ఏదోలా దిగమింగుకుని పొలాల వద్దకు వెళ్లి చూసిన రైతులు.. అక్కడంతా రాళ్లురప్పలు, ఇసుక మేటలే కనిపించడంతో ఆవేదనతో కన్నీట మునిగిపోయారు. అసలు ఎవరి భూమి ఎక్కడ ఉందో తెలియనంతగా మారిపోవడాన్ని తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు.

**రాకాసి తండాను తుడిచిపెట్టిన ఆకేరు**

70 కుటుంబాలు ఉన్న రాకాసితండాకు పక్కనే ఆకేరు ప్రవహిస్తుంది. సాగునీరు అందుబాటులో ఉండటంతో.. ఇక్కడి గిరిజన రైతులు మిర్చి, పత్తి, వరి పండిస్తారు. కానీ మునుపెన్నడూ లేనంతగా ఆకేరు పోటెత్తడంతో వరద గ్రామాన్ని చుట్టుముట్టింది. గిరిజనులంతా ఎక్కడికక్కడ వదిలేసి సమీపంలోని గుట్టలపైకి చేరుకున్నారు. ఆ వరద కొద్ది గంటల్లోనే చాలా ఇళ్లను నేలమట్టం చేసింది. ధాన్యం, బియ్యం, నిత్యావసరాలు, ఇతర వస్తువులన్నీ కొట్టుకుపోయాయి.

**పొలాలన్నీ మాయం..**

సారవంతమైన ఆకేరు పరీవాహక గ్రామాల్లోని వ్యవసాయ భూములు వరదతో ఆనవాళ్లు కోల్పోయాయి. తిరుమలాయపాలెం మండలంలోని హైదర్‌సాయిపేట, రావిచెట్టుతండా, తూర్పుతండా, అజ్మీరాతండా, రాకాసితండా, బీసురాజుపల్లితండా, రమణా తండాల పరిధిలో వెయ్యి ఎకరాలకుపైగా భూములు నామరూపాల్లేకుండా రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయి. సాగునీటి బోర్లు, మోటార్లు, పైపులు కూడా జాడ లేకుండా పోయాయి. మరోవైపు బీరోలు, బంధంపల్లి చెరువులకు గండ్లు పడి.. దిగువన ఉన్న పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. ఈ భూములను తిరిగి సాగుయోగ్యంగా మార్చాలంటే.. లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తామంటున్న అరకొర సాయం ఎలా కాపాడుతుందని ప్రశ్నిస్తున్నారు.

**ఊరికి వెళ్లి వచ్చేలోగా..**

రాకాసితండాకు చెందిన భూక్యా అచ్చమ్మ- వెంకన్న దంపతులు సరుకుల కోసం మరిపెడ బంగ్లాకు వెళ్లారు. వర్షం పెరగడంతో అక్కడే బంధువుల ఇంట్లో ఉన్నారు. ఇంట్లో చిన్న కుమారుడు కార్తీక్ మాత్రమే ఉన్నాడు. ఆకేరు వరద గ్రామాన్ని చుట్టుముట్టి, ఇంట్లోకి నీరు చేరడంతో డాబాపైకి ఎక్కాడు. కానీ వరద ధాటికి ఇంట్లోని బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, బట్టలు, సామగ్రి, పెంపుడు మేకలు కొట్టుకుపోయాయి. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరదలో కొట్టుకుపోయిన ఇంటి వద్ద భూక్యా అచ్చమ్మ భర్త వెంకన్న

**ఇకపై బతికేదెట్లా?**



అజ్మీరా తండాకు చెందిన బోడ దాసు ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. సాగు నీటికి ఇబ్బంది లేకపోవడంతో ముందుగానే నాట్లు వేశాడు. పచ్చగా కళకళలాడుతున్న వరి పంట ఒక్కరోజులోనే తుడిచిపెట్టుకుపోయింది. పొలంలో ఇసుక మేటలు వేసింది. ఆయన భార్య మరణించగా.. కుమారుడు శోభన్ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు, దివ్యాంగురాలైన కుమార్తెకు వివాహం చేశాడు. ఇప్పుడు పొలం దెబ్బతినడంతో ఇకపై బతికేదెట్లాగని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# ఐదు రోజులైనా అదే యాతన

- ఖమ్మంలో ఇంకా తేరుకోని మున్నేరు ముంపు ప్రాంతం
- పలు ప్రాంతాల్లో తొలగని బురద మేటలు
- ముంపు సర్వేలో తమ పేర్లు రాయలేదంటూ బాధితుల ఆందోళన
- ట్యాంకర్ల నీళ్లు సరిగా అందడం లేదని.. తాగునీటికీ ఇబ్బందని ఆవేదన
- నీట మునిగి చెడిపోయిన కరెంటు మీటర్లు.. అందని విద్యుత్ సరఫరా



తెగిపోయిన ముల్కలపల్లి బ్రిడ్జి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వరద వచ్చి ఐదు రోజులైనా ఖమ్మం జిల్లాలోని మున్నేరు పరీవాహక ప్రాంతాలు ఇంకా తేరుకోలేదు. బురద, దుర్వాసన ఓవైపు.. తాగడానికి, ఇతర అవసరాలకు నీళ్లు దొరకక మరోవైపు బాధితులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఆర్థిక సాయం సర్వేలో.. తమ పేర్లు నమోదు చేయలేదంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బురద తొలగింపు, పారిశుధ్య పనులు ఇంకెప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదని వాపోతున్నారు.

**తొలగని బురద.. అందని నీరు**

సుమారు 50 కాలనీల్లో బురద నిండిపోయి ఉంది. వాహనాలతో తొలగిస్తూనే ఉన్నా.. ఇంకా భారీగా పేరుకుపోయే కనిపిస్తోంది. ఇళ్లలో బాత్రూంలను వాడుకునే పరిస్థితి లేదు. ఇళ్లను, సామగ్రిని శుభ్రం చేసుకుందామనుకునే వారికి తగినన్ని నీళ్ల అందడం లేదు. కొన్ని కాలనీలకే ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భోజనాల వేళ దాతలు ఇచ్చే తాగునీటి ప్యాకెట్లే తప్ప రక్షిత నీరు అందడం లేదని వాపోతున్నారు.

**తమను సర్వే చేయడం లేదంటూ..**

వరద సమయంలో ఆస్పత్రులు, శుభకార్యాలు, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు.. ఇళ్లకు తిరిగి వచ్చి అక్కడి పరిస్థితి చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. సుమారు రెండు వేలకుపైగా ఇళ్లు పూర్తిగా నీటమునగడంతో విద్యుత్ మీటర్లు పాడయ్యాయి. విద్యుత్ శాఖ వాళ్లు వాటి స్థానంలో కొత్తవి బిగించే పనులు చేస్తున్నా.. గోడలు తడిసే ఉండటంతో షాక్ వస్తుందన్న భయం పట్టుకుంది. ఇప్పటికే ఖమ్మంరూరల్ మండలం కేబీఆర్ కాలనీలో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో పగలంతా ఇళ్లలో శుభ్రం చేసుకుంటున్న బాధితులు.. రాత్రికి తిరిగి పునరావాస కేంద్రాలకు వెళ్తున్నారు.

**భర్త ఆపరేషన్ కోసం వెళ్లి..**

ఖమ్మం వెంకటేశ్వర నగర్‌కు చెందిన ఐతరాజు జ్యోతి, వెంకన్న కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వెంకన్నకు గొంతు ఆపరేషన్ కోసం భార్యాభర్తలు హైదరాబాద్ వెళ్లారు. వరద విషయం తెలిసి ఆందోళనలో పడ్డారు. స్థానికంగా లేకపోతే సర్వేలో పేరు రాయరని, ఆర్థిక సాయం అందదేమోనని భావించిన చెందిన జ్యోతి బుధవారం రాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో నిత్యావసరాలు సహా సామగ్రి అంతా తడిసి పాడైపోయి ఉండటాన్ని చూసి కన్నీళ్లలో మునిగిపోయారు.

**కిరాణం, వాటర్ ప్లాంట్ కొట్టుకుపోయి..**

ఇక్కడి వెంకటేశ్వర నగర్‌లో కాటం వెంకటేశ్వర్లు కిరాణం, వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. ఈ రెండూ మునిగి, సామగ్రి కొట్టుకుపోయి.. రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని ఆయన వాపోతున్నారు. ముంపు సర్వే కోసం ఇంకా ఎవరూ రాలేదని, ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు.

**పదివేల సాయం ఏ మూలకు..?**

కాల్వొడ్డు ప్రాంతంలో నివసించే రామిశెట్టి నాగమణి భర్త గతంలోనే చనిపోయారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. ఇళ్లలో పనిచేసుకుంటూ జీవించే నాగమణికి.. వరదల వల్ల కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.10 వేల పరిహారం దేనికీ సరిపోదని ఆమె వాపోతున్నారు.

**శుభకార్యానికి వెళ్లొచ్చే సరికి..**

వెంకటేశ్వరనగర్‌లో నర్రి సుగుణ, యాదయ్య కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఓ పెళ్లికి వెళ్లి వచ్చే సరికి ఇంటిని వరద ముంచెత్తింది. ఇంట్లోని నాలుగు క్వింటాళ్ల బియ్యం, ఇతర నిత్యావసరాలు తడిసి పాడైపోయాయి. తనను పరామర్శించేందుకు వచ్చిన పెద్దకుమార్తెని చూసి కట్టుబట్టలతో మిగిలామంటూ సుగుణ కన్నీరుపెట్టారు.

## కోలుకోని ముంపు గ్రామాలు!

సాక్షి, మహబూబాబాద్/అనంతగిరి (కోదాడ): సూర్యాపేట, మానుకోట జిల్లాల్లోని ముంపు గ్రామాలు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. భారీ వరద కారణంగా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, దంతాలపల్లి, నర్సింహులపేట, మరిపెడ, కురవి, చిన్నగూడూరు, డోర్నకల్ మండలాల్లో 45 చెరువులు తెగిపోయాయి, మరో 35 చెరువులు దెబ్బతిన్నాయి. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారమే.. చెరువులు, కుంటల కింద 27,639 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు నిండిపోయాయి. మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వెళ్లేందుకు సీరోలు మండలం ముల్కలపల్లి వద్ద నిర్మించిన బ్రిడ్జి భారీ వరదకు కూలిపోయింది. దానితో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. వరద బీభత్సంతో చిన్నగూడూరు, ఎల్లంపేట, పురుషోత్తమాయగూడెం, తానంచెర్ల, ఉల్లెపల్లి తదితర చోట్ల పైపులైన్లు తెగిపోవడం, పగిలిపోవడం వంటి జరగడంతో.. గత ఐదు రోజులుగా 45 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇక సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కిష్టాపురం, గొండ్రియాలలో ముంపు బాధితులు తమకు నిత్యావసరాలు, తాగునీరు అందడం లేదని వాపోతున్నారు.



కోదాడలో భారీగా ఇసుక మేటలు వేసిన పంట పొలాలు

# మరమ్మతులకు తక్షణమే టెండర్లు

- వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, ప్రాజెక్టులకు అత్యవసర మరమ్మతులు
- 1,800 లస్కర్ల నియామకానికి ఆర్థికశాఖ అనుమతి కోరండి: మంత్రి ఉత్తమ్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువుల కట్టలు, కాల్వలు, ఇతర ప్రాజెక్టుల పునరుద్ధరణకు తక్షణమే స్వల్పకాలిక టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పనులకు పరిపాలనాపర అనుమతులను అత్యవసరంగా జారీ చేసి శుక్రవారం ఉదయం నాటికి ఆన్‌లైన్‌లో టెండర్లను పొందుపర్చాలని సూచించారు. దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, ఇతర ప్రాజెక్టుల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆయన జలసౌధ నుంచి క్షేత్రస్థాయిలోని నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మొత్తంగా 544 జలవనరులకు నష్టం వాటిల్లిందని, అత్యవసర మరమ్మతులకు రూ.113 కోట్లు అవసరమని అధికారులు మంత్రికి నివేదించారు. అత్యవసర, శాశ్వత మరమ్మతులకు రూ.1,100 కోట్లు కేటాయించాలని కోరగా, రాష్ట్ర ఆర్థిక శాఖ రూ.350 కోట్లు కేటాయించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిధులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, తక్షణమే అన్ని పనులకు షార్ట్ టెండర్లు ఆహ్వానించాలని మంత్రి ఆదేశించారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ తప్పిదంతో ఏదైనా నష్టం జరిగితే సంబంధిత చీఫ్ ఇంజనీర్లను బాధ్యులుగా చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**వట్టెం పంప్‌హౌస్ పునరుద్ధరణ ఖర్చు నిర్మాణ సంస్థదే...:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని వట్టెం వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌తోపాటు సొరంగం నీటమునగగా, 4000 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 16 పంపుల ద్వారా నీళ్లను బయటకు తోడేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి చెప్పారు. నిర్మాణ సంస్థే సొంతఖర్చుతో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.

**త్వరలో పదోన్నతులు, బదిలీలు..:** విపత్తుల సమయంలో 90 శాతం మంది ఉద్యోగులు బాగా పనిచేశారని, మిగిలిన 10 శాతం మంది సైతం తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. కొత్తగా నియామకం పొందిన 700 మంది ఏఈలకు త్వరలో పోస్టింగులతోపాటు నీటిపారుదల శాఖలో ఇంజనీర్లకు పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలిక పదోన్నతులు కాకుండా శాశ్వత పదోన్నతులే ఇస్తామన్నారు. నీటిపారుదలశాఖలో ఖాళీగా ఉన్న 1,800 లస్కర్ పోస్టుల భర్తీకి అనుమతి కోరుతూ ఆర్థికశాఖకు ప్రతిపాదనలను పంపించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ(జనరల్) అనిల్‌కుమార్, ఈఎన్సీ (ఓఅండ్‌ఎం) నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మాపైనే దాడి చేసి మళ్లీ కేసులా?

**రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం**

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో ప్రజాపాలన కాదని.. రాక్షస పాలన నడుస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వరద బాధితులకు సాయం చేద్దామని వెళ్తే తమపై దాడి చేయడమే కాకుండా మళ్లీ తమపైనే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడబోమని స్పష్టం చేశారు. ఖమ్మం వరద బాధితులను ఆదుకొనేందుకు సిద్దిపేట నుంచి దాతల సహకారంతో సేకరించిన నిత్యావసరాలను మూడు వాహనాల్లో నింపి వాటిని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వరద బాధితులకు సాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు రూ. 2 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు సిద్దిపేట నుంచి ఉడుతా భక్తిగా సాయం చేస్తున్నామన్నారు. సిద్దిపేటలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందన్నారు. చెక్కులు ఇద్దామంటే ప్రభుత్వ పెద్దలు ఎవరూ సహకరించడం లేదని పేర్కొన్నారు. కాగా, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననీయకుండా బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.



నిత్యావసర సరుకుల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

# మరో మూడు రోజులు వానలు

**వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం**

- దాని ప్రభావంతో ఆరు జిల్లాల్లో భారీ వర్షాలకు చాన్స్
- మిగతా చోట్ల మోస్తరు వానలు పడతాయన్న వాతావరణ శాఖ
- రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన సాధారణ ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. వాయవ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడిందని, దానికి అనుబంధంగా ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. వీటి ప్రభావంతో విస్తారంగా వానలు కురుస్తాయని తెలిపింది. ఆరు జిల్లాలు ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**తగ్గిపోయిన ఉష్ణోగ్రతలు**

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, ముసురు వాతావరణంతో ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. భద్రాచలం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల మేర, మిగతా చోట్ల ఒకట్రెండు డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాత్రివేళల్లో చలిగాలులు వీస్తున్నాయి. గురువారం రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్‌లో 32.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

**రెండు జిల్లాల్లో వానలు డబుల్**

నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి వర్షాలు సాధారణాన్ని దాటిపోయాయి. సీజన్‌కు సంబంధించి ఇప్పటి (సెప్టెంబర్ 5)వరకు 60.32 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. 40శాతం అధికంగా 84.72 సెంటీమీటర్లు కురిసింది. వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో సాధారణం కంటే రెండింతలకుపైగా వర్షాలు కురిసినట్టు తెలంగాణ ప్రణాళిక విభాగం గణాంకాలు చెప్తున్నాయి. వనపర్తి జిల్లాలో 37.15 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 79.14 సెంటీమీటర్లు, అంటే 114 శాతం అధికంగా వర్షం కురిసింది. నారాయణపేట జిల్లాలో 37.08 సెం.మీ. సాధారణ వర్షపాతానికిగాను 77.15 సెంటీమీటర్లు (108 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ఆరు జిల్లాలు వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, సిద్దిపేట జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా.. మిగతా జిల్లాల్లో అధిక వర్షం కురిసింది.




AVAILABLE AT 130+ EXCLUSIVE STORES AND AT ALL LEADING OUTLETS ACROSS INDIA

For franchise enquiries contact Mr. Om Rajesh on 99418 05000
For trade enquiries contact Mr. KV Kannan on 98406 17000
Facebook.com/BasicsLifeIndia Instagram.com/basicslife
Youtube.com/@BasicsLife


ALSO AVAILABLE AT
CENTRO max Pantaloons SHOPPERS STOP TRENDS

ONLINE PARTNERS
Shop online : www.basicslife.com

---

ORSL BEAT SILENT DEHYDRATION SERIES

# ORSL®తో సైలెంట్ డీహైడ్రేషన్‌ను నివారించండి




## డీహైడ్రేషన్

సాధారణంగా పనిచేయుటకు శరీరానికి అవసరమయ్యేదాని కన్నా **ఎక్కువగా ద్రవాలు** మరియు నీటిని శరీరం **కోల్పోతున్నప్పుడు** డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఇది ద్రవాలను ఎక్కువగా కోల్పోవడం వల్లగాని లేదా తీసుకోవడం తగ్గిపోవడం వల్లగాని లేదా రెండువిధాలాగాని అయిఉండవచ్చును. ద్రవాలను కోల్పోవడం అనేది అయినపుడు దానికి కొంతపరిమాణంలో **ఎలక్ట్రోలైట్స్ నష్టపోతాయి.**

సాధారణ శరీర పనితీరు కొరకు ద్రవాలు మరియు ఎలెక్ట్రోలైట్స్ అవసరం ఉంది, వీటి నష్టం వల్ల క్రిటికల్‌గా మారవచ్చు. కావున మనం ద్రవాలను మరియు ఎలక్ట్రోలైట్లను స్థానభర్తీ చేయనట్లయితే డీహైడ్రేషన్‌కు గురవుతాం.

## కనిపించే మరియు సైలెంట్ డీహైడ్రేషన్

నీళ్ళవిరేచనాలు, వికారం లేదా వాంతులు అవుతున్నప్పుడు శరీరం నుండి ద్రవాలు పోవడం, మనల్ని బలహీనపరుస్తుండటంతో మనకు డీహైడ్రేషన్ కనిపిస్తుంది. అయితే డీహైడ్రేషన్ పలు ఇతర పరిస్థితుల్లో సంభవించగలదు మరియు మనకు కనిపించకపోవచ్చును. సైలెంట్ డీహైడ్రేషన్ అనేది అనారోగ్యంతో ఉన్నపుడు మరియు రోజువారీ పరిస్థితుల్లోనూ కలుగవచ్చును. సైలెంట్ డీహైడ్రేషన్ గురించి మరింత తెల్సుకొనుటకు ఈ చిత్రాలను చూడండి.

## డీహైడ్రేషన్‌ను అరికట్టడం

డీహైడ్రేషన్‌ను కట్టడి చేయుటకు ద్రవాలను మరియు ఎలక్ట్రోలైట్లను తిరిగి భర్తీ చేయవల్సిఉంటుంది. సైలెంట్ డీహైడ్రేషన్ సమయంలో డయేరియా కానీ డిహైడ్రేషన్ అయినప్పుడు ఇది సరిపోకపోవచ్చును మరియు వ్యక్తిని సాధారణ ఆరోగ్యస్థితికి తీసుకురావడానికి, శక్తి కొరతలను పూరించుటకు శక్తిని తిరిగి భర్తీ చేయడం కూడా అవసరం రావచ్చును. సంక్షిప్తంగా చెప్పాలంటే సైలెంట్ డీహైడ్రేషన్‌కు ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు మరియు శక్తిని తిరిగి నింపడం అవసరమౌతాయి.

డీహైడ్రేషన్ సమయంలో మనసుకు తోచే మొదటి ఎంపిక నీరు. అయితే డీహైడ్రేషన్‌ను అరికట్టడానికి నీరు ఒక్కటే సరిపోకపోవచ్చును, ఎందుకనగా శరీరంలో ద్రవాల సమతౌల్యాన్ని నిలిపేందుకు అవశ్యకమైన ఎలక్ట్రోలైట్లు అందులో కొరవడి ఉంటాయి.

**డీహైడ్రేషన్: సందర్భాలు మరియు పరిష్కారాలు**

| కనిపించే డీహైడ్రేషన్ | సైలెంట్ డీహైడ్రేషన్ (తేలికపాటి నుండి మితమైన డయేరియా కాని డీహైడ్రేషన్) |
|---|---|
| నీళ్ళ విరేచనాలు మరియు నీళ్ళ విరేచనాల స్థితులు | జ్వరం; తీవ్రమైన వేడి వాతావరణం; శారీరకంగా అలసిపోవడం; ఉపవాసం; తలనొప్పి; కండరాలు పట్టేయడం |
| WHO ORS గా పేర్కొనబడినది | సైలెంట్ డీహైడ్రేషన్ విషయంలో **ఎలక్ట్రోలైట్ పానీయాలలో** శక్తి కలిగివుండటం చాలా ముఖ్యం, ఇవి తెలిసిన మోతాదులో ఎలెక్ట్రోలైట్స్ మరియు ఎనర్జీ ఇస్తాయి. |

ORSL INDIA'S NO.1 ELECTROLYTE DRINK

ORSL® ఇండియాలో రెడీ టు డ్రింక్ రూపంలోని ఎలక్ట్రోలైట్ పానీయాలలో అగ్రగామిగా నిలిచినది. ORSL®



“మేము ద్రవాలను, ఎలక్ట్రోలైట్లు మరియు శక్తిని తిరిగి భర్తీచేయడం వెనుక దాగివున్న శాస్త్రీయ లబ్ధిని నిరంతరం అందిస్తున్నాము. మా ORSL® శ్రేణి ఉత్పత్తులు ఎలక్ట్రోలైట్లను పునః పూరించుటకు మరియు శక్తిని తిరిగి నింపుటకు శాస్త్రీయంగా సూత్రీకరించబడినవి, తద్వారా మీరు సైలెంట్ డీహైడ్రేషన్ నుండి త్వరగా కోలుకోగలుగుతారు.”

**డా. ప్రీతి రాథోడ్**
హెడ్ ఆఫ్ మెడికల్ సేఫ్టీ సైన్సెస్ (ఇండియా)
రెస్టోరేటివ్ అండ్ డైజెస్టివ్ హెల్త్ (ఏపీఏసీ) కెన్వ్యూ

*Basis IQVIA MAT Survey – Sep' 22 – Oct'23 for ORSL® Brand. Refer product pack for details. ORSL® variants are standardized 'food' products in the category of 'Electrolyte Drinks' under FSSAI. ORSL® is only a trademark and does not represent its true nature. These are not an ORS. DO NOT USE DURING DIARRHEA. ORSL® is not intended for prevention, alleviation, treatment, or cure of any disease or disorder | Silent Dehydration refers to mild to moderate non-diarrheal dehydration only | The information provided in the article are scientific facts only and not a substitute for any professional advice. Please reach out to your Doctor / Nutritionist for more details on dehydration | ORSL® is formulated by scientists. Creative Visualization.

Advertisement

---




Instant Cashback up to ₹10 000** | HDFC BANK | ICICI Bank | IDFC FIRST Bank | BOBCARD

HYDERABAD: YUVAAN AUTOHUB- LB NAGAR- 8121801302, SRI LV MOTORS - VANASTHALIPURAM – 8121801302, RAMCOR MOTORS - MALAKPET– 8121801302, ANJALI MOTORS - SOMAJIGUDA– 8121801302, KIRAN AUTOHUB - RANIGUNJ – 8121801302, LOTUS IMPERIUM ENTERPRISE - ATTAPUR – 8121801302, ANTARIKSH MOTORS PVT. LTD - TOLICHOWKI – 8121801302, LOTUS IMPERIUM AUTOMOTIVE - HABSIGUDA – 8121801302, SUSHEEL TVS -KUKATPALLY – 8106819900, NANESH TVS- TADBUND – 8106819900, PARAM TVS- RC PURAM– 8106819900, LANDMARK TVS- KONDAPUR & GACHIBOWLI – 8106819900, OM SRI SAI SRINIVASA - KOMPALLY – 8106819900, SHANTI TVS – HIMAYATHNAGAR – 8106819900, NALGONDA NISCHAY AUTOMOTIVE PVT LTD – 8121801302, SREE L V MOTORS LLP – 8121801302, SURYAPET LAXMISAI AUTO AGENCIES- 8121801302, MAHABUBNAGAR Sri JAYARAMA TVS – 8106819900, KHAMMAM RANGARAYA TVS & VAJRA TVS –8106819900, KARIMNAGAR ADARSHA MOTORS SALES PRIVATE LIMITED-9392013695, NIZAMABAD LAXMI AGENCIES-9392013695, HANAMKONDA ADARSHA TVS-9392013695, MANCHERIAL TVS-VINAY AUTOTECH- 9392013695, NIRMAL VINAY AUTOTECH PVT. LTD- 9392013695, JAGTIAL HRUTHIN MOTORS PVT LTD-9392013695, WARANGAL BALAJI MOTOCORP WIN-9392013695, SIDDIPET SRINIVASA AUTOMOTIVES PVT LTD-9392013695.

dentsu/sak Tel/02/24

మీ పైన ఉన్న బరువును తగ్గించాలన్నది అల్లాహ్ అభిలాష.
ఎందుకంటే మానవుడు బలహీనుడుగా పుట్టించబడ్డాడు.
– ఇస్లాం ధర్మం



సాక్షి
శుక్రవారం, 6 సెప్టెంబర్ 2024

# ఏది ధర్మం? దేనికి రక్షణ?

చట్టం విరుద్ధం కానంత వరకు ఎవరేమి చేయాలో, ఎవరేం తినాలో చెప్పడానికి వేరొకరికి ఏమి హక్కు ఉంటుంది? కొద్దిరోజుల వ్యవధిలో హర్యానాలో వరసగా జరిగిన రెండు విచక్షణా రహిత హత్యలు ఆ మౌలిక ప్రశ్ననే మరోమారు ముందుకు తెచ్చాయి. ధర్మం పేరిట విద్వేషాన్ని నింపుకొని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొంటున్న స్వయం ప్రకటిత గోరక్షకులతో దేశానికున్న ముప్పును గుర్తుచేశాయి. పన్నెండో తరగతి చదువుతున్న 19 ఏళ్ళ టీనేజ్ కుర్రాడు ఆర్యన్ మిశ్రా హర్యానాలోని ఆగస్ట్ 24న మిత్రులతో కలసి కారులో వస్తుండగా, గోమాంసం రవాణా చేస్తున్నాడనే అనుమానంతో సాయుధ మూకలు 50 కిలోమీటర్ల దూరం ఛేజ్ చేసి మరీ, ఫరీదాబాద్ వద్ద అతణ్ణి కాల్చి చంపిన ఘటన అమానుషం. అలాగే, గొడ్డుమాంసం తింటున్నాడనే అనుమానంతో ఆగస్ట్ 27న చర్ఖీ దాద్రీ వద్ద 26 ఏళ్ళ వలస కార్మికుడు సబీర్ మాలిక్‌ను కొందరు సోకాల్డ్ ధర్మపరిరక్షకులు కొట్టి చంపిన తీరు నిర్ఘాంతపరుస్తోంది. సాక్షాత్తూ హర్యానా సీఎం సైతం 'సెంటిమెంట్లు దెబ్బతింటే, ఎవరినైనా ఎలా ఆపగల'మంటూ బాధ్యతారహితంగా వ్యాఖ్యానించడం దీనికి పరాకాష్ఠ.

ఇలాంటి పాలక వర్గాల భావజాలం కారణంగానే దాదాపు దశాబ్ద కాలంగా దేశంలో గోరక్షణ పేరిట హింస సాధారణమైపోయింది. సోమవారం మహారాష్ట్రలో ఓ రైలులో పశుమాంసం తీసుకెళుతున్న ఓ వృద్ధుడిపై మూకదాడి అందుకు మచ్చుతునక. అయితే, తాజా దాడులు మైనారిటీలపై హింస పెచ్చరిల్లుతున్న వైనాన్ని పట్టిచూపడమే కాక, ఈ మతపరమైన అసహనంపై విస్తృత చర్చను లేవనెత్తాయి. ఫరీదాబాద్ ఘటనలో చనిపోయింది అమాయక హిందువంటూ రచ్చ చేస్తున్న వాళ్ళు ఆ పోయిన ప్రాణాలు ముస్లిమ్‌వైనా ఇలాగే స్పందిస్తారా అన్నది ధర్మసందేహం. అప్పుడే ఇలా స్పందించి ఉంటే, దేశంలో అసలు గోరక్షణ పేరిట పరిస్థితులు ఇంత దూరం వచ్చేవి కావేమో! ప్రధాని మోదీ సైతం పశువుల వ్యాపారులపై, పశు మాంసం తినేవారిపై దాడులను గతంలో ఖండించక పోలేదు. కానీ, నోరొకటి మాట్లాడుతుంటే నొసలొకటి చెబుతున్నట్టుగా... అధికార బీజేపీ ఊదరగొడుతున్న హిందూ జాతీయవాదం గోరక్షణ పేరిట దాడుల్ని పెంచిపోషించిందన్నది నిష్ఠురసత్యం. ఆర్యన్ ఘటనపై నిరసనలు వెల్లువెత్తే సరికి, ప్రభుత్వం సైతం దిద్దుబాటు చర్యలకు దిగకతప్పలేదు. ఛాందసవాద గోరక్షకుల జాబితా సిద్ధం చేస్తున్నట్టు పోలీసులు గురువారం ప్రకటించారు.

గతంలోకి వెళితే, 2012– 2018 మధ్య కాలంలో గోరక్షణ పేరిట దేశవ్యాప్తంగా 120 దాకా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి. ఆ హింసలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా అత్యధిక ఘటనలు ఉత్తర ప్రదేశ్‌లోనే జరగడం గమనార్హం. గడచిన ఏడెనిమిదేళ్ళుగా ఉత్తర ప్రదేశ్‌లోనే కాక హర్యానా, బిహార్, రాజస్థాన్, జార్ఖండ్ తదితర అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో గోసంరక్షకుల పేరిట హింస పెచ్చరిల్లుతూ వస్తోంది. ఈ 'గోరక్షక ముఠాల' దాడులు భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలనే దెబ్బతీస్తున్నాయి. నిజానికి, 19వ శతాబ్దం ద్వితీయార్ధం నుంచే మన దేశంలో గోహత్యపై చర్చ, అడపాదడపా హింస సాగుతూనే వచ్చాయి. 'హిందువేతరులపై హిందూ ధర్మాన్ని రుద్ద కూడద'ని దేశ విభజన సందర్భంగా సాక్షాత్తూ గాంధీ సైతం నొక్కిచెప్పాల్సి వచ్చింది. భారతదేశం లౌకికవాద గణతంత్ర రాజ్యమనే స్ఫూర్తిని నిలబెట్టడం కోసం రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన సంఘం సైతం గోరక్షణను తమ డ్రాఫ్టులో చేర్చలేదు. గోరక్షణను ప్రాథమిక హక్కుగా చేర్చాలన్న వాదనను తోసిపుచ్చి, దాన్ని ఆదేశిక సూత్రాల్లోనే చేర్చారని చరిత్ర.

భారత ప్రజాస్వామ్య సౌధాన్ని నిర్మించిన మన పెద్దలు వివేకంతో వ్యవహరించి, మెజారిటీ ప్రజల ఒత్తిడికి తలొగ్గలేదు. భావోద్వేగభరిత ధార్మిక అంశాల కన్నా దేశంలోని లౌకికవాద చట్టాన్ని సమున్నతమని చేతలతో చాటారు. హిందూ ధర్మంలో గోవును పవిత్రమైనదిగా పూజిస్తాం. తప్పు లేదు. మరి, అదే ధర్మం మనిషిలో దేవుణ్ణి చూడమన్న మాటను గౌరవించవద్దా? దాదాపు 24 రాష్ట్రాల్లో గోవుల అక్రమ అమ్మకం, వధను నిషేధిస్తూ రకరకాల నియంత్రణలున్నాయి. కానీ, వీటిని అడ్డం పెట్టుకొని కొన్ని అతివాద బృందాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, హత్యలకు పాల్పడడం, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి, విద్వేషాలు పెంచడం సహిద్దామా? భరిద్దామా? ఈ రకమైన హిందూ జాతీయవాదంతో దేశం ఎటు పోతుంది? దేశంలోని 20 కోట్ల పైగా ముస్లిమ్‌లను వేరుగా చూస్తూ, ఈ సమాజంలో తాము మరింత మైనారిటీలుగా మిగిలిపోయామనే భావన కల్పించడం సామాజిక సమైక్యతను దెబ్బతీయదా? అది పొరుగున పొంచిన శత్రువులకు ఊతం కాదా?

సంఘమంటేనే విభిన్న వర్గాలు, భావాలు, సంస్కృతులు, అలవాట్ల సమ్మేళనమనే ప్రాథమిక అంశాన్ని అందరూ గుర్తెరిగేలా చేయాలి. వైమనస్యాలు పెంచి సామరస్యాన్ని దెబ్బతీస్తే మొదటికే మోసం. అందులోనూ మూగజీవాల్ని అడ్డం పెట్టుకొని ప్రదర్శిస్తున్న మతోన్మాదం రాజకీయ ప్రేరేపితమైనది కావడం పెను ప్రమాదఘంటిక. రాజ్యాంగ నైతికతకే విఘాతం కలిగిస్తున్న ఈ చర్యలతో చివరకు సత్ పౌరులనూ, అమాయకులనూ హింసించడం మరింత విషాదం. సుప్రీమ్ కోర్ట్ సైతం ఈ రకమైన హింసను సహించరాదని పదే పదే ఆదేశించినా, పాలకవర్గ రాజకీయాలకు ఆశ్రితులైన దోషులు తప్పించుకుంటూనే ఉన్నారు. స్థానిక నేతలుగా ఎదిగి, చట్టసభల్లో స్థానం సంపాదించుకొని, ప్రజాస్వామ్య విలువల్ని పరిహాసప్రాయం చేస్తున్నారు. పశువుల్ని కాపాడే మిషతో మనిషే మృగంగా మారుతున్న ఈ ధోరణికి ఇకనైనా పాలకులు అడ్డుకట్ట వేయాలి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకై దీన్ని ఇలాగే వదిలిస్తే ఆఖరికి ఆవుల రక్షణ పేరిట ఆటవిక రాజ్యం నెలకొంటుంది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.తదియ ఉ.11.57 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** హస్త ఉ.7.58 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.4.50 నుండి 6.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.12 వరకు, **అమృత ఘడియలు:** రా.3.22 నుండి 5.07వరకు.

**సూర్యోదయం:** 5.49
**సూర్యాస్తమయం:** 6.09
**రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు
**యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు

# నేరం ఎవరిది? శిక్ష ఎవరికి?

జలవనరులనూ, చెట్లనూ, కొండలనూ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కానీ కాలంలో వచ్చిన మార్పులను ఒడిసి పట్టుకుని లాభాలు ఆర్జించాలనీ, ఆస్తులు వెనకేసుకోవాలనీ కొందరు చేస్తున్న ప్రయత్నాలు అటు ప్రకృతి వనరులనూ, ఇటు సంస్కృతినీ ఏక కాలంలో నాశనం చేస్తున్నాయి. అందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదలు సృష్టించిన విలయం ఒక ఉదాహరణ. నది కరకట్టపైనే ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసం ఉండి ఏం సందేశం ఇస్తున్నారనేది పెద్ద ప్రశ్న. ప్రజలకు ముందస్తు హెచ్చరికలైనా చేయకుండా బుడమేరు నీటిని వదలడం ఎటువంటి పాలనకు సూచిక? వరదను ఎదుర్కోవడంలో అన్నివిధాలా విఫలమైన ఏపీ ప్రభుత్వం ప్రతిపక్షంపై నింద వేస్తోంది.

## ప్రజలే బుద్ధి చెబుతారు!

అభిప్రాయం


డా॥ కత్తి పద్మారావు

భారతదేశం నదీ నాగరికతల దేశం. అసలు ఇక్కడ నదులను దేవతలుగా కొలవడం సంస్కృతిలో భాగం. ఈ సంస్కృతికి మూల విరాట్టులు ఆదివాసీలూ, దళితులే. అడవులు, నదీతీరాలు వీరి ఆవాసాలుగా ఉన్నప్పుడు వాటికి ఏ ఇబ్బందులూ కలగలేదు. ఎప్పుడైతే పారిశ్రామిక విప్లవం వచ్చి, వస్తూత్పత్తి వాణిజ్య స్థాయిలో అవ్వడం ప్రారంభమయ్యిందో... అప్పుడే ప్రకృతి వనరులను విచక్షణా రహితంగా దోచుకోవడం ప్రారంభమయ్యింది. పట్టణాలు, నగరాలు విస్తరించాయి. చివరికి నదులు, కాలువలు, చెరువులు, అడవులు అన్నింటినీ ఆధిపత్య వర్గాలవారు కబ్జా చేశారు. వీరి చేతుల్లోనే భూమి, మూలధనం కేంద్రీకృతమై ఉన్నందున వీరే పరిశ్రమలు, ఇతర వ్యాపారాలను స్థాపించి పేరాశతో డబ్బు, అధికార దర్పాలతో కబ్జాలకు తెరలేపారు. తత్ఫలితమే విజయవాడ, ఖమ్మం వంటి చోట్ల ఇవ్వాళ నదులు లేదా ఏరులు సృష్టించిన విలయాలు!

ఈ నేపథ్యంలో విజయవాడను చుట్టుముట్టిన వరదలను చూడాలి. ఇక్కడ ప్రజల కడగండ్లకు ప్రధాన కారణం బుడమేరు కాలువ/ వాగు. జలవనరుల శాఖ పరిభాషలో ఇది ఒక మేజర్ డ్రెయిన్. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పంట పొలాల్లోని మిగులు నీరు ప్రవహించే ఒక వాగు. ఖమ్మం జిల్లాలో పుట్టిన ఈ వాగు మైలవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. రెడ్డిగూడెం, మైలవరం, కొండూరు మండలాల్లోని పులివాగు, భీమ్‌వాగు, లోయవాగును కలుపుకొని ముందుకు సాగుతుంది. విస్సన్నపేట, తిరువూరు నుంచి వచ్చే కొన్ని ఏరులు కూడా దీనిలో కలుస్తాయి. ఇవన్నీ కలిశాక, వెలగలేరు మీదుగా విజయవాడ శివారులోని సింగ్‌నగర్, గూడవల్లి, గన్నవరం, బాపులపాడు, గుడివాడ, నందివాడ వైపు సాగి చివరకు కొల్లేరులో కలుస్తుంది. బుడమేరు గరిష్ఠ నీటి ప్రవాహ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు మాత్రమే. దీని ఉద్ధృతి తగ్గించేందుకు 1970ల్లో నాటి ప్రభుత్వం జి. కొండూరు మండలం వెలగలేరు వద్ద ఒక రెగ్యులేటరీని నిర్మించింది. అక్కడ చిన్న జలాశయాన్ని తలపిస్తుంది. ఈ హెడ్ రెగ్యులేటరీ ద్వారా కిందకు వరద ప్రవాహాన్ని నియంత్రించేవారు. తర్వాత దీన్నుంచి మళ్లింపు కాలువ (బుడమేరు డైవర్షన్ ఛానెల్– బీడీసీ)ని తవ్వారు. అధికంగా వచ్చే వరద ఈ ఛానెల్ ద్వారానే ప్రవహించి, ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా నదిలో కలుస్తుంది. వీటీపీఎస్‌లోని వృథా నీటిని కూడా దీని ద్వారానే కృష్ణాలోకి పంపిస్తారు. దీని సామర్థ్యం చాలా తక్కువ.




కాలువ సామర్థ్యం పెంపు ప్రతిపాదనల్లో ఉండగానే బుడమేరుకు 2005లో సుమారు 70 వేల క్యూసెక్కుల వరద పోటెత్తి, విజయవాడను ముంచెత్తింది. వరదను అరికట్టాలంటే మళ్లింపు కాలువ విస్తరణే మార్గమని ప్రతిపాదన వచ్చింది. తర్వాత పోలవరం కుడి కాలువను బుడమేరులో కలిపారు. అంటే పోలవరం నుంచి వచ్చే నీటిని కృష్ణా నదిలో కలిపేందుకు దీన్నొక అనుసంధాన కాలువగా మలిచారు. పోలవరం కుడి కాలువను 37,500 క్యూసెక్కుల సామర్థ్యంతో డిజైన్ చేయగా, ప్రస్తుత సామర్థ్యం 8,500 క్యూసెక్కులు మాత్రమే. గత ఏడెనిమిదేళ్లుగా పట్టిసీమ నీళ్ల ఈ కాలువ ద్వారానే కృష్ణాలోకి వస్తున్నాయి. భవిష్యత్తులో పోలవరం కాలువను విస్తరించేందుకు అవకాశముంది. ఆ మేరకు బీడీసీ సామర్థ్యం కూడా ఇప్పుడున్న 10 వేల క్యూసెక్కుల నుంచి పెంచాల్సిన అవసరముంది.

సహజమైన నదీ తీరాన్ని ఇవ్వాళ ధ్వంసం చేసి పెద్ద పెద్ద అంతస్తులతో భవనాలు కట్టి నదీ గమనానికి అడ్డుగా నిలవడమే కాక నదీజలాలు కలుషితం కావడానికి కూడా కారణమవుతున్నారు బడాబాబులు. విజయవాడకు ఇంతటి పెనుముప్పు రావడానికి ఇదే ప్రధాన కారణం. కృష్ణా నది కరకట్ట మీద పెత్తందారుల అక్రమ కట్టడాల వల్లే ఇది జరిగింది. ఈ కరకట్ట మీద ఉన్న ముఖ్యమంత్రి నివాసం, కొంతమంది వైద్యం పేరుతో వ్యాపారం చేస్తున్న వారి కట్టడాలు ఉన్నాయి. వాటిని కూలుస్తామనే మాట పాలకులు చెప్పడం లేదు. ఈనాడు తెలంగాణలో 'హైడ్రా' చెరువులు కబ్జా చేసిన వారి అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్లు అన్ని రాష్ట్రాలలో కూల్చివేయాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ కూల్చివేతల అవసరం ఎంతైనా ఉంది. ఇక ప్రజలు ప్రాకృతిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పునరుజ్జీవనం గురించి ఆలోచించవలసిన సమయం వచ్చింది. ప్రజల్లో అలముకున్న నిరాశ, నిస్పృహల స్థానంలో సమకాలీన పరిస్థితుల పట్ల స్పష్టమైన అవగాహన నింపాలి. అప్పుడే వారు పెత్తందార్లకు బుద్ధి చెబుతారు. ప్రజలే చరిత్ర నిర్మాతలు కదా!

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు I 98497 41695

## సచివాలయ వ్యవస్థే దిక్కయ్యింది!

అభిప్రాయం


డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

బెజవాడను వరద ముంచెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం సహాయక చర్యల్లో ఘోరంగా విఫలమైంది. అదే సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన గడచిన ఐదేళ్ల పాలనలో జరిగిన మంచిని అడుగడుగునా గుర్తుచేసింది. ఇదే ఇప్పుడు చంద్రబాబు సహా కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. ప్రజల్లో తమకు లేని ఆదరణ జగన్‌కు వస్తుంటే కడుపు మంట రెట్టింపైంది.

జగన్ ఇడుపులపాయ నుండి వస్తుంటే మార్గమధ్యంలో కృష్ణలంక వాసులు ఆయన కారును ఆపేసి రిటైనింగ్ వాల్ నిర్మాణం వల్లే తాము బతికి ఉన్నామంటూ దండాలు పెట్టారు. ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టలేదంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. అదేరోజు మధ్యాహ్నం జగన్ సింగ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. అప్పటి వరకూ బోట్లలో తిరుగుతూ కాలక్షేపం చేసిన చంద్రబాబు... జగన్ నీటిలోకి దిగి ప్రజలతో మమేకమయ్యేసరికి ఉండ బట్టలేక పోయారు. జగన్ నీళ్లలోకి దిగాడని తాను కూడా నీళ్లలో దిగి ఫీట్లు చేయడానికి పడరాని పాట్లు పడ్డారు. ఇక జగన్ ఈ క్రమంలోనే అడిగిన అనేక ప్రశ్నలకు బాబు సమాధానం చెప్పలేక ఇప్పటి వరకూ ఊరుకుని... ఇప్పటికిప్పుడు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటనను తెరపైకి తీసుకొచ్చారు. అసలు వీడియోలే లేవంటూ ఆడపిల్లల ఆందోళనను అవమానించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ముందస్తు సమాచారం లేకుండా నీటిని విడుదల చేయడం వల్ల సింగ్‌నగర్, పాయకాపురం, ఆర్‌ఆర్ పేట, కండ్రిక... ఇలా అనేక ప్రాంతాలు కేవలం రెండు గంటల వ్యవధిలో చెరువుల్లా మారిపోయాయి. శనివారం సాయంత్రం నుండి ఈ పరిస్థితి ఉంటే సోమవారం సాయంత్రం వరకూ సహాయక చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. ఆ యా ప్రాంతాలకు వెళ్లిన టీవీ రిపోర్టర్ల వద్ద ప్రజల నుండి ఆగ్రహావేశాలు వ్యక్తమవడం చూసిన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. నిన్నమొన్నటి వరకూ రేషన్ సరుకులు సరఫరా చేసే వ్యాన్లను వద్దంటే వద్దన్న బాబు అండ్ కో ఇప్పుడా వ్యాన్లలోనే ఫుడ్ ప్యాకెట్లను సరఫరా చేసింది. సచివాలయాలను నిర్వీర్యం చేస్తూ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడదే సచివాలయాలను కేంద్రంగా చేసుకుని సహాయక చర్యలను చేపట్టింది.

ఇదిలా ఉంటే సహాయక చర్యల్లోనూ ముమ్మాటికీ అవినీతే కనిపిస్తోంది. పడవ పంపాలంటే రూ. 2 వేల నుండి రూ. 10 వేల వరకూ డిమాండ్ చేశారని బాధితులు ఆరోపించారు. ఇక ఆహారం కూడా చివరి ప్రాంతాలకు అందలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇచ్చిన ఆహారం కూడా పురుగులు, కుళ్లిన వాసన వస్తోందని మండిపడ్డారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీచేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండమే పునరావాస కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయలేకపోవడానికి కారణమని అర్థమవుతోంది.

చంద్రబాబు తన నివాసమే కృష్ణా నదిలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయారు. శనివారం నుండి వరద ఉధృతి ఉంటే బుధవారం తన ఇంటిపై అప్పుడెప్పుడో రెండు రోజుల క్రితం జగన్ ఆరోపించిన అంశాలను లేవనెత్తడం వెనుక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. అందరి ఇళ్ల మునిగిపోయినట్లే తన ఇల్లూ మునిగిపోయిందని చంద్రబాబు ఎందుకన్నారన్న ప్రశ్నకు కనీసం ఆయన దగ్గర కూడా సమాధానం దొరకుతుందో లేదో! అందరి ఇళ్లు ప్రభుత్వం నీటిని విడుదల చేయడం వల్ల మునిగాయి. కానీ, చంద్రబాబు ఇల్లు మాత్రం కృష్ణా నదిలో ఉన్నందువల్ల మునిగింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను యథేచ్ఛగా ఉల్లంఘించిన చంద్రబాబు... బుడమేరు ఆక్రమణదారులను కఠినంగా శిక్షిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. మరీ ముఖ్యంగా బుడమేరు 2019 నుండి ఆక్రమణలకు గురైందంటూ వైసీపీ మీదకు నెట్టేందుకు పన్నాగం పన్నారు. నిజానికి చంద్రబాబు పాలనా కాలంలోనే బుడమేరు ఆక్రమణలకు గురయిందన్నది బహిరంగ రహస్యం.

ఆంధ్రప్రదేశ్‌లో హైడ్రా తరహా సంస్థను నెలకొల్పేలా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ తరహా సంస్థలు నెలకొల్పితే ముందు చంద్రబాబు నాయుడి నివాసం నుండి పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. ఆ మేరకు పవన్ కల్యాణ్‌కు ధైర్యం ఉందా అనేది చూడాలి. జనసైనికులు తమ నేత ప్రశ్నించాల్సిన సమయంలో నిశ్శబ్దంగా ఉండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు I 98484 05455

### సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

#### బోధనే దేశభక్తి



ఒక పౌరుడు తమ దేశానికి చేయగల అత్యంత గొప్ప దేశభక్తిపూరిత చర్య... విద్యా బోధన. విద్యావేత్తలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞత. మీరే మా భవిష్యత్ నిర్మాతలు. (సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం.)

– కమల్ హాసన్, నటుడు – నాయకుడు

#### దేవుడే గురువు



దేవుడు మనల్ని తనలా ఉండమని బోధిస్తాడు. ప్రేమ పాఠాలు – బేషరతుగా అంగీకరించడం. న్యాయ పాఠాలు– ఎప్పుడూ సత్కర్మలే చేయడం. వెలుగు పాఠాలు – అణకువ, అహం లేకపోవడం. జీవిత పాఠాలు– ఇవ్వు, ఇవ్వు, ఇవ్వు. మహోపాధ్యాయుడు మనల్ని సత్యయుగపు దివ్యాత్మలా మార్చగలడు. 'ఆయనకూ', ఉపాధ్యాయులకూ ధన్యవాదాలు.

– బి.కె. శివాని, బ్రహ్మకుమారి

#### అమ్మ కావాలి!



విదేశాల్లోని ఆసియా దంపతులు అమ్మలను రప్పించుకోవడానికి బాగా ఇష్టపడతారు. ఎందుకంటే తమ పిల్లల పెంపకంలో తల్లుల నైపుణ్యాలు వారికి కావాలి. అదే, ఈ నైపుణ్యం లేని, పైగా అధికారపూరిత తండ్రులకు చాలాసార్లు ఈ విశేష గౌరవం లేదు.

– షేక్ షౌకత్, విశ్వవిద్యాలయ బోధకుడు

# సరస్వతీ సన్నిధానవర్తి

''వెన్నెలతో మొదలుపెట్టి/ వెన్నెలతో తుది చేసిన/ నన్నయకవి భారత ప్ర/ సన్నకథాకలితార్థ యుక్తికి/ నిలయమైన నగరమా!/ నిర్మల సాహిత్యాకాశమా! / నా రాజ్మహేంద్ర నగరమా!'' ('ప్రాణహిత'లో సన్నిధానం నరసింహశర్మ)

రాజమండ్రి అంటే గోదావరి; అంతేనా? రాజమండ్రి అంటే గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం. ఆ గ్రంథాలయం అచలంగానే కాక చలంగానూ ఉంటే దాని పేరు ఏమవుతుంది? సన్నిధానం నరసింహశర్మ అవుతుంది. రాజమండ్రి పెద్దదేం కాదు; కానీ ఎంతోమంది పెద్దలుండి వెళ్ళిన పట్టణం. ఆదికవి నన్నయ్యతో మొదలుపెట్టి వీరేశలింగం వరకూ అదో పెద్ద జాబితా. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి తరం తర్వాత మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, మల్లంపల్లి శరభేశ్వర శర్మ వంటి సంప్రదాయ సాహిత్య రసపిపాసులు; నేదునూరి గంగాధరం వంటి జానపద సాహిత్య శిఖరాయమానులు; కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ వంటి ఆధునిక కవి వరేణ్యులు వచ్చి వెళ్లారు. వాళ్ళ మధ్యలో ఉంటూ సాహిత్య సమధికోత్సాహపు వరదై, గోదావరి గట్టై, పుష్కరాల రేవై, కోటగుమ్మం సెంటరై చివరికి రాజమండ్రియే అయిపోయిన వారు సన్నిధానం.


సన్నిధానం నరసింహశర్మ

రాజమండ్రిలో ఉన్నవాళ్లే కాదు; రాజమండ్రికి వచ్చిన వాళ్ళూ రాజమండ్రి అయిపోతారు. ఆరుద్ర అంతే; సతీష్ చందర్, జయధీర్ తిరుమలరావు, ఎండ్లూరి సుధాకర్ లాంటి మరెందరో అంతే. రాజమండ్రికి వచ్చిన వాళ్లనందరినీ తనవైపు తిప్పుకుని రాజమండ్రిగా మార్చేసే రసవిద్య సన్నిధానానికి తెలుసు. కవి అజంతా మౌనంగా ఉండి ఉండి గట్టిగా గాలి పీల్చి 'రాజమండ్రి' అంటూ నిశ్వసించి తిరిగి మౌనంలోకి జారిపోయే వారు; ఎందుకో తెలిసేది కాదు; సన్నిధానంవారి తలపులు ముసురుకున్న ఈ క్షణాన అర్థమవుతోంది; స్మరణగా మారిపోయే మాంత్రికత ఏదో ఆ పేరులో ఉంది.

డెబ్బైల సంగతి. గోదావరి కీవలి ఒడ్డు కొవ్వూరులో ఆంధ్రగీర్వాణ విద్యాపీఠానికి దారితీసే రోడ్డు మలుపులో ఎదురయ్యారు సన్నిధానం. పలకరింపులవుతూనే, పద్యం ఎత్తుకున్నారు. ''సిరులెల్ల క్షరము లక్షరమైన సిరిజూపు నాప్తోపదేష్ట గ్రంథాలయమ్ము/ జగము నశ్వర మనశ్వర జగమ్మును జూపు నమరాలయమ్ము గ్రంథాలయమ్ము/ తలపు చంచల మచంచలమైన తలపూన అశ్రమాశ్రమము గ్రంథాలయమ్ము/ నామరూపములు శూన్యములు వాని/ అశూన్యతా వ్యాప్తి కిరవు గ్రంథాలయమ్ము...'' పఠనోత్తేజాన్ని నింపుకుని కంఠనాళాల్లోంచి తోసుకొచ్చే ఆ పద్యధారలో సన్నిధానం మార్కును పట్టుకుంటూ, ''పద్యం చాలా బాగుందే'' అన్నాను. ''ఎవరిదో తెలుసా?'' అన్నారు; తెలియదన్నాను. ''మీ నాన్నగారు వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారి'' దన్నారు. నా అరయమిని తన పద్య పారవశ్యంతో చిన్నది చేస్తూ, అదెంత గొప్ప పద్యమో చెబుతూ మా ఇంటి దాకా వచ్చి మా నాన్నగారికి వినిపించారు. ''ఇది నేను రాసినదేనా?'' అనుకుని ఆయనా విస్తు పోయారు. పద్యంలో చెప్పినట్టు సిరులు, జగమే కాదు; జ్ఞాపకాలూ క్షరాలే. అక్షర శ్రీమంతమైన గ్రంథాలయోద్యోగి కనుకనే కవి కూడా మరచిపోయిన పద్యాన్ని గుర్తుచేసి వినిపించగలిగారు. చూపును, పుస్తకం పై రూపునుంచి లోపలికి సారించడమూ తెలిసిన అరుదైన గ్రంథాలయ సంచాలకుడు సన్నిధానం.

సంప్రదాయ, ఆధునికతలు; భావజాల వ్యత్యాసాల అడ్డుకట్టలు దాటి ప్రవహించే వైశాల్యం ఆయన. పద్యాన్ని, వచన పద్యాన్ని సమానమైన ఒడుపుతో నడపగలరు. ''అవును నేను రైతు గురించీ రాస్తాను, ఎందుకా? అన్నం తినేవాణ్ణి కనుక'' అని తొడగొట్టినట్టే; ''ఒక బుడుంగు సద్దు కలుగుటొకటి తప్ప/ తప్పక మునుగుదు మది యథార్థ మట్టి/ మునక వెనుక లభించు మోక్షమునకు/ మునుగుటొక మారు గౌతమిన్-పొంగు నెడద'' అంటూ గౌతమిపై తమినీ చాటగలరు. తెలుగు సాహితీ సేవకులపై ఆయనది ఎల్లలెరుగని ప్రేమ. అందుకే 'బ్రౌను ఉదాహరణం' పేరిట ఉదాహరణ కావ్యాలకు కొత్త తళుకునద్దారు. పాతూరి నాగభూషణం జీవితచరిత్ర రాసి గురు రుణం తీర్చుకున్నారు. నేదునూరి గంగాధరం గురించి కేంద్ర సాహిత్య అకాడెమీకి పుస్తకం రాసి ఇచ్చారు. తప్పిపోయిన రాజమండ్రిలా ఇప్పుడు ఎక్కడెక్కడో తిరుగుతున్నారు. అయితేనేం, ఆయన ఎక్కడుంటే అక్కడే రాజమండ్రి!

– కల్లూరి భాస్కరం

(కాకినాడలో సెప్టెంబర్ 8న సన్నిధానం వారు అద్దేపల్లి రామమోహనరావు స్మారక పురస్కారం అందుకోబోతున్న సందర్భంగా)


# పౌర హక్కులకు ప్రమాద ఘంటికలు

అభిప్రాయం


మాడభూషి శ్రీధర్

బ్రిటిష్ వాళ్ల కాలంలో 1860లో ఇండియన్ పీనల్ కోడ్ రూపకల్పన పూర్తయింది. అప్పుడు మన దేశానికి రాజధాని కలకత్తా. కలకత్తా హైకోర్టే అతి పెద్ద న్యాయ స్థానం. బార్న్స్ పీకాక్ మొదటి చీఫ్ జస్టిస్‌గా ఉండేవారు. మన భారత దేశపు శిక్షాస్మృతి రాకముందు, మహ్మదీయ నేర చట్టం అమలులో ఉండేది. హిందూ, ముస్లింలనే తేడా లేకుండా అందరికీ ఈ చట్టం ప్రకారమే తీర్పులు ఉండేవి. దీనితో పోల్చినప్పుడు ఇండియన్ పీనల్ కోడ్ కొన్ని రెట్లు ఉన్నతమైనదిగా చెప్పవచ్చు. థామస్ బాబింగ్టన్ మెకాలే ఈ పీనల్ కోడ్‌ను రూపొందించాడు. బ్రిటిష్ చట్టాల ఆధారంగా క్రిమినల్ చట్టం రూపొందింది. మెకాలే సేకరించిన నేర నిర్వచనాలే ఇండియన్ పీనల్ కోడ్ అనవచ్చు. భారతీయ శిక్షాస్మృతిని నిర్మించడానికి అంతకుముందు బ్రిటిష్ కామన్ లా, న్యాయసూత్రాలు, చట్టపరమైన సంప్రదాయాలు వాడుకుంటూ... బ్రిటిష్ చట్టాల అమలులో ఎదురైన సమస్యల నుంచి, అనుభవాల నుంచి ఈ స్మృతిని రూపొందించాడు. 164 ఏళ్ల పాటు ఉన్న ఈ బ్రిటిష్ పట్టాల (చట్టాల) పైనే బీజేపీ ప్రభుత్వ రైళ్లు నడిచాయి.

ఇవీ మన కొత్త చట్టాలు-6



అయితే 2023 ఆగస్టు నాటికి ఈ చట్టాల స్థానంలో కొత్త శిక్షాస్మృతిని రూపొందించింది బీజేపీ ప్రభుత్వం. ఆ తర్వాత కేవలం నాలుగు నెల్లలోనే... అంటే డిసెంబర్ నాటికి మూడు క్రిమినల్ చట్టాలకు సవరణలు చేశారు. ఫలితంగా ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)–1860, ది కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ)–1973, ది ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872ల స్థానంలో వరుసగా: ది భారతీయ న్యాయ (సెకండ్) సంహిత బిల్–2023, ది భారతీయ నాగరిక్ సురక్షా (సెకండ్) సంహిత–2023, ది భారతీయ సాక్ష్య (సెకండ్) బిల్–2023 బిల్లులు తీసుకువచ్చారు. బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ లాల్ అధ్యక్షతన 31 మంది సభ్యుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆగస్టు 2023న ఈ చట్టాలను పునఃపరీక్ష చేసింది. నవంబర్ 7న కమిటీ రిపోర్టు సమర్పించింది. అందులో చాలా తప్పులు గుర్తించారు. 50 కన్నా ఎక్కువ మార్పులు చేయవలసిన అవసరం ఉందని అర్థమైంది. కొన్ని తప్పులను ప్రతిపక్షాల వారు కూడా పేర్కొన్నారు. క్రిమినల్ లా గురించి నిపుణులను సంప్రదించాల్సిన అవసరం ఉంది. కాని పట్టించుకోలేదు. అదిగాక, చాలా వరకు పాత చట్టాలనే కాపీ పేస్ట్ చేశారని తేలింది. ఆ తరువాత వ్యాకరణ తప్పులు, భాషాలోపాలు పట్టుకుని మార్చారు. స్టాండింగ్ కమిటీ చాలా మార్పులు చేసింది. మూడు బిల్లులను పూర్తిగా చదువుకోవడానికి 48 గంటల సమయం చాలు కదా అని ప్రభుత్వ పెద్దలు అనుకున్నారు. కానీ ఆ సమయం చాలదని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు.

క్రిమినల్ చట్టాలకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా అవలోకించవలసి ఉంది. 1950 నాటికి భారత రాజ్యాంగం తయారైనపుడు క్రిమినల్ న్యాయ సూత్రాలను ప్రాథమిక హక్కులలో చేర్చిన విషయాలు చదవవలసి ఉంది. అందుకే ఆర్టికల్స్ 20, 21, 22లను అర్థం చేసుకోకుండా న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేసే వాళ్లు దేశానికి పనికి రారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్టికల్ 20(1) కింద ఇటీవల పార్లమెంట్ మూడు నేర చట్టాలు చేయడమే రాజ్యాంగ నేరం. రాజద్రోహం అనే నేరాన్ని భారతీయ న్యాయ (రెండో) సంహిత బిల్లు 2023 నుంచి తొలగించారు. కాని మరో రూపంలో మళ్లీ వచ్చింది. మూకుమ్మడి వ్యక్తుల హత్యకు మరణశిక్ష విధించాలన్నారు. 'ఉపా' చట్టంలోని టెర్రరిస్టు నిర్వచనాన్ని మక్కీకి మక్కీ న్యాయసంహితకు చేర్చారు. ప్రజలకూ, ప్రజలలో ఏదో ఒక వర్గానికీ హాని కలిగించినా; దేశ ఐక్యత, సమగ్రత, ఆర్థిక భద్రత, సార్వభౌమత్వాలకు భంగం కలిగించినా, అలా భంగం కలిగిస్తున్నారేమోనని అనుమానం వచ్చినా ఉగ్రవాదిగా పరిగణించి అరెస్టుచేసే సర్వంసహాధికారాన్ని పోలీసులకు కొత్త న్యాయ చట్టం ఇచ్చింది. చెప్పొచ్చేదేమిటంటే... కొత్త న్యాయ చట్టాలు పోలీసులకు అపరిమిత అధికారాలు కట్టబెట్టాయి. ఫలితంగా పౌరహక్కులకు ప్రమాద ఘంటికలయ్యాయి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్టులు

- ఒక్కో రోజు ఒకరిద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు
- త్వరలో అందుబాటులోకి సేవలు

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో కూడా స్పెషలిస్ట్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అందుకోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముందుగా గైనకాలజీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆప్తల్మాలజీ, డెంటల్, ఆర్థోపెడిక్స్, పల్మనరీ మెడిసిన్, ఈఎన్‌టీ, సైకియాట్రీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అయితే పీహెచ్‌సీలలో అన్ని రోజులు అన్ని రకాల సర్వీసులు అందుబాటులో ఉండవు. ఒక్కోరోజు ఒకటి లేదా రెండు రకాల సర్వీసులు మాత్రమే అందుబాటులో తెస్తారు. ఉదాహరణకు ప్రతి సోమవారం గైనకాలజీ, పీడియాట్రిక్స్, మంగళవారం ఆర్థోపెడిక్స్, బుధవారం జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ అందుబాటులో ఉంటాయి. అలాగే, ఒక పీహెచ్‌సీలో సోమవారం గైనకాలజీ, పీడియాట్రిక్స్ డాక్టర్లు ఉంటే, మరో పీహెచ్‌సీలో సోమవారం ఆర్థోపెడిక్స్ లేదా మరేదైనా సర్వీసు అందుబాటులో ఉంటుంది. డాక్టర్ల లభ్యతను బట్టి ఏయే పీహెచ్‌సీలలో ఏరోజు ఏ సర్వీసులు అందుబాటులో ఉంచాలన్న అంశంపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. బోధనాసుపత్రులు, జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల (సీహెచ్‌సీ)లలో పనిచేస్తున్న డాక్టర్లనే రొటేషన్ పద్ధతిలో పీహెచ్‌సీలకు పంపిస్తారు. పీహెచ్‌సీలకు వచ్చిన రోగులను పరిశీలించి, ప్రాథమిక పరీక్షలు చేసి మందులు రాస్తారు. ఒకవేళ పీహెచ్‌సీలో అందుబాటులోలేని పరీక్షలు చేయాల్సి వస్తే, ఆ రోగిని పై ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. త్వరలో స్పెషలిస్టు సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

## ఆటోలో ప్రసవించిన మహిళ

- భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఘటన
- వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే...
- 15 రోజుల వ్యవధిలో ఇది రెండోసారి..


బిడ్డతో సంధ్యారాణి

భద్రాచలం అర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలో బుధవారం అర్ధరాత్రి ఓ మహిళ ఆటోలో ప్రసవించింది. గడిచిన 15 రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. భద్రాచలంలోని కంబాలపాడు కాలనీకి చెందిన గ్రంధి సంధ్యారాణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆటోలో ఏరియా ఆస్పత్రికి బుధవారం అర్ధరాత్రి తీసుకొచ్చారు. అయితే, ఆ సమయంలో వైద్యం అందించేందుకు ఎవరూ లేకపోవడంతో కొత్తగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో కొత్తగూడెం తరలించే క్రమంలో ఆమె ఆటోలోనే ఆడ శిశు వును ప్రసవించింది. వెంటనే ఆస్పత్రి సిబ్బంది, సంధ్యారాణి కుటుంబ సభ్యులు శిశువుని డ్యూటీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కాగా, భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నైట్ డ్యూటీ చేసే వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య ఆటోలో ప్రసవించాల్సి వచ్చిందని శ్రావణ్ ఆరోపించాడు. ఇదే విషయమై భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను వివరణ కోరగా.. వైద్యులెవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని, సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. సంధ్యారాణి బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారని, అక్కడ ఖర్చు ఎక్కువవుతుందని తిరిగి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సమయంలోనే ఇలా జరిగిందని వెల్లడించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన 415 మద్యం బాటిళ్లు స్వాధీనం

- గోవా నుంచి తీసుకొస్తుండగా.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్/శంషాబాద్ : గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న ఖరీదైన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. గోవా నుంచి మూడు విమానాల్లో మద్యం వస్తుందనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఆదేశాలతో ఏఈఎస్ జీవన్‌కిరణ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగారు. ఎస్టీఎఫ్ సీఐలు సుబాష్ చందర్‌రావు, చంద్రశేఖర్, డీటీఎఫ్ సీఐ ప్రవీణ్, శంషాబాద్ ఎక్సైజ్ సీఐ దేవేందర్‌రావుతోపాటు ఎస్సైలు, సిబ్బంది కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుధవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు ఎయిర్‌పోర్ట్ అధికారుల సహకారంతో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 415 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. 12 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఆర్‌ఎంపీలు గోవాలోని ఓ సదస్సుకు వెళ్లారు. వీరంతా తిరుగు ప్రయాణంలో మద్యం తీసుకొస్తున్నట్టు సమాచారం అందింది. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తెచ్చిన నేరం కింద ఎక్సైజ్ ఈఏఎస్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో శంషాబాద్ సీఐ దేవేందర్‌రావు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

**'చండీగఢ్'మద్యం సీజ్**

చండీగఢ్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా చేరిన మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మెట్రోస్టేషన్ సమీపంలో రూ.3.85 లక్షల విలువ చేసే 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.





## భద్రాద్రి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

# ఆరుగురు మావోయిస్టులు హతం

**కరకగూడెం అడవుల్లో ఎదురు కాల్పులు**

- మృతుల్లో డివిజినల్ కమిటీ సభ్యుడు లచ్చన్న
- గాయపడిన ఇద్దరు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు


ఎన్‌కౌంటర్ జరిగిన అడవి దగ్గర గుమిగూడిన స్థానికులు


● పోలీసులు విడుదల చేసిన మావోయిస్టుల ఫొటోలు

సాక్షిప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం, ములుగు జిల్లా తాడ్వాయిల సరిహద్దు అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు గ్రేహౌండ్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో వారు బుధవారం సాయంత్రం నుంచి ఈ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున మావోయిస్టులు ఉన్న కరకగూడెం మండలం రఘునాథపాలెం సమీపంలోని నీలాద్రిగుట్టను గుర్తించారు. వెంటనే అదనపు బలగాలను అడవుల్లోకి రప్పించారు. మొత్తంగా 150 మంది వరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏరియా డామినేషన్ మొదలెట్టారు. ఈ క్రమంలో ఉదయం 6:45 గంటలకు ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. అడవుల్లోంచి వస్తున్న భారీ శబ్దాలు, కాల్పుల మోతలు విని సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు.

**మృతులంతా బీకే–ఏఎస్‌ఆర్‌కే డివిజన్ వారే**

ఈ కాల్పుల్లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామ రాజు (బీకే-ఏఎస్‌ఆర్) డివిజన్ కమిటీకి చెందిన ఆరుగురు మావోయిస్టులు చనిపోయినట్టు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. మృతుల్లో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే 47, ఒక్కో ఎస్ఎల్‌ఆర్, 303 రైఫిల్, పిస్టల్‌తోపాటు తూటాలు, కిట్‌బ్యాగులు లభించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కాల్పుల నుంచి మావోయిస్టు మాసయ్య తప్పించుకున్నట్టు తమకు సమాచారముందని, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

**ఎల్‌జీఎస్‌గా పనిచేస్తూ..**

కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఆరుగురు మావోయిస్టులు మణుగూరు-పాల్వంచ ఏరియాలో లోకల్ గెరిల్లా స్క్వాడ్‌గా (ఎల్‌జీఎస్) పనిచేస్తున్నారు. వీరిలో బీకే-ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్న లచ్చన్న అలియాస్ కుంజా వీరన్న (42) స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా గొల్లపల్లి మండలం రాయిగూడెం గ్రామం. 2000 సంవత్సరంలో మావోయిస్టు పార్టీలో చేరిన లచ్చన్న అంచెలంచెలుగా ఎదిగాడు. ఈ కాల్పుల్లో చనిపోయిన పూనెం లక్కే (29) అలియాస్ తులసి (సీజీ, బీజాపూర్ జిల్లా, గంగ్లూర్ గ్రామం ) లచ్చన్న భార్యగా ప్రచారం జరుగుతోంది. ఈమె 2005లో మావోయిస్టు పార్టీలో చేరింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఇద్దరు ఉన్నారు. వీరిలో అల్లూరి సీతారామరాజు జిల్లా యటపాక మండలం సంగంపాడుకు చెందిన కొవ్వాసి రాము(25) 2015లో పార్టీలో చేరాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామానికి చెందిన పొడియం కోసయ్య (21) అలియాస్ శుక్రు 2019లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. మిగిలిన ఇద్దరు కోసి, దుర్గేశ్ ఇటీవలే మావోయిస్టు పార్టీ సభ్యులుగా చేరారు.

**వారిద్దరూ సేఫ్**

కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో కానిస్టేబుళ్లు వంశీ, సందీప్‌లలో ఒకరికి పొట్టలో తూటా దూసుకుపోగా, మరొకరి కాలుకు గాయాలయ్యాయి. దీంతో వీరిద్దరిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఆపై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అవసరమైన శస్త్ర చికిత్సలు చేశారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

**సాయంత్రానికి బయటకొచ్చిన మృతదేహాలు**

ఉదయం 6:45 గంటలకు ఎన్‌కౌంటర్ జరగ్గా, ఎనిమిది గంటలకు బయటి ప్రపంచానికి తెలిసింది. 10:30 గంటలకు మృతుల ఫొటోలు, పేర్లు వెలుగులోకి వచ్చాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తహసీల్దార్, ఎస్పీ రోహిత్‌రాజ్ ఘటనాస్థలికి వెళ్లారు. అయితే సాయంత్రం 6 గంటలకు మృతదేహాలను అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులు వచ్చే వరకు మృతదేహాలను మణుగూరు/భద్రాచలం ఆస్పత్రులకు తరలించనున్నారు.

**ఇది విప్లవద్రోహుల పనే: ఆజాద్**

విప్లవ ద్రోహుల కారణంగానే ఎన్‌కౌంటర్ జరిగిందని మావోయిస్టు పార్టీ బీకే -ఏఎస్‌ఆర్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈనెల 9న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే నెత్తుటి బాకీ తీర్చుకుంటామని ప్రకటించారు.

**జనజీవన స్రవంతిలో కలవండి: డీజీపీ జితేందర్**

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ జితేందర్ విజ్ఞప్తి చేశారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో డీజీపీ జితేందర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమాలకు తావులేదని డీజీపీ స్పష్టం చేశారు. అనాలోచిత హింసను మావోయిస్టులు కొనసాగించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. జనజీవన స్రవంతిలోకి వస్తే మావోయిస్టులకు ప్రభుత్వపరంగా పునరావాసం కల్పిస్తామని, ఇందుకు తక్షణ, దీర్ఘకాలిక సహాయక చర్యలు పొందవచ్చని డీజీపీ హామీ ఇచ్చారు

## మావోలపై 'టోర్నడో' ఎఫెక్ట్

- రెండునెలల క్రితమే భద్రాద్రి జిల్లాలోకి లచ్చన్న దళం
- తాడ్వాయిలో సుడిగాలులకు కూలిన చెట్లు
- ఆశ్రయం కోసం కరకగూడెం వనాల్లోకి వచ్చిన మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కరకగూడెం ఎన్‌కౌంటర్ వెనుక తాడ్వాయి టోర్నడో (సుడిగాలులు) కీలకంగా మారాయి. తెలంగాణలోకి ప్రవేశించిన మావోయిస్టులు ములుగు-భద్రాద్రి జిల్లాల సరిహద్దులోని దట్టమైన అడవులను కేంద్రంగా చేసుకొని రెండు నెలలుగా తిరుగుతున్నారు. అయితే భారీ సుడిగాలుల ధాటికి తాడ్వాయి మండలంలో ఒకేచోట రెండు వందల హెక్టార్లలో వేలాదిగా చెట్లు నేలకూలాయి. దీంతో మావోయిస్టుల కదలికలకు బ్రేక్ పడింది. అనివార్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అడవులకే దళాలు పరిమితం కావాల్సి వచ్చింది. చివరకు మావోల ఉనికి పోలీసులకు తెలియడంతో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి.

**తెలంగాణలో పార్టీ విస్తరణకు వచ్చి...**

తెలంగాణలో మళ్లీ పార్టీని విస్తరించాలనే లక్ష్యంతో జూన్‌లో చిన్నచిన్న జట్లుగా మావోయిస్టులు గోదావరి దాటినట్టు సమాచారం. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామెరతోగు అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతో పాటు దాదాపు పదిహేను మంది సభ్యులు సంచరిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గత జూలై 25న ములుగు -భద్రాద్రి జిల్లా సరిహద్దులో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఆరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన అశోక్ (34) అలియాస్ విజేందర్ చనిపోయాడు. మిగిలిన దళ సభ్యులు తప్పించుకుని పారిపోయినట్టు పోలీసులు ప్రకటించారు.

**పెరిగిన నిర్బంధం..**

దామెరతోగు ఎన్‌కౌంటర్ తర్వాత తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో నిఘా విస్తృతం చేశారు. లచ్చన్న దళానికి చెందిన సభ్యుల వివరాలు, ఫొటోలతో పాటు వారి తలలపై ఉన్న రివార్డులను సైతం వివరిస్తూ పోలీసులు వాల్‌పోస్టర్లు అంటించి నిర్బంధాన్ని తీవ్రం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయుధాలతో గోదావరి నది దాటడం మావోయిస్టులకు కష్టంగా మారినట్టు తెలుస్తోంది.

**నలభై రోజులుగా..**

ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నా..అడవులు, కొండల్లో రోజుకో చోటుకు మకాం మారుస్తూ పోలీసులకు చిక్కకుండా మావోయిస్టులు సంచారం సాగిస్తూ వచ్చారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, అతి భారీ సుడిగాలులు సృష్టించిన బీభత్సంతో తాడ్వాయి మండలాన్ని వదిలేసి పూర్తిగా భద్రాద్రి జిల్లాకే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో కచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు కూంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురిని మట్టుబెట్టారు.

## ఏ చెట్లు.. ఎన్ని కూలాయి?

- ములుగు అటవీ ప్రాంతంలో విధ్వంసంపై పరిశీలన షురూ
- 204 హెక్టార్లలో దాదాపు 70 వేల చెట్లకు నష్టం జరిగినట్టు ప్రాథమిక నివేదిక
- బీభత్సానికి కారణంపై వాతావరణ శాఖ, రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీల ద్వారా విశ్లేషణ


చెట్లను లెక్కిస్తున్న సిబ్బంది

సాక్షి, హైదరాబాద్/ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో చెట్లు నేలకూలడంపై అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. తాడ్వాయి నుంచి మేడారానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా.. రెండు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం (204కుపైగా హెక్టార్ల)లో దాదాపు 70వేల చెట్లకు నష్టం జరిగినట్టుగా ఆ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. ఇందులో నల్లమద్ది, ఏరుమద్ది, తెల్లమద్ది, గుప్పెన, తునికి, టేకు, ఎగిశా, నేరేడు, మారేడు. గుంపెన, బొజ్జ, బూరుగ తదితర 50, 60 రకాల చెట్లు ఉన్నట్టుగా వెల్లడించినట్టు సమాచారం. రెండు, మూడు రోజుల్లో అంచనా నివేదికను కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపనున్నట్టు తెలిసింది. కూలిపోయిన వాటిలో 50 నుంచి 70 ఏళ్లపైబడినవి భారీ వృక్షాల నుంచి ఐదు, పదేళ్ల వయసున్న చిన్న చెట్ల దాకా ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

**పూర్తి స్థాయిలో చెట్ల లెక్కలు తీస్తూ..**

ములుగు జిల్లా మేడారం అడవుల్లో కూలిన చెట్ల లెక్కింపులో అధికారులు నిమగ్నమయ్యారు. 30 హెక్టార్లకు ఒక బృందం చొప్పున పది బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 20 మంది సిబ్బంది ఉన్నారు. వారు పూర్తిగా నేలకూలిన, సగానికి విరిగిన, కొమ్మలు విరిగిన చెట్లతోపాటు బాగున్నవాటిని కూడా గుర్తించి.. వాటి కొలతలు నమోదు చేస్తున్నారు. ఏయే రకాల చెట్లు ఎన్ని ఉన్నాయి, కూలినవి ఎన్ని అనేదీ లెక్కతీస్తున్నారు. రెండు రోజుల్లో సవివర నివేదికను సిద్ధం చేసి అటవీశాఖకు అందించనున్నట్టు తెలిసింది.

**కారణమేమిటనే దానిపై ఆరా..**

కేవలం గంట, అరగంటలోనే అంత పెద్ద సంఖ్యలో చెట్లు నేలకూలడానికి కారణాలపై.. వాతావరణశాఖ (ఐఎండీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ)లను అటవీశాఖ సంప్రదించింది. మెట్రోలాజికల్, శాటిలైట్ డేటాలను విశ్లేషించి.. అసలు ఆ రోజు ఏం జరిగిందన్నది గుర్తించేందుకు ప్రయత్నించనున్నారు. మరోవైపు గురువారం అరణ్యభవన్ నుంచి జిల్లా అటవీ అధికారులతో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు తరహాలో రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో ఎక్కడైనా చెట్లకు నష్టం జరిగిందా అన్నది పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**నష్టాన్ని అంచనా వేస్తున్నాం..**

సుడిగాలుల కారణంగా అటవీ ప్రాంతానికి, చెట్లకు జరిగిన నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశాం. దెబ్బతిన్న చోట అటవీ పునరుద్ధరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. ములుగులో అంత బీభత్సం జరగడానికి కారణాలు, ఇతర అంశాలపై లోతైన అధ్యయనం నిర్వహిస్తాం.

– ఏలూసింగ్ మేరూ, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్)

## కొణతం దిలీప్ అరెస్టు

- జైనూరు ఉదంతంపై వివాదాస్పద పోస్టు చేశారన్న ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ మీడియా విభాగ మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో చోటు చేసుకున్న ఉదంతానికి సంబంధించి దిలీప్ 'తెలుగు స్క్రైబ్'అనే 'ఎక్స్'హ్యాండిల్‌లో వివాదాస్పద పోస్టు చేశారన్నది ఆరోపణ. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం రాత్రి సుమోటోగా కేసు నమోదు చేశారు. జైనూరు ఉదంతం రెండు వర్గాలకు సంబంధించినది అంటూ దిలీప్ పోస్టు చేయడం వివాదాస్పదం కావడంతో వెంటనే తొలగించారు. అప్పటికే ఇది వైరల్‌గా మారి పోలీసుల వరకు వెళ్లింది. సైబర్ క్రైమ్ అధికారులు తొలుత తెలుగు స్క్రైబ్ అనే హ్యాండిల్ పైనే కేసు పెట్టారు. తర్వాత దిలీప్‌ను నిందితుడిగా తేల్చిన పోలీసులు గురువారం ఉదయం ఆయనను అదుపులోకి తీసుకుని సీసీఎస్ కార్యాలయానికి తరలించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, కార్తీక్‌రెడ్డి సీసీఎస్ కార్యాయలయం వద్దకు చేరుకున్నారు. వీరిని అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో వాగ్వాదం జరిగింది.

**గొంతు నొక్కడమే ప్రజాపాలనా: కేటీఆర్**

కొణతం దిలీప్‌ను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాపాలన అంటే ప్రశ్నించే వారి గొంతు నొక్కటమేనా అని ప్రశ్నించారు. కాగా, ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారయత్న ఘటన విచారకరమని, నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## జైనూరు బాధితురాలికి రూ.లక్ష తక్షణ సాయం

**గాంధీ ఆస్పత్రిలో మంత్రి సీతక్కను అడ్డుకున్న బీజేపీ శ్రేణులు**


బాధిత కుటుంబానికి తక్షణసాయంగా లక్షరూపాయల చెక్కు అందిస్తున్న మంత్రి సీతక్క

గాంధీ ఆస్పత్రి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు ఘటనలో గాయపడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. బాధితురాలికి తక్షణసాయంగా లక్ష రూపాయల చెక్కును అందించారు. కాగా మంత్రి వస్తున్న సమాచారం తెలుసుకున్న బీజేపీ మహిళా శ్రేణులు గాంధీ ఆస్పత్రి వద్దకు చేరుకుని మంత్రిని అడ్డుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**ఆదివాసీ బిడ్డగా నాకే ఎక్కువ బాధ్యత...**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ, జైనూరు ఘటనపై కొంతమంది వ్యక్తులు, రాజకీయ పార్టీలు చేస్తున్న విషప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని తెలియగానే ప్రభుత్వం స్పందించిందని, నిందితునిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామని, కఠినశిక్ష పడేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఘటనలో దోషులను శిక్షించేందుకు ఆడబిడ్డగా, ఆదివాసీ బిడ్డగా తనకే ఎక్కువ బాధ్యత ఉందన్నారు. జైనూరు ఘటనకు మతం రంగు పూసేందుకు కొందరు యత్నిస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

**ఆదివాసీల జీవితాలతో చెలగాటం: ఏలేటి**

బంగ్లాదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రోహింగ్యాలు, ముస్లింలు ఏజెన్సీ ప్రాంతాలను ఆక్రమించుకుని, ఆదివాసీల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జైనూరు ఘటనలో చికిత్స పొందుతున్న బాధితురాలిని గురువారం పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర నిబంధనల మేరకు ఆదివాసీల ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు ఉండకూడదని, కానీ జైనూరు అటవీప్రాంతంలో వేలాది మంది ముస్లింలు, గిరిజనేతరులు స్థిరనివాసాలు ఏర్పరుకున్నారని ఆరోపించారు.

# పార్టీల 'పహాడీ' రాజకీయాలు

కశ్మీర్‌లో ఎస్సీ, ఎస్టీ ఓట్లపై కన్ను • పహాడీలు, వాల్మీకులకు ఎస్టీ హోదా • మోదీ సర్కార్ ఎత్తుగడ



జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తేల్చడంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారి ఓట్లే కీలకంగా మారే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో ప్రబల శక్తిగా ఎదిగేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాల ఫలితంగా స్థానిక రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ స్థానాలదే ముమ్ముందు కీలక పాత్రగా మారవచ్చని అంటున్నారు. జమ్మూ కశ్మీర్‌లో దశాబ్ద కాలం అనంతరం అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ ఒకటో తేదీల్లో మూడు విడతల్లో పోలింగ్ జరగనుంది. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను రద్దు చేశాక జరుగుతున్న తొలి ఎన్నికలివి. దాంతో ఫలితాలపై అందరి దృష్టి నెలకొని ఉంది. ఈ పదేళ్లలో స్థానిక రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోయిందనే చెప్పాలి. కాంగ్రెస్ మాజీ దిగ్గజం గులాం నబీ ఆజాద్ డీపీఏపీతో పాటు పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ వంటి నయా రాజకీయ పక్షాలు పుట్టుకొచ్చాయి. 2022లో చేపట్టిన నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా అసెంబ్లీ స్థానాల సంఖ్య 87 నుంచి 90కి పెరిగింది. ఇదేమీ పెద్ద పెరుగుదలగా కనిపించకపోయినా, ముస్లిం మెజారిటీ కశ్మీర్‌తో పోలిస్తే హిందూ ప్రాబల్య జమ్మూ ప్రాంతంలో ఎక్కువ సీట్లు పెరిగేలా మోదీ సర్కారు జాగ్రత్త పడింది.

మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో 9 ఎస్సీలకు, 7 ఎస్టీలకు రిజర్వ్ చేశారు. దాంతో జమ్మూ కశ్మీర్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే గుజ్జర్లు, పహాడీ తదితర సామాజిక వర్గాల ప్రాధాన్యం మరింత పెరిగింది. గత ఫిబ్రవరిలో దాదాపు 16 లక్షల మంది పహాడీ జాతులను కొత్తగా ఎస్టీ జాబితాలో చేరుస్తూ మోదీ సర్కారు వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ఇది అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి కోసం చేపట్టిన ఫక్తు రాజకీయ చర్య అని విపక్షాలు అప్పుడే విమర్శించాయి. ఎందుకంటే సంచార పశు పోషక జాతులైన గుజ్జర్లు, బాకర్వాల్‌లు సాంప్రదాయికంగా కాంగ్రెస్ మద్దతుదారులు. వారిని తనకేసి తిప్పుకోవడం సులువు కాదన్నది బీజేపీ భావన. అందుకే ఉరీ, కర్నాహ్, బారాముల్లా వంటి ప్రాంతాల్లో సంఖ్యాధికులైన పహాడీల ఓట్లపై పార్టీ కొంతకాలంగా కన్నేసింది. వీరు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) వంటి స్థానిక పక్షాలను బలపరుస్తుంటారు. ఎస్టీ జాబితాలో చేరిన కారణంగా వాళ్లిప్పుడు బుధాన్, సూరజ్ కోటే, రాజౌరీ వంటి ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అవకాశం కలిగింది. ఇది వారి ఓట్లను తమవైపు మళ్లిస్తుందని బీజేపీ ఆశ పడుతోంది. పహాడీలతో పాటు వాల్మీకి తెగవారిని తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. వాల్మీకులకు తాజాగా ఎస్టీ హోదా కల్పించారు. ప్రతి ఓటూ కీలకమే అయిన జమ్మూ కశ్మీర్‌లో ఏ అవకాశాన్నీ వదలరాదని బీజేపీ పట్టుదలగా ఉంది. 9 ఎస్టీ స్థానాల్లో ఐదు పీర్ పంజాల్ బెల్ట్‌లోని రాజౌరీ - పూంచ్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇవన్నీ తన ఖాతాలోనే పడతాయని అంచనా వేస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

**గుర్రుగా గుజ్జర్లు**

పహాడీ, వాల్మీకి జాతులకు ఎస్టీ హోదా ఇవ్వడంతో గుజ్జర్లలో ఆగ్రహజ్వాలలు ఎగసిపడుతున్నాయి. 15.6 లక్షలకు పైగా ఉన్న వీరు ఇప్పటిదాకా జమ్మూ కశ్మీర్‌లో 10 శాతం ఎస్టీ రిజర్వేషన్లకు పూర్తి హక్కుదారులు. వాటినిప్పుడు పహాడీ, వాల్మీకులతో పంచుకోవాల్సి వస్తుండటంపై వారిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అలాగని ఈ వర్గాలు నమ్ముకున్న కాంగ్రెస్ కూడా 16 లక్షల జనాభా ఉన్న పహాడీ, వాల్మీకులను కాదని వీరికి మద్దతుగా పూర్తిస్థాయిలో గళం విప్పే పరిస్థితుల్లో లేదు. మారిన రిజర్వేషన్ల అనంతరం జమ్మూకశ్మీర్ రాజకీయాలపై ఎస్సీ, ఎస్టీల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో తేటతెల్లం కానుంది.

# భారత్‌లోనూ 'సింగపూర్‌లు' సృష్టిస్తాం



సింగపూర్‌లో చిప్‌లను పరిశీలిస్తున్న లారెన్స్ వాంగ్, మోదీ

- అదే తమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ద్వైపాక్షిక చర్చలు
- కీలక రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయాలని నిర్ణయం

**సింగపూర్:** అభివృద్ధి చెందుతున్న దేశాలకు సింగపూర్ ఒక మోడల్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. సింగపూర్ ప్రగతి ప్రయాణం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భారత్‌లోనూ 'సింగపూర్‌లు' సృష్టించాలన్నదే తమ ధ్యేయమని తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ గురువారం సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్-సింగపూర్ మధ్య సంబంధాలను 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి చేర్చాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. సింగపూర్‌ను పరిపాలిస్తున్న నాలుగో తరం నాయకత్వంలో దేశం మరింత వేగంగా అభివృద్ధికి పథంలో దూసుకెళ్తుందన్న విశ్వాసం ఉందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. సింగపూర్ కేవలం ఒక భాగస్వామ్య దేశం మాత్రమే కాదని, అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. సింగపూర్ భాగస్వామ్యంతో భారత్‌లోనూ సింగపూర్‌లు సృష్టిస్తామన్నారు. నాలుగు నెలల క్రితం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన లారెన్స్ వాంగ్‌కు మోదీ అభినందనలు తెలియజేశారు.

**వేగం పుంజుకున్న పరస్పర సహకారం**

భారతదేశ 'తూర్పు కార్యాచరణ విధానం'లో సింగపూర్ పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. నైపుణ్యాభివృద్ధి, డిజిటలైజేషన్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ(ఏఐ), అడ్వాన్స్‌డ్ మ్యాను‌ఫ్యాక్చరింగ్, ఆరోగ్య సంరక్షణ, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాల్లో సింగపూర్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చామన్నారు. తాము నమ్ముతున్న ప్రజాస్వామ్య విలువలు భారత్, సింగపూర్‌ను అనుసంధానిస్తున్నాయని వివరించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం గత పదేళ్లలో రెండు రెట్లకుపైగా పెరిగిందన్నారు. భారత్‌లో సింగపూర్ పెట్టుబడులు మూడు రెట్లు పెరిగి, 160 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. రెండు దేశాల ప్రజల మధ్య యూపీఐ చెల్లింపుల సదుపాయం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

**త్వరలో తిరువళ్లువర్ సాంస్కృతిక కేంద్రం**

భారత్-సింగపూర్ మధ్య సంబంధాలకు 2025లో 60 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ వేడుకలను రెండు దేశాలు కలిసి నిర్వహించుకోవాలని, ఇందుకోసం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలని మోదీ సూచించారు. మొట్టమొదటి తిరువళ్లువర్ సాంస్కృతిక కేంద్రాన్ని త్వరలో సింగపూర్‌లో ప్రారంభించబోతున్నామని చెప్పారు. భారత్‌లో పర్యటించాలని లారెన్స్ వాంగ్‌ను మోదీ ఆహ్వానించారు.

**4 అవగాహనా ఒప్పందాలు**

సెమీ కండక్టర్ల తయారీ రంగంలో పరస్పరం సహకరించుకోవాలని భారత్, సింగపూర్ తీర్మానించుకున్నాయి. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల ప్రగతిని నరేంద్ర మోదీ, లారెన్స్ వాంగ్ సమీక్షించారు. సెమీ కండక్టర్లు, డిజిటల్ సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ రంగంలో పరస్పర సహకారం కోసం భారత్, సింగపూర్ నాలుగు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

**భారత్‌లో పెట్టుబడులు పెట్టండి**

ప్రధాని మోదీ గురువారం ప్రఖ్యాత సింగపూర్ కంపెనీల సీఈఓలతో సమావేశమయ్యారు. తమ దేశంలో వైమానిక, ఇంధనం, మౌలిక సదుపాయాలు, తయారీ, నైపుణ్యాభివృద్ధితోపాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు, వ్యాపార అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని సూచించారు.

**సెమీ కండక్టర్ కంపెనీ సందర్శన**

సింగపూర్‌లో ప్రఖ్యాతిగాంచిన సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ ఏఈఎం హోల్డింగ్స్ లిమిటెడ్‌ను నరేంద్ర మోదీ, లారెన్స్ వాంగ్ కలిసి సందర్శించారు. భారత్-సింగపూర్ మధ్య సంబంధాల్లో సెమీ కండక్టర్లు, టెక్నాలజీకి అత్యధిక ప్రాధాన్యం ఉందని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఉగ్రవాదం పెను ముప్పు**

ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ఉగ్రవాదం పెద్ద ముప్పుగా మారిందని భారత్, సింగపూర్ ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఈ మేరకు ఇరు దేశాలు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా సరే అంతం చేయాల్సిందేనని పేర్కొన్నాయి. ఇందుకోసం అన్ని దేశాలు అంకితభావంతో కృషి చేయాలని సూచించాయి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం దక్షిణ చైనా సముద్రంలో నౌకలు, గగనతలంలో విమానాల స్వేచ్ఛా విహారానికి అవకాశం ఉండాలని ఇరుదేశాలు ఉద్ఘాటించాయి.

# ఫ్రాన్స్ ప్రధానిగా మైకేల్ బార్నియర్



**పారిస్:** ఫ్రాన్ నూతన ప్రధాని మైకేల్ బార్నియర్‌ను దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ గురువారం నియమించారు. బ్రెగ్జిట్ చర్చల్లో యూరోపియన్ యూనియన్‌కు 73 ఏళ్ల బార్నియర్ ప్రాతినిధ్యం వహించారు. హంగ్ పార్లమెంటు ఏర్పడటం వామపక్షాలు అతిపెద్ద గ్రూపుగా అవతరించడంతో ప్రభుత్వం ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. ఎన్నికల్లో ఓటమితో గాబ్రియెల్ అట్టల్ జూలై 16న ప్రధానిగా రాజీనామా చేసినా ఒలింపిక్స్ క్రీడల దృష్ట్యా మాక్రాన్ ఆయన్నే తాత్కాలిక ప్రధానిగా కొనసాగించారు. లెఫ్ట్ కూటమి ఇదివరకు ఒకరిని ప్రధానిగా ప్రతిపాదించగా మాక్రాన్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో అందరినీ కలుపుకొని వెళ్లి ప్రభుత్వాన్ని నడపగల అభ్యర్థి కోసం మాక్రాన్ శిబిరం అన్వేషించింది. చివరకు బార్నియర్‌ను ఎంపిక చేసింది. 'దేశానికి, ఫ్రెంచ్ ప్రజలకు సేవ చేయడానికి ఏకీకృత ప్రభుత్వాన్ని నడిపే బాధ్యతను బార్నియర్‌కు అప్పగించాం' అని మాక్రాన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బార్నియర్ గతంలో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిగా, పర్యావరణ, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. యూరోపియన్ యూనియన్ కమిషనర్‌గా రెండు పర్యాయాలు చేశారు.

# పునరుత్పాదక ఇంధన లక్ష్యం సాధిస్తాం



**న్యూఢిల్లీ:** భారత్ పదేళ్లలోనే సౌర విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని 32 రెట్లు పెంచుకుందని ప్రధాని మోదీ చెప్పారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని చేరుకోవడం ఖాయమని స్పష్టంచేశారు. ఇంటర్నేషనల్ సోలార్ ఫెస్టివల్ సందర్భంగా గురువారం ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 'హరిత ఇంధన రంగంలో భారత్ ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. పునరుత్పాదక ఇంధనంపై పారిస్ ఒప్పందం పేర్కొన్న లక్ష్యాలను ముందుగా సాధించిన మొదటి దేశం భారత్' అని మోదీ పేర్కొన్నారు. హరిత ఇంధన రంగంలో పెట్టుబడుల్లో ప్రాంతాల వారీ వ్యత్యాసాలను తగ్గించాల్సిన అవసరముందని తెలిపారు. 2015లో ప్రారంభమైన ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్(ఐఎస్ఏ)లో అతి తక్కువ సమయంలోనే 100 దేశాలు సభ్యులుగా చేరడాన్ని ఒక మైలురాయిగా ఆయన అభివర్ణించారు.

# నోట్ల రద్దుపై మోదీ క్షమాపణ చెప్పాలి

**ఛత్రపతి శివాజీ విగ్రహం కూలినందుకు కూడా: రాహుల్**



**సాంగ్లి:** సింధుదుర్గ జిల్లాలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలినందుకుగాను ప్రధాని మోదీ ప్రతి మహారాష్ట్ర వాసికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుతోపాటు రైతు వ్యతిరేక చట్టాలు, వస్తుసేవల పన్ను(జీఎస్టీ) విధానాన్ని తెచ్చినందుకు కూడా మోదీ ప్రజలను క్షమాపణ కోరాలని ఆయన స్పష్టం చేశారు. సాంగ్లిలో గురువారం కాంగ్రెస్ పార్టీ దివంగత నేత పతంగ్‌రావ్ కదమ్ విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. 'ఎటువంటి అనుభవం లేని ఆర్‌ఎస్‌ఎస్ నేతకు శివాజీ విగ్రహం ఏర్పాటు బాధ్యతలను అప్పగించినందుకు, ఈ ప్రక్రియలో అవినీతికి పాల్పడినందుకు మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరుతున్నానన్నారు. 'కాంట్రాక్టులన్నిటినీ అదానీ, అంబానీలకు ఎందుకు ఇస్తున్నారు? ఆ ఇద్దరి కోసం మాత్రమే ప్రభుత్వాన్ని ఎందుకు నడుపుతున్నారు?'వంటి వాటికి మోదీ బదులివ్వాలన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ హాజరు కాగా మహాఘట్‌బంధన్‌లోని శివసేన(యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతోపాటు ఆ పార్టీ నేతలెవరూ ఈ కార్యక్రమంలో కనిపించలేదు.

# ఏచూరి ఇంకా ఎయిమ్స్ ఐసీయూలోనే



**న్యూఢిల్లీ:** సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72)కి ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆగస్ట్ 19వ తేదీన ఆయన్ను ఎయిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. అనంతరం ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)కు మార్చారు. అప్పటి నుంచి ఐసీయూలోనే ఆయనకు చికిత్స అందుతోంది. వైద్య నిపుణుల బృందం సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. అయితే, ఆయన అనారోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావడం లేదు. కొన్నిరోజుల క్రితం ఏచూరి కాటరాక్ట్ సర్జరీ చేయించుకున్నారు.

# అపరాజిత బిల్లుపై గవర్నర్ కొర్రీ!



**కోల్‌కతా:** మహిళలపై నేరాలకు కఠినశిక్షలను ప్రతిపాదిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకువచ్చిన అపరాజిత బిల్లుపై గవర్నర్ ఆనంద బోస్ కొర్రీ వేశారు. బిల్లుతో పాటు సాంకేతిక నివేదికను పంపనందుకు ముఖ్యమంతి మమతా బెనర్జీని గవర్నర్ తప్పుపట్టారు. బిల్లుపై సంతకం చేయాలంటే సాంకేతిక నివేదిక అత్యావశ్యకమని గవర్నర్ అభిప్రాయపడ్డారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. సాంకేతిక నివేదికలను బిల్లులతో పాటు పంపకపోవడం పరిపాటిగా మారిందని, ఆపై బిల్లులను తొక్కిపట్టారని గవర్నర్‌పై నిందలు వేస్తున్నారని పేర్కొన్నాయి. ఈ వైఖరిపై గవర్నర్ .. మమతా సర్కారుపై అసంతృప్తిని వెళ్లగక్కారని తెలిపాయి. అపరాజిత బిల్లును తెచ్చేముందు ప్రభుత్వం తగిన కసరత్తు చేయలేదని, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్‌లు తెచ్చిన బిల్లుల నుంచి మక్కీకి మక్కీగా (కాపీ- పేస్ట్) దించినట్లుగా ఉందని గవర్నర్ సర్కారును మందలించారు. ఇలాంటి పలు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిసీ.. బెంగాల్ ప్రజలను పక్కదోవ పట్టించడానికి రాజ్‌భవన్ వద్ద ధర్నా చేస్తానని మమత బెదిరిస్తున్నారని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఈ అపరాజిత బిల్లును బెంగాల్ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే.

# ఎన్నికల వేళ హరియాణాలో బీజేపీకి షాక్



**చండీగఢ్:** హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5వ తేదీన జరగనున్న ఎన్నికలు అధికార బీజేపీలో కాక పుట్టిస్తున్నాయి. బుధవారం బీజేపీ ప్రకటించిన 67 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాలో తమ పేర్లు లేవనే ఆగ్రహంతో మంత్రి రంజిత్ సింగ్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌దాస్ నాపాతోపాటు పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్, మాజీ మంత్రి కరణ్ దేవ్ కాంబోజ్ తిరుగుబాటు ప్రకటించారు. మాజీ డెప్యూటీ ప్రధానమంత్రి దేవీ లాల్ కుమారుడైన రంజిత్ సింగ్ మంత్రి పదవికి, ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. మద్దతుదారుల అభిప్రాయం మేరకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నానని, ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేస్తానని రంజిత్ సింగ్ గురువారం ప్రకటించారు. స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉన్న రంజిత్ సింగ్ లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు.

# బీజేపీలోకి క్రికెటర్ రవీంద్ర జడేజా



**గాంధీనగర్:** క్రికెటర్ రవీంద్ర జడేజా(35) రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. జడేజా భార్య, జామ్‌నగర్ బీజేపీ ఎమ్మెల్యే అయిన రివాబా స్వయంగా ఈ విషయం తెలిపారు. ఈ నెల రెండో తేదీ నుంచి బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జడేజా పార్టీ సభ్యుడయ్యారని రివాబా గురువారం వెల్లడించారు. బీజేపీ పార్టీ సభ్యత్వ కార్డులు ధరించిన ఇద్దరి ఫొటోలను రివాబా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో టీ20 అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు జడేజా రిటైర్‌మెంట్ ప్రకటించారు.

# వాళ్లు సంక్షోభాన్ని పోగొట్టగలరు

**ఉక్రెయిన్ విషయంలో భారత్, చైనా, బ్రెజిల్‌లనుద్దేశిస్తూ పుతిన్ వ్యాఖ్య**

**మాస్కో:** ఉక్రెయిన్‌పై రష్యా చేపట్టిన 'సైనికచర్య' కారణంగా తలెత్తిన సంక్షోభాన్ని భారత్, బ్రెజిల్, చైనా పోగొట్టగలవని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. వ్లాడివోస్తోక్ నగరంలో జరుగుతున్న ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరమ్ ప్లీనరీ సెషన్‌లో పుతిన్ మాట్లాడారు. '' భారత్, బ్రెజిల్, చైనాలతో నిరంతరం టచ్‌లోనే ఉన్నా. సంక్షోభం సమసిపోయేలా చేసేందుకు ఈ మూడు దేశాలు తీవ్రంగా కృషిచేస్తున్నాయి. చర్చలు జరిపేందుకు ఉక్రెయిన్ సుముఖంగా ఉంటే నేనూ అందుకు సిద్ధమే'' అని అన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలకు భారత్ సాయపడగలదని రష్యా అధ్యక్షుడి అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. '' చర్చలకు నాయకత్వంవహించే సత్తా మోదీకి ఉంది. ఆయన అయితేనే అటు పుతిన్‌తో ఇటు జెలెన్‌స్కీ, అమెరికాతో స్వేచ్ఛగా మాట్లాడగలరు. అంతర్జాతీయ సంబంధాల్లో కీలక భూమిక పోషించేందుకు భారత్‌కు ఇది సువర్ణావకాశం'' అని దిమిత్రి అన్నారు.

# ట్రూడో ప్రభుత్వానికి ముప్పు

- మద్దతు ఉపసంహరించుకున్న న్యూ డెమొక్రటిక్ పార్టీ
- కొత్త పొత్తులకు ఆహ్వానం
- విశ్వాస పరీక్ష కోసం ప్రతిపక్షాలపై ఆధారపడిన కెనడా ప్రధాని



జగ్మీత్ సింగ్ | జస్టిన్ ట్రూడో

**ఒట్టావా:** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రభుత్వానికి ఊహించని గట్టి దెబ్బ తగిలింది. ట్రూడో ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్డీపీ) నేత జగ్మీత్ సింగ్ బుధవారం ప్రకటించారు. 2022లో తమ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్లు జగ్మీత్ తెలిపారు. తన నిర్ణయాన్ని ఇప్పటికే ప్రధానికి తెలియజేశానని చెప్పారు. దీంతో ట్రూడో ప్రభుత్వం మైనారిటీలో పడింది. హౌస్ ఆఫ్ కామన్స్‌లో బల పరీక్షలో నెగ్గాలంటే ఇతర ప్రతిపక్షాల మద్దతు ట్రూడోకు తప్పనిసరి. అయితే కన్జర్వేటివ్‌లను ట్రూడో ఎదుర్కోలేకపోతున్నారని జగ్మీత్ విమర్శించారు. ట్రూడో ప్రభుత్వం పూర్తిగా స్వార్థపరులతో నిండిపోయిందని, కార్పొరేట్ ప్రపంచానికి కొమ్ముకాస్తోందని జగ్మీత్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తాను ప్రధాని పదవికి పోటీ చేస్తానని జగ్మీత్ తన మనసులో మాట బయటపెట్టారు. 52 ఏళ్ల ట్రూడో తొలిసారిగా 2015 నవంబరులో బాధ్యతలు చేపట్టారు. గత రెండేళ్లుగా అధిక ద్రవ్యోల్బణం ,గృహనిర్మాణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు ఎన్నికలలోనూ లిబరల్స్ మెజారిటీ సాధించలేదు. ఎన్డీపీ మద్దతుతో మైనారిటీ ప్రభుత్వాన్ని ట్రూడో పాలిస్తున్నారు. 2015 నవంబర్‌లో తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన ట్రూడో పట్ల ప్రస్తుతం ఓటర్లలో వ్యతిరేకతతో ఉందని సర్వేలు చెబుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగితే తాను ఘోరంగా ఓడిపోతానని సర్వేలు చెబుతున్న తరుణంలో పార్లమెంటు దిగువ సభలో విశ్వాస పరీక్షలో నెగ్గడానికి ట్రూడో ప్రతిపక్ష సభ్యుల మద్దతుపై ఆధారపడాల్సి వస్తుంది. కెనడా చట్టం ప్రకారం 2025 అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాలి. సెప్టెంబర్ 16న హౌస్ ఆఫ్ కామన్స్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ట్రూడో ప్రభుత్వం విశ్వాస పరీక్షలో ఓడిపోతే సార్వత్రిక ఎన్నికలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తు ఎన్నికల వార్తలను ట్రూడో తోసిపుచ్చారు. న్యూ ఫౌండ్ ల్యాండ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ట్రూడో మీడియాతో మాట్లాడారు. కెనడియన్లకు సేవలందించడంపై తాను ప్రత్యేకంగా దృష్టి పెడతానని ఆయన చెప్పారు. ఇతర రాజకీయాలపై దృష్టి పెట్టబోమని ఆయన స్పష్టంచేశారు. వచ్చే సంవత్సరమే ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. దానివల్ల తమ ప్రభుత్వం సొంత ఎజెండాతో ముందుకు సాగడానికి సమయం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కర్ణాటకలో యువతిపై హత్యాచారం

**బీదర్:** కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలో ఓ యువతి అత్యాచారం, హత్యకు గురైంది. ప్రధాన నిందితుడైన ఆమె బంధువు సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. గుణతీర్థవాడి గ్రామానికి చెందిన 18 ఏళ్ల తమ కుమార్తె ఆగస్ట్ 29వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ ఒకటిన స్థానిక పాఠశాల వద్ద ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. సాంకేతిక ఆధారాల సాయంతో అదృశ్యమైన రోజున ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన ముగ్గురిని గుర్తించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురిలో ఒకరు ఆమెను ఆరోజు కలుసుకున్నట్లు తేలింది. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఘటనాస్థలానికి కొద్ది దూరంలో తన ఇద్దరు మిత్రులు వాహనంతో కాపలాగా ఉండగా యువతిని రేప్ చేసి, తలపై బండరాయితో మోది చంపినట్లు ఒప్పుకున్నాడు. మృతురాలు, ప్రధాన నిందితుడు బంధువులవుతారని బీదర్ ఎస్పీ తెలిపారు. హత్యాచారం ఘటనపై బీదర్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు.

# బెయిల్ ఇవ్వడమంటే హైకోర్టును తక్కువ చేయడం కాదు

- కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణలో సుప్రీంకోర్టు
- తీర్పు రిజర్వు
- మంగళవారానికి వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో బెయిల్ ఇవ్వడమంటే హైకోర్టును తక్కువ చేయడం కాదని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిలు పిటిషన్‌పై విచారణలో భాగంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపి తీర్పు రిజర్వు చేసింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. తొలుత ఎస్వీ రాజు వాదనలు ప్రారంభిస్తూ... ఈ అంశాన్ని తొలుత ట్రయల్ కోర్టు విచారించాలని కోరారు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితల బెయిల్ ప్రస్తావన తీసుకొస్తూ....బెయిల్ మంజూరుకు ట్రయల్ కోర్టుకు వెళ్లమనడం సరికాదని సింఘ్వి పేర్కొన్నారు. బెయిల్ కోసం మళ్లీ ట్రయల్ కోర్టుకు పంపడం వైకుంఠపాళి ఆటలా ఉంటుందని సిసోడియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై ఎస్వీ రాజు అభ్యంతరం చెబుతూ సిసోడియా ట్రయల్ కోర్టుకు వెళ్లి మళ్లీ సుప్రీంకోర్టుకు వచ్చారని కేజ్రీవాల్ కూడా పద్ధతి ప్రకారం వ్యవహరించాల్సిందేనని పేర్కొన్నారు. ట్రయల్ కోర్టును బైపాస్ చేయడం కేవలం ప్రత్యేక పరిస్థితుల్లోనే జరుగుతుందని ఇక్కడ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడం తప్ప ఇంకేం లేదని రాజు తెలిపారు. బెయిల్ కోసం కేజ్రీవాల్ నేరుగా హైకోర్టుకు వెళ్లారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో, సీబీఐ వైకుంఠపాళి ఆట ఆడాలని చూస్తోందని సింఘ్వి ఆరోపించారు. సుప్రీంకోర్టు ఒకవేళ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తే.. అరెస్టును సమర్థించిన ఢిల్లీ హైకోర్టు నైతికస్థైర్యాన్ని అది దెబ్బతీస్తుందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అన్నారు. 'అలా అనకండి. బెయిల్ ఇస్తే హైకోర్టును తక్కువ చేసినట్లు కాదు. ఎలాంటి ఆదేశాలు జారీచేసినా హైకోర్టుకు భంగం కలగనివ్వం ' అని ధర్మాసనం రాజుకు హామీ ఇచ్చింది. అనంతరం తీర్పు రిజర్వుచేస్తున్నట్లు ప్రకటించి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# హసీనా మౌనంగా ఉంటే మంచిది

- భారత్‌లో కూర్చొని బంగ్లాదేశ్‌పై మాట్లాడటం సబబు కాదు
- అది ఇరుదేశాల మైత్రికి మంచిది కాదు
- బంగ్లాదేశ్ సారథి మొహమ్మద్ యూనుస్ వ్యాఖ్య

**ఢాకా:** బంగ్లాదేశ్‌ను వీడిన మాజీ మహిళా ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఉన్నంతకాలం మౌనంగా ఉంటే మంచిదని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్ హెచ్చరించారు. హసీనా బంగ్లాదేశ్‌ను వీడాక చెలరేగిన అల్లర్లలో చనిపోయిన వారికి న్యాయం జరగాలని ఆగస్ట్ 13వ తేదీన హసీనా డిమాండ్ చేయడంపై యూనుస్ ఘాటుగా స్పందించారు. గురువారం ఢాకాలోని తన అధికార నివాసంలో పీటీఐతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

**అప్పగింత కోరేదాకా మౌనంగా ఉండాల్సిందే**

''హసీనాను అప్పగించాలని మేం భారత్‌ను మేం కోరేదాకా ఆమె అక్కడ ఎలాంటి వ్యాఖ్యానాలు చేయొద్దు. మౌనమే మేలు. ఇక భారత్ సైతం ఒక విషయం గుర్తుంచుకోవాలి. హసీనా లేకపోయి ఉంటే మా దేశం అఫ్గానిస్తాన్‌లా తయారవుతుందన్న అభిప్రాయాలు మార్చుకోవాలి. హసీనాకు చెందిన ఆవామీ లీగ్ పార్టీ తప్ప బంగ్లాదేశ్‌లోని ప్రతి రాజకీయ పార్టీ ఇస్లామిక్ పార్టీ అనే భావననూ భారత్ విడనాడాలి. భారత్‌లో ఉంటూ ఆమె చేస్తున్న బంగ్లా వ్యతిరేక వ్యాఖ్యలపై ఇక్కడ ఎవరూ సంతోషంగా లేరు. ఆమెను వెనక్కి తీసుకురావాలని యోచిస్తున్నాం. భారత్‌లో ఉంటూ ఆమె చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతింటాయి'' అని అన్నారు.

**మేం కూడా ఆమెను మర్చిపోతాం**



మొహమ్మద్ యూనుస్

''ఆమె ఇండియాలో మౌనంగా కూర్చుంటేనే మేం కూడా ఆమెను మర్చిపోతాం. బంగ్లాదేశ్ ప్రజలూ ఆమెను మర్చిపోతారు. ఆమె తన లోకంలో తాను ఉంటే అందరికీ మంచిది. అలా కాకుండా భారత్‌తో కూర్చుని మాకు ఎలా పరిపాలించాలో ఉచిత సలహాలిస్తే ఎవ్వరికీ నచ్చదు. ఈ ధోరణి మాకేకాదు భారత్‌కు కూడా మంచిది కాదు. ఇరు దేశాల సంబంధాలపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆమె సాధారణ పర్యటనకు ఇండియా వెళ్లలేదు. ఉవ్వెత్తున ఎగసిన ప్రజా ఉద్యమానికి జడిసి హసీనా దేశం నుంచి పారిపోయారు. దేశంలో దురాగతాల నుంచి ప్రజలకు న్యాయం అందించేందుకు మా సర్కార్ కట్టుబడి ఉంది. ఆమె చెబుతున్నట్లు ప్రజలకు న్యాయం జరగాలంటే వాస్తవానికి ఆమెనే స్వదేశానికి తీసుకురావాలి. అలా జరగకపోతే బంగ్లాదేశ్ ప్రజలు శాంతించరు. ఆమె పాల్పడిన దురాగతాలపై అందరి సమక్షంలో విచారణ జరగాల్సిందే'' అని అన్నారు.

**భారత్‌తో సత్సంబంధాలనే కోరుకుంటున్నాం**

''బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఇస్లామిక్‌గా మారిపోయిందని, దేశాన్ని అఫ్గానిస్తాన్‌లా మార్చేస్తారని భారత్ భావిస్తోంది. కానీ మేం పొరుగుదేశం ఇండియాతో మైత్రి బంధాన్నే కోరుకుంటున్నాం. హసీనా నాయకత్వంలో మాత్రమే బంగ్లాదేశ్‌లో సుస్థిరత సాధ్యమని భారత్ భావించడం మానుకోవాలి. హసీనా ప్రభుత్వం కూలిపోయాక మైనారిటీ హిందువులపై దాడులు పెరిగాయనేది అవాస్తవం. భారత్‌తో బలహీనంగా ఉన్న బంధాన్ని బలోపేతం చేసుకోవాల్సిన సమయమొచ్చింది. రవాణా, అదానీ విద్యుత్ ఒప్పందం వంటి వాటిని పట్టాలెక్కించాలి. ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరుపుతా. తదుపరి ఎన్నికల్లో బీఎన్‌పీ గెలిచి అధికారంలోకి వస్తే దేశంలో అవసరమైన సంస్కరణలు తీసుకొస్తా'' అని అన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొత్త పథకాన్ని అమల్లోకి తెస్తూ రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సకాలంలో నిధులు విడుదల కాక సర్కారీ బడులు, కళాశాలలు కరెంటు బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం.. ఉత్తర్వులు జారీ**

- బిల్లులు కట్టలేకపోతున్న బడులు, కాలేజీలకు ఊరట
- డిస్కంలకు బిల్లులు చెల్లించనున్న ఆయా శాఖల విభాగాధిపతులు

**ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్**

సర్కారీ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌ను రూపొందించనున్నాయి. విద్యాసంస్థలు ఏ ప్రభుత్వ శాఖ పరిధిలోకి వస్తే ఆ శాఖ విభాగాధిపతి (హెచ్‌ఓడీ)కి ఆ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యే సదుపాయం కల్పిస్తాయి. తమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చేందుకు లేదా తొలగించేందుకు అవసరమైతే సవరణలు (యాడ్/డిలీట్/ఎడిట్) చేసేందుకు హెచ్‌ఓడీలకు అవకాశం ఉంటుంది. అవసరాన్నిబట్టి ఆయా విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని లేదా నిలిపివేయాలని కోరే వెసులుబాటు వారికి ఉంటుంది.

**ఇన్‌చార్జీలకు 'ఉచిత'బిల్లులు**

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేసి ప్రతినెలా క్రమం తప్పకుండా మీటర్ రీడింగ్ తీసి ఇన్‌చార్జి అధికారికి బిల్లులు జారీ చేస్తారు. దీనివల్ల ఉచిత విద్యుత్ దుర్వినియోగం కాకుండా వారు చర్యలు తీసుకొనేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ఎంత బిల్లు వచ్చిందనే వివరాలు అందులో ఉండనున్నాయి. అయితే ఆ బిల్లులను సదరు పాఠశాల/కళాశాల/విద్యాసంస్థ చెల్లించాల్సిన అవసరముండదు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన బిల్లులను సంబంధిత విభాగాధిపతులు తమ శాఖ బడ్జెట్ నిధుల నుంచి ప్రతి నెలా డిస్కంలకు చెల్లించనున్నారు. సంబంధిత విభాగాధిపతులు బడ్జెట్ కేటాయింపుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో సైతం అనుసంధానించనున్నారు. విభాగాధిపతులు తమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల విద్యుత్ వినియోగం, బిల్లుల మొత్తం, గత కాలానికి సంబంధించిన వినియోగం, జారీ అయిన బిల్లులు, జరిపిన చెల్లింపులు, చెల్లించాల్సిన బకాయిల వంటి సమాచారంతో కూడిన నివేదికలను వెబ్ పోర్టల్‌లో చూసుకోవడానికి వీలుండనుంది. విద్యాసంస్థ, మండలం, జిల్లావారీగా సైతం ఈ నివేదికలు ఆన్‌లైన్‌లో జనరేట్ కానున్నాయి.

## ఓటర్ల జాబితా ప్రచురణ రీషెడ్యూల్

- 13న జీపీ, ఎంపీపీ కార్యాలయాల్లో ప్రచురించాలి
- 21 కాకుండా 28న తుది జాబితా

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల కోసం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణను రీషెడ్యూల్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. గతంలో విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాలు ఈనెల 6న జీపీలలో ప్రచురించి, 21న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉంది. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా జిల్లాల్లోని మొత్తం యంత్రాంగం, క్షేత్రస్థాయి సిబ్బంది సహాయక చర్యలు, పునరావాస చర్యల్లో నిమగ్నమైనందున ఎస్ఈసీ జాబితాల తయారీ షెడ్యూల్‌ను సవరించినట్టు కమిషనర్ తెలిపారు. తాజా షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాలు ఈ నెల 13న గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. 14 నుంచి 21 వరకు గ్రామీణ అసెంబ్లీ ఓటర్లను వార్డు, గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించడంపై అభ్యంతరాలు స్వీకరించి, 26న పరిష్కరించాలని, ఈ నెల 28న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం అన్ని జీపీలలో ఫొటో ఓటర్ల జాబితాలు వార్డుల వారీగా, జీపీల వారీగా తయారీ, ప్రచురణకు జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# 4,85,729 మంది డూప్లికేట్ ఓటర్లు!

**ఓటర్ల జాబితా సవరణ- 2025లో భాగంగా గుర్తింపు**

- సీఈఓ సి.సుదర్శన్‌రెడ్డి వెల్లడి
- అక్టోబర్ 29 నుంచి కొత్త ఓటర్ల నమోదు



సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(ఎస్ఎస్ఆర్) 2025లో భాగంగా రాష్ట్రంలో 4,85,729 మంది ఓటర్ల పేర్లు, ఇతర సమాచారం ఒకే రీతి(సిమిలర్ ఎంట్రీ)లో ఉన్నట్టు గుర్తించామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఒకే నియోజకవర్గం ఒకే పార్ట్ పరిధిలో 52,586 మంది, ఒకే నియోజకవర్గం వేర్వేరు పార్ట్‌ల పరిధిలో 1,10,994 మంది, వేర్వేరు నియోజకవర్గాల పరిధిలో 3,22,149 మంది ఇలాంటి ఓటర్లున్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటివరకు 21,432 మంది డూప్లికేట్ ఓటర్లను జాబితాల నుంచి తొలగించామని చెప్పారు. బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన నిర్వహిస్తున్నారని, గత నెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో 3,33,11,347 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 70,60,288 (21.19 శాతం) మంది ఓటర్లను గుర్తించి నిర్ధారించినట్టు తెలిపారు. 10,224 మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని, 23,220 మంది వలస వెళ్లారని, 21,465 మంది చనిపోయారని, 12,763 మంది ఫొటోలు సరిగ్గా లేవని, 5,677 మందికి రెండు ఓట్లున్నట్టు గుర్తించినట్టు సీఈఓ తెలిపారు.

**జనవరి 6న తుది ఓటర్ల జాబితా:** అక్టోబర్ 29న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నాటి నుంచి నవంబర్ 28 వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులతో పాటు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని వెల్లడించారు. 2025 జనవరి 1కి కనీసం 18 ఏళ్లు కలిగి ఉండేవారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. డిసెంబర్ 24లోగా దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 6న తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సైతం ఒక పర్యాయంలో 10 దరఖాస్తులు, అభ్యంతరాలు చొప్పున 3 పర్యాయాల్లో 30 దరఖాస్తులు, అభ్యంతరాలను స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు సమర్పించవచ్చునని చెప్పారు.

# 6,000 పోస్టులతో మరో డీఎస్సీ

▶ మొదటి పేజీ తరువాయి

పెద్దపీట వేస్తోందన్నారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాలను మరో పదిరోజుల్లో వెల్లడించనున్నట్టు తెలిపారు. రూ.667 కోట్లతో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, వాటి నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించామని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.300 కోట్లు వెచ్చించామని, విద్యారంగంలో సమూల మార్పుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని భట్టి చెప్పారు.

**'ప్రభుత్వ' విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్**

ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు విదేశీ విద్య, ఉన్నత విద్యకు సంబంధించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేందుకు ఆలోచిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, టీచర్లు కూడా స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, అణగారిన వర్గాల కొత్తతరం ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లకు వస్తోందని, వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. మారుతున్న కాలంతో పాటు ఉపాధ్యాయులూ అప్‌గ్రేడ్ కావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఇంటర్‌బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొ. ఎస్‌కే మహమూద్, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎమ్మెల్సీలు కూర రఘోత్తమ్ రెడ్డి, ఎ.నర్సిరెడ్డి, ఎ.వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 150 మంది అధ్యాపకులను మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించారు.

## స్వప్నకు నేషనల్ ఆంట్రప్రెన్యూర్ అవార్డు



సాక్షి, న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఉత్తమ సేవలు అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఫ్యాకల్టీ వనమల స్వప్నకు 'ఆంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్'కేటగిరీలో కేంద్రంజాతీయ అవార్డును ప్రదానం చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రపతి ముర్ము నుంచి స్వప్న అవార్డు అందుకున్నారు. స్వప్న స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైజెస్ మేనేజ్‌మెంట్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రోలో అసోసియేట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు.

# 'మల్లన్నసాగర్'పై 'ఎన్జీటీ' విచారణ



- ఇన్వెస్టిగేషన్లు, అధ్యయనాలు లేకుండానే భూకంపాల జోన్‌లో ప్రాజెక్టు నిర్మించినట్టు గతంలో కాగ్ నివేదిక
- దీని ఆధారంగా సుమోటోగా విచారణ చేపట్టిన ఢిల్లీలోని ఎన్జీటీ ప్రధాన ధర్మాసనం
- కేసు చెన్నై ధర్మాసనానికి బదిలీ.. ఈ నెల 11న తదుపరి విచారణ

సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ప్రధాన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఏ అధ్యయనమూ చేయలేదు. ఎలాంటి ఇన్వెస్టిగేషన్ జరపలేదు. తొందరపాటుతో డ్రాయింగ్స్‌ను ఆమోదించి భూకంప జోన్‌లో మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించారంటూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) నివేదిక సమర్పించింది'అంటూ ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను ఎన్జీటీ సుమోటోగా పరిగణించింది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, జిల్లా డిప్యూటీ కలెక్టర్, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణమార్పుల మంత్రిత్వ శాఖ(ఎంఓఈఎఫ్) కార్యద ర్శిని ప్రతివాదులుగా చేర్చుతూ నోటీసులు జారీ చేసింది. అనంతరం చెన్నైలోని ఎన్జీటీ సదరన్ జోన్ ధర్మాసనానికి కేసును బదిలీ చేసింది. గత నెల 7న విచారణ నిర్వహించిన చెన్నై ఎన్జీటీ ధర్మాసనం.. 'మల్లన్నసాగర్'ను సందర్శించి నివేదిక సమర్పించాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్, నీటిపారుదల శాఖను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 11న నిర్వహించనుంది.

**'సిక్కిం' డ్యామ్ విషయాన్ని ప్రస్తావిస్తూ..**

గతేడాది సిక్కింలోని లోహ్నాక్ వాగుకు గండి పడడంతో తీస్తా నదికి ఆకస్మిక వరదలు పోటెత్తాయి. దీంతో చుంగ్తాంగ్ వద్ద తీస్తాపై నిర్మించిన 1,200 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు కమ్ డ్యామ్ కొట్టుకుపోగా, పలు మరణాలతో పాటు భారీనష్టం వాటిల్లింది. దీనిపై గతంలో ఎన్జీటీ–ఢిల్లీ సుమోటోగా విచారణకు స్వీకరించింది. మల్లన్నసాగర్ సైతం ఇదే తరహా అంశమని భావిస్తూ దానిపై సైతం విచారణ నిర్వహిస్తామని ఎన్జీటీ–ఢిల్లీ స్పష్టం చేసింది. భూకంపాల సంభావ్యతకు సంబంధించిన అధ్యయనాల్లేకుండా మల్లన్నసాగర్ నిర్మాణంతో ఏదైనా విపత్తు జరిగితే అమలు చేయాల్సిన అత్యవసర కార్యాచరణ ప్రణాళిక సైతం రూపొందించకపోవడం ద్వారా ప్రభుత్వం రిజర్వాయర్‌తోపాటు దిగువ ప్రాంతాల ప్రజల ప్రాణాలను ప్రమాదంలో నెట్టేసిందని కాగ్ ఆందోళన వ్యక్తం చేసిందని ఈ సందర్భంగా ఎన్జీటీ గుర్తు చేసింది.

**మల్లన్నసాగర్ గర్భంలో 3 జతల పగుళ్లు**

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించడానికి ముందే సైట్‌లో భూకంపాలు సంభవించడానికి ఉన్న అవకాశాలపై ఎన్జీఆర్ఐతో అధ్యయనం జరిపించాలని షరతు విధిస్తూ ప్రాజెక్టు ప్రాథమిక డ్రాయింగ్స్‌ను 2016 ఆగస్టులో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఆమోదించారు. ఈ అధ్యయనాలు నిర్వహించాలని నీటిపారుదలశాఖ 2016 డిసెంబర్, ఆగస్టు 2017, అక్టోబర్ 2017లో హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. అధ్యయన నివేదిక వచ్చే వరకు వేచిచూడకుండానే, 2017లో నీటిపారుదలశాఖ మల్లన్నసాగర్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. మరోవైపు మల్లన్నసాగర్‌ను ప్రతిపాదించిన ప్రాంత భూగర్భంలో అత్యంత లోతు వరకు నిలువునా 3 జతల పగుళ్లు, వాటిలో కదలికలూ ఉన్నట్టు ఎన్జీఆర్ఐ 2017 మార్చిలో సమర్పించిన ప్రాథమిక నివేదికలో తేల్చి చెప్పిందని కాగ్ బయటపెట్టింది. వీటి ద్వారా ఉండనున్న ప్రభావంపై సమగ్ర సర్వే, పరిశోధనలు చేయాలని సిఫారసులు చేసింది. ఈ ప్రాంతానికి ఉన్న భూకంపాల చరిత్రను ఉటంకిస్తూ సమగ్ర అధ్యయనం జరిపించాలని కోరింది. ఈ సిఫారసులను రాష్ట్ర నీటిపారుదల శాఖ విస్మరించిందని కాగ్ ఆక్షేపణలు తెలిపింది.

# వేద + కృత్రిమ మేధ

## భవిష్యత్తును చెప్పే డెస్టినీ.ఏఐ యాప్ రూపకల్పనలో హైదరాబాదీ శ్రీకుషాల్

**ఓ సినిమాలో 'భవిష్యవాణి' పుస్తకం రేపు ఏం జరుగుతుందనే విషయాన్ని హీరోకు చెప్పేస్తుంది. దాన్ని బట్టి కథానాయకుడు నిర్ణయాలు తీసుకుంటుంటాడు.**

**అచ్చం అలాగే రేపు ఏం జరుగుతుందో చాలా కచ్చితత్వంతో చెప్పేస్తా అంటున్నాడు ఓ స్టార్టప్ వ్యవస్థాపకుడు.**

వేదాలకు ఏఐ సాంకేతికతను జోడించి దీన్ని సాధించినట్లు శ్రీకుషాల్ యార్లగడ్డ అనే టెకీ చెబుతున్నాడు. మూడేళ్లుగా ఎన్నో పరిశోధనలు చేసి డెస్టినీ.ఏఐ అనే స్టార్టప్‌ను ఏర్పాటు చేసిన అతను.. అదే పేరుతో ఒక యాప్‌కు తుది మెరుగులు దిద్దుతున్నాడు.

**సాక్షి, హైదరాబాద్**

- వేదాలకు కృత్రిమ మేధ జోడించి స్టార్టప్‌కు రూపకల్పన
- ప్రోత్సహించిన టీ–హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు
- ప్రస్తుతం బీటా వెర్షన్ దశలో యాప్.. 60% కచ్చితత్వంతో ప్రిడిక్షన్
- త్వరలో 99% కచ్చితత్వంతో పనిచేసేలా రూపొందించేందుకు కసరత్తు



హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీకి చెందిన కృష్ణారావు, కనకదుర్గ దంపతుల పెద్ద కుమారుడు శ్రీకుషాల్ యార్లగడ్డ. చిన్నప్పటి నుంచి చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ ఉండే అతను.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్‌ఎం)లో పీజీ చేశాక బెంగళూరులో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అయితే చేసే పని నచ్చక 20 రోజులకే మానేసి ఇంటికొచ్చేశాడు. అప్పటి నుంచి వినూత్నంగా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో తనకు వచ్చిన ఆలోచనలను తల్లితో పంచుకొనేవాడు. భవిష్యత్తును కచ్చితంగా ఎలా అంచనా వేయగలమనే అంశంపై దాదాపు మూడేళ్లపాటు పరిశోధనలు చేపట్టాడు. ఇందుకోసం జ్యోతిష శాస్త్రంకన్నా ఎంతో గొప్పదైన 'ప్రాణ' (మనిషిలోని ఆరు చక్రాలు, నాడులు, కుండలిని) ఆధారంగా భవిష్యత్తుపై పరిశోధనలు ముమ్మరం చేశాడు. ఇందుకోసం 400 కోట్ల డేటా సెట్స్‌తో అల్గారిథమ్ రూపొందించాడు. అందులోని వివరాల ఆధారంగా తన తల్లిపైనే ప్రయోగాలు చేసేవాడు. ఫలానా రోజున జ్వరం వస్తుందని తల్లికి చెప్పగా అన్నట్లుగా ఆమె ఆ రోజున జ్వరం బారిన పడ్డారు. అలాగే ఫలానా రోజున ఒంట్లో నలతగా ఉంటుందని చెప్పిన సందర్భంలోనూ అలాగే జరిగింది. ఇలా 6 నెలలు పరిశీలించాక తాను చెబుతున్న విషయాలు కచ్చితత్వంతో జరగడంతో స్టార్టప్ స్థాపించాలనే ఆలోచనకు వచ్చాడు. ఇదే విషయాన్ని టీ–హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావుకు చెప్పడంతో ఆయన పరిశోధనలు చేసుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి ప్రోత్సహించారు. దీంతో డెస్టినీ.ఏఐ స్టార్టప్‌ను ఏర్పాటు చేసి అదే పేరుతో యాప్ రూపొందించాడు.

### తల్లి భవితపై ప్రయోగాలు..

### హోర శాస్త్రం ఆధారంగా..

బృహత్ పరాశరుడు రాసిన హోర శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని ప్రతి మనిషిలో ఉండే 'ప్రాణ' ఆధారంగా ఈ భవిష్యవాణి చెప్పొచ్చని కుషాల్ వివరించాడు. పూర్వ కాలంలో రాజులు, మంత్రులకు మాత్రమే పండితులు ఈ ప్రాణ లెక్కలు వేసి వారి భవిష్యత్తును అంచనా వేసేవారు. అయితే ఇప్పుడున్న పరిస్థితులు, జనాభాకు ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా లెక్కలు వేయడానికి చాలా సమయం పడుతుందనే ఉద్దేశంతో కుషాల్ సాంకేతికతను వినియోగించాడు. దీని ద్వారా కేవలం కొన్ని సెకన్లలోనే ఒక వ్యక్తి భవిష్యత్తును కచ్చితత్వంతో చెప్పొచ్చని కుషాల్ అంటున్నాడు. సాధారణ పద్ధతిలో ఒక వ్యక్తి ప్రాణ విశ్లేషణ చేసేందుకు కొన్ని గంటల సమయం పడుతుందని కుషాల్ పేర్కొన్నాడు.

### ఎలా పనిచేస్తుంది?

డెస్టినీ.ఏఐ అప్లికేషన్‌లో మన పుట్టిన తేదీ, సమయం, పుట్టిన ప్రాంతాన్ని ఎంటర్ చేస్తే మెషీన్ మొత్తం విశ్లేషించి రేపటి రోజున ఏం జరుగుతుందనేది చెప్పేస్తుందని కుషాల్ చెబుతున్నాడు. ప్రస్తుతం యాప్ బీటా వెర్షన్‌లో ఉందని.. దాదాపు 60 శాతం కచ్చితత్వంతో సమాచారం అందిస్తోందని వివరించాడు. సమీప భవిష్యత్తులో యాప్‌ను మరింతగా అభివృద్ధి చేసి 99 శాతం కచ్చితత్వంతో భవిష్యవాణి చెప్పేలా రూపొందిస్తానని కుషాల్ అంటున్నాడు.

### నిర్ణయాలు తీసుకోవడానికి దోహదం

జీవితంలో కీలక నిర్ణయాలు తీసుకొనే విషయంలో ఈ యాప్ ఉపయోగపడుతుందని కుషాల్ అంటున్నాడు. భవిష్యత్తులో జరగబోయే విషయాలు తెలిస్తే ఆందోళనకు గురికాకుండా అప్లికేషన్‌లో భవిష్యత్తుతోపాటు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే మంచిదనే అంశాలను కూడా మెషీన్ పొందుపరుస్తుందని వివరించాడు.

# ఏఐకి 'ఫ్యూచర్' సిటీనే

▶ మొదటి పేజీ తరువాయి

మొబైల్ ఫోన్లు చూడటం మన తరం చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఏఐ లాంటి కొత్త టెక్నాలజీ వచ్చిన సమయంలో.. ఓ వైపు జీవితం మెరుగుపడుతుందనే ఆశ ఉండగా, మరోవైపు ఉద్యోగ భద్రత ఉండదనే భయం కూడా సహజంగానే ఉత్పన్నమవుతోందన్నారు. కానీ ఏఐ టెక్నాలజీని ప్రోత్సహించడంలో తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు.

**26 అవగాహన ఒప్పందాలు**

'ఏఐ ఆధారిత తెలంగాణ'లక్ష్యాల సాధన దిశగా ప్రైవేటురంగ సంస్థలు, విద్యా సంస్థలు, దిగ్గజ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, లాభాపేక్ష లేని సంస్థలతో 26 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ ఒప్పందాల్లో కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్సలెన్స్ కేంద్రం, స్కిల్లింగ్, ఇంపాక్ట్ అసెస్‌మెంట్, స్టార్టప్ ఇన్నోవేషన్, జనరేటివ్ ఏఐ, పరిశోధన సహకారం, డేటా అన్నోటేషన్ రంగాలకు సంబంధించినవి ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. ఏఐ ద్వారా తెలంగాణను ప్రపంచ మేధోశక్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ప్రణాళికలు పటిష్టంగా రూపొందిస్తున్నామని చెప్పారు.

**ఆవిష్కరణలు కీలకం: మోహన్‌రెడ్డి**

ఏఐ రంగంలో కొత్తగా ఆవిష్కరణలు, కొత్త యాప్‌లు అత్యంత కీలకమని నాస్కామ్ మాజీ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఏఐపై పాఠాలు, పరిశోధనలకు వాణిజ్య రూపం ఇవ్వడం, ఏఐలో కొత్త మార్కెట్‌ను సృష్టించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ఐటీ రంగ ప్రముఖులు రాబిన్, వరప్రసాద్‌రెడ్డి, అశోక్ స్వామినాథన్‌తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంకా, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తదితరులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 200 ఎకరాల్లో ఏఐ సిటీ: శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్రం ఏటా 11.3 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని 176 బిలియన్ డాలర్లకు చేర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. త్వరలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఏఐ పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా 200 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ సిటీని తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏఐ సిటీ నూతన ఆవిష్కరణలకు పుట్టినిల్లుగా నిలుస్తుందని, స్కూల్ ఆఫ్ ఏఐ ఎక్సలెన్స్‌ను కూడా ప్రారంభిస్తామని అన్నారు. ఏఐ ఆధారిత కంపెనీల కోసం తాత్కాలికంగా శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంలో రెండు లక్షల చదరపు అడుగుల్లో అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి చెప్పారు.

# ఏఐ సిటీకి రోడ్‌మ్యాప్

**విడుదల చేసిన ముఖ్యమంత్రి**

- ఏడుగురితో అడ్వైజరీ కౌన్సిల్
- గ్లోబల్ సమ్మిట్‌లో తొలిరోజు కీలక ఒప్పందాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏఐ గ్లోబల్ సదస్సు తొలిరోజు గురువారం రాష్ట్ర ప్రభుత్వం పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఏఐ టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం లక్ష్యంగా కీలక ప్రకటనలు చేసింది. ఏఐ సిటీ రోడ్‌మ్యాప్‌ను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో 25 కార్యక్రమాలను పొందు పరిచింది. తెలంగాణ గ్రోత్ స్టోరీ పేరిట వివిధ రంగాల అభివృద్ధి వివరాలతో కూడిన పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఏఐ రంగం అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనల కోసం ఏడుగురు సభ్యులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేశారు. ఏఐ సిటీ లోగోను ఆవిష్కరించిన సీఎం.. అనంతరం ఏఐ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ టెక్నాలజీ లక్ష్యాలు చేరుకునేందుకు వీలుగా ఊతమిచ్చేందుకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, స్థానిక భాషలో ఏఐ, పరిశోధన, భాగస్వామ్యాలు తదితరాలపై రాష్ట్ర ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుంది.

**కుదిరిన ఒప్పందాలు ఇవే..**

- ➤ సి డాక్, యొట్టా (కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)
- ➤ ఫిక్స్ ఏఐ పాత్, నజావా (ఏఐ సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు)
- ➤ ఏడబ్ల్యూఎస్, మైక్రోసాఫ్ట్, నెక్స్‌ట్ వేవ్, సౌత్ ఏషియన్ ఉమెన్ టెక్ (నైపుణ్య శిక్షణ)
- ➤ జె- పాల్ (ఏఐ కార్యకలాపాల మీద థర్డ్ పార్టీ అసెస్‌మెంట్)
- ➤ సమగ్ర (ఏఐ రోడ్‌మ్యాప్ తయారీ)
- ➤ ఓపెన్ ఏఐ, ఎన్‌విడియా, మెటా, భాషిణి (స్థానిక భాషలో ఏఐ)
- ➤ ఐఎస్‌బీ, ఐఐటీ హైదరాబాద్, బిట్స్ హైదరాబాద్, నల్సార్, ఎన్‌ఐటీ వరంగల్ (పరిశోధన, భాగస్వామ్యం)
- ➤ ఉబెర్, జీఎన్‌టీయూ, స్వేచ్ఛ(డేటా ఆర్గనైజేషన్)
- ➤ ఏఐ పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకోకున్నా కలిసి పనిచేసేందుకు జార్జియా టెక్ వర్సిటీ ఆసక్తి వ్యక్తం చేసింది.

**ఏఐ అడ్వైజరీ కౌన్సిల్**

రోహిణీ శ్రీవత్స (మైక్రోసాఫ్ట్), సునీల అబ్రహం (మెటా), ప్రొఫెసర్ బీఎస్ మూర్తి (డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్), శ్రీకాంత్ కొలనుకన్ని (ఫ్రాక్టెల్), రాజన్ (పీక్ ఎక్స్‌వీ), సమీర్ సనన్ (అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్), విజయ శంకర్ (ఈవై). కాగా ఈ కమిటీని భవిష్యత్తులో విస్తరిస్తారు.

**ఏఐ సిటీ ప్రత్యేకతలు ఇవే..**

హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఏఐ రంగానికి అవసరమైన అన్ని వసతులు ఉంటాయి. తెలంగాణను గ్లోబల్ ఏఐ ఆవిష్కరణల కేంద్రంగా నిలిపేందుకు వీలుగా అనేక సౌకర్యాలు ఉంటాయి. అభివృద్ధి, పరిశోధన కేంద్రం, స్టార్టప్‌లు, ఏఐ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ తదితరాలు ఉంటాయి.



రాష్ట్రపతి నుంచి అవార్డులు అందుకుంటున్న మృదుల, సంపత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి

# డాక్టర్ మృదులకు జాతీయ ఉత్తమ అధ్యాపకురాలు అవార్డు ప్రదానం

- ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ఉత్తమ టీచర్లుగా సంపత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డికి..

సాక్షి, న్యూఢిల్లీ: విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నందవరం మృదులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉత్తమ అధ్యాపకురాలి అవార్డును ప్రదానం చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్ బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ప్రొఫెసర్‌గా మృదుల పనిచేస్తున్నారు. మృదులతో పాటు తాడూరి సంపత్‌కుమార్ (రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీ స్కూల్), పీసర ప్రభాకర్‌రెడ్డి (ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జెడ్పీ స్కూల్) జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను రాష్ట్రపతి నుంచి అందుకున్నారు.

# బీజేపీ తెలంగాణ రుణం తీర్చుకోవాలి: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 14 జిల్లాలు జల ప్రళయానికి గురై తీవ్ర నష్టం సంభవించిందని, ఈ అసాధారణ ప్రకృతి విలయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ఈ వైపరీత్యం కారణంగా 16 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటనష్టం, ఆస్తుల నష్టం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణం తెలంగాణ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, తెలంగాణను ఆదుకోవడం ద్వారా రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకోవాలని సూచించారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజానీకం 8 లోక్‌సభ స్థానాలలో గెలిపించి బీజేపీకి ప్రాణం పోశారని గుర్తు చేశారు. రాష్ట్రానికి రూ. 2వేల కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరారు. క్లౌడ్ బరస్ట్ అయినట్టుగా కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసిందని, తమ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించి, అధికారులను మోహరించడం వల్ల మృతుల సంఖ్య తగ్గిందని ఆయన పేర్కొన్నారు.



**అక్రమార్కులపై డిస్కం కొరడా!**

అక్రమ వసూళ్లకు పాల్పడిన, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజినీర్లపై డిస్కం కొరడా ఝుళిపించింది.
-12లో



**ఓటీటీపై.. ఓ లుక్కు..**

ఓటీటీ వేదికలంటే.. ఇంటి పట్టునే ఉండి కొత్త కొత్త సినిమాలను ఆస్వాదించడంతో పాటుగానే ఇప్పటి జీవన శైలిలో ఇదో నిత్యకృత్యంగా మారింది.
- సిటీ ప్లస్‌లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
30.0/23.0

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## మట్టి గణపతులనే పూజిద్దాం

మేయర్ విజయలక్ష్మి



జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న మేయర్

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని మేయర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పర్యావరణంపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల్లో భాగంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

## జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రేవంత్



సికింద్రాబాద్: హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు నగరంలోని సీతాఫల్‌మండికి చెందిన జీఎం రేవంత్ ఎంపికయ్యాడు. తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో రేవంత్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా రేవంత్‌ను హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు శివకుమార్, శ్రవణ్ కుమార్, రాజు, జింఖానా కోచ్ హేమలత అభినందించారు.

## క్రెష్‌ల ఏర్పాటు తప్పనిసరి

భవన నిర్మాణ అనుమతుల్లో నిబంధన

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి కాలంలో కుక్కల బెడద పెరిగిపోవడం.. ముఖ్యంగా పసిపిల్లలు కుక్కల దాడుల్లో తీవ్రంగా గాయపడటంతో పాటు అడపాదడపా ప్రాణాలు కోల్పోతుండటంతో నిర్మాణ ప్రాంతాల్లో పిల్లల సంరక్షణకు క్రెష్‌ల ఏర్పాటు తప్పనిసరి చేయాలని ఇదివరకే నిర్ణయించిన జీహెచ్‌ఎంసీ .. ఇక దాన్ని అమలు చేయనుంది. ఈమేరకు కమిషనర్ ఆమ్రపాలి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 50 మంది, అంతకుమించి కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో క్రెష్‌లు ఏర్పాటు చేస్తేనే భవన నిర్మాణాలకు అనుమతులిచ్చేలా నిబంధనల్లో చేర్చాలని ఆదేశించారు. పనులకు వెళ్లే కార్మికుల పిల్లలను సంరక్షించేందుకు ఎవరూ లేకపోవడంతో వారు కుక్కకాటు బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇందుకు సిద్ధమయ్యారు. ఈ నిబంధన చేర్చడంతో పాటు అమలు చేయాలని, ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు పొందిన బిల్డర్లకు సైతం ఈ విషయం తెలియజేసి క్రెష్‌లు ఏర్పాటు చేయించాల్సిందిగా కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు.

## వరద బాధితులకు కార్పొరేటర్ల సాయం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు ఒక నెల గౌరవ వేతనాన్ని అందజేసేందుకు ముందుకొచ్చారు. మేయర్ విజయలక్ష్మి అన్ని పార్టీల కార్పొరేటర్లతో మాట్లాడటంతో అందుకు వారు అంగీకరించారు. త్వరలోనే ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయనున్నట్లు మేయర్ తెలిపారు.

## పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం



అంబర్‌పేట: బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంబర్‌పేట గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్‌లతో కలిసి మంత్రి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభూల శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభూల ఉష శ్రీకాంత్ గౌడ్, గౌడ్ సంఘం చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు బింది రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాలకు శంకుస్థాపన నేడు

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం నిర్మించతలపెట్టిన రెండు కొత్త హాస్టల్ భవనాల నిర్మాణ పనులకు శుక్రవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా రెండు హాస్టల్ భవనాల నిర్మించేందుకు రూ.115 కోట్లు, డెంటల్ స్టూడెంట్ల హాస్టల్ భవన విస్తరణ కోసం రూ.6 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 8 అంతస్తుల్లో 1,80,760 చదరపు అడుగుల విస్తీర్ణంలో అమ్మాయిల హాస్టల్ నిర్మించనుండగా, 4 అంతస్తుల్లో 74,696 చదరపు అడుగుల విస్తీర్ణంలో అబ్బాయిల హాస్టల్ నిర్మించనున్నారు. 10,286 చదరపు అడుగుల విస్తీర్ణంలో డెంటల్ హాస్టల్ నిర్మించనున్నారు. వీటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రభత్వం టెండర్లు పిలిచింది. ఏడాదిలోగా బిల్డింగుల నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నారు.



ఖైరతాబాద్ మహా గణపతికి నేత్రాలు దిద్దుతున్న శిల్పి రాజేంద్రన్

## కన్నుల పండువగా..

ఖైరతాబాద్ మహాగణపతికి నేత్రోనిలనం

ఖైరతాబాద్‌లో కొలువుదీరనున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతికి గురువారం శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేత్రోనిలనం చేశారు. కంటిపాపను అమర్చి ప్రాణ ప్రతిష్ఠ గావించారు. విగ్రహ తయారీ పూర్తయిన తర్వాత వినాయకుడికి కంటిపాపను అమర్చడం ద్వారా ప్రాణప్రతిష్ఠ చేసినట్లవుతుందని శిల్పి తెలిపారు. దివ్యజ్ఞాన సిద్ధాంతి విఠలశర్మ సూచన మేరకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మహా గణపతికి కంటిపాపను అమర్చారు. కాగా.. రేపటి నుంచి ప్రారంభం కానున్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి మహాగణపతి చెంత మహారాష్ట్రకు చెందిన బ్యాండ్ కళాకారులు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున సందడి చేశారు. వీరితో ఎమ్మెల్యే దానం నాగేందర్ జత కలిశారు. ఆనందంగా స్టెప్పులు వేశారు.

– ఖైరతాబాద్



ఆనందంగా స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



బ్యాండ్ కళాకారుల సందడి

# క్లోరినేషన్‌పై నజర్

- కలుషితం లేని నీటి సరఫరాకు చర్యలు
- లాగ్‌బుక్ నిర్వహణ తీరుపై ఆరా
- జలమండలి ఎండీ క్షేత్రస్థాయి పరిశీలన

**ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేలా..**

రిజర్వాయర్లలో జరిగే క్లోరినేషన్ ఆటోమేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి పాయింట్‌లో నీటిశుద్ధిపై దృష్టి సారించాం. నీటి పరీక్షలు నిర్వహించిన తర్వాతే సరఫరా చేసేలా ఆదేశాలు జారీ చేశాం. నీటి సరఫరాలో కలుషిత సమస్యకు పూర్తిగా చెక్ పెట్టేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం.
– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

**రిజర్వాయర్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**



రిజర్వాయర్లలో క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ

**ట్యాంకుల్లోకి పక్షులు దూరకుండా..**

తాగునీటిని సరఫరా చేసే రిజర్వాయర్ల శుభ్రతపై జలమండలి ఆరా తీస్తోంది. రిజర్వాయర్ల క్లీనింగ్, ట్యాంకులకు రక్షణ కవచం మెయింటెన్స్‌పై దృష్టి సారించింది. రిజర్వాయర్ల ట్యాంకుల్లోకి పక్షులు దూరి రాకుండా చర్యలు చేపట్టింది. గతంలో వెంటిలేషన్‌ల నుంచి పావురాలు ట్యాంక్‌లోకి రావడం వ్యర్థాలు వదలడం, ప్రమాదవశాత్తు పడి చనిపోవడం లాంటి జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది.

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో సైతం కలుషితం లేకుండా సురక్షిత తాగునీటి సరఫరా జరిగేలా రిజర్వాయర్లలో క్లోరినేషన్ నిర్వహణపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి జలాశయాల్లో కొత్త నీరు వచ్చి చేరి రిజర్వాయర్లకు చేరే క్రమంలో మట్టి, ఇతరత్రా వ్యర్థాలు కలిసి వస్తుండటంతో పూర్తిస్థాయి శుద్ధితో నగర వాసులకు నీరు అందేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చివరి సర్వీస్ రిజర్వాయర్ వరకు క్లోరినేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సాక్షాత్తూ జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రంగంలోకి దిగి రిజర్వాయర్లలో క్లోరినేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తున్నారు. గురువారం నారాయణ గూడ రిజర్వాయర్‌ను సందర్శించి క్లోరినేషన్ ప్రక్రియ, ఫ్లో మీటర్‌ను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించి చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రత పాటించాలని అశోక్‌రెడ్డి సూచించారు.

**క్లోరినేషన్ మెయింటెనెన్స్ ఇలా..**

- జలాశయాల నుంచి మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల మీదుగా సర్వీస్ రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల వరకు నీరు సరఫరాలో ప్రతి పాయింట్ వద్ద నీటి శుద్ధి ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా మూడంచెల క్లోరినేషన్ నిర్వహించి వినియోగదారుడికి నీటిని సరఫరా చేస్తున్నారు. బీఐఎస్ నిబంధనల ప్రకారం రిజర్వాయర్ వద్ద క్లోరినేషన్ రెండు పీపీఎం (పార్ట్ పర్ మిలియన్) మెయింటెనెన్స్ జరగాలి. నల్లా ద్వారా వినియోగదారుడికి నీరు చేరే సమయంలో కచ్చితంగా అందులో 0.5 పీపీఎం క్లోరినేషన్ మెయింటెనెన్స్ కావాలి. సర్వీస్ రిజర్వాయర్ నుంచి లైన్‌కు సరఫరా చేసే అర్ధగంట ముందు క్లోరినేషన్ గ్యాస్‌ను నీటిలో విడుదల చేయాల్సి ఉంటుంది.
- ప్రతి లైన్‌కు క్లోరినేషన్ శాతం పరిశీలన అనంతరమే సరఫరా జరగాలి. నీటి సరఫరా సమయంలో క్లోరినేషన్ శాతంపై ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. రిజర్వాయర్‌లో నీటిలో క్లోరినేషన్ ప్రభావం తగ్గగానే తిరిగి కలిపితేనే నీటి నాణ్యత మెరుగుపడుతుంది. క్లోరినేషన్ శాతం నిర్దేశించిన దానికంటే తక్కువ ఉంటే ఆ నీరు సురక్షితం కానట్లేనని నిపుణులు పేర్కొంటున్నారు. క్లోరిన్ ప్రభావం లేని కారణంగా సూక్ష్మ క్రిమికీటకాలు వృద్ధి చెంది నీరు ప్రజారోగ్యానికి హానికరంగా మారే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**లాగ్‌బుక్ నిర్వహణ తీరుపై ఆరా..**

సర్వీస్ రిజర్వాయర్లలో లాగ్‌బుక్ నిర్వహణ తీరుపై జలమండలి దృష్టి సారించింది. నిబంధనల ప్రకారం ఎగువ నుంచి రిజర్వాయర్‌లోకి వచ్చి చేరే నీటి ప్రవాహంలో క్లోరిన్ శాతంతో పాటు దిగువ నీటిని విడుదల చేసే సమయంలో క్లోరిన్ శాతాన్ని లాగ్ బుక్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వీస్ రిజర్వాయర్ నుంచి లైన్‌లకు నీటిని సరఫరా జరిగే సమయంలో సైతం క్లోరిన్ శాతాన్ని లాగ్ బుక్‌లో నమోదు చేయాలి. ప్రతి గంటకు నమోదు చేయాల్సి ఉండగా ఆచరణలో కొన్ని చోట్ల అమలు కానట్లు తెలుస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించి లాగ్‌బుక్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు ఉపక్రమించేందుకు సిద్ధమవుతోంది.

## నైపుణ్యానికి సాన!



**స్కిల్స్‌తోనే కెరీర్‌లో ఉన్నతావకాశాలు**

- నైపుణ్యాభివృద్ధిపై యువ ఉద్యోగుల ఆసక్తి
- డేటా సైన్స్, ఏఐ, మిషన్ లెర్నింగ్‌లో శిక్షణ
- ఉద్యోగ భద్రతతో పాటు సంస్థ విలువ పెరుగుదల

**సంస్థలకు విలువ చేకూరుతుంది**

నేటి సాంకేతిక యుగంలో ఉద్యోగుల స్థానం పదిలంగా ఉండాలంటే నిరంతరం అభ్యాసం తప్పనిసరి. దీంతో డిజిటల్ సాధనాలను యువ ఉద్యోగులు కొత్త ఉపాధి మార్గాలుగా ఎంచుకుంటున్నారు. వ్యాపార, విస్తరణ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త సాంకేతికత వీలు కలిపిస్తుంది. ఉద్యోగులలో నైపుణ్యాభివృద్ధి ఆలోచనలు వారు పనిచేసే సంస్థలకు మరింత విలువను చేకూరుస్తుంది.
– కశ్యప్ దలాల్, సీఈఓ, సింప్లీలెర్న్

సాక్షి, సిటీబ్యూరో: శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక రంగంలో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువ ఉద్యోగులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందుకోసం ప్రతిభ, నైపుణ్యాలకు సాన పెడుతున్నారు. దీంతో కెరీర్‌లో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆయా సంస్థల విలువ మెరుగవుతోంది. కొత్త ఉద్యోగ అవకాశాల కోసం 83 శాతం జెన్–జెడ్ యువత వారి నైపుణ్యాభివృద్ధికి మొగ్గు చూపిస్తుందని సింప్లీలెర్న్ తాజా అధ్యయనంలో తేలింది.

**డేటా సైన్స్, ఏఐ కోర్సులలో..**

నైపుణ్యాభివృద్ధి కోసం అయ్యే వ్యయాన్ని తల్లిదండ్రులు, ఇతరత్రా మార్గాల ద్వారా కాకుండా సొంత నిధులు, వ్యక్తిగత పెట్టుబడులకే 91 శాతం యువత ఆసక్తి చూపిస్తోంది. నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని భావిస్తున్న వారిలో 70 శాతం పురుషులు, 30 శాతం మహిళలు ఉన్నారు. అత్యధికంగా 35.3 శాతం మంది డేటా సైన్స్, వ్యాపార విశ్లేషణలో, 33.9 శాతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మిషన్ లెర్నింగ్‌లో, 20.2 శాతం మంది సైబర్ సెక్యూరిటీ కోర్సులలో నైపుణ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు.

**60 శాతం ఐటీ రంగంలోనే..**

10 వేల మంది యువ ఉద్యోగులపై సింప్లీ లెర్న్ అధ్యయనం చేసింది. శ్రామికశక్తిలో నైపుణ్యాభివృద్ధికి ప్రేరణ, వారి ప్రవర్తన తదితర అంశాలను విశ్లేషించింది. వీరిలో సుమారు 66 శాతం బ్యాచిలర్స్ డిగ్రీ విద్యార్హత కలిగి ఉన్నారు. దాదాపు 60 శాతం మంది ఇప్పటికే ఐటీ రంగంలో ఉపాధి పొందుతున్నారు. 40 శాతం మంది ఐటీయేతర రంగాలలో నిమగ్నమయ్యారు.

**జెన్–జెడ్ అంటే?**

18–27 ఏళ్ల వయసు తరాన్ని జెన్–జెడ్‌గా పిలుస్తుంటారు. ప్రపంచంలోనే అత్యధిక జెడ్–జెడ్ యువత మన దేశంలోనే ఉన్నారు. దేశంలోని జనాభాలో 60 కోట్ల మంది 28 ఏళ్ల లోపు యువతే. జెన్–జెడ్‌లో నైపుణ్యాలను మెరుగుపర్చడంతో 10 కోట్ల మంది యువ భారతీయులను వర్క్‌ఫోర్స్‌లోకి వస్తారని అంచనా. దీంతో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి చెంది, దేశ ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుతుంది. 2030 నాటికి ప్రపంచ శ్రామిక శక్తిలో 30 శాతం జెన్–జెడ్ యువతే ఉంటారు.

## ఇక పాతబస్తీపై ప్రత్యేక దృష్టి

**ఫ్లై ఓవర్లు, రహదారుల పనులకు చర్యలు**

- క్షేత్రస్థాయిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పర్యటనలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి వివిధ చర్యలు చేపడుతున్న జీహెచ్‌ఎంసీ ప్రస్తుతం పాతబస్తీపై దృష్టి సారించింది. ఇరుకు రహదారుల్లో ట్రాఫిక్ చిక్కులను తప్పించేందుకు ఆయా ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణాలు చేయాలని గతంలోనే భావించింది. అందుకనుగుణంగా కొన్ని ప్రాంతాల్లో దాదాపు రూ. 150 కోట్లు ఖర్చు చేసి సంబంధిత అధికారులు భూసేకరణ సైతం జరిపారు. పనులు మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లోనూ మళ్లీ ఆక్రమణలు జరిగేందుకు అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పనులు చేపట్టేందుకు కమిషనర్ ఆమ్రపాలి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సంబంధిత ప్రాజెక్టులకు పూర్తిస్థాయి ప్రణాళికతో పాటు సరైన అంచనా వ్యయం, తదితర పనులు పూర్తి చేసి టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సిందిగా సంబంధిత ఇంజినీరింగ్ (ప్రాజెక్ట్స్) అధికారులకు సూచించారు. ఆక్రమణలుంటే తొలగించాల్సిందిగా ఆదేశించారు. భూసేకరణ పూర్తికాని ప్రాంతాల్లో త్వరితంగా పూర్తిచేయాలని సూచించారు.

**ఇవీ పనులు..**

- చేయాల్సిన పనుల్లో బెంగళూర్ నేషనల్ హై వే నుంచి శాస్త్రిపురం జంక్షన్ వరకు, శాస్త్రిపురం జంక్షన్ నుండి ఇంజన్ బౌలి వరకు వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ, అజీం హోటల్ నుంచి చర్చి గేట్ వరకు (షోహెబ్ హోటల్ నుంచి బాలాపూర్ రోడ్)80 అడుగుల రోడ్డు, చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్ నుంచి చాంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్ మీదుగా బార్కాస్ రోడ్ వరకు 60 అడుగుల రోడ్డు, లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబానగర్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డు విస్తరణ, హఫీజ్ బాబా నగర్ జంక్షన్, బండ్లగూడ జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్‌లు, ఓవైసీ జంక్షన్ వద్ద ఎడమ వైపు డౌన్ ర్యాంపు నిర్మాణం తదితరాలు ఉన్నాయి.
- కమిషనర్ ఆమ్రపాలి గురువారం బండ్లగూడ ఫ్లైఓవర్ జంక్షన్, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డు విస్తరణ, తులసీ నగర్ నుంచి గౌస్ నగర్ వరకు ఫ్లై ఓవర్, బాబా బజార్ నుంచి భవాని నగర్ వరకు, షేక్ ఫైజ్ కమాన్ నుంచి డబీర్ పుర ఫ్లైఓవర్ వరకు ప్రతిపాదిత రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఫలక్‌నుమాలో చేపట్టనున్న ఆర్‌ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) ఎం. దేవానంద్, ఎస్ఈ దత్తు పంత్, చార్మినార్ జోన్ సిటీ ప్లానర్ మాజిద్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పాతబస్తీలో పర్యటిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

## అలా వచ్చేస్తూ.. ఇలా ముంచేస్తూ..

**రాత్రి వేళల్లో వరుణుడి ప్రతాపం**

- కుండపోతతో రోడ్లన్నీ జలమయం
- ముందుకు సాగని ట్రాఫిక్
- చీకట్లో కనిపించని గుంతలు
- ప్రమాదాల బారిన వాహనదారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిశీధి సమయంలో వాన బెంబేలెత్తిస్తోంది. మూడు రోజులుగా వరుసగా రాత్రి పూట కురుస్తున్న కుండపోత వర్షం అతలాకుతలం చేస్తోంది. రోడ్లన్నీ జలమయమై ట్రాఫిక్ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రి పూట కావడంతో ఇంటికి త్వరగా చేరుకోవాలన్న తపన వాహనదారులను నరకయాతనకు గురిచేస్తోంది. ఒకవైపు మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు ముందుకు సాగక మొరాయిస్తుండగా.. చీకట్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురిచేస్తోంది. మహానగరంలో చిన్న వర్షానికే రోడ్లన్నీ చెరువులు తలపించే పరిస్థితి ఉండగా, డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లుతుంటాయి. ఇక రాత్రి పూట కుండపోత వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు సెక్టార్లలో పని చేసే ఉద్యోగులు విధులు ముగించుకొని ఇంటి బాట పట్టేవారికి, అత్యవసర పనులపై బయటికి వచ్చిన వారికి రాత్రిపూట భారీ వర్షం ప్రాణాంతకంగా తయారైంది. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుండగా, సర్వీస్ రోడ్లలో లైట్లు లేక చీకటి మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

**10 సెంటీమీటర్లకుపైగానే..**

గత నాలుగైదు రోజులుగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే నగరంలో అతి భారీ వర్షాలు లేనప్పటికి ప్రతిసారీ 8 నుంచి 10 సెంటీ మీటర్లపైనే వర్షపాతం నమోదవుతూ వస్తోంది. గురువారం రాత్రి 9 గంటల వరకు 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, బుధవారం రాత్రి 8, అంతకు ముందు అర్ధరాత్రి తర్వాత 9, అంతకుముందు రాత్రి 10 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కనీసం గంట రెండు గంటలు వర్షం కురిసినా.. కుండపోతగా కొనసాగడం ఆందోళనకు గురిచేస్తోంది.

**వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించినా..**

- హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తుంటాయి. వర్షం నీరు ఎటూ వెళ్లలేక రోడ్లపై నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగించడం సర్వసాధారణంగా మారింది. జలమండలి, జీహెచ్‌ఎంసీ వర్గాలు వాటర్‌లాగింగ్ పాయింట్లను గుర్తించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినా.. అవి కేవలం పగటి పూటకు పరిమితమవుతున్నాయి.
- వాస్తవంగా నగరంలో గుర్తించిన లాగింగ్ పాయింట్ల కంటే రెట్టింపు సంఖ్యలో వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాన రోడ్లపై పరిస్థితి ఇలా ఉంటే సర్వీస్ రోడ్లపై పరిస్థితి మరింత అందోళన కరంగా తయారైంది. ప్రధానంగా ఫ్లై ఓవర్ల కింద రోడ్ల మూల మలుపులు, సర్వీస్ రోడ్ల క్రాసింగ్‌ల్లో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచి ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. పగటి పూట కొంత జాగ్రత్తలు తీసుకున్నా.. రాత్రి పూట మాత్రం మరింత ప్రమాదకరంగా తయారవుతున్నాయి.



## ఎందుకలా చేశావమ్మా..

- ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకిన మహిళ
- తల్లి, కుమారుడి మృతదేహాలు లభ్యం
- కూతురు బాడీ కోసం గాలింపు
- ఇబ్రహీంపట్నంలో విషాదం



మంగ, శరత్ మృతదేహాలు

ఇబ్రహీంపట్నం: ఆ తల్లికి ఎంత కష్టమొచ్చిందో తెలియదు.. అభంశుభం తెలియని ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. తల్లి, కుమారుడి మృతదేహాలు లభించగా కూతురు కోసం గాలిస్తున్నారు. మరో చిన్నారి ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్ ప్రాంతానికి చెందిన ఓర్సు మంగ(38) తన కూతురు, ఇద్దరు కుమారులను వెంటబెట్టుకొని గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. స్నానం చేద్దామని చెప్పి పిల్లలతో కలిసి కట్ట కిందికి దిగింది. మంగతో పాటు ఆమె కూతురు లావణ్య(14), పెద్ద కుమారుడు శరత్(7) చెరువులోకి దూకారు. చిన్న కుమారుడు విఘ్నేష్(5) నీళ్ల పక్కనే నిలబడి ఉండిపోయాడు. ఎంత సేపటికి తన వాళ్లు బయటకు రాకపోవడంతో ఏడ్చుకుంటూ కట్టపైకి వచ్చాడు. ఇది గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చేరుకున్న మున్సిపల్, పోలీసు సిబ్బంది చెరువులో గాలించగా మంగ, శరత్ మృతదేహాలు లభించాయి. లావణ్య కోసం గాలిస్తున్నారు. పిల్లలు వేసుకున్న స్కూల్ డ్రెస్ ఆధారంగా వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్‌లో చదువుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుల కుటుంబం మునగనూర్‌లో నివసిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 25 రోజుల్లో 591 ఫోన్లు రికవరీ!



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

- వీటి విలువ రూ.2 కోట్ల పైమాటే
- సెల్‌ఫోన్ల రికవరీలో రెండో స్థానంలో రాచకొండ
- బాధితులకు అందజేసిన కమిషనర్ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. 25 రోజుల్లో రూ.2 కోట్లు విలువ చేసే 591 సెల్ ఫోన్లను రికవరీ చేశారు. గురువారం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో కమిషనర్ జీ సుధీర్ బాబు ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో 3,213 మొబైల్స్‌ను రికవరీ చేశామని, దీంతో ఫోన్ల రికవరీలో గ్రేటర్‌లో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఎల్బీనగర్, మల్కాజ్‌గిరి, భువనగిరి సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు, ఐటీ సెల్ విభాగంతో కలిసి సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించి, చోరీకి గురైన ఫోన్లను రికవరీ చేశారని, అత్యధికంగా ఎల్బీనగర్ సీసీఎస్ పరిధిలో 339, మల్కాజ్‌గిరిలో 149, భువనగిరిలో 103 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే ఐఎంఈఐ నంబర్, ఇతరత్రా వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. దీంతో చోరీకి గురైన ఫోన్‌లో ఎవరైనా వినియోగించేందుకు ప్రయత్నించగానే ఐఎంఈఐ నంబర్ యాక్టివేట్ అవుతుందని, దీంతో ఫోన్ ఎక్కడుంది? వంటి వివరాలు పోర్టల్‌లో కనిపిస్తాయని, దీంతో రికవరీ చేయడం సులువవుతుందని కమిషనర్ వివరించారు.

# అన్ని సమస్యలకు ఏఐ పరిష్కారం

- గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ఆకట్టుకుంటున్న స్టాల్స్
- భారత్ స్మార్ట్ సర్వీసెస్ ఏఐ పరిష్కారం
- బిజిలీ ఆడిటర్ పేరిట వినూత్న పరికరం తయారు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల మంది వినియోగం
- నెల వారీగా విద్యుత్ వినియోగంపై విశ్లేషణ
- మూసీ రివర్ మేనేజ్‌మెంట్‌లో ఏఐ వినియోగం
- ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గ్లోబల్ ఏఐ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఎన్నో సమస్యలకు కృత్రిమ మేధ (ఏఐ)తో పరిష్కారం చూపిస్తున్నారు. టీ హబ్‌లో పురుడుపోసుకున్న భారత్ స్మార్ట్ సర్వీసెస్ సంస్థ ద్వారా విద్యుత్‌ను స్మార్ట్‌గా వాడుకునే ఉపకరణాలను అభివృద్ధి చేసింది.

### పక్కాగా కరెంటు లెక్క..

ఏఐ పవర్డ్ కంట్రోలింగ్ స్మార్ట్ ప్లగ్ అనే ఈ పరికరంతో ఇంట్లో వాడుతున్న అన్ని రకాల విద్యుత్ ఉపకరణాలకు ఎంత విద్యుత్‌ను వినియోగిస్తున్నామనే వివరాలను మనకు ఎప్పటికప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు సమాచారం అందజేస్తుంది. ఈ నెలలో ఎంత మేర విద్యుత్ వినియోగం చేస్తున్నామో.. వచ్చే నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో కచ్చితంగా చెప్పేస్తుందని కంపెనీ సీఈవో సికిందర్‌రెడ్డి తాండ్ర తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది దీనిని వాడుతున్నారని, తద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని, వాతావరణ మార్పులు జరగకుండా తమ వంతు సాయం చేయొచ్చని వివరించారు. ఇక, క్లైమేట్ యోధ ఉద్యమం పేరిట.. కొందరు వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి, ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలకు సంబంధించి ఆడిట్ నివేదిక ఇస్తారని పేర్కొన్నారు. ఎంతమేర విద్యుత్ వాడాలో టార్గెట్ ఇచ్చి మరీ, విద్యుత్‌ను ఆదా చేసుకునేలా మనకు యాప్‌లో నిర్దేశిస్తుందని తెలిపారు.

### మూసీ పరిరక్షణలో ఏఐ

మూసీ రివర్ ఫ్రంట్ మేనేజ్‌మెంట్‌లో కృత్రిమ మేధను ఎలా వాడుకోవచ్చనే విషయంలో పలువురు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్ పలువురిని ఆకట్టుకుంది. తమ ప్రాజెక్టులో భాగంగా కృత్రిమ మేధతో మూసీ సమస్యకు చెక్ పెట్టొచ్చని విద్యార్థులు తెలిపారు. ఈ విషయాన్ని తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు మెచ్చుకున్నారన్నారు. దీనికి సంబంధించి స్టాల్‌ను గ్లోబల్ ఏఐ సదస్సులో ఏర్పాటు చేసేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ స్టాల్‌ను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఐడియాను మెచ్చుకున్నారని విద్యార్థులు చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో సెన్సార్లను అమర్చడం ద్వారా.. వరదలు వచ్చినా.. ఎవరైనా భవన నిర్మాణ వ్యర్థాలు పడేసినా.. చెత్త పడేసినా వెంటనే గుర్తించి అధికారులకు సమాచారం అందజేస్తుందని వివరించారు. పరీవాహక ప్రాంత ప్రజలకు వరదలకు సంబంధించిన సమాచారం కూడా చేరవేస్తుందని తెలిపారు. దీంతో ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చని పేర్కొన్నారు.





### చేతిరాత నుంచి నేరుగా పీడీఎఫ్

మన పుస్తకాల్లో రాసుకున్న నోట్స్ ఎప్పటికీ భద్రంగా ఉండాలంటే కష్టమైనదే. కాకపోతే రీనోట్ ఏఐ అనే స్టార్టప్ కృత్రిమ మేధతో చేతితో రాసుకున్న అంశాలను చక్కగా పీడీఎఫ్ రూపంలో మనకు అందించే ఏర్పాటు చేశారు. ఇందుకోసం వారు ప్రత్యేకంగా నోట్ బుక్ కూడా తయారు చేశారు. ఈ బుక్‌పై పెన్నుతో రాసుకుని వెంటనే తుడిచేసుకోవచ్చు. రాసుకున్న వివరాలను యాప్ ద్వారా ఒక ఫొటో తీసుకుంటే చాలు పీడీఎఫ్ రూపంలోకి మార్చేస్తుంది. మనం చేయాల్సిన పనులు, వెళ్లాల్సిన కార్యక్రమాలు, షెడ్యూల్స్ రాసుకుని యాప్‌లో ఫొటో తీసుకుంటే చాలు మనకు గుర్తుచేస్తుంటుంది. ఏఐ అసిస్టెడ్ చాట్‌బోట్‌ను మనకు సంబంధించిన షెడ్యూల్స్‌ను అడిగితే మనకు చెప్పేస్తుందని కంపెనీ సీఈవో సుమన్ బాలబొమ్ము వివరించారు. రీనోట్ ఏఐ నోట్‌బుక్‌ను ఓ రకమైన రాతి పొడి నుంచి తయారు చేశారని వెల్లడించారు. దీన్ని 100 సార్లు వాడుకోవచ్చని తెలిపారు.

## మెట్రో పార్కింగ్‌లే టార్గెట్

- పోలీసుల అదుపులో బైక్ దొంగల ముఠా
- అశ్వారావుపేటలో నిందితుల అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మెట్రో రైల్ స్టేషన్ పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా చిక్కింది. ఇటీవలి కాలంలో ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువ కావడంతో హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. చోరులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మెట్రో రైల్ పార్కింగ్ స్థలాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు, సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన పోలీసులు గురువారం ఖమ్మంలోని అశ్వారావుపేటలో చోరుల ఆచూకీ గుర్తించారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం వారిని అదుపులోకి తీసుకుంది. విచారణ నేపథ్యంలో ఇప్పటి వరకు 50కి పైగా వాహనాలు చోరీ చేసి విక్రయించినట్లు వెల్లడైంది. వీటిని రికవరీ చేయడంపై దృష్టి పెట్టిన అధికారులు 30 వాహనాల ఆచూకీ కనిపెట్టినట్లు సమాచారం. నిందితులను హైదరాబాద్ తరలిస్తున్న పోలీసులు మిగిలిన వాహనాలు ఎక్కడనేది ఆరా తీస్తున్నారు.

## రూ.3.85 లక్షల విలువైన మద్యం పట్టివేత

- చండీగర్ నుంచి హైదరాబాద్‌కు మద్యం రవాణా
- ఆర్‌టీసీ క్రాస్ రోడ్డులో పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: చండీగర్ నుంచి నగరానికి సరఫరా చేస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. గురువారం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. అత్తాపూర్‌కు చెందిన గోపాల్ అగ్రవాల్ అనే వ్యక్తి చండీగర్ నుంచి హైదరాబాద్‌కు వాహనంలో మద్యాన్ని తీసుకువచ్చాడు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్డులోని మెట్రో స్టేషన్ సమీపంలో మరో వాహనంలోకి మార్చేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు గుర్తించి వారిని పట్టుకున్నారు. రూ. 3.85 లక్షల విలువైన 72 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఆదివాసీ మహిళలపై అరాచకాలు దారుణం



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

గాంధీఆస్పత్రి : ఆదివాసీ, దళిత మహిళలు, చిన్నారులపై అరాచకాలను నిరోధించడంలో, జైనూరులో గొడవలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జైనూరు ఘటనలో గాయపడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలితోపాటు కుటుంబ సభ్యులను ఆయన గురువారం రాత్రి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గత కొంతకాలంగా ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధిత మహిళను పరామర్శించకుండా ముస్లింల దుకాణాలు దగ్ధం చేశారని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చస్తే సంతాపం బతికుంటే పరిహారం మాదిరిగా ఉందని ఎద్దేవా చేశారు.

**బుల్డోజర్లు పంపుతా... కూల్చే దమ్ముందా...**

పాతబస్తీలో ఎఫ్‌టీఎల్ పరిధిలో సెల్కం చెరువు ఆక్రమణలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూసిచూడనట్లు వ్యవహరిస్తోందని, బుల్డోజర్లు పంపుతా..ఎంఐఎం నాయకులు ఆక్రమణలను కూల్చే దమ్ముందా..అంటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బండి సంజయ్ సవాల్ విసిరారు. ఎంఐఎం నాయకులు, కార్యకర్తల ఆరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, నాగేష్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిషం పేరుతో రూ. 30 లక్షలు టోకరా



పోలీసుల అదుపులో నిందితులు

బన్సీలాల్‌పేట్: మనశ్శాంతి ఉండటం లేదని బాధపడుతున్న ఓ మహిళ ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చూసి రూ. 30 లక్షలు పోగొట్టుకున్న సంఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. న్యూబోయిగూడ ప్రాంతానికి చెందిన జయనందిత, తల్లి నీలావతితో కలిసి ఉంటోంది. గత కొన్నాళ్లుగా తమకు మనశ్శాంతి ఉండటం లేదని, సంతోషంగా జీవించలేక పోతున్నామని మధన పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో ఇన్‌స్టాగామ్‌లో ఓ పోస్టు చూసింది. అందులో పలు కొటేషన్లు చూసి ఆకర్శితురాలైన బాధితురాలు తాము పడుతున్న ఇబ్బందులను అందులో పోస్ట్ చేసింది. దీనిని ఆసరాగా తీసుకున్న బాపూజీనగర్‌కు చెందిన కిన్నెర సాయి, ఎర్నాల వాసు, పురాణం నివాస్, కోయ నాగరాజు ఆమెను సంప్రదించారు. తమను కోయదొరలుగా పరిచయం చేసుకుని మీ సమస్యకు పరిష్కారం చూపుతామంటూ నమ్మబలికారు. అన్ని రకాల రుగ్మతలను నయం చేస్తామని భరోసా ఇచ్చారు. అయితే మీ ఇంట్లో ఆత్మ తిరుగుతుందని అందుకే మనశ్శాంతి కరువవుతోందని చెప్పారు. ఇంట్లో దోషంతో పాటు సదరు ఆత్మ మిమ్మల్నీ చంపుతుందని భయపెట్టారు. వారి మాటలను నమ్మిన బాధితురాలు ఇంట్లో బంగారాన్ని తాకట్టుపెట్టి 5 దఫాలుగా రూ. 30 లక్షల నగదు వారికి అప్పజెప్పింది. మళ్లీ డబ్బుల కోసం ఫోన్ చేస్తూ వేధిస్తుండటంతో బాధితురాలు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. అయినా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు ఈ నెల 1న గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# ‘పేటీఎం’ పట్టించింది!

- ఐదుగురు నిందితుల అరెస్టు, నగదు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న భారీ బందిపోటు దొంగతనం మిస్టరీ వీడటానికి ‘పేటీఎం పేమెంట్’ ఆధారమైంది. నిందితులు పక్కా పథకం ప్రకారం జర్కిన్లు ధరించి, హెల్మెట్లు పెట్టుకుని, నెంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చి తమ ‘పని’ కానిచ్చారు. సొమ్ముతో తిరిగి వెళ్తూ ఓ పెట్రోల్ బంక్‌లో ఆగి తన వాహనంలో ఇంధనం నింపుకున్నారు. అక్కడ నగదు చెల్లించడంతో దొరికిన తీగ లాగిన సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మొత్తం డొంకను కదిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.43.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు. సౌత్ వెస్ట్ డీసీపీ జి.చంద్ర మోహన్‌తో కలిసి గురువారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో వివరాలు వెల్లడించారు.

**మాజీ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో...**

జియాగూడకు చెందిన శ్రవణ్ దేశెట్టి గతంలో బంజారాహిల్స్‌లో ఉన్న తిబారుమల్ జ్యువెలర్స్ దుకాణంలో పని చేశాడు. దీని యజమాని గుడిమల్కాపూర్ ప్రాంతంలో నివసిస్తుంటారు. ప్రతి రోజూ సంస్థ వ్యాపార లావాదేవీలు ముగిసేటప్పటికి రాత్రి 11 గంటలు దాటుతుంది. ఈ నేపథ్యంలోనే దాని మేనేజర్, ఉద్యోగి ఆ రోజు క్రయవిక్రయాలకు సంబంధించిన మొత్తాన్ని బ్యాగులో తీసుకెళ్లి యజమానికి అప్పగిస్తారు. మర్నాడు ఉదయం ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసేవారు. ఈ విషయం తెలిసిన మాజీ ఉద్యోగి శ్రవణ్ డబ్బు దోచుకోవాలని భావించాడు. ఈ విషయాన్ని గత మార్చిలో తన స్నేహితుడైన సిక్ చావ్‌నీ వాసి సర్దార్ హర్‌ప్రీత్ సింగ్‌కు చెప్పడంతో అతను తన స్నేహితుడైన నాందేడ్ వాసి సర్దార్ మన్ ప్రీత్ సింగ్‌తో కలిసి దోపిడీకి స్కెచ్ వేశాడు.

**హత్య కేసులో జైలుకు వెళ్లడంతో బ్రేక్...**

ఈ పథకం కార్యరూపంలోకి రాకముందే ఈ ఏడాది మార్చిలో అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో హర్‌ప్రీత్ సింగ్‌తో పాటు అతడి సోదరుడు సర్దార్ గుర్ జీత్ సింగ్ అరెస్టు కావడంతో దోపిడీ అమలుకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆ కేసులో 84 రోజులు జైల్లో ఉన్న వీరు జూలై 5న బెయిల్‌పై విడుదలయ్యారు. జైలుకు వెళ్లడం, బెయిల్ పొందడం తదితర అంశాల నేపథ్యంలో వీళ్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో శ్రవణ్‌ను సంప్రదించిన హర్‌ప్రీత్ దోపిడీ పథకాన్ని అమలు చేద్దామని చెప్పాడు. మన్‌ప్రీత్ సింగ్‌ను రప్పించిన ఇతడు తమతో గుర్‌జీత్, మరో స్నేహితుడు మహ్మద్ గుఫాన్ ఇలాహీలను కలుపుకున్నాడు. తన సోదరుడి వద్ద ఉన్న ఎయిర్ పిస్టల్‌ను చోరీ చేసుకుని వచ్చిన హర్‌ప్రీత్ సింగ్ తన వద్ద ఉంచుకున్నాడు. దాదాపు వారం రోజుల పాటు జ్యువెలరీ దుకాణం వద్ద, నగదు తీసుకువెళ్లే ఉద్యోగుల కదలికలపై రెక్కీ చేసి పథకం సిద్ధం చేసుకున్నారు. చివరకు గత నెల 30 రాత్రి రంగంలోకి దిగారు.

**పెట్రోల్ బంక్‌లో దొరికిన ఆధారంతో...**

ఆ రోజు రాత్రి నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై జ్యువెలరీ దుకాణం వద్దకు వెళ్లిన హర్‌ప్రీత్‌సింగ్, మన్‌ప్రీత్ సింగ్ నగదుతో ఉద్యోగులు బయలుదేరే వరకు వేచి చూశారు. ఆపై వారిని వెంబడిస్తూ మెహదీపట్నం రోడ్‌లోని పిల్లర్ నెం.28 దాకా వచ్చారు. అక్కడి ఓ పాన్‌షాపు వద్ద ఆగిన సంస్థ ఉద్యోగులు పాన్ తీసుకుంటున్నారు. అదే అదునుగా భావించిన వీరు ఎయిర్ పిస్టల్‌తో బెదిరించి వారి చేతిలో ఉన్న రూ.50 లక్షలతో కూడిన బ్యాగ్ లాక్కుని ఉడాయించారు. దీనిపై గుడిమల్కాపూర్ ఠాణాలో కేసు నమోదు కాగా... టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి నేతృత్వంలో ఎస్సైలు అర్జీత్ సింగ్, ఆర్.శరత్ చంద్ర, ఎస్.సాయి కిరణ్ తమ బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలి నుంచి నేరగాళ్లు వెళ్లిన రూట్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించగా, ఆ మార్గంలోని ఓ పెట్రోల్ బంక్‌లో ఆగిన వీరు వాహనంలో పెట్రోల్ పోయించుకుని, పేటీఎం ద్వారా చెల్లింపులు చేసినట్లు గుర్తించారు.

**నేరం చేసి నాందేడ్ గురుద్వారాకు..**

బంకు నుంచి సేకరించిన వివరాలతో ఆ లావాదేవీల ఆధారంగా హర్‌ప్రీత్ సింగ్ ఫోన్ నెంబర్ కనిపెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడి చరిత్ర తెలుసుకున్నారు. సిక్ చావ్‌నీలోని అతడి ఇంటిని గుర్తించి కాపుకాశారు. నేరం చేసిన వెంటనే ఆ సొమ్ములో కొంత వెచ్చించి మూడు ఐఫోన్ 15 ప్రో ఫోన్లు, ఇయర్ పాడ్స్, ఖరీదైన బూట్లు, వస్త్రాలు ఖరీదు చేసిన హర్‌ప్రీత్ మిగిలిన మొత్తం ఇంట్లోనే ఉంచి నాందేడ్‌లో ఉన్న గురుద్వారాకు దర్శనం కోసం వెళ్లాడు. గురువారం మన్‌ప్రీత్‌తో కలిసి తిరిగి రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇరువురినీ పట్టుకున్నారు. విచారణలో మిగిలిన ముగ్గురి పేర్లు బయటకు రావడంతో వారినీ అరెస్టు చేశారు. నిందితుల నుంచి నగదు, నేరానికి వాడిన వాహనం, వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను గుడిమల్కాపూర్ పోలీసులకు అప్పగించారు. వీరిని పోలీసు కస్టడీకి తీసుకున్న తర్వాత మిగిలిన వివరాలు సేకరిస్తామని డీసీపీ సుధీంద్ర తెలిపారు.

## ఆమరణదీక్ష విరమించిన బీసీ నేత సిద్ధేశ్వర్

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గత పన్నెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ హిందు మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ గురువారం రాత్రి దీక్ష విరమించారు. కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణదీక్ష చేపట్టిన సిద్ధేశ్వర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి గాంధీఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో దీక్ష కొనసాగిస్తున్న సంగతి విదితమే. సిద్ధేశ్వర్ ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతోపాటు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో దీక్ష విరమించాలని పలువురు బీసీ సంఘ నేతల అభ్యర్థనను సిద్ధేశ్వర్ అంగీకరించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతోపాటు పలువురు బీసీ, ప్రజాసంఘాల నేతలు సిద్ధేశ్వర్‌కు నిమ్మరసం తాగించి దీక్ష విరమింపజేశారు. డిమాండ్ల సాధనకు దశల వారీగా ఆందోళన ఉధృతం చేస్తామని ప్రకటించారు.

## భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

శ్రీనగర్‌కాలనీ: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి కార్మికుడు మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ కార్యాలయం ప్రాంగణంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం, బాలాఘాట్‌కు చెందిన ఉమా శంకర్(32) పని చేస్తున్నాడు. గురువారం అతను భవనం పై అంతస్తులో పని చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# దశాబ్దాల ఆనవాయితీ..!

- ఎన్నో ఏళ్లుగా కాలనీలు, బస్తీలో గణనాథుల ఏర్పాటు
- ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపాలు
- విగ్రహాల కొనుగోలులో నిర్వాహకులు బిజీబిజీ
- ఐకమత్యంతో వేడుకలు నిర్వహిస్తున్న అసోసియేషన్లు


ఫిలింనగర్ యువజన సంఘం ఏర్పాటుచేసిన మూషిక వాహన గణనాథుడు

**బంజారాహిల్స్:** వినాయక చవితి పర్వదినం వస్తుందంటేనే చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ ఎప్పుడూ లేని ఉత్సాహం వస్తుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో యువత కేరింతలు, చిన్నారుల ఆటపాటలు, పెద్దల పూజాధికాల మధ్య తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే రీతిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత 40 నుంచి 50 సంవత్సవాలుగా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తూ గణనాథులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు ఇప్పటికీ ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ వస్తున్నారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చి విగ్రహాల దాతలతో పాటు అన్నదాన కార్యక్రమాలు, వేదికల ఏర్పాటు, అలంకరణ, నిమజ్జన ఊరేగింపు..ఇలా తలో ఒకరు చేయి చేయీ కలుపుతూ ఈ ఉత్సవాలకు వన్నెలద్దుతున్నారు. దశాబ్దాలుగా ఒకే ప్రాంతంలో వినాయక మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతూ నవరాత్రులను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అసోసియేషన్లు వినాయక చవితి వచ్చిందంటే స్నేహపూర్వక వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను శోభాయమానంగా జరుపుకుంటున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కృష్ణానగర్, ఇందిరానగర్, కమలాపురికాలనీ, పంజగుట్ట, సోమాజీగూడ, ఎన్‌బీటీనగర్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, శ్రీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తూ స్థానికంగా తమ ఐకమత్యాన్ని చాటుకుంటున్నారు.

### అత్యంత ఎత్తైన గణనాథుడు..

ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో ఫిలింనగర్ యువజన సంఘం గత 18 సంవత్సర కాలంలో అత్యంత ఎత్తైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ తమ రికార్డును కొనసాగిస్తోంది. ఈసారి కూడా 21 అడుగుల మూషికావాహన గణనాథున్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. సుమారు రూ.3.30 లక్షల వ్యయంతో ఈ వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేశారు. సంఘంలోని 30 మంది యువకులు తామే తలాకొంత జమ చేసుకుని ఈ వేడుకలను నిర్వహిస్తారు. విగ్రహం కొనుగోలు నుంచి నిమజ్జనం దాకా రూ.18 లక్షల వరకు ఖర్చు చేస్తారు. విద్యుత్ అలంకరణకు రూ.5 లక్షల దాకా వెచ్చిస్తున్నారు. దీంతో ఈ రోడ్లన్నీ జాతర వాతావరణం తలపిస్తాయి.


శ్రీకృష్ణానగర్-ఇందిరానగర్ షాప్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన బొజ్జ గణపయ్య


బంజారా యూత్ అసోసియేషన్ గణనాథుడు

### శ్రీకృష్ణానగర్ షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

శ్రీకృష్ణానగర్-ఇందిరానగర్ షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 44 సంవత్సరాలుగా ఇందిరానగర్ రాజీవ్‌గాంధీ విగ్రహం వెనుక నవరాత్రి ఉత్సవాలను జరుపుతున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతిగౌడ్, సెక్రటరీ నర్సింగ్‌యాదవ్, కోశాధికారి కర్తారాం చౌదరి తదితరులు ముందుండి ఈ వేడుకలు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ సారి 16 అడుగుల విగ్రహాన్ని రూ.1.20 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. లైటింగ్, డెకరేషన్ అన్నీ కలిపి ఈ ఉత్సవాలకు రూ.10 లక్షల దాకా ఖర్చు చేస్తారు. ఎవరినీ ఒక్క రూపాయి కూడా అడగకుండా షాప్స్ అసోసియేషన్ సభ్యులే ముందుకువచ్చి ఖర్చు చేస్తారు.

### బంజారా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బంజారా యూత్ అసోసియేషన్ గత 40 సంవత్సరాలుగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి. బాబానాయక్, సి. రాములు చవాన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏయేటికాయేడు విగ్రహం ఎత్తును పెంచుతూ నిర్వహిస్తున్నారు. ఈ సారి 13 అడుగుల విగ్రహాన్ని రూ.1.30 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు అన్నదానంతో కలిపి రూ.10 లక్షల దాకా ఖర్చు చేశారు.

## జేహెచ్‌పీఎస్‌లో టీచర్స్ డే వేడుకలు




**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న సమగ్ర పాత్రకు నిదర్శనంగా నిలిచాయి. వివిధ తరగతుల విద్యార్థులు నాటికలు, పాటలు, నృత్యాలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎం.వరలక్ష్మి, ప్రిన్సిపాల్ పి.కాంచనవల్లి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## రాంగ్‌రూట్‌పై స్పెషల్ నజర్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

**బంజారాహిల్స్:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రాంగ్‌రూట్‌లో వస్తున్న 50 మంది వాహదారులను బంజారాహిల్స్ పోలీసులు గుర్తించి జరిమానాలు విధించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/12 చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రాంగ్‌రూట్‌లో వస్తున్న వారిని తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. వీరి వల్ల ఇతరులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రాంగ్‌రూట్ డ్రైవింగ్ మంచిది కాదని పలు సూచనలు చేశారు.

## ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే

**బంజారాహిల్స్:** ఓటరు జాబితా సవరణపై ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చురుకుగా సాగుతుంది. నియోజకవర్గ వ్యాప్తంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఓటరు జాబితాతో గురువారం ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024-25లో భాగంగా ఓటరు జాబితా తయారు చేస్తున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి జాబితాలో పేరున్న వారు అక్కడే ఉన్నారా.. ఎక్కడకైనా వెళ్లిపోయారా అన్న వివరాలు సేకరిస్తున్నారు. అద్దెకు ఉన్నవారు ఇతర ప్రాంతాలకు వెళితే వారి ఓట్లు అక్కడికి బదిలీ చేస్తారు. శాశ్వతంగా వెళ్లిపోయినా, మరణించినా వారి పేర్లను తొలగిస్తారు. మరణించిన వారి ఆధార్ కార్డు వివరాలను నమోదు చేస్తున్నారు. వివరాలు సేకరించిన ఇంటికి సర్వే పూర్తయినట్లు బీఎల్‌ఓలు రాస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అక్టోబర్ 29న ముసాయిదా జాబితా, వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారని ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారిణి, సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు.

## అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించండి

జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్


న్యాయవిహార్ రోడ్డును పరిశీలిస్తున్న మయాంక్ మిట్టల్

**బంజారాహిల్స్:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ఎక్కడికక్కడ కాలనీలు, బస్తీలు అన్న తేడా లేకుండా డ్రైనేజీలు పొంగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ జలమండలి జీఎం హరి శంకర్‌తో కలిసి ఫిలింనగర్, తట్టికాన, బంజారాహిల్స్ సెక్షన్ల పరిధిలో పర్యటించారు. జూబ్లీహిల్స్ న్యాయవిహార్‌లో రోడ్డు కుంగిపోవడంతో రోడ్డు కింద ఉన్న డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదని వెంటనే దీన్ని పునరుద్ధరించడానికి ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో వైట్ టాపింగ్ రోడ్డు కింద దెబ్బతిన్న పైపుల నుంచి నిత్యం పెద్ద ఎత్తున మురుగు రోడ్డంతా ప్రవహిస్తున్నది. ఈ సమస్యను గుర్తించిన ఈడీ వెంటనే జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకొని రోడ్డును తవ్వి లైన్లను సరిచేయాలని సూచించారు. అదే విధంగా వెంకటరమణ కాలనీలో సైతం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అదే విధంగా బంజారాహిల్స్‌లో నీటి సరఫరా సమయంలో క్లోరిన్ శాతాన్ని కూడా పరిశీలించారు. రోడ్లపై డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్కడైనా లైన్లు మార్చాల్సి ఉంటే వెంటనే ప్రతిపాదనలు రూపొందించి వాటిని బాగు చేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శీలారాణి, మేనేజర్లు రాంబాబు, శివకుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కూడళ్ల విస్తరణపై సమీక్ష



**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 1/12 చౌరస్తా, 1/13 జంక్షన్ల అభివృద్ధి, విస్తరణ అంశాలను పరిశీలించేందు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె గురువారం పర్యటించారు.రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని సులువుగా వాహనాలు ముందుకు వెళ్లేందుకు రోడ్డు విస్తరణ పనులు, కూడళ్ల అభివృద్ధిపై చర్చించారు. సర్కిల్-18 ఈఈ విజయ్‌కుమార్,బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్‌గౌడ్, డీసీ ప్రశాంతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాయికుంట చెరువును పరిరక్షించండి


సమావేశంలో మాట్లాడుతున్న రైతులు కె.శేఖర్ రెడ్డి తదితరులు

**కాచిగూడ:** సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం మండలం, వెలిమెల గ్రామ సర్వేనెంబర్ 421లోని రాయికుంట చెరువును కబ్జా చేసిన మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్‌పై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుని చెరువును పరిరక్షించాలని గ్రామ రైతులు కన్నాపురం శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దాదాపు 20 ఎకరాల 36 గుంటల చెరువును, సర్వే నెంబర్ 15లో గల ఒక ఎకరం ఇరవై గుంటల ప్రభుత్వ భూమిని మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్ ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారని ఆరోపించారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా ఉన్న స్మితా సబర్వాల్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను పెట్టారని తెలిపారు. ప్రస్తుతం ఫెన్సింగ్‌ను తొలగించి ప్రభుత్వ భూమని ఆక్రమించాడని తెలిపారు. చెరువు తూమును తొలగించి రైతులు తమ పొలాలకు వెళ్లకుండా దారిలేకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, తహసీల్దార్ తదితర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్ తాను కాంగ్రెస్ పార్టీ నేతనని, ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కబ్జాకు గురైన చెరువును పునరుద్ధరించి రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు గతంలో మాదిరిగా దారిని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రెస్టారెంట్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు


రెస్టారెంట్‌లో కాలం చెల్లిన జ్యూస్

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్‌లోని తెలుగు మీడియం రెస్టారెంట్‌పై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. బిర్యానీలో వెంట్రుకలు వచ్చాయన్న ఫిర్యాదుతో అధికారులు ఈ దాడులు జరిపారు. కాలంచెల్లిన జ్యూస్, మష్రూమ్స్ తదితర వాటిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వెజ్, నాన్‌వెజ్ వస్తువులను రీఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో రెస్టారెంట్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

## బీవీబీపీ స్కూల్ ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్స్ అవార్డులు


బెస్ట్ టీచర్ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో గోపాలకృష్ణన్ తదితరులు

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విద్యార్థుల ఆటపాటల నడుమ కనులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా అవార్డు పొందిన ఉపాధ్యాయులకు స్కూల్ చైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, అకాడమిక్ డైరెక్టర్ పి.రమాదేవి, ప్రిన్సిపాల్ అరుణశ్రీ ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రమశిక్షణతో అత్యుత్తమ ప్రతిభ గలవారిగా తయారు చేస్తున్నందుకు టీచర్లను అభినందించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయబద్ధంగా జరిగిన సన్మానోత్సవం పండుగను తలపించింది. బెస్ట్ టీచర్ అవార్డులు అందుకున్న వారిలో లక్ష్మీసువర్చల, వెంకటలక్ష్మి, పి.సుధ, శ్యామల, దీప్తి, వివేకా తదితర టీచర్లు ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ అస్మతున్నీసా

**ఫిలింనగర్:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మతున్నీసా టీచర్లతో కలిసి టీచర్స్‌డే కేక్‌ను కట్ చేశారు. టీచర్లతో నిర్వహించిన ఆటల పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, సమాజంలో వీరికున్న స్థానం, విలువ ఎంతో గొప్పవని కొనియాడారు.

## మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదాం


కార్మికనగర్‌లో విగ్రహాలకు పంపిణీ చేస్తున్న సీఎన్ రెడ్డి


బోరబండ బస్ స్టాప్‌లో...

**రహమత్‌నగర్ (బోరబండ):** మట్టి వినాయక విగ్రహాలకు ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. కార్మికనగర్ కూడలిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మట్టి వినాయక విగ్రహాలను గురువారం ప్రజలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు మన్సూర్, షరీఫ్, ఇక్బాల్, వేముల యాదయ్య, షేక్ సాబేర్, రవిశంకర్, రాగిని యాదయ్య, ముద్దంగుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మహిళా కాంగ్రెస్ నాయకురాలు, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సతిమణీ హబీబా సుల్తానా బోరబండ బస్‌స్టాప్‌లో మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు అందజేశారు. వార్డు అధికారిణి విశ్వవతి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, కవిత, దేవే ందర్, లఖన్‌నాయక్, మల్లేశ్, లక్ష్మమ్మ, వైజయంతి, యాదమ్మ, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు.!



**ఫిలింనగర్:** ఫిలించాంబర్ ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్‌బాక్స్ కింది నుంచి గత నాలుగు రోజులుగా నిర్విరామంగా మురుగు ప్రవహిస్తున్నది. ప్రమాదకరంగా ఉన్న ఇక్కడి పరిస్థితి గురించి పలుమార్లు విద్యుత్ అధికారులకు స్థానికులు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

**శ్రీనగర్‌కాలనీ:** తన భార్య పిల్లలు కనిపించడం లేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కార్మికనగర్‌కు చెందిన మాజీ సైనికుడు పృథ్వీరాజ్ సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం డ్యూటీకి వెళ్ళి సాయంత్రం తిరిగొచ్చేసరికి ఇంట్లో తన భార్య జ్యోతి(36), కుమార్తెలు మౌనిక (11), నందిని (10), యశ్విని (6) కనిపించలేదు. ఫోన్ చేసిన స్పందనలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో జరిగిన గొడవతో తన భార్య కుమార్తెలతో కలిసి వెళ్ళిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 28న మిస్ అండ్ మిసెస్ గ్రాండ్ ఫినాలే



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నటి మీనాక్షి ఓజా

**బంజారాహిల్స్:** మిస్ అండ్ మిసెస్ ఫ్యాబులస్ ఎడిషన్-3 గ్రాండ్ ఫినాలె పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు నటి మీనాక్షి ఓజా తెలిపారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ ఫ్యాషనబుల్ కనిపించాలనుకునే యువతులకు ఇలాంటి పోటీలు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రముఖ నగరాల్లో ఆడిషన్స్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్టిమేట్ మేకప్ స్టూడియో మేనేజర్ ప్రీణ్ బ్రహ్మశ్రీ రామకృష్ణ, సంజన, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మాటికీ ఆ స్థలం నాయీ బ్రాహ్మణులదే

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు సుధాకర్ నాయీ



**రహమత్‌నగర్:** నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం తమదని కొంతమంది వ్యక్తులు అభ్యంతరం తెలపడాన్ని ఖండిస్తున్నామని, ముమ్మాటికీ ఆ స్థలం నాయీ బ్రాహ్మణులదేనని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు సుధాకర్ నాయీ స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ నందునగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 120 గజాల స్థలం కేటాయించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు అప్రువల్స్ సైతం ఇచ్చారని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు నందునగర్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు ఈ స్థలం తమ బస్తీ కమ్యూనిటీ స్థలమని అభ్యంతరం వ్యక్తం చేస్తూ తమల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అరోపి ంచారు. ఇది సరైందికాదని సుధాకర్ సూచించారు. దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం జూబ్లీహిల్స్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయీ, ప్రభు నాయీ, మైలారం సురేష్, స్వామి నాయీ, దత్తు నాయీ, తిరుపతి నాయీ, మురళినాయీ, లక్ష్మణ్ నాయీ తదితరులు పాల్గొన్నారు.

### నాయీ బ్రాహ్మణులకు వేరే చోట కేటాయించారు

నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ కోసం మేరిమాత ఆలయం వద్ద 120గజాల స్థలం అప్పటి ప్రభుత్వం కేటాయించి,హద్దులు సైతం నిర్ణయించిందని, దాన్ని వదిలి తమ బస్తీలోని కమ్యూనిటీ హాల్ స్థలాన్ని తమ స్థలమని నాయీ బ్రాహ్మణులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బస్తీ అధ్యక్షుడు తులసి వెంకటేశ్ యాదవ్ అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అధికారుల ఉత్తర్వులు సైతం జారీ చేశారని చెప్పారు. జరుగుతున్న భూ ఆక్రమణపై రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

- తులసి వెంకటేశ్ యాదవ్
(నందునగర్ బస్తీ అధ్యక్షుడు)

## హెబ్రోన్ చర్చి సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెరుషాలెం మత్తయ్య, బిషప్ భాస్కర్

**కాచిగూడ:** గోల్కొండ క్రాస్ రోడ్డులోని హెబ్రోన్ చర్చిలో గత నెల 31వ తేదీన జరిగిన సంఘటనపై న్యాయ విచారణ జరిపించి ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా దళిత, క్రైస్తవ సంఘాల సమాఖ్య కార్యదర్శి జెరుషాలెం మత్తయ్య, బిషప్ ముల్కాల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హెబ్రోన్ చర్చిపై జరిగిన కుట్రకు ప్రధాన కారకులైన మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నేత రాజేశ్వర్ రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత దశాబ్దకాలంగా హెబ్రోన్ చర్చి సొసైటీ, ట్రస్టీల మధ్య జరుగుతున్న వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో రాజేశ్వర్ రావు సొసైటీ, ట్రస్టీల మధ్య వివాదం సృష్టించాడని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్రంగా విచారణ జరిపించి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.

## బస్సు అద్దాలు పగులకొట్టిన ఆగంతకులు

**శ్రీనగర్‌కాలనీ:** ఆర్టీసీ బస్సుకు దారి ఇవ్వకుండా ఆపై బస్సులోకి చొరబడి ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను దూషించడమే కాకుండా రాళ్ళతో బస్సు అద్దాలను ధ్వంసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ వెళ్ళే ఆర్టీసి బస్సు బుధవారం సాయంత్రం జవహర్‌నగర్ వద్దకు రాగానే ఇద్దరు ఆగంతకులు బైక్‌పై ప్రయాణిస్తూ బస్సుకు దారి ఇవ్వలేదు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ శ్రీరాములు పదేపదే హారన్ మోగించడంతో ఇద్దరు ఆగంతకులు బస్సుకు అడ్డుగా తమ ద్విచక్ర వాహనం ఆపి బస్సులో చొరబడి డ్రైవర్ శ్రీరాములు, కండక్టర్ యాదయ్యలను దూషించారు. ఈ క్రమంలో బస్సు వెంగళరావునగర్ అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్దకు రాగానే ఆ ఇద్దరు ఆగంతకులు బస్సుపై రాళ్ళు రువ్వి అద్దాలను పగులగొట్టి పరారయ్యారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయండి


మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వనం శ్రీనివాసయాదవ్

**శ్రీనగర్‌కాలనీ:** ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు వనం శ్రీనివాసయాదవ్, జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మనోజ్‌యాదవ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిగూడలో స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొంటి సాయినాథ్‌యాదవ్, శరత్‌గౌడ్, హరి, మహేష్ పాల్గొన్నారు.

# ఆర్ట్ గ్యాలరీలో అద్భుతాలు


చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన గణేశ్ చిత్రప్రదర్శనను తిలకిస్తున్న లక్ష్మీ తదితరులు

గణేశ్ ఉత్సవాల సందర్భంగా మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించిన వినాయక చిత్రాల పెయింటింగ్‌లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ మేరకు గురువారం ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గణేశ్ రూపాలు అద్భుతంగా ఉన్నాయని కళాకారులను అభినందించారు. 45 మంది కళాకారులు వేసిన చిత్రాలను ఈ నెల 9వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. విజేతలకు మొదటి నగదు బహుమతి రూ.5,000(ఒకరికి), రెండవ బహుమతి రూ.3,000(ఇద్దరికి), మూడవ బహుమతి రూ.2,000(ఐదుగురికి) అందజేయనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. – మాదాపూర్



ఆకట్టుకుంటున్న చిత్రాలు

## నగరంలో నేడు

- నగరంలోని షాలిబండ(చార్మినార్) వేదికగా కల్యాణ్ జువెల్లర్స్ ఆధ్వర్యంలోని నూతన షోరూం ప్రారంభోత్సవం. కల్యాణ్ జువెల్లర్స్ బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున ఈ షోరూంను ప్రారంభించి, నూతన కలెక్షన్‌ను ఆవిష్కరిస్తారు.
- గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్–2024కు సంబంధించిన టీ షర్ట్, ఫినిషింగ్ మెడల్ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా దస్పల్లా హోటల్ వేదికగా జరగనుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

## బాచుపల్లి తహసీల్దార్‌కు ముందస్తు బెయిల్

సాక్షి, హైదరాబాద్: నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట చెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లుగా నమోదైన కేసులో తహసీల్దార్ పూల్‌సింగ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అక్రమ కట్టడాలపై హైడ్రా కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 30న పోలీసులు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, తహసీల్దార్ పూల్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ముందస్తు బెయిల్ కోరుతూ పూల్‌సింగ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున టి.సృజన్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. హైడ్రా పేర్కొన్న కట్టడాలకు అనుమతి 2023 ఆగస్టుకు ముందు ఇచ్చినవని, పిటిషనర్ ఆ తర్వాత విధుల్లో చేరారని, ఆ కట్టడాలకు పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదని వాదనలు వినిపించారు. ఈ వాదనలను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## బీటెక్‌లో ఏఐ, ఎంఎల్ కోర్సులు


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తున్న మాథ్యూ జోసెఫ్

సాక్షి, సిటీ బ్యూరో: ఎడ్యుటెక్ కంపెనీ బైట్ ఎక్స్ఎల్ బీటెక్ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దేందుకు సరికొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతలపై ప్రత్యేక కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు దేశంలోని లవ్లీ ప్రొఫెషనల్, పరుల్, చండీగఢ్, జీఎల్ఏ, రాయట్ బహ్రా వంటి పది విశ్వవిద్యాలయాలతో ఒప్పందం చేసుకున్నామని పేర్కొంది. మైక్రోసాఫ్ట్ గుర్తింపు పొందిన శిక్షకులు కోర్సుల సిలబస్‌ను రూపొందిస్తారని బైట్ ఎక్స్ఎల్ సీఈఓ అండ్ కో–ఫౌండర్ కరుణ్ తాడేపల్లి తెలిపారు.

## 'అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నాం'

మన్సూరాబాద్: అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ సాంకేతిక రంగంలో పరస్పర మద్దతును పెంపొందిస్తున్నామని జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాథ్యూ జోసెఫ్ అన్నారు. నాగోలు బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో గురువారం నిర్వహించిన టాంజానియా భూవిజ్ఞాన శాస్త్రవేత్తల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. టాంజానియా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలకు మినరల్ రిసోర్స్ ప్రాస్పెక్టింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్‌లపై మూడు వారాలపాలు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖచే స్పాన్సర్ చేయబడిన ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో ఆపరేషన్ కార్యక్రమం ద్వారా శిక్షణ చేపట్టబడిందని పేర్కొన్నారు.

## 'మధు రోహాలు' కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రమేశ్‌కుమార్, జస్టిస్ చంద్రకుమార్, రాము

నాంపల్లి: ప్రముఖ రచయిత డాక్టర్ ఎం కే రాము రచించిన 'మధు రోహాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభను నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించారు. రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.రమేశ్‌కుమార్ హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ కవితా సంపుటిని విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్పకు అంకితం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత నాగబాల డి.సురేశ్‌కుమార్, సంగీత దర్శకులు పీవీ సాయిబాబా, ఆంధ్రప్రదేశ్ కళారత్న అవార్డు గ్రహీత ఎం.కె.ఆర్.ఆశాలత పాల్గొన్నారు. సభా ప్రారంభంలో డాక్టర్ ఎం.కె.రాము రచించిన గీతాల గానం జరిగింది.

# అక్రమార్కులపై డిస్కం కొరడా!

- అక్రమ వసూళ్లకు పాల్పడే ఇంజినీర్లపై వేటు
- ఇప్పటికే 19 మందికి షోకాజు నోటీసులు
- ఫోకల్ పోస్టుల్లో పాతుకుపోయిన ఘనులు


నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడం, సంస్థకు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా డిస్కం ముందుకు సాగుతోంది.

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ వసూళ్లకు పాల్పడిన, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజినీర్లపై డిస్కం కొరడా ఝుళిపించింది. ఎక్కడా లేని విధంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఫోకల్/నాన్ ఫోకల్ అంటూ రెండు రకాల పోస్టులను సృష్టించి, ఏళ్ల తరబడి కీలకమైన ఫోకల్(అధికారికి ఆదాయాన్ని సమకూర్చి పెట్టే) పోస్టుల్లో పాతుకుపోయిన అక్రమార్కులపై గట్టి నిఘా పెట్టింది. తప్పు చేసినట్లు తేలితే చాలు, వారికున్న రాజకీయ నేపథ్యం, ఉద్యోగ సంఘాల మద్దతును కూడా ఖాతరు చేయకుండా వేటు వేస్తోంది. గత ఏడు మాసాల్లోనే 19 మంది ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం గమనార్హం. వీరిలో ఐదుగురిని కార్పొరేట్ ఆఫీసుకు అటాచ్ చేయగా, మరో ఆరుగురిని సస్పెండ్ చేసింది. ఇంకో ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలకు గురైన ఉద్యోగుల్లో మెజార్టీ ఇంజినీర్లు కీలక యూనియన్‌కు నాయకత్వం వహిస్తున్నవారే. వినియోగదారులకు

### ఇద్దరు ఏడీఈలపై 'ప్రజావాణి'లో ఫిర్యాదు

కొత్త కనెక్షన్ల జారీ, లైన్లు, డీటీఆర్‌లు, లైన్ షిఫ్టింగ్ వర్క్ ఎస్టిమేషన్లు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలోని కొంతమంది ఇంజినీర్లు చిన్న, చిన్న సాంకేతిక అంశాలను కారణంగా చూపించి, కనెక్షన్ల కోసం ఫైళ్లను తొక్కి పెడుతున్నారు. ఆర్టిజన్ మొదలు ఎస్ఈ వరకు అందరికీ వాటాలు అందుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్ డివిజన్లలో ఇద్దరు ఏడీఈలపై ఇటీవల ఓ వినియోగదారుడు ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయడం గమనార్హం. విధినిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని ప్రభుత్వంతోపాటు డిస్కం కూడా తీవ్రంగా పరిగణించింది. అధికార, ఆర్థిక బలంతో విర్రవీగుతున్న ఇంజినీర్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఒకవైపు ఏసీబీ రంగంలోకి దిగింది. అక్రమార్కులను గుర్తించి అరెస్టు చేస్తోంది. ఇప్పటివరకు క్రమశిక్షణ చర్యలకు గురైన ఇంజినీర్లలో అత్యధికులు ఈ సర్కిల్ పరిధిలోని వారే కావడం విశేషం.

### షోకాజ్ నోటీసులు.. అరెస్టులు

హబ్సిగూడ సర్కిల్ కీసర డివిజన్ ఇంజినీర్‌సహా నార్సింగి అసిస్టెంట్ ఇంజినీర్, లైన్ ఇన్‌స్పెక్టర్, అల్లాపూర్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఆర్టిజన్లపై సస్పెన్షన్ వేటు వేశారు. సైబర్‌సిటీ సర్కిల్ గచ్చిబౌలి డివిజన్ ఇంజినీరుసహా సంగారెడ్డి సర్కిల్ పటాన్‌చెరు డివిజన్ ఇంజినీరు, మాదాపూర్ అసిస్టెంట్ ఇంజినీర్, ఇబ్రహీంబాగ్ అసిస్టెంట్ ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులతోపాటు కార్పొరేట్ ఆఫీసుకు అటాచ్ చేశారు. ఇబ్రహీంబాగ్ ఏఈ, డీఈ, నార్సింగ్ ఏఈ, నాగారం ఏఈ, కిస్మత్‌పూర్ ఏఈ, మాసబ్ ట్యాంక్ ఏఈ, మెహిదీపట్నం ఏడీఈ, రాజేంద్రనగర్ ఏడీఈ, డీఈలకు షోకాజ్ నోటీసులతోపాటు చార్జి మెమో జారీ చేసింది. యాజమాన్యం అంతర్గత చర్యలు తీసుకుంటున్నా అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. బలవంతపు వసూళ్లకు పాల్పడుతూనే ఉన్నారు. వనస్థలిపురం ఏడీఈ రాంమోహన్‌రావు ఓ వినియోగదారుడి నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడగా, ఏడాది క్రితం గచ్చిబౌలి ఏడీఈ అందె రాములు రూ.20 వేలు తీసుకుంటూ దొరికిపోయారు. డిస్కం పరిధిలోని వనపర్తి ఎస్ఈ, డీఈ, ఏఈ ముగ్గురు ఒకే సమయంలో ఏసీబీకి పట్టుబడటం తెలిసిందే. ఏసీబీ కేసులు.. అంతర్గత క్రమశిక్షణ చర్యలతో డిస్కం ఇంజినీర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

## 14న ఓబీసీ స్టూడెంట్స్ సత్యాగ్రహ దీక్ష

రాయదుర్గం: కులగణన కోసం 'ఓబీసీ సత్యాగ్రహ దీక్ష'లను దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో ఈ నెల 14న చేపట్టాలని నిర్ణయించినట్లు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ ప్రధానద్వారం వద్ద ఓబీసీ సత్యాగ్రహ దీక్షను మొదలుపెడతామన్నారు. రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న 50 శాతం సీలింగ్‌ను తొలగించడానికి రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, పార్లమెంటులో బీసీలకు 50 శాతం సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఓబీసీఎస్ఏ జాతీయ కార్యదర్శి వసుమతియాదవ్, సాయికిరణ్, తెలంగాణ అధ్యక్షుడు శివ ముదిరాజ్, యూనివర్సిటీ శాఖ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి శివయాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## మహాగణపతికి కండువా సిద్ధం


మహాగణపతికి సమర్పించే కండువా ప్రదర్శిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతికి ప్రతి యేటా సమర్పించే కండువా, జంధ్యం, గరికమాలను ఈసారి కూడా ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సమర్పిస్తున్నట్లు అధ్యక్షుడు కడారి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు 75 అడుగుల కండువా, జంధ్యం, గరికమాలతోపాటు పట్టువస్త్రాలను గురువారం ఖైరతాబాద్‌లో ప్రదర్శించారు. వినాయక చవితి రోజు ఉదయం రాజ్‌దూత్ చౌరస్తా నుంచి సంప్రదాయ కళానృత్యాలు, ఒగ్గుడోలు, గుస్సాడి నృత్యం, కోలాటాల నడుమ గుర్రపుబగ్గీలో ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించనున్నట్లు తెలిపారు.

## వరదబాధితులకు మారుతీ సుజుకి సాయం

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని వరద ప్రాంతాల్లోని బాధితులకు తమ వంతుగా చేయూతనందించేందుకు ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణసహా కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల వరద బీభత్సం లక్షలాది మంది జీవితాల్ని దుర్భరం చేసిందనీ, ఈ నేపథ్యంలో తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.3 కోట్లను పీఎం కేర్స్ ఫండ్‌కు అందించామని వివరించారు.

## గురుశిష్యుల అనుబంధాన్ని పరిరక్షించాలి

- ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వక్తల పిలుపు
- ట్యాంక్‌బండ్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు


సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మణ్, శివరామకృష్ణ తదితరులు

కవాడిగూడ: నేటి యాంత్రిక జీవనంలో సన్నగిల్లుతున్న గురుశిష్యుల అనుబంధాలను పరిరక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ టీచర్ సెల్ కన్వీనర్ ఆచార్య శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్‌రావు, రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, ఇంటర్మీడియెట్ కమీషనర్ శ్రుతి ఓజా, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహరెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం లక్ష్మణ్ మాట్లాడుతూ ఏ దేశమైనా, ఏ ప్రాంతమైనా ముందుకు వెళ్లాలంటే విద్యారంగంలో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థికి జీవితంలో గురువు పాత్ర కీలకమన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే గురువుల పాత్ర గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్, ముషీరాబాద్ మండలాల డిప్యూటీ డీఈవోలు విజయలక్ష్మి, చిరంజీవి, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, కె.రవిచారి, కొంతం దీపిక, బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, మేకల సారంగపాని, సీకే శంకర్‌రావు, ఎం.రమేష్‌రాం, జి.వెంకటేష్, వై.సురేష్‌కుమార్‌తోపాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ గణపతి పూజకు రండి!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజకు ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు గురువారం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, చైర్మన్ సింగరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆహ్వానపత్రాలు అందజేశారు. శనివారం ఉదయం 11 గంటలకు పూజా కార్యక్రమానికి రావడానికి సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ అడ్‌హక్ కమిటీ సభ్యులు కృష్ణయాదవ్, బాక్సర్ అశోక్, లక్ష్మణ్ యాదవ్, మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


రేవంత్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దానం


భట్టి విక్రమార్కను ఆహ్వానిస్తున్న సభ్యులు

## హైదరాబాద్–విజయవాడ రూట్‌లో ఆర్టీసీ రాయితీ

చైతన్యపురి: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయి ఇబ్బందులు పడుతున్న తెలుగు ప్రజలకు ఆర్టీసీ ఊరట కల్పించింది. హైదరాబాద్–విజయవాడ రూట్ బస్సుల్లో ప్రయాణించేవారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. రాజధాని ఏసీ, సూపర్ లగ్జరి బస్సుల్లో ఈ రాయితీ వర్తిస్తుందని, ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముందస్తు రిజర్వేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు.

## ఆర్టీసీ గ్రేటర్ ఈడీగా వినోద్‌కుమార్




సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సి.వినోద్‌కుమార్ బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఈ విధుల్లో ఉన్న వెంకటేశ్వర్లు ఇటీవల పదవీ విరమణ చేపడంతో ఆయన స్థానంలో వినోద్ కుమార్‌కు బాధ్యతలను అప్పగించారు.

## 19 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఓపెన్ మాస్టర్స్ డబుల్స్ ప్రైజ్‌మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 తేదీ వరకు కొత్తపేట–నాగోల్ రహదారిలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ పక్కనున్న స్పీడ్ బ్యాడ్మింటన్ అకాడమీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 16 తేదీలోపు https://btronline.in/ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొనే వారు రూ.1200 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 77889 93006, 98480 15443 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వస్థలంలో అక్రమ నిర్మాణాలకు బ్రేక్


నందగిరిహిల్స్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–70లోని జర్నలిస్ట్‌కాలనీ నందగిరిహిల్స్ సొసైటీకి చెందిన ఓ మాజీ పోలీసు అధికారి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సర్వే జరిగే వరకు నిర్మాణాలను చేపట్టవద్దంటూ ప్లాట్ యజమానిని ఆదేశించారు. జర్నలిస్టు కాలనీ ప్లాట్ నెంబర్–65 వెనుక నందగిరిహిల్స్ కాలనీ పరిధిలో ప్రభుత్వస్థలం ఉంది. అక్కడ ఆయనకు కేటాయించిన ప్లాట్‌కు అదనంగా కొంత స్థలాన్ని కలుపుకుంటూ ప్రమాదకరమైన ప్రహరీని నిర్మిస్తున్నాడని కాలనీవాసులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి ఫిర్యాదు చేశారు. భారీ వర్షాలు పడితే ఈ మట్టి కొట్టుకువచ్చి, గోడలు కూలిపోయి తమకు ప్రాణ, ఆస్తినష్టం సంభవించే ప్రమాదం ఉందని హైడ్రా కమిషనర్‌కు కూడా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు.

## జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌కు బెస్ట్ టీచర్ అవార్డు


వెంకటనర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: హైదరాబాద్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటనర్సింహారెడ్డి ఈ ఏడాది బెస్ట్ ఇంజనీరింగ్ టీచర్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ నర్సింహారెడ్డిని ఈ అవార్డు కోసం ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేసింది. నర్సింహారెడ్డి 2000లో జేఎన్‌టీయూ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. 2016 నుంచి ప్రొఫెసర్‌గా విద్యార్థులకు సేవలు అందిస్తున్నారు. గతంలోనూ ఆయనకు జేఎన్‌టీయూ నుంచి బెస్ట్ టీచర్ అవార్డు, నిజామాబాద్ జీపీటీ నుంచి అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో రెండు బెస్ట్ పేపర్ అవార్డులు పొందారు. జేఎన్‌టీయూ రెక్టార్ డా. కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె.వెంకటేశ్వరరావు, పలువురు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి


మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న బలరామ్

నాంపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దీనివల్ల ముందుతరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించినవాళ్లం అవుతామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. గురువారం సింగరేణి భవన్‌లో ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్‌లో ప్రతీ ఏడాది పర్యావరణహిత చర్యల్లో భాగంగా అన్ని ఏరియాల్లో యాజమాన్యం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను కార్మికులకు పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ –కో ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథ రాజు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ విగ్రహాల తరలింపునకు రూట్‌మ్యాప్

- నేటి ఉదయం 7 నుంచి మరునాడు రాత్రి 10 వరకు ఆంక్షలు
- ధూల్‌పేట్ నుంచి పలు మార్గాల్లో...

అబిడ్స్/జియాగూడ: ఈ నెల 6వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 7వ తేదీ రాత్రి 10 గంటల వరకు ధూల్‌పేట్‌లో వినాయక విగ్రహాలు కొనుగోలు చేసి తరలించే మార్గాల్లో ఆంక్షలు కొనసాగుతాయని నగర ట్రాఫిక్– 3 డీసీపీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు... వాహనదారులు గణేశ్ విగ్రహాలను తీసుకురావడానికి ముస్లింజంగ్ బ్రిడ్జి, గాంధీ బొమ్మ మీదుగా ధూల్‌పేట్‌కు వెళ్లాలి. ఈ సమయంలో ఇతర వాహనాలకు రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అనుమతి ఉండదు.

### ధూల్‌పేట్‌లోకి ప్రవేశ దారులు

ప్రధాన ప్రవేశం:– గణేశ్ విగ్రహాలను కొనుగోలు చేసినట్లు రసీదును చూపించినవారికి మాత్రమే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు గాంధీ బొమ్మ గుండా ధూల్‌పేటలోకి వాహనాల ప్రవేశానికి అనుమతిస్తారు. రహీంపురా రోడ్ ఎక్సైజ్ ఆఫీస్ లేన్, బలరాంగల్లీ, ఆరాంగల్లీ కాలనీ, అనిత టవర్స్ మీదుగా కూడా వాహనాలను అనుమతిస్తారు.


గణేష్ విగ్రహాల తరలింపు రూట్ మ్యాప్

### బయటకు వెళ్లేదారులు

ధూల్‌పేట్ నుంచి గణేశ్ విగ్రహాలు గల వాహనాలు వెళ్లేదారులు... శివలాల్‌నగర్, ఔట్‌పోస్ట్, టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ టీ జంక్షన్, బోయిగూడ కమాన్, గోడేకి ఖబార్ మీదుగా టక్కరివాడి టీ జంక్షన్

- అన్ని వాహనాలు బోయిగూడ కమాన్ నుంచి దారుసలాం, ఏక్ మినార్, నాంపల్లి, అలస్కా పెట్రోల్ పంప్, టి జంక్షన్ గోషామహల్, ఎంజే మార్కెట్, ఛత్రి, భూలక్ష్మి టెంపుల్ మీదుగా అఫ్జల్ గంజ్, పురానాపూల్ నుంచి బహదూర్‌పురా, సిండికేట్ బ్యాంక్, ఆగాపురా మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. జిర్రా, టప్పాచబుత్ర వాహనాలు జిర్రా గుండా టప్పాచబుత్ర, కార్వాన్, లంగర్‌హౌస్, ఆసిఫ్‌నగర్ దారుల్లోనూ వెళ్లవచ్చు. ఈ సమయంలో ఎలాంటి వాహనాలను ధూల్‌పేట్‌లోకి అనుమతించరు.
- బయటికి వెళ్లే మరికొన్ని దారులు మల్లేపల్లి ఎక్స్‌రోడ్, బోయిగూడ కమాన్, ఏక్ మినార్, నాంపల్లి, అలస్కా పెట్రోల్ పంప్, టీ జంక్షన్ గోషామహల్.

చిన్న వాహనాలకు ధూల్‌పేట్ మార్కెట్‌లోకి ఎలాంటి సమయంలోనైనా ప్రవేశదారులు కలవు.

### పార్కింగ్ స్థలాలు... ఆంక్షలు

1. జుమ్మేరాత్ బజార్ పార్కింగ్ స్థలంలో నిర్వాహకులు భారీ వాహనాలను నిలపవచ్చు
2. 100 అడుగుల రహదారి గల కుల్సుంపురా లిమిట్స్‌లో భారీ వాహనాలను నిలపవచ్చు
3. ముస్లిం జంగ్ బ్రిడ్జి నుంచి పురానాపూల్ వరకు ఇతర వాహనాలు, ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదు
4. వాహనదారులు తప్పనిసరిగా వాహనాల కండిషన్ చెక్ చేసుకొని రావాలి
5. వాహనదారులు తప్పనిసరిగా నియమాలు పాటించాలి. అలాగే ప్రతి ఒక్కరూ సహకరించాలి



# కలర్‌ఫుల్‌ టెకీ లైఫ్‌..

## 12 నుంచి సోనీలివ్‌లో బెంచ్‌లైఫ్‌



హైదరాబాద్‌ ఐటీ హబ్‌ శరవేగంగా విస్తరిస్తోంది. ఇక్కడకి విభిన్న ప్రాంతాల నుంచి తెలుగువారు వచ్చి ఐటీ ఉద్యోగులుగా మారుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఐటీ ఉద్యోగుల కెరీర్‌లోని ఒక సంక్లిష్ట పరిస్థితి నేపథ్యంలో రూపొందిన ఈ బెంచ్‌లైఫ్‌.. జీతం సమయానికి అందుతున్నా.. ఉద్యోగానికి గ్యారెంటీ లేని ఒక

సాక్షి, సిటీబ్యూరో: పని ఉండదు అయినా జీతానికి ఢోకా ఉండదు.. ప్రాజెక్టులు లేకపోయినా సరదాలు వినోదాలకు అడ్డు ఉండదు.. అయినా మనసులో ఏదో గుబులు.. ఎందుకంటే.. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉన్నట్టు అనేలా ఈ సరదాలూ సంతోషాలకు కారణమైన ఉద్యోగం. ఉంటుందో ఊడుతుందో తెలియని.. బెంచ్‌లైఫ్‌ పలువురు ఐటీ ఉద్యోగులు ఎదుర్కొనే విచిత్రమైన పరిస్థితి. ఈ పరిస్థితిని నేపథ్యంగా తీసుకుని ప్రముఖ నటి నిహారిక కొణిదెల నిర్మాణ సారథ్యంలో 'బెంచ్‌లైఫ్‌' అనే వెబ్‌ సిరీస్‌ తెరకెక్కింది. ఈ సిరీస్‌ సోనీలివ్‌లో ఈ నెల 12 నుంచి ప్రసారం కానున్న నేపథ్యంలో నిహారికతో పాటు దర్శకురాలు మానసశర్మ, నటుడు చరణ్‌ పేరిలు గురువారం తాజ్‌ కృష్ణాలో విలేకరులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా బెంచ్‌లైఫ్‌ గురించి వారు పంచుకున్న విశేషాల సారాంశం..వారి మాటల్లోనే...

### విభిన్న అంశాలను స్పృశిస్తూ..

విచిత్రమైన పరిస్థితుల్లో కొన్ని రోజులు, నెలలు గడిపినప్పుడు వారి లైఫ్‌ ఎలా ఉంటుంది? అనే ఇతివృత్తంతో హాస్యభరితంగా అదే సమయంలో వినోదం, విషాదం, భయం, ధైర్యం.. పరస్పర విరుద్ధ భావోద్వేగాలతో ఈ సిరీస్‌ సాగిపోతుంది. యువ నటులతో పాటు రాజేంద్రప్రసాద్‌, తనికెళ్ల భరణి వంటి సీనియర్‌ నటులు కూడా నటించిన ఈ సిరీస్‌ యువతతో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది.



## నేడు సిక్స్‌ బ్యాండ్స్‌తో..

# జామ్‌ జంక్షన్‌..




సాక్షి, సిటీబ్యూరో: అతిపెద్ద సంగీత ప్రదర్శనగా నిర్వాహకులు పేర్కొంటున్న హైదరాబాద్‌ జామ్‌ జంక్షన్‌ నగరంలో శుక్రవారం జరగనుంది. మాదాపూర్‌లోని హైటెక్స్‌ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఈ మ్యూజికల్‌ ఈవెంట్‌లో నగరానికి చెందిన పేరొందిన అరడజను బ్యాండ్స్‌ పాల్గొంటుండడం విశేషం. ఈ ఆరు బ్యాండ్స్‌ ఆరు వేర్వేరు వేదికలపై కొలువుదీరి సంగీతపు హోరును సృష్టించనున్నాయి. ఈ ఆరు బ్యాండ్స్‌ తమదైన శైలిలో 7 రౌండ్స్‌ ప్రదర్శన అందివ్వనుండడం నగరవాసులకు మునుపెన్నడూ కలగని అనుభూతిని అందిస్తుందని నిర్వాహకులు అంటున్నారు. నగరానికి చెందిన మోక్ష, వమమ్‌, అమిగోస్‌, ఇన్‌ఫ్యూజన్‌, మెరాకీ, నిరావళ్‌ బ్యాండ్లు పాల్గొనే బ్యాండ్‌ వార్‌.. రాత్రి 7గంటల నుంచి హైటెక్స్‌లో హోరెత్తించనుంది.

## సోషల్‌ మీడియా ప్రమోషన్‌..

ఓటీటీ సినిమాలకు సంబంధించి సోషల్‌ మీడియా ప్రచారం జోరుగా సాగుతోంది. ఓటీటీ సబ్‌స్క్రైబర్లకు అదే వేదిక ద్వారానే ఎప్పటికప్పుడు సరికొత్త సినిమాలు, వెబ్‌ సిరీస్‌ల ప్రమోషన్‌ జరుగుతుంది. అంతేకాకుండా సోషల్‌ మీడియా వేదికల్లోనూ మీమ్స్‌, రీల్స్‌, ఆసక్తికర క్రియేటివ్స్‌తో ప్రచారం చేస్తున్నారు. బాగా క్లిక్‌ అయిన డైలాగ్‌, సాంగ్‌ తదితరాలతో ఈ ప్రచారం ఊపందుకుంటోంది. ఈ మధ్య కాలంలో గామీ, కమిటీ కుర్రాళ్లు, నిందా, ధూమం, శాకాహారి, గరుడన్‌, మ్యూజిక్‌ షాప్‌ మూర్తి, గోట్‌ లైఫ్‌, అహం రీబూట్‌, ఖాదర్‌ ఐజాక్‌ వంటి సినిమాలు ప్రేక్షకుల ఆదరణ పొందాయి.

హైదరాబాద్‌ వైబ్స్‌

వినూత్న సినిమాలకు పట్టం కడుతున్న ప్రేక్షకులు

షార్ట్‌ స్టోరీ, ఐఎమ్‌డీబీ రేటింగ్‌తో మంచి సినిమాల ఎంపిక

థియేటర్స్‌లో ఆడకున్నా ఇక్కడ మాత్రం హిట్‌..

ఒక్క సినిమా కోసం కూడా సబ్‌స్క్రిప్షన్స్‌

# ఓటీటీపై.. ఓ లుక్కు..

## చరిత్ర సృష్టిస్తున్న ఓటీటీ వేదికలు




చేతిలో రిమోట్‌ పట్టుకుంటే చాలు కళ్ల ముందు చిత్రాల వెల్లువ, సిరీస్‌ల సముద్రం.. షోల ఫ్లో.. మరి ఎంచుకోవడం ఎలా? ఎవరిని అడగాలి ఏవి చూడాలి? మన సబ్‌స్క్రిప్షన్‌కి ఎలా న్యాయం చేయాలి? ఇవి నగరవాసులకు రోజువారీ సందేహాలుగా మారాయి. సమాధానాల కోసం విభిన్న మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఓటీటీ వీక్షణలో తమదైన శైలిని ఏర్పరచుకుంటున్నారు. వేల సంఖ్యలో ఉన్న సినిమాల్లో కొన్ని మాత్రమే ఆసక్తికరమైన వాటిని ఎంచుకుని, చూడటానికి ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఓటీటీ వేదికలంటే.. ఇంటి పట్టునే ఉండి కొత్త కొత్త సినిమాలను ఆస్వాదించడంతో పాటుగానే ఇప్పటి జీవన శైలిలో ఇదో నిత్యకృత్యంగా మారింది. నెట్‌ఫ్లిక్స్‌, అమేజాన్‌ ప్రైమ్‌, ఆహా, సోనీ లివ్‌, హాట్‌స్టార్‌, జీ స్టూడియోస్‌ ఇలా లెక్కకు మించి ఆదరణ పొందుతున్న ఓటీటీ వేదికల్లో సినిమా చూసే ముందు, ఆ సినిమా విశేషాలను సంక్షిప్తంగా తెలియజేసే షార్ట్‌ స్టోరీ (సినాప్సిస్‌) ఉంటుంది. సాధారణంగా ప్రేక్షకులు ఈ సమాచారంతోనే సినిమా చూడాలా వద్దా అనే నిర్ణయానికి వస్తున్నారు. ప్రస్తుతం అన్ని భాషల్లోని సినిమాలు ఇతర భాషల్లోకి డబ్బింగ్‌ చేస్తున్నారు. లేదా ఇంగ్లిష్‌ సబ్‌టైటిల్స్‌తో విడుదల చేస్తున్నారు. ఈ కారణంతో ఏ భాష వారైనా సరే.. అన్ని భాషల్లోని ఉత్తమ సినిమాలను చూడగలుగుతున్నారు. ఇందులో ఈ షార్ట్‌స్టోరీ డిస్క్రిప్షన్‌ ప్రధాన పాత్ర పోషిస్తుంది. సినిమాలు, వెబ్‌ సిరీస్‌లతో పాటు ఎంటర్‌టైన్మెంట్‌ షోలకు కూడా మంచి క్రేజ్‌ ఉంది. తెలుగు ఓటీటీ ఛానల్‌ 'ఆహా' వేదికగా ప్రసారమవుతున్న తెలుగు ఇండియన్‌ ఐడెల్‌ వంటి షోలకు ప్రత్యేకంగా ఫ్యాన్స్‌ ఉన్నారు.

### ఐఎండీబీ రేటింగ్‌..

విడుదలైన మూవీ ఎలా ఉందని తెలిపే సినిమాల రివ్యూలాగే ఓటీటీ సినిమాలకు కూడా ఐఎండీబీ (ఇంటర్‌నెట్‌ మూవీ డేటాబేస్‌) రేటింగ్‌ ఉంది. ఇది సినిమాలు, టెలివిజన్‌ సిరీస్‌, ట్రెండింగ్‌ కంటెంట్‌ తదితరాలకు ఆన్‌లైన్‌ రేటింగ్‌ను అందిస్తుంది. ఈ రేటింగ్‌లో భాగంగా పదికి 9 శాతం కన్నా ఎక్కువ ఉన్న వాటిని ఎక్కువగా చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు. 5 శాతం కన్నా తక్కువ రేటింగ్‌ ఉంటే మాత్రం ఆ వైపు వెళ్లట్లేదు. 7, 8 శాతం రేటింగ్‌ ఉంటే చూడాల్సిన సినిమాగానే ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం ట్రెండింగ్‌గా మారిన కొన్ని సినిమాలను చూడటం కోసమే ఆ ఓటీటీ ఛానల్‌ సబ్‌స్క్రిప్షన్స్‌ తీసుకుంటున్న వారూ ఉన్నారు. ఒక్కో సినిమాకు వంద మిలియన్‌ల సీయింగ్‌ మినిట్స్‌ రావడం విశేషం.



### ఓటీటీలో హిట్‌.. థియేటర్లో ఫట్‌..

ఎన్నో అంచనాలతో విడుదలైన కొన్ని సినిమాలు థియేటర్‌లో ప్రేక్షకాదరణ పొందలేక డిజాస్టర్లుగా నిలిచిపోతాయి. ఇది సినిమా రంగంలో సర్వసాధారణం. అయితే థియేటర్‌లో అంతంత మాత్రమే ఆడిన సినిమాలు ఓటీటీల్లో మాత్రం సూపర్‌ డూపర్‌ హిట్లుగా ఆదరణ పొందుతున్నాయి. అదేవిధంగా థియేటర్‌లో హిట్‌ టాక్‌ పొంది, అదే అంచనాలతో భారీ ధరకు కొనుగోలు చేసి ఓటీటీ వేదికల్లో విడుదల చేయగా.. ఆ అంచనాలకు చేరకపోగా, కనీసం ప్రేక్షకాదరణ పొందని సినిమాలు సైతం ఎన్నో ఉన్నాయి. థియేటర్‌ కల్చర్‌లో స్టార్‌ హీరోలు, మంచి క్యాస్టింగ్‌ ఉన్న సినిమాలనే ఎక్కువ ఇష్టపడే వారు జనాలు. కానీ ప్రస్తుతం ఆసక్తికర కథ, కథనం, మేకింగ్‌ ఉంటే చాలు. అది ఎవరి సినిమా ఐనా, చిన్న సినిమా ఐనా సరే.. విపరీతంగా చూస్తున్నారు.



# నాలెడ్జి సిటీలో నాండోస్‌

నవాబుల నగరానికి దక్షిణాఫ్రికా రెస్టారెంట్‌

హైదరాబాదీలకు ప్రపంచ ప్రఖ్యాత 'పెరి–పెరి' రుచులు

ప్రారంభించిన సీఈఓ సమీర్‌భాసిన్‌

రాయదుర్గం : నవాబుల నగరం హైదరాబాద్‌కు దక్షిణాఫ్రికా రెస్టారెంట్‌ అందుబాటులోకి వచ్చింది. దక్షిణాఫ్రికా రెస్టారెంట్‌ బ్రాండ్‌ 'నాండోస్‌' హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని ఆర్‌ఎంజెడ్‌ నెక్సిటీ భవనంలో గురువారం అందుబాటులోకి వచ్చింది. ఆహార వైవిధ్యం, మసాలాల పట్ల ప్రేమకు ప్రసిద్ధి చెందిన నగరవాసులకు ప్రపంచ ప్రఖ్యాత 'పెరి–పెరి' రుచులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ అంతర్జాతీయ స్థాయి రెస్టారెంట్‌ను నాండోస్‌ ఇండియా సీఈఓ సమీర్‌భాసిన్‌ చేతుల మీదుగా ప్రారంభించారు. దక్షిణాఫ్రికా బ్రాండ్‌ రెస్టారెంట్‌ నాండోస్‌లో కృత్రిమ రుచులు, రంగులు లేకుండా ఫ్లేమ్‌ గ్రిల్‌ చేసి ఆహారప్రియులకు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నాండోస్‌ ఇండియా సీఈఓ సమీర్‌భాసిన్‌ మాట్లాడుతూ ఆహార వైవిధ్యం, మసాలాల పట్ల ప్రేమకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్‌కు మా ప్రపంచ ప్రఖ్యాత పెరి–పెరి రుచులను అందించడానికి సంతోషిస్తున్నామన్నారు. మా ప్రామాణిక రుచులు దక్షిణాఫ్రికాలో పుట్టాయి కానీ భారతదేశంలోని మసాలాప్రియుల కోసం రూపొందించామన్నారు. పెరిపెరి–ఆఫ్రికన్‌ బర్డ్స్‌ ఐ చిల్లీతో తయారు చేయబడిందని, ఇది నాండోస్‌ అనుభవానికి గుండెకాయ అని వివరించారు. మా సాస్‌లు, బేస్టింగ్‌లు, మెరినేడ్స్‌ అన్నీ అసలైన తాజా పదార్థాలతో తయారు చేయబడ్డాయని తెలిపారు. నాండోస్‌ ప్రేమికులు ఇప్పుడు నగరంలోని హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని ఆర్‌ఎంజెడ్‌ నెక్సిటీలో మా కొత్త కాసాలో లెజెండరీ ఫ్లేమ్‌ గ్రిల్డ్‌ పెరి చికెన్‌ ఆస్వాదించవచ్చన్నారు. మా సంస్థ 36 ఏళ్ల క్రితం దక్షిణాఫ్రికాలోని జోహన్స్‌ బర్గ్‌లోని ఒకే ప్రదేశంలో ప్రారంభించగా ప్రస్తుతం 5 ఖండాలలోని 24 దేశాల్లో విస్తరించి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

# గ్రీన్‌, క్లీన్‌, సేఫ్‌ మధ్యప్రదేశ్‌


ట్రావెల్స్‌, హోటల్స్‌, టూర్‌ ఆపరేటర్ల కోసం మాస్టర్‌ క్లాస్‌

మధ్యప్రదేశ్‌ పర్యాటక శాఖ రోడ్‌ షో..

పర్యాటకుల సంఖ్య 3 రెట్లు పెరుగుదల

ప్రఖ్యాతిగాంచిన జ్యోతిర్లింగాలలో ఒక్కటైన ఉజ్జయిని మహాకాళి దేవాలయాన్ని ఏటా లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారు. అదే సమయంలో దేవి లోక్‌ శక్తిపీఠం, ఓంకారేశ్వరలోని 108 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహం, ఇతర దేవాలయాలు మధ్యప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి, సిటీ బ్యూరో



ప్రాణ్పూర్‌ చందేరి సమీపంలో భారతదేశపు మొదటి క్రాఫ్ట్‌ హ్యాండ్లూమ్‌ గ్రామం, చందేరి ఫెస్టివల్‌, కునో ఫారెస్ట్‌ ఫెస్టివల్‌, గాంధీసాగర్‌ ఫారెస్ట్‌ రిట్రీట్‌, జల్‌ మహోత్సవ్‌ వంటి పండగలు, అక్కడి సంస్కృతి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. 785 పులులతో 'టైగర్‌ స్టేట్‌ ఆఫ్‌ ఇండియా' టైటిల్‌ను సొంతం చేసుకున్న వన్యప్రాణి అటవీ ప్రాంతం, 14 యునెస్కో వరల్డ్‌ హెరిటేజ్‌ సైట్లతో సహా హెరిటేజ్‌ టూరిజం స్పాట్లు మహారాష్ట్ర సొంతం. ఎనిమిది నగరాలను కలుపుతూ భారతదేశంలోనే మొదటి ఇంట్రా స్టేట్‌ ఎయిర్‌ ట్యాక్సీ సేవలు ఇక్కడే ప్రారంభమయ్యాయి. ఇలా ఎన్నో ప్రత్యేకతలున్న మధ్యప్రదేశ్‌లో పర్యాటక రంగం ఇటీవలి కాలంలో గణనీయంగా వృద్ధి చెందుతోంది.

### సాంస్కృతిక కళలు..

ఖజురహో డ్యాన్స్‌ ఫెస్టివల్‌, లోక్‌రంగ్‌, తాన్సేన్‌ సమారో (2025లో 100వ ఎడిషన్‌), అల్లావుద్దీన్‌ ఖాన్‌ సంగీత్‌ సమారో, అఖిల భారతీయ కాళిదాస్‌ సమారోహ్‌ తో సహా ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాలను అందిస్తోంది. 'హార్ట్‌ ఆఫ్‌ ఇన్‌క్రెడిబుల్‌ ఇండియా'ను సందర్శించడానికి ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నారు.

### పెరిగిన పర్యాటకులు..

అధికారిక లెక్కల ప్రకారం 2022లో పర్యాటకుల సంఖ్య 34.1 మిలియన్లుగా ఉండగా.. 2023లో ఆ సంఖ్య 112.1 మిలియన్లకు చేరింది. గణనీయమైన పెరుగులతో మధ్యప్రదేశ్‌ పర్యాటక శాఖ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు వివిధ రాష్ట్రాల్లో రోడ్‌షోలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం 'గ్రీన్‌, క్లీన్‌, సేఫ్‌ మధ్యప్రదేశ్‌' అనే థీమ్‌తో మధ్యప్రదేశ్‌ పర్యాటక శాఖ స్థానిక ఓ స్టార్‌ హోటల్‌లో రోడ్‌ షో నిర్వహించింది. ట్రావెల్‌ ఏజెన్సీలు, టూర్‌ ఆపరేటర్లకు ప్రత్యేక అవగాహన కల్పించారు.

### సత్సంబంధాల కోసం..



హైదరాబాద్‌లో రోడ్‌ షో విజయవంతమైంది. పలు సంస్థలతో మధ్యప్రదేశ్‌ పర్యాటక శాఖ చేసుకున్న అవగాహన ఒప్పందాలు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడతాయని నమ్ముతున్నాం. తెలంగాణ, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాల మధ్య బలమైన బంధాలు ఏర్పాటు చేస్తుంది. ట్రావెల్‌ ఏజెన్సీలు, టూర్‌ ఆపరేటర్లు ఈ వర్క్‌ షాప్‌లో తమ అనుభవాలను పంచుకోవడం సంతోషంగా ఉంది. పర్యాటకంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్నవారిని రాయితీలతో ఆహ్వానిస్తున్నాం.

– బిదిషా ముఖర్జీ, అదనపు మేనేజింగ్‌ డైరెక్టర్‌

## హెరిటేజ్‌ సిటీలో

# పింక్‌ పవర్‌ రన్‌

- బ్రెస్ట్‌ క్యాన్సర్‌ పై అవగాహనకు 3, 5, 10కిమీ రేసులు
- 29న పక్షి రూప మానవహారంతో గిన్నీస్‌ రికార్డుకు సన్నాహం

సాక్షి, సిటీబ్యూరో: రోజు రోజుకూ పెరిగిపోతున్న క్యాన్సర్‌ వ్యాధిపైన అవగాహన పెరగాలి. ముఖ్యంగా మహిళల్లో సాధారణమైపోతున్న రొమ్ము క్యాన్సర్‌ గురించి, సంరక్షణ గురించి ప్రతి మహిళకూ తెలియాల్సిన అవసరముంది. ఈ అవగాహన కల్పించడం కోసం ప్రముఖ సామాజిక వేత్త, ఫ్యాషన్‌ ఐకాన్‌ సుధారెడ్డి ఆధ్వర్యంలో సుధా రెడ్డి ఫౌండేషన్‌తో పాటు ఎంఐఐఎల్‌ ఫౌండేషన్‌ సంయుక్తంగా ఈ నెల 29న ప్రతిష్టాత్మకంగా 'పింక్‌ పవర్‌ రన్‌ 2024'ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన మెడల్స్‌, పింక్‌ టీ షర్ట్‌ను గురువారం హోటల్‌ ఆవాసా వేదికగా సుధా రెడ్డి, ఇండియన్‌ బ్యాడ్మింటన్‌ స్టార్‌ పీవీ.సింధూ ఆవిష్కరించారు. బ్రెస్ట్‌ క్యాన్సర్‌ పై అవగాహన కల్పించడం కోసం నిర్వహిస్తున్న ఈ రన్‌లో తాను కూడా పాల్గొంటానని పీవీ. సింధూ తెలిపారు.

### అవగాహన.. ప్రేరణ.. అవసరం

పింక్‌ పవర్‌ రన్‌ మహిళల సంరక్షణ కోసం అంకితభావంతో నిర్వహిస్తున్న కార్యక్రమమని, భారీ మానవ హారంతో గిన్నీస్‌ వరల్డ్‌ రికార్డును సాధించనున్నామని నిర్వాహకులు సుధారెడ్డి తెలిపారు. ఐక్యత, ఆశ, బ్రెస్ట్‌ క్యాన్సర్‌ పై పోరాడే నిబద్ధతకు సంకేతమని వివరించారు. నగరంలో ఐటీ, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు, ఫ్యాషన్‌ ట్రెండ్స్‌కు వేదికని.. ఇలాంటి వేదికపై మహిళల ఆరోగ్యం, సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసువాల్సిన అవసరముందన్నారు. బ్రెస్ట్‌ క్యాన్సర్‌ను జయించిన మహిళలు వెంకట రమణమ్మ (ఖమ్మం), శివ లక్ష్మి (నల్గొండ) పాల్గొని వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రముఖ మెడికల్‌ ఆంకాలజీ కన్సల్టెంట్‌ సుధా సిన్హా క్యాన్సర్‌కు సంబంధించిన పలు విషయాలను వివరించారు.





# బాబు తప్పిదమే ముంచేసింది

**ప్రొటోకాల్ తుంగలో తొక్కి వెలగలేరు గేట్లు ఎత్తడంపై ఇంజనీర్లు, సాగునీటి నిపుణుల విస్మయం**

### ప్రభుత్వానికి చెప్పాం

శుక్రవారం బుడమేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో శనివారం బుడమేరుకు భారీ వరద వస్తుందని మాకు ముందే తెలుసు. వెలగలేరు రెగ్యులేటర్ వద్దకు 45 వేల క్యూసెక్కుల వరద వస్తుందని అంచనా వేశాం. గరిష్ఠంగా వరద వస్తున్న నేపథ్యంలో వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తి వరదను దిగువకు వదిలేయాల్సి ఉంటుందని ప్రభుత్వానికి శనివారం మధ్యాహ్నంలోపే సమాచారం ఇచ్చాం. వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తిన 20 గంటల్లో విజయవాడకు వరద చేరుతుందని చెప్పాం. ప్రభుత్వ అనుమతితోనే శనివారం రాత్రి వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తి వరదను దిగువకు వదిలేశాం.

– మాధవ్ నాయక్, డీఈ, వెలగలేరు రెగ్యులేటర్

''గత శనివారం ఉదయమే బుడమేరుకు ఎగువ నుంచి వరద ఉధృతి ప్రారంభమైందన్నది ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. కృష్ణా నదికి గరిష్ఠ ప్రవాహం వస్తుందన్నది కూడా తెలుసు. వెలగలేరు రెగ్యులేటర్ దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు కావాల్సినంత సమయం ఉంది. కానీ.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా హఠాత్తుగా వెలగలేరు గేట్లు ఎందుకు ఎత్తేశారు? ఎవరు ఎత్తమన్నారు? విజయవాడలో జల ప్రళయానికి ఇదే కారణం. అపార ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీసింది. ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమే దీనికి కారణం''

– ఉమ్మడి రాష్ట్రంలో పలువురు సీఎంల వద్ద సలహాదారులుగా (జలవనరులు) పనిచేసిన రిటైర్డ్ ఈఎన్సీల నిశ్చితాభిప్రాయం ఇది.

''2005లో బుడమేరుకు 70–75 వేల క్యూసెక్కులకుపైగా వరద వచ్చింది. నాడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాక వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగాం. అప్పటితో పోల్చితే ఇప్పుడొచ్చిన వరద తక్కువే. ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఆశ్చర్యకరం. వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు హఠాత్తుగా ఎత్తేస్తే విజయవాడను బుడ మేరు ముంచెత్తుతుందని, భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించింది?''

– కృష్ణా డెల్టాలో సుదీర్ఘకాలం పనిచేసిన ఇంజనీర్ సూటి ప్రశ్న

**సాక్షి, అమరావతి:** విజయవాడతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వకుండా బుడమేరుపై వెలగలేరు వద్ద ఉన్న రెగ్యులేటర్ గేట్లను శనివారం అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా ఎత్తివేయడంపై రిటైర్డ్ ఈఎన్సీలు (ఇంజనీర్–ఇన్–చీఫ్), చీఫ్ ఇంజనీర్లు, సాగు నీటిరంగ నిపుణులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం చారిత్రక తప్పిదం విజయవాడలో జల ప్రళయానికి.. కనీవినీ ఎరుగని ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం చెలగాటమాడేలా వ్యవహరించడంపై నివ్వెరపోతున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వల్ల 30వ తేదీ (శుక్రవారం), 31న (శనివారం) భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని గత నెల 28న ఐఎండీ హెచ్చరించింది. ఈ క్రమంలో శుక్రవారం పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు బుడమేరు ఉప్పొంగింది. శనివారం ఉదయానికి వెలగలేరు రెగ్యులేటర్ వద్దకు దూసుకొచ్చింది. బుడమేరు డైవర్షన్ చానల్ గుండా కృష్ణా నది వైపు పరుగులు తీసింది. ఎగువ నుంచి బుడమేరుకు భారీ వరద వస్తోందని.. వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి, ఎస్ఈ, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు శనివారం ఉదయమే సమాచారం ఇచ్చామని డీఈ మాధవ్ నాయక్ 'సాక్షి'కి చెప్పారు. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి బుడమేరు వరద విజయవాడ చేరడానికి 20 గంటల సమయం పడుతుందని కూడా చెప్పామన్నారు.

**నిలువెల్లా నిర్లక్ష్యానికి తార్కాణం..**

వెలగలేరు రెగ్యులేటర్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు దానికి దిగువన బుడమేరు పరీవాహక లోతట్టు ప్రాంతాల గ్రామాలు, విజయవాడలోని సింగ్ నగర్, కండ్రిక, పాత రాజరాజేశ్వరిపేట, పాయకాపురం తదితర కాలనీల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసేలా చాటింపు వేయించాలి. సురక్షిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాలకు తరలించాలి. ఆ తర్వాత గేట్లు ఎత్తడానికి వెలగలేరు రెగ్యులేటర్ సిబ్బందికి అనుమతి ఇవ్వాలి. కానీ.. ఈ విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. వెలగలేరు రెగ్యులేటర్ సిబ్బంది పంపిన సమాచారంపై శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ కనీసం స్పందించలేదు. కృష్ణా, బుడమేరు ఒకేసారి ఉప్పొంగడం.. బుడమేరు నుంచి 60 వేల క్యూసెక్కులకుపైగా వరద పోటెత్తడంతో సీఎం చంద్రబాబు ఇంటికి ముంపు ముప్పు ముంచుకొస్తుండటంతో శనివారం రాత్రి ప్రభుత్వం స్పందించింది. చంద్రబాబు ఇంటికి ముంపు ముప్పు తప్పించడం కోసం వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తేసి బుడమేరు వరదను మళ్లించాలని రెగ్యులేటర్ సిబ్బందిని ఆదేశించింది.

**విజయవాడలో జల ప్రళయం..**

లోతట్టు ప్రాంతాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో శనివారం ఎప్పటిలానే బుడమేరు లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాలు, విజయవాడ ప్రజలు నిద్రకు ఉపక్రమించారు. అనంతరం రాత్రి వెలగలేరు రెగ్యులేటర్ గేట్లను ఎత్తేశారు. ఆదివారం తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న విజయవాడ లోతట్టు ప్రాంతాల వాసులపై బుడమేరు వరద ఒక్కసారిగా విరుచుకుపడింది. తేరుకునే లోపే బుడమేరు వరద చుట్టుముట్టి ఇళ్లను ముంచెత్తింది. జలప్రళయానికి దారి తీసింది. అపార ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. చంద్రబాబు సర్కారు చారిత్రక తప్పిదం వల్లే ఈ ప్రళయం చోటుచేసుకుందని ఇంజనీర్లు, సాగునీటి రంగ నిపుణులు తేల్చి చెబుతున్నారు.

# టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం రాసలీలలు

**మాట్లాడాలంటూ హోటల్‌కు పిలిచి అఘాయిత్యాలకు తెగబడ్డారు**

**చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి సంచలన ఆరోపణలు**


రహస్య కెమెరాకు చిక్కిన చిత్తూరు జిల్లా ఎమ్మెల్యే ఆదిమూలం


మీడియాతో మాట్లాడుతున్న వరలక్ష్మి

**సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి:** చిత్తూరు జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అదే పార్టీకి చెందిన నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు వరలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డారని.. ఎవరికైనా చెబితే అంతుచూస్తానని బెదిరించారని ఆమె ఆరోపించారు. ఎమ్మెల్యే గురించి అందరికీ తెలియాలనే తాను ఆయన లీలలను పెన్ కెమెరాలో రికార్డు చేశానని చెప్పారు. తనవద్ద బలమైన సాక్ష్యాలున్నాయనే ఆయన తనకు అనేకమార్లు ఫోన్లుచేశారని.. రాత్రిపూట మెసేజ్‌లు పెట్టి బెదిరిస్తున్నారని.. గురువారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియా సమక్షంలో వెల్లడించారు. ఇదే విషయమై పార్టీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ విషయాలన్నీ విధిలేని పరిస్థితుల్లో వెల్లడించాల్సి వస్తోందన్నారు. వరలక్ష్మి ఇంకా ఏమన్నారంటే..

ఇద్దరం ఒకే పార్టీకి చెందిన వారం కావడంతో పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరం పాల్గొనే వారం. కొద్దిరోజులకు నా ఫోన్ నెంబర్ తీసుకుని పదేపదే ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఎన్నికలు ముగిసే వరకూ నన్ను సోదరిగా సంబోధించారు. ఆ తర్వాత ఆయన తన నిజస్వరూపం బయటపెట్టారు. అయనతో సన్నిహితంగా ఉండాలంటూ బెదిరింపులకు దిగారు. తమ మాట వినకపోతే భర్త, ఇద్దరు పిల్లల్ని చంపేస్తానని, పార్టీ పరంగా ఎలాంటి లబ్ధి చేకూరకుండా చేస్తాననే వారు. చివరకు.. మాట్లాడుకుని విషయం సెటిల్ చేసుకుందామంటూ నమ్మబలికిన ఆదిమూలం.. ఈ ఏడాది జూలై 6న తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు పిలిపించాడు. అక్కడి రూమ్ నెం.109లో నాపై లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయం ఎవరికైనా చెబితే కుటుంబంలో అందరినీ చంపేస్తానంటూ బెదిరించడంతో మిన్నకుండిపోయా. ఆయన అంతటితో ఆగకుండా వేళగాని వేళల్లో ఫోన్లు, సందేశాలతో వేధించేవారు. దీంతో.. అర్ధరాత్రి సమయంలో ఎమ్మెల్యే నుంచి పదేపదే ఫోన్లు రావడాన్ని గమనించిన నా భర్త నన్ను ప్రశ్నించడంతో జరిగిందంతా ఆయనకు చెప్పేశాను. కామాంధుడైన ఎమ్మెల్యే ఆదిమూలానికి బుద్ధిచెప్పాలని నిర్ణయించుకున్నాం. అదే నెల పదో తేదీన అదే హోటల్‌లో రూం నెం.105కి ఆయన మళ్లీ రమ్మనడంతో రహస్య కెమెరాలతో వెళ్లాను. ఆ రోజు ఎమ్మెల్యే నాపై మరోసారి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ తతంగం మొత్తం రహస్య కెమెరాల్లో రికార్డు అయింది. మరోసారి అదే నెల 17న అదే హోటల్‌లో రూమ్ నెం.105కి రమ్మని మళ్లీ అత్యాచారం చేశాడు. నా వద్ద ఆయన ఆడియోలు, వీడియోలు ఉన్నాయని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం నాపై నిఘా ఉంచి, నా చుట్టూ ఆయన మనుషులను మోహరించాడు.

**చంద్రబాబు, లోకేశ్‌కు ఫిర్యాదు చేసినా..**

ఈ పరిస్థితుల్లో.. నావద్ద ఉన్న సాక్ష్యాలను జతచేస్తూ ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేశ్‌లకు లేఖలు రాశా. కామాంధుడిగా మారి సొంత పార్టీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలినే చెరబట్టిన ఎమ్మెల్యే ఆదిమూలంపై చర్యలు తీసుకోవాలని అందులో కోరా. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈరోజు మీడియా ముందుకొచ్చా. ఎమ్మెల్యే నుంచి ప్రాణహాని ఉన్నందున నాకు రక్షణ కల్పించాలి. పార్టీ సరైన చర్యలు తీసుకోకపోతే మంగళగిరిలోని పార్టీ కార్యాలయం ముందు ఆత్మహత్య చేసుకుంటా. మరోవైపు.. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీడీపీ మహిళా నేతను లైంగికంగా వేధించిన దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా రావడంతో ఆయనను పార్టీ నుంచి టీడీపీ సస్పెండ్ చేసింది.

మరిన్ని ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# ఆర్టీసీలో విడతల వారీగా బాండ్ల బకాయిల చెల్లింపులు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ వేతన సవరణకు సంబంధించిన బాండ్ల బకాయిల చెల్లింపులో విడతల విధానాన్ని కొనసాగిస్తోంది. ఆరు నెలల క్రితం డ్రైవర్లకు, గురువారం కండక్టర్లకు బకాయిలు చెల్లించింది. ఇంకా పదివేల మంది వివిధ విభాగాల ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఈ తీరుపై ఆర్టీసీ కార్మిక సంఘాల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**రెండేళ్ల బకాయిలు.. రెండురకాల చెల్లింపులు**

ఆర్టీసీలో 2013 లో జరగాల్సిన వేతన సవరణను 2015 లో పూర్తి చేశారు. రెండేళ్ల ఆలస్యంగా జరిగినందుకు ఆ రెండేళ్ల కాలం నాటి బకాయిలను రెండు రకాలుగా చెల్లించనున్నట్టు అప్పటి ప్రభుత్వం పేర్కొంది. 50 శాతం మొత్తాన్ని నగదు రూపంలో నిర్ధారిత గడువులోగా చెల్లించి, మిగతా మొత్తాన్ని బాండ్ల రూపంలో చెల్లించనున్నట్టు పేర్కొంది. ఆ బాండ్ల చెల్లింపు గడువు పూర్తయినా సకాలంలో వాటిని చెల్లించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ మొత్తాన్ని చెల్లించనున్నట్టు ప్రకటించింది. గత ఫిబ్రవరిలో బాండ్ల బకాయిలు రూ.281 కోట్లు చెల్లిస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా తొలుత డ్రైవర్లకు చెల్లించారు. మిగతా 25 వేల మంది ఉద్యోగుల చెల్లింపులను పెండింగ్‌లో పెట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతున్నవి అవుతున్నట్టుగా చెల్లిస్తామని అప్పట్లో ఆర్టీసీ ప్రకటించింది. ఏడు నెలలు గడుస్తున్నా అతీగతీ లేకపోవటంతో కార్మిక సంఘాలు ఆందోళనకు కూడా సిద్ధమయ్యాయి. ఈ జాప్యాన్ని వివరిస్తూ కొద్దిరోజుల క్రితమే సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరికొన్ని నిధులు కేటాయించింది. కానీ ఆ నిధులు ఏ విభాగానికి కూడా పూర్తిగా సరిపోకపోవటంతో ఆర్టీసీ పునరాలోచనలో పడింది. ప్రస్తుతం ఆర్టీసీలో 14 వేల మంది కండక్టర్లున్నారు. వీరందరికి చెల్లించాలంటే రూ.85 కోట్లు అవసరం. కానీ ప్రభుత్వం రూ.57 కోట్లు మాత్రమే ఇచ్చినట్టు తెలిసింది. దీంతో మిగతా మొత్తాన్ని ఆర్టీసీ కలిపి రూ.85 కోట్లు కండక్టర్లకు విడుదల చేసినట్టు సమాచారం. గ్యారేజీ సిబ్బందితోపాటు ఆర్టీసీ ఆస్పత్రి, ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, బస్‌భవన్ అధికారులు, ఉద్యోగులు, డిపోల్లోని అధికారులు, ఉద్యోగులు, వర్క్‌షాప్ సిబ్బంది.. ఇలా మరో పది వేల మంది చెల్లింపులు పెండింగ్‌లో పెట్టారు. కండక్టర్లకు బాండ్ల బకాయిలు చెల్లించటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఉద్యోగులను విభజించు పాలించు తరహాలో కొంతమందికి ఇచ్చి మిగతావారిని విస్మరించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వివిధ కార్మిక సంఘాల నేతలు, వీఎస్‌రావు, వీరాంజనేయులు, కమాల్‌రెడ్డి, నరేందర్, రాజిరెడ్డి, అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి, యాదయ్య, వెంకన్న, ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు విమర్శించారు.


దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించిన నీరజ్ అగర్వాల్

## మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

**సీట్ల పెంపు, కొత్త కోర్సులపై ఇంజనీరింగ్ కాలేజీలకు తేల్చిచెప్పిన హైకోర్టు**

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో సీట్ల పెంపు, కొత్త కోర్సులపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని కాలేజీలకు హైకోర్టు తేల్చి చెప్పింది. తెలంగాణ విద్యాచట్టం–1982 లోని సెక్షన్–20ని, సీట్ల పెంపునకు నిరాకరిస్తూ ప్రభుత్వం గత నెల 24న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ పలు కాలేజీలు 11 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, శ్రీరఘురామ్, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అనుమతి ఇచ్చిన మేరకు కొన్ని కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతిచ్చేలా... టీజీఈఏపీసీఈటీ 2024– 25కు సంబంధించి ప్రత్యేక కౌన్సెలింగ్ జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ ఆగస్టు 19 నుంచి బీటెక్ కోర్సులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. వాదనలు విన్న న్యాయ మూర్తి మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరించారు.

## నేడు జాయింట్ పార్లమెంట్ కమిటీ భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటు కమిటీ (జేపీసీ) శుక్రవారం భేటీ కానుంది. పార్లమెంటులోని అనెక్స్ బిల్డింగ్‌లో ఈ సమావేశం జరగనుంది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జేపీసీ సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇప్పటికే తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో వక్ఫ్ భూముల సమస్యలు, వివాదాలు, బాధితుల పరిస్థితులను వివరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ వక్ఫ్ బోర్డు సభ్యులు కమిటీకి తమ అభిప్రాయాలు తెలపనున్నారు.

# స్థానికంగా ఉంటే అనుమతించండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టి గురువారం ఈ మేరకు తీర్పు చెప్పింది. ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల మేరకు ప్రతి విద్యార్థికి స్థానిక కోటా వర్తింపజేయాలని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో దాదాపు 130 మంది విద్యార్థులకు ఊరట లభించనుంది.

**టెన్త్, ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలన్న నిబంధనతో..**

జీవో 33లోని నిబంధన 3 (ఏ)ను సవాల్ చేస్తూ హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కల్లూరి నాగనరసింహ అభిరామ్‌తోపాటు మరికొందరి తరఫున న్యాయవాది కొండపర్తి కిరణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం జూలై 19న జారీ చేసిన జీవో 33 చట్టవిరుద్ధం. ఈ జీవో ప్రకారం విద్యార్థులు 9, 10తోపాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. పరీక్షలు ఇక్కడే రాయాలి. ఏడేళ్లు స్థానికంగా ఉండాలి. ఇది చట్టవిరుద్ధం. లోకల్‌గా పరిగణించేందుకు కొత్త నిబంధనలు తెస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన జీవోను కొట్టేయాలి'అని పిటిషనర్లు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

**ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివారని స్థానికులు కాదంటున్నారు..**


'చాలా మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివారు. వారంతా తెలంగాణలోనే పుట్టి టెన్త్ వరకు ఇక్కడే చదివినా జీవో ప్రకారం వారికి స్థానికత వర్తించదు. అదే తెలంగాణలో పుట్టకపోయినా ఆ నాలుగేళ్లు ఇక్కడే చదివిన వారికి స్థానికత వర్తిస్తుంది. ఇది రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. ఫిబ్రవరి 9న నీట్‌కు నోటిఫికేషన్ వెలువడగా మే 5న పరీక్ష, జూలై 26 ఫలితాలు వెలువడ్డాయి. కానీ ఫలితాల ముందు ప్రభుత్వం జీవో జారీ చేయడం చట్టవిరుద్ధం'అని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, డీవీ సీతారామమూర్తి వాదించారు. అయితే హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఏపీకి చెందిన వారున్నారని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు. నీట్ దరఖాస్తులో అభ్యర్థులే ఆ విషయాన్ని పేర్కొన్నారన్నారు. కర్ణాటక, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న నిబంధనలనే ఇక్కడ తీసుకొచ్చామని చెప్పారు.

**మార్గదర్శకాల మేరకు అనుమతించండి..**

'తెలంగాణకు చెందిన విద్యార్థులకే స్థానిక కోటా వర్తింపజేయాలని ప్రభుత్వం తెచ్చిన జీవో 33లోని నిబంధన 3 (ఏ) ఉద్దేశం మంచిదే. అయితే తెలంగాణకు చెందిన విద్యార్థి ఇతర రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాశారని స్థానికత నిరాకరించడం సరికాదు'అని ధర్మాసనం తీర్పులో పేర్కొంది. ప్రభుత్వం రూపొందించే 'నివాస'మార్గదర్శకాల మేరకు ప్రతి కేసును పరిశీలించాలని.. అర్హులైన పిటిషనర్లను స్థానిక కోటా కింద కౌన్సెలింగ్‌కు అనుమతించాలని కాళోజీ వర్సిటీని ఆదేశించింది.

# సీబీఐ విచారణపై వారికెందుకు అభ్యంతరం?

- రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థ సిద్ధంగా ఉన్నాయి
- ఐఎంజీ భారతకు భూ కేటాయింపుపై పిటిషనర్ల వాదన
- సీబీఐ విచారణకు ఆదేశిస్తేనే అక్రమ భూకేటాయింపు వెనకున్నవారు తేలతారని వెల్లడి
- తీర్పు రిజర్వు చేసిన తెలంగాణ హైకోర్టు



**సాక్షి, హైదరాబాద్:** ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్)కు భూముల అక్రమ కేటాయింపుపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సిద్ధంగా ఉన్నప్పుడు అనధికారిక ప్రతివాదులు (బిల్లీరావు, మాజీ మంత్రి పి.రాములు)కు అభ్యంతరమెందుకని హైకోర్టులో పిటిషనర్లు ప్రశ్నించారు. భూముల కేటాయింపు అక్రమమని ఇదే హైకోర్టు తేల్చిందని, అయితే ఆ అక్రమాలకు, అవినీతికి పాల్పడిన వారెవరో నిగ్గు తేల్చాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు. సీబీఐ విచారణ చేపడితే నిందితులుగా మారబోయే వారికి విచారణ వద్దు అని వాదించే హక్కు లేదని తేల్చిచెప్పారు. 12 ఏళ్ల క్రితం దాఖలైన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో వాదనలు పూర్తి కావడంతో సీజే ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. 'హైదరాబాద్ పరిధిలో రూ.వేల కోట్ల విలువైన (ప్రస్తుత విలువ రూ.లక్ష కోట్లు) 850 ఎకరాల ప్రభుత్వ భూములను ఓ బోగస్ కంపెనీకి నాటి చంద్రబాబు ప్రభుత్వం కారుచౌకగా కేటాయించింది. ఆ కంపెనీకి రూ.వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్‌లోని క్రీడా స్టేడియంలు కూడా అప్పగించింది. దీని వెనుక చంద్రబాబు సర్కార్ పెద్దలు ఉన్నారు. బోగస్ కంపెనీకి ఇన్ని వందల ఎకరాలు, రూ.వందల కోట్లు ఎందుకు కేటాయించారు.. దీని వెనకున్న వారెవరో తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి..'అని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు తదితరుల తరఫు న్యాయవాదులు రఘునాథ్‌రావు, గాడిపల్లి మల్లారెడ్డి 2012లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

**అక్రమాలను అధికారుల కమిటీ తేల్చింది..**

శ్రీరంగారావు తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'భూ కేటాయింపులో అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ 2006లో తేల్చింది. ఈ నివేదిక మేరకు నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్ భూముల కేటాయింపు రద్దు చేస్తూ జీవో జారీ చేసింది. దీనిపై బిల్లీరావు పిటిషన్ దాఖలు చేయగా, భూ కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఇదే హైకోర్టు ఈ ఏడాది మార్చిలో ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రూ.లక్ష కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూముల అప్పగింత విషయంలో నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. అక్రమాల వెనకున్న వారెవరో తెలియాలంటే సీబీఐతో పారదర్శక దర్యాప్తు జరిపించాల్సిందే. రాజకీయ దురుద్దేశాలతో ఈ పిల్‌లు దాఖలయ్యాయని చెప్పడం హాస్యాస్పదం. శ్రీరంగారావుకు ఏ పార్టీతోనూ ఎలాంటి సంబంధాలు లేవు. పిటిషనర్లే కాదు.. రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణ కోరిన విషయాన్ని మరవద్దు. భూ కేటాయింపుపై విచారణ జరిపించాలని కేంద్రానికి వినతిపత్రం సమర్పించాం. ఎలాంటి స్పందన లేకపోవడంతోనే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది..'అని వెల్లడించారు. ఏబీకే తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని, ప్రముఖ జర్నలిస్ట్‌గా సుపరిచితులని చెప్పారు. కాగా ఇప్పటివరకు ఎలాంటి క్రిమినల్ కేసు గానీ, ఫిర్యాదు గానీ నమోదు కాని అంశంలో సీబీఐ విచారణ చేయడం సరికాదని బిల్లీరావు తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదించారు. మాజీ మంత్రి పి.రాములు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం తీర్పు వాయిదా వేసింది.

# ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌పై నీలినీడలు

**స్థానికతపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాని స్పష్టత**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ఎంబీబీఎస్ రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. స్థానికతపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో మరింత గందరగోళం నెలకొంది. ఈ తీర్పు నేపథ్యంలో కౌన్సెలింగ్ నిర్వహించడం సాధ్యం కాదని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. స్థానికతపై కోర్టును ఆశ్రయించిన వారే కాకుండా కాళోజీ విశ్వవిద్యాలయం రూపొందించిన నాన్ లోకల్ జాబితాలో ఉన్న దాదాపు 1,100 మంది విద్యార్థులకు కొత్త మార్గదర్శకాలు అమలు చేయాలని తీర్పులో ఉందని... అందువల్ల అది తేలకుండా కౌన్సెలింగ్ నిర్వహించడం సాధ్యంకాదని పేర్కొన్నాయి. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంపైనే అంతా ఆధారపడి ఉందని తెలిపాయి. ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడం ద్వారా పరిష్కారం వెతకడమో లేదా కొత్త మార్గదర్శకాలు ఖరారు చేసి అమలు చేయడమో ఇప్పుడున్న ప్రత్యామ్నాయ మార్గాలని అధికారులు అంటున్నారు. దీనివల్ల కౌన్సెలింగ్ మరింత ఆలస్యం కానుందని చెబుతున్నారు.

**స్థానికతపై రాజుకున్న లొల్లి...**

రాష్ట్రంలో ఎంబీబీఎస్ సహా ఇతర మెడికల్ కోర్సుల్లో స్థానికత నిర్ధారణకు ప్రభుత్వం ఈసారి మార్పులు చేసింది. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ మధ్యలో ఏదైనా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వారిని స్థానికులుగా గుర్తించేది. అయితే ఈ నిబంధన వల్ల చాలా మంది ఏపీకి చెందిన విద్యార్థులు 6–9 తరగతులు చదివినట్లు తప్పుడు సర్టిఫికెట్లు తెచ్చి తెలంగాణ స్థానికులుగా చెలామణి అవుతున్నారని ప్రభుత్వం భావించింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు 9, 10, ఇంటర్ రెండేళ్లు కలిపి మొత్తం నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివిన వారినే స్థానికులుగా గుర్తించాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమకు అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళ్లారు.

**కౌన్సెలింగ్ జరిగేదెప్పుడు?**

ప్రస్తుతం 15 శాతం ఆలిండియా కోటా సీట్లు డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతోంది. తొలివిడత కౌన్సెలింగ్ పూర్తయింది. రెండో విడత జరుగుతోంది. వాస్తవానికి జాతీయ స్థాయిలో తొలివిడత కౌన్సెలింగ్ ముగిశాక రాష్ట్రస్థాయిలో తొలివిడత కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ స్థానికత అంశం కోర్టులో ఉండటంతో ఇప్పటివరకు రాష్ట్రంలో కౌన్సెలింగ్ మొదలవలేదు. ఏదిఏమైనా తెలంగాణలో ఈసారి కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కానుందని కాళోజీ వర్గాలు తెలిపాయి. మరో రెండు వారాలు కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం లేదని పేర్కొన్నాయి.

# రైతు వారీగా పంట నష్టం అంచనా

**వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు జారీ**

**సాక్షి, హైదరాబాద్:** రైతు, పంట వారీగా నష్టం అంచనా వేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నందున, రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు సమగ్ర గణన చేపట్టాలని ఆదేశించారు. 33 శాతం, అంతకంటే ఎక్కువ నష్టం జరిగిన పంటల వివరాలను వారం రోజుల్లోగా నివేదించాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు 8 లక్షల నుంచి 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ వర్గాలు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం. అయితే అందులో 33 శాతం పంట నష్టం జరిగిన భూములున్న రైతులకు పరిహారం ఇస్తారు. ఆ మేరకు నష్టం జరిగిన విస్తీర్ణాన్ని, రైతుల వివరాలను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శిస్తారు. ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం పేర్కొన్న సంగతి తెలిసిందే.

# 8 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

**లాంఛనంగా ప్రారంభించనున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్ :** ఈ నెల 8వ తేదీన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుకానుంది. ఆ తర్వాత 9, 10 తేదీల్లో అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుడతారు. 25వేల బూత్‌లలో ఎక్కువ సభ్యత్వాలు చేయాలని, మిగతా 10వేల బూత్‌లను టార్గెట్ బూత్‌లుగా పెట్టుకొని సభ్యత్వాలు చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించింది. మొత్తం రాష్ట్రాన్ని 7 వేల శక్తి కేంద్రాలుగా (4,5 పోలింగ్ బూత్‌లు కలిపి ఓ శక్తికేంద్రం) విభజించారు. వాటికి 7వేల మంది విస్తారక్‌లను కేటాయించి, ఎక్కువ సభ్యత్వాలు చేయించేలా టార్గెట్‌గా పెట్టుకున్నారు. గురువారం రాత్రి పొద్దుపోయేదాకా రాష్ట్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై జిల్లా అధ్యక్షులు, జిల్లా మెంబర్ షిప్ ప్రముఖులతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మీడియాకు వివరాలు వెల్లడించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 6-9-2024



టీచర్స్ డే రోజు పూజించుకుంటున్నాం సరే.
వారి మానసిక ఆరోగ్యం గురించి
ప్రభుత్వానికి, ఇంటికి శ్రద్ధ ఉందా?
చెప్పాల్సిన క్లాసుల సంఖ్య, సిలబస్‌ల వత్తిడి,
విద్యార్థులు నిత్యం తెచ్చే సమస్యలు,
స్కూల్లో అరాకొరా వసతులు, స్కూలుకు రానూ పోనూ
ప్రయాణ సౌలభ్యం లేని ఆందోళన...
ఇవన్నీ టీచర్ల మానసిక ఆరోగ్యం దెబ్బ తీస్తున్నాయి.
ఆ అసహనం విద్యార్థుల మీదకు మళ్లితే
వారు గాయపడటమే కాక పాఠాలు నడవవు.
శాంతంగా, నవ్వుతూ ఉండే టీచర్లు ఎందరు?

### టీచర్లపై ఒత్తిడి బెత్తం

# స్ట్రెస్.. హెల్త్ మిస్

**2023లో** బిహార్‌లో టీచర్ల మానసిక ఆరోగ్యం మీద ప్రభుత్వం సర్వే చేసింది. మొత్తం 75 వేల ప్రభుత్వ పాఠశాలల్లోని 4 లక్షల మంది టీచర్లకు 12 రకాల ప్రశ్నలున్న ప్రశ్నాపత్రాన్ని పంపి వాటికి సమాధానాలు రాయించారు. ఈ సర్వే చేయడానికి ముఖ్య కారణం విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులు...

- టీచర్లు తరచూ తిడుతూ ఉండటం, కొడుతూ ఉండటం
- స్కూలుకు సరిగ్గా రాకపోవడం
- సిలబస్ సమయానికి పూర్తి చేయలేకపోవడం

ప్రభుత్వం జీతాలు ఇచ్చి పాఠాలు చెప్పమంటే పిల్లలతో వారు వ్యవహరిస్తున్న తీరులో ఎందుకు తేడా వస్తున్నదో తెలియడానికి ఈ సర్వే చేశారు. కాని సర్వే ఫలితాలను మాత్రం బయట పెట్టలేదు. సర్వేలో అడిగిన కొన్ని ప్రశ్నలు ఇలా ఉన్నాయి.

- మీ ఇంట్లోని ఒత్తిడి స్కూల్లో మీ ఉద్యోగం మీద పడుతున్నదా?
- పిల్లల్ని ఎంత తరచుగా తిడుతున్నారు?
- సిలబస్ టైమ్‌కి పూర్తి చేయగలుగుతున్నారా?
- మీరు ఇంట్లో ఎక్కువ ఒత్తిడి ఫీలవుతారా స్కూల్లోనా?
- ఇప్పటి విద్యా వ్యవస్థ మీద సంతృప్తిగా ఉన్నారా?

ఈ సర్వేతో సంబంధం లేకుండా ఎక్కువ మంది ఏం చెప్పారంటే మాకు పాఠాలు చెప్పే పని కంటే వేరే పనులు ఎక్కువ చెబుతున్నారు అని. వాటిలో ఎలక్షన్ డ్యూటీలు, సర్వేలు, మిడ్ డే మీల్స్ ఉన్నాయి. సర్వేల పనిలో టీచర్లను పెడితే ఆ సమయంలో టీచర్ల అటెండెన్స్ దారుణంగా పడిపోతోంది. కొందరైతే 'మిడ్ డే మీల్స్‌ను బయటి ఏజెన్సీకి అప్పగించాలి. చీటికి మాటికి దాని గురించి ఇన్‌స్పెక్షన్‌లకు వస్తుంటే ఒత్తిడిగా ఉంది' అన్నారు.

**వ్యక్తిగత ఒత్తిడి**

టీచర్ ఉద్యోగంలో ఉన్నవారికి కుటుంబం నుంచి చాలా సపోర్ట్ ఉండాలి. ఇంటి పని తగ్గించగలగాలి. ఆర్థిక, భావోద్వేగ సమస్యలు తెలుసుకొని మిత్రులు, బంధువులు సపోర్ట్‌గా నిలవాలి. సక్సెస్‌ఫుల్ విద్యార్థులను తయారు చేయించడంలో ఆమె సక్సెస్ అయ్యేలా తోడు నిలవాలి.

**వ్యక్తిగత శ్రద్ధకు సమయం లేదు**

స్కూల్లో పాఠాలు, హోమ్‌వర్క్‌లు, పరీక్షలు పెట్టి పేపర్లు దిద్దటాలు, స్కూల్ మేనేజ్‌మెంట్‌తో మీటింగ్‌లు, పేరెంట్స్‌తో మీటింగ్‌లు, సిలబస్‌ను పూర్తి చేయడం, వృత్తిపరమైన పోటీ (మంచి పేరు రావడం), స్టూడెంట్‌ల వ్యవహారశైలితో సమస్యలు... ఇవన్నీ ఒత్తిడి కలిగించేవే. ఇక కుటుంబ పరమైన ఒత్తిడులు కూడా ఉంటాయి. ఇంటి వొత్తిడి స్కూల్లో స్కూలు ఒత్తిడి ఇంట్లో తెచ్చి పెట్టుకుంటే రెండు చోట్లా టీచర్లకు స్థిమితం ఉండదు. స్థిమితంగా లేని స్వభావంతో పాఠం చెప్పడం కష్టం. ఈ మొత్తం వ్యవహారంలో టీచర్లు తమ మానసిక స్థితి గురించి శ్రద్ధ పెట్టే ఆలోచన చేయలేకపోతున్నారు.

**పిల్లలకు ఒత్తిడి**

క్లాసురూమ్‌లో కూచోగానే పిల్లలు తలెత్తి చూసేది టీచర్‌నే. టీచర్ ముఖం ప్రసన్నంగా ఉంటే వారు ప్రసన్నంగా పాఠం వింటారు. చిర్రుబుర్రులాడే టీచర్ ఉండే క్లాసులోని పిల్లల్ని పరీక్షిస్తే వారిలో 'కార్టిసల్' అనే స్ట్రెస్ హార్మోన్ ఎక్కువగా విడుదలవుతున్నదని తేలింది. పిల్లల మానసిక ఆరోగ్యం పై స్కూల్ వాతావరణం నెగెటివ్ ప్రభావం ఏర్పరిస్తే వారిలో సమస్యలు వస్తాయి. వీళ్లు మళ్లీ టీచర్‌కు స్ట్రెస్ ఇస్తారు. అంటే ఇదొక సైకిల్‌గా మారుతుంది.

**చర్యలు తీసుకోవాలి**

టీచర్లు, పిల్లలు మంచి మానసిక స్థితిలో ఉంటూ స్కూల్ జీవనం కొనసాగించాలంటే టీచర్ల గురించి ఆలోచించాలి. టీచర్ల కోసం ప్రభుత్వం గాని, ప్రయివేటు యాజమాన్యాలుగాని కింది చర్యలు తీసుకోవాలి.

- తరచూ నిపుణులచే కౌన్సిలింగ్ చేయించడం
- మెంటల్ హెల్త్ వర్క్‌షాప్‌లు నిర్వహించడం
- సాటి టీచర్ల నుంచి మద్దతు లభించే పని వాతావరణం.
- వసతులు, బోధనా సామాగ్రి ఏర్పాటు
- ఇంటి పని, ఉద్యోగ బాధ్యత సమతుల్యత గురించిన అవగాహన
- యాజమాన్యం, తల్లిదండ్రులు, పిల్లలకు టీచర్లు అనుసంధానకర్తలుగా ఉండేలా చేసి ఆ టీచర్లు చెప్పే సూచనలను పాజిటివ్‌గా చూడటం.

మై వార్డ్‌రోబ్



కదలి

'కొత్త డ్రెస్ వేసుకుంటే ఆ రోజంతా హుషారుగా అనిపిస్తుంటుంది.
అందుకే ఉదయం లేస్తూనే ఆ రోజు వేసుకోదగిన డ్రెస్ గురించి ప్లానింగ్ చేసుకుంటాను' అంటోంది రచయిత్రి, సాంగ్ రైటర్ కదలి. ఖమ్మం నుంచి హైదరాబాద్ వచ్చి సాహిత్యం, సినిమాల్లో కృషి చేస్తున్న కదలి పాఠకులకు పరిచితమే. 'రైటర్ అంటే కాటన్స్ మాత్రమే వేసుకోవాలనేం ఉండదు. కంఫర్ట్‌గా ఉండే డ్రెస్సులు ఏవైనా వేసుకోవచ్చు. అందుకే నా వార్డ్రోబ్‌లో అన్నీ మోడ్రన్, కలర్‌ఫుల్ డ్రెస్సులు ఉంటాయి' అంటోంది కదలి.

# కలర్‌ఫుల్‌గా కదలి అలలా...





''మన వార్డ్రోబ్ మనకు ఒక అద్దం లాంటిది. ఈ విషయం చెప్పడానికి నేను రాసిన ఒక కథను పరిచయం చేయాలి. ఆ కథలో ఒక యంగ్ అమ్మాయి హీరోయిన్ అవ్వాలనుకుంటుంది. కానీ చుట్టూ రకరకాల మాటలతో డిప్రెస్ అయ్యి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. రైలు పట్టాల దగ్గరకు వెళ్లి అక్కడ జరిగిన ఒక సంఘటనతో ఇంటికి తిరిగి వచ్చేస్తుంది. అద్దంలో తన ముఖం చూసుకొని అందంగా తయారవ్వాలనుకుని కళ్లకు కాటుక పెట్టుకుంటుంది. తర్వాత జీవితంపై ఆశతో స్వీయప్రేరణతో తనను మెరుగు చేసుకుంటుంది ఆ కథలో. అంటే మనం ఎలా ఉండాలో మన చుట్టూ ఉన్న వారు డిసైడ్ చేయరు. మనకు మనమే నిర్ణయించుకోవాలి.

**నాకు నేను ప్రేరణగా!**

నేను షార్ట్స్ కూడా వేసుకుంటాను. బట్టలను బట్టి ఒక అమ్మాయి వ్యక్తిత్వాన్ని ఎలా జడ్జ్ చేస్తారో ఇప్పటికీ అర్థం కాదు. అందుకే కొన్ని సభలకు టీ షర్ట్స్, జీన్స్ వేసుకెళతాను. ఈ అమ్మాయా రైటర్ రా?! అని ఆశ్చర్యపోయేవారున్నారు. ఏది సౌకర్యంగా ఉంటుందో అది వేసుకున్నంత మాత్రాన వ్యక్తిత్వానికి మార్కులు వేయకూడదు. ఎవరైనా అలా అన్నా నేను పట్టించుకోను. మీటింగ్ సందర్భాలలో కుర్తీస్ వేసుకుంటాను. రెడీ అవ్వాలి అనిపిస్తే మాత్రం ఏ మాత్రం రాజీ పడను.

**కాన్ఫిడెంట్‌గా ఉండాలి**

నా మనసుకు నచ్చిన డ్రెస్ వేసుకుంటాను కాబట్టి కాన్ఫిడెంట్‌గా కూడా ఉంటాను. నా స్నేహితుల జాబితాలో ఫ్యాషన్ డిజైనర్లు ఉన్నారు. వారి డిజైన్స్ నాతో ట్రై చేస్తుంటారు. వాటిలో నచ్చినవి తీసుకుంటాను.

**అమ్మ చీరలను కొత్తగా!**

అమ్మ కట్టుకునే చీరలు చూసి నాకూ అలా చీరలు కట్టుకోవాలనిపిస్తుంది. మా అమ్మకు మూడు బీరువాల చీరలున్నాయి. రెగ్యులర్ చీరలు తప్ప వాటిని కట్టుకోదు. దీంతో అమ్మ చీరలను నేను కట్టుకుంటుంటాను. 'అంచు చీరలు నీవేం కట్టుకుంటావు, పెద్దదానిలా' అంటుంది. కానీ, బ్లౌజ్ డిజైన్‌తో స్టైలిష్ లుక్ తీసుకువస్తాను. దీంతో అమ్మ కూడా ఆశ్చర్యపోతూ 'చాలా బాగుంది' అని కితాబు ఇచ్చేస్తుంది. పండగలు, కుటుంబ ఫంక్షన్లు, వేడుకలకు సందర్భానికి తగినట్టు లంగాఓణీలు, పట్టుచీరలు అన్నీ ప్రయత్నిస్తాను.

**భిన్నంగా ఉండాలని...**

రచయిత్రి అనగానే ముతక చీరలు, కళ్లద్దాలు ఉండాలని చాలా మంది అనుకునేవారు. కానీ, నా వార్డ్రోబ్ మాత్రం వాటన్నింటికన్నా భిన్నం. రచయిత్రులు అంటే ఇలాగే ఉండాలి అనే ఆలోచనల్లోనుంచి ఒక మార్పు తీసుకురావాలని బుక్ లాంచింగ్ వంటి కార్యక్రమాలకు జీన్స్, టాప్స్ ట్రై చేస్తుంటాను. ప్రతీ రోజూ కొత్తగా ఉండాలనుకుంటాను. ఏ డ్రెస్ వేసుకొని రెడీ అవుతామో ఆ రోజు ఆ డ్రెస్ ప్రభావం మన మీద ఉంటుంది.

**ఫ్యాషన్ షోలు**

దేశ, విదేశాల్లోనూ ఫ్యాషన్ షోలు నడుస్తుంటాయి. వాటిలో ప్రసిద్ధ డిజైనర్లు సీజన్‌ని బట్టి కలర్, డిజైన్ థీమ్‌ని పరిచయం చేస్తుంటారు. వాటి కోసం ఆన్‌లైన్ సెర్చింగ్‌తో పాటు, ఫ్యాషన్ మ్యాగజీన్స్ కూడా చూస్తుంటాను. ఆ కలర్ డ్రెస్ కాంబినేషన్స్ నేనూ ప్రయత్నిస్తుంటాను. ఎక్కువగా మాత్రం బ్లాక్ అండ్ వైట్ కలర్స్ ఇష్టపడతాను. ఆ కాంబినేషన్ డ్రెస్సులు కూడా చాలానే ఉన్నాయి నా దగ్గర'' అంటూ వార్డ్‌రోబ్ విశేషాలను షేర్ చేసుకుంది.

– నిర్మలారెడ్డి





● కళవాయి శివమ్మ

# అమ్మ గీసిన బొమ్మ

**దళవాయి శివమ్మ... తోలుబొమ్మల చిత్రకారిణి. తోలు మీద అపురూప చిత్రాలను గీస్తూ 'శిల్పగురు' జాతీయ పురస్కారానికి ఎంపికైన తెలుగు మహిళ శివమ్మ.**



దళవాయి శివమ్మ



దళవాయి శివమ్మది ఆంధ్రప్రదేశ్, శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం, నిమ్మల కుంట గ్రామం. తోలుబొమ్మలపై అద్భుతమైన చిత్రాలను సృజనాత్మకంగా చిత్రీకరిస్తోంది. శ్రీకృష్ణ చరిత్ర, విశ్వరూప హనుమ ఘట్టాల చిత్రీకరణకు కేంద్ర ప్రభుత్వం ఉత్తమ కళాకారులకు అందించే శిల్పగురు అవార్డుకు ఈ ఏడాది శివమ్మను ఎంపిక చేసింది. దక్షిణ భారతదేశంలో ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక మహిళ ఆమె. కేంద్ర చేనేత, జౌళి, హస్త కళల శాఖ ఆమెకు శిల్పగురు అవార్డును ప్రకటించింది. ఈమె ప్రతిభకు మెచ్చి కేంద్ర ప్రభుత్వం 2019లో జాతీయ అవార్డు ప్రదానం చేసింది.

తోలుబొమ్మల తయారీ దళవాయి శివమ్మ కుటుంబ వృత్తి. భర్త ప్రోత్సాహంతో ఆమె తోలుబొమ్మలను తయారు చేయడంలో నైపుణ్యాన్ని సాధించారు.. తాతముత్తాతల కాలం నాటినుండి వారికి ఈ కళపై పట్టు ఉండటంతో మారుతున్న ఫ్యాషన్ పోటీ ప్రపంచానికి దీటుగా వైవిధ్యమైన బొమ్మలను చిత్రిస్తున్నారు. వీరి చేతిలో రూపుదిద్దుకున్న ల్యాంప్‌సెట్‌లు, పెయింటింగ్స్, డోర్‌హ్యాంగర్స్, రామాయణ ఘట్టాలు, సుందరకాండ, శ్రీకృష్ణలీలలు, విశ్వరూప హనుమల ఘట్టాలు ప్రాచుర్యం పొందాయి.

**విదేశాల్లో మన బొమ్మలు**

శివమ్మ తయారు చేస్తున్న తోలుబొమ్మలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు యూరప్, అమెరికా దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఈ కళ తనతో పాటే అంతరించిపోకుండా నాలుగు తరాల పాటు కొనసాగాలని ఆమె ఆకాంక్ష. అందుకోసం కొత్తతరానికి శిక్షణ ఇస్తోంది. గ్రామీణ మహిళలకు ఉపాధిని కల్పిస్తోంది. ఈ తోలుబొమ్మలను ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారు. దళవాయి శివమ్మ కుమారుడు కుళ్లాయప్ప తోలుబొమ్మల తయారీలో జాతీయ స్థాయి అవార్డులు, వియత్నాం యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వీరి కుటుంబం ఎంతో మంది కళాకారులకు ప్రేరణగా నిలుస్తోంది.

– కొత్త విజయ్‌భాస్కర్‌రెడ్డి, సాక్షి, ధర్మవరం, శ్రీసత్యసాయి జిల్లా

● కలికాలం

# కొడుకు పనికిమాలి... అమ్మ ఆటో తోలి...

**55 సంవత్సరాల తల్లి.
రాత్రి పూట ఆటో నడుపుతోంది.
ఎందుకు? కొడుకు చూడటం లేదు.
'అడుక్కోను. ఏడ్వను.
నన్ను నేను పోషించుకుంటా' అంటోందామె.
ఆ తల్లిని చూసి కన్నీరు.
ఆమె స్థైర్యాన్ని చూస్తే చిర్నవ్వు.
కొడుకులూ... కాస్త సిగ్గు పడతారా?**



రాత్రిపూట ఆటో నడుపుతున్న తల్లి

అరవై ఏళ్లకు సమీపిస్తున్న ఏ తల్లయినా రాత్రయితే ఇంట్లో కొడుకు కోడలితో మనవరాళ్లతో కబుర్లు చెబుతూ టీవీతో కాలక్షేపం చేస్తూ ఉండాలి. కాని రాత్రి పన్నెండు గంటలకు ఆటో నడుపుతూ ఉంటే? 'ఆప్ కర్తే క్యాహో' అనే ఇన్‌స్టా అకౌంట్ నడుపుతున్న ఆయుష్ గోస్వామి అనే వ్యక్తి వివిధ ఉపాధుల్లో ఉన్న వ్యక్తులను ఇంటర్వ్యూ చేస్తుంటాడు. అతను ఒక అర్ధరాత్రి ఈ తల్లిని ఆటో నడుపుతూ చూశాడు.

'ఈ టైమ్‌లో ఆటో నడుపుతున్నావా?'

'పగలు ఇంటి పని. ఏం చేయను. ఇప్పుడే వీలవుతుంది. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఒంటి గంట వరకూ నడుపుతా'

'అన్నం తిన్నావా?'

'సాయంత్రం ఒండుకొని వస్తాను. వెళ్లి తింటాను'

'నీకు ఎవరూ లేరా?'

'కొడుకు ఉన్నాడు. ఏ పనీ చేయడు. నా దగ్గర డబ్బు అడుగుతాడు. వాడి పెంపకంలో నేనేం తప్పు చేశానో. వాడికి రెండేళ్లున్నప్పుడు తండ్రి చనిపోతే కష్టపడి పెంచాను. కాని వాడు నన్ను చూడడు. నాతో తగాదా పడుతూ ఉంటాడు'

'ఇంత రాత్రి వేళ.. ఈ వయసులో ఇంత ధైర్యం మీకెక్కడిది?'

'ఒకరి ముందు చేయి చాచి అడుక్కోవడం కంటే పని చేయడం మంచిది కదా. పని చేయడానికి సిగ్గు పడటం ఎందుకు. చేయాలనుకుంటే చాలా పని ఉంది'

బహుశా ఆ కొడుకు ఆవారా అయి ఉంటాడు. సంపాదన లేని వాడు కూడా కావచ్చు. కాని సంపాదన ఉండి ఇల్లు మేడలు ఉండి వృద్ధులైన తల్లిదండ్రులకు ఒక గది ఇవ్వగలిగి తిండి పెట్టగలిగి చూడని సంతానం ఇవాళ ఎందరు. చస్తే చావని అని బయటకు గెంటేస్తున్నవారు ఎందరు. గతంలో ఇరుగు పొరుగు వారు గడ్డి పెట్టేవారు. ఇప్పుడు మనకెందుకులే అని ఊరుకుంటున్నారు. కాని మనస్సాక్షి ఊరుకుంటుందా. కొడుకులూ... మీ మనస్సాక్షి మిమ్మల్ని నిలదీస్తుంటే మీరేం సమాధానం చెబుతారు? మీ తల్లి దుఃఖ పడితే మీరు ఎలా నిర్లక్ష్యంతో ఉండగలరు.

మీరు మనసును బండరాయి చేసుకున్నారా? కొంచెమైనా సిగ్గుపడరా?

వంటిల్లు

# బుజ్జి గణపయ్యకు బొజ్జ నిండా!

**రేపే వినాయక చవితి.
ఉదయం చంద్రుడిని చూడవద్దు.
చందమామ లాంటి కుడుములు చేద్దాం.
వినాయకుడికి నివేదన చేద్దాం.
ఓ బొజ్జ గణపయ్యా! నీ బంటు నేనయ్యా!!
ఉండ్రాళ్లపై దండు పంపమని స్తోత్రం చదువుదాం!!**



## ఉండ్రాళ్లు

**కావలసినవి:** బియ్యపు రవ్వ– కప్పు; నీరు – 2 కప్పులు; పచ్చి శనగపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు; నెయ్యి– టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము – పావు కప్పు (ఇష్టమైతేనే)

**తయారీ:** ● శనగపప్పును కడిగి 20 నిమిషాల సేపు నీటిలో నానబెట్టి నీటిని వంపేసి పక్కన పెట్టాలి. ● ఒక పాత్రలో నెయ్యి వేడి చేసి అందులో శనగపప్పు వేసి వేయించాలి. శనగపప్పు దోరగా వేగిన తర్వాత అందులో నీరు పోసి ఉప్పు వేసి మూత పెట్టాలి. నీరు మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి, రవ్వ వేసి ఉండలు లేకుండా గరిటెతో కలపాలి. కొబ్బరి తురుము వేసి సమంగా కలిసే వరకు కలిపి నీరు ఆవిరైపోయి రవ్వ దగ్గరగా అయిన తర్వాత దించేయాలి. వేడి తగ్గిన తర్వాత చేతికి నెయ్యి రాసుకుని గోళీలుగా చేస్తే ఉండ్రాళ్లు రెడీ.

## పూర్ణం కుడుములు

**కావలసినవి:** బియ్యప్పిండి– కప్పు; నీరు – కప్పు; నెయ్యి – టీ స్పూన్; ఉప్పు – చిటికెడు. పూర్ణం కోసం... పచ్చి శనగపప్పు – అర కప్పు; నీరు – కప్పు; బెల్లం పొడి– ముప్పావు కప్పు; పచ్చి కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్‌లు; యాలకుల పొడి– అర టీ స్పూన్

**తయారీ:** ● శనగపప్పును కడిగి రెండు టేబుల్ స్పూన్‌ల నీరు పోసి కుక్కర్‌లో నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, చల్లారిన తర్వాత నీటిని వంపేసి శనగపప్పును మిక్సీలో వేసి పొడి చేయాలి. ఈ పొడి డ్రైగా ఉండదు, కొద్దిపాటి తడిపొడిగా ఉంటుంది. ● ఒక పాత్రలో బెల్లం పొడి, రెండు టేబుల్ స్పూన్‌ల నీరు పోసి కరిగే వరకు మరిగించాలి. కరిగిన తర్వాత మరొకపాత్రలోకి వడపోయాలి. బెల్లం నీటిలో శనగపప్పు పొడి, కొబ్బరి తురుము వేసి గరిటెతో కలుపుతూ మిశ్రమం దగ్గరగా అయ్యే వరకు మరిగించాలి. చివరగా యాలకుల పొడి వేసి కలిపి దించేయాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని ఎనిమిది భాగాలుగా చేసి, గోళీలుగా చేస్తే పూర్ణం రెడీ.

**ఇక కుడుముల కోసం...** ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో ఉప్పు, నెయ్యి వేసి వేడి చేయాలి. నీరు మరిగేటప్పుడు స్టవ్ ఆపేసి బియ్యప్పిండి వేసి గరిటెతో కలపాలి. వేడి తగ్గిన తరవాత చేత్తో మర్దన చేస్తూ చపాతీల పిండిలా చేసుకుని ఎనిమిది భాగాలు చేయాలి. ఒక్కో భాగాన్ని గోళీలాగ చేసి పూరీలా వత్తాలి. ఇందులో పూర్ణం పెట్టి అంచులు మూసేయాలి. ఇలాగే అన్నింటినీ చేసుకోవాలి ● ఒక వెడల్పు పాత్రకు నెయ్యి రాసి పూర్ణకుడుములను అమర్చాలి. ప్రెషర్ కుకర్‌లో నీరు పోసి కుడుముల పాత్ర పెట్టి మూత పెట్టి ఎనిమిది నిమిషాల సేపు ఉడికించి స్టవ్ ఆపేయాలి. చల్లారిన తర్వాత తీసి వినాయకుడికి నివేదన చేయాలి.

# యువర్స్

**క్యాంపస్ కబుర్లు చెప్పండి...**

హాయ్, ఎలా ఉన్నారు? 'సూ...పర్' అంటారా...అయితే ఒకే! ఇప్పుడంటే 'సూపర్' అంటున్నారుగానీ ఒకప్పుడు? మన దేశం దాటి పర దేశంలో, వినడమే తప్ప ఎప్పుడూ చూడని యూనివర్శిటీలో అడుగు పెట్టినప్పుడు మీకు ఎలా అనిపించింది? కాస్త భయం వేసిందా? బోలెడు ఆనందం వేసిందా? అపరిచితులతో అనుకోని సమస్యలు ఎదురయ్యాయా? మీరు విదేశీ యూనివర్శిటీలో అడుగు పెట్టినప్పటి నుంచి ఆ వాతావరణానికి అలవాటు పడిన ఇప్పటి వరకు రకరకాల అనుభవాలు, అనుభూతులు మీ జ్ఞాపకాల బ్యాంకులో భద్రంగా ఉండే ఉంటాయి. వాటిని షేర్ చేసుకోవాలని మీకు అనిపిస్తే... ఆలస్యం చేయకండి... కలం పట్టండి. యూనివర్శిటీలో మీ ఫొటో జత చేసి మాకు మెయిల్ చేయండి. మా ఈమెయిల్: yourscampus@gmail.com

● డిజిటల్ వరల్డ్



## మనదంతా ఈజీ 'టైప్'!

**అట్టే కష్టపడనక్కర్లేకుండా టెక్నాలజీకి సంబంధించి ఎటు చూసినా 'ఈజీ' ఆప్షన్స్ కనిపిస్తాయి. 'ఈజీ'కి అలవాటు పడడం అనేది 'లేజీ'కి దారితీస్తుందనేది ఒక కోణం అయితే, 'స్కిల్స్' కోల్పోవడం మరో కోణం. ఇప్పటి ఆన్‌లైన్ జనరేషన్ కంప్యూటర్ కీబోర్డ్‌పై టైప్ చేసే సామర్థ్యం కోల్పోతుందని చెబుతున్నారు నిపుణులు. టచ్ స్క్రీన్ పరికరాల అధిక వాడకమే దీనికి కారణం అంటున్నారు...**

జెన్ జెడ్ ఐకాన్, అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ బిల్లీ ఎలీష్ ఒక ఇంటర్వ్యూలో....

'నేను టైప్ చేయడం ఎప్పుడూ నేర్చుకోలేదు. ఎందుకంటే నేను ఈతరానికి చెందిన వ్యక్తిని. టైపింగ్ నేర్చుకోనందుకు మాత్రం చింతిస్తున్నాను' అన్నది.

ఆమె చింత మాట ఎలా ఉన్నా జెన్ జెడ్ 'టైపింగ్ స్కిల్స్'కు దూరం కావడం ఒకింత ఆందోళన కలిగిస్తోంది. గత పాతిక సంవత్సరాలుగా టైపింగ్ కోర్సులు చేసే యువత సంఖ్య గణనీయంగా తగ్గింది.

### ఇలా కనిపెట్టవచ్చు

హెయిర్ స్టైల్, ధరించే దుస్తుల ఆధారంగా ఒకరు ఏ జనరేషన్‌కు చెందిన వారో చెప్పవచ్చు. ఇవి మాత్రమే కాదు స్మార్ట్‌ఫోన్ కీబోర్డ్‌పై టైపింగ్ చేసే విధానాన్ని బట్టీ కూడా ఒకరు ఏ జనరేషన్‌కు చెందిన వారో సులభంగా చెప్పేయవచ్చు అంటున్నాడు టిక్‌టాకర్ టైలర్ మోర్గాన్. 'మిలీనియల్స్‌లో ఎక్కువమంది బొటన వేలితో టైప్ చేస్తారు. వన్ హ్యాండ్ స్వైప్ ఫీచర్‌ని ఉపయోగిస్తారు. జెనరేషన్ ఎక్స్, బూమర్స్ ఒక వేలును ఉపయోగిస్తారు. ఆ తరువాత కాలంలో చూపుడు వేలును కూడా వాడతారు' అంటున్నాడు మోర్గాన్.

టైపింగ్ నైపుణ్యం అనేది అవసరమైన నైపుణ్యం అంటున్నప్పటికీ టచ్ టైపింగ్ ('కీ'ల వైపు చూడకుండా టైప్ చేయడం) అనేది కరికులమ్‌లో భాగం కావడం లేదు. అయితే యూకేలోని బ్రైటన్ కాలేజీలాంటి ప్రసిద్ధ విద్యాలయాలు కరికులమ్(విద్యాప్రణాళిక)లో టైపింగ్‌ను తిరిగి ప్రవేశపెడుతున్నాయి.

స్మార్ట్‌ఫోన్‌లో టైపింగ్ స్పీడ్ నిమిషానికి 38 పదాలు, క్వర్టీ కీబోర్డ్‌లో 52. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ స్పీడ్‌ల మధ్య 'టైపింగ్ గ్యాప్' 25 శాతం ఉందని ఒక అధ్యయనం చెబుతోంది. ఈ విషయం ఎలా ఉన్నా కంప్యూటర్‌లలో కంటే మొబైల్ డివైజ్‌లలోనే టైపింగ్ చేయడానికి యువతరం ఇష్టపడుతుంది.

'టైపింగ్ స్పీడ్ తగ్గడానికి కారణాలలో ప్రాక్టిస్ లేకపోవడం కూడా ఒకటి' అంటున్నాడు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన టైపింగ్ సిస్టమ్స్ నిపుణుడు డాక్టర్ పెర్ ఓలా క్రిస్టెన్సన్.

ఆన్–స్క్రీన్ టైపింగ్, టచ్‌స్క్రీన్ టైపింగ్ వల్ల టచ్ టైపింగ్ నైపుణ్యం కనుమరుగు కావచ్చు అంటున్నారు నిపుణులు.'అలా వీల్లేదు' అని మీకు అనిపిస్తే టచ్ టైపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వండి. స్పీడ్ పెంచండి.'ఏకాగ్రత' 'జ్ఞాపకశక్తి' నుంచి 'కెరీర్ ఆప్షన్స్' వరకు టచ్ టైపింగ్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి అనే విషయం మరవద్దు.

## క్యాంపస్ బర్డ్స్

**ఇల్లు-కాలేజీ తప్ప ప్రపంచం తెలియని అమ్మాయిలు.... ఢిల్లీ పేరు వినడం తప్ప ఎప్పుడూ చూడని అమ్మాయిలు... ఢిల్లీలో చదివే అవకాశం వస్తుందని ఎప్పుడూ ఊహించని అమ్మాయిలు... ఢిల్లీలోని ప్రసిద్ధ అశోక యూనివర్శిటీలోకి అడుగు పెట్టారు. వారికి ఢిల్లీ కొత్తగా కనిపించింది. యూనివర్శిటీ అంతకంటే కొత్తగా కనిపించింది. మనసు నిండా ఆనందం. అదే సమయంలో మనసులో ఏదో మూల భయం! 'అందరూ పోష్‌గా ఉన్నారు. నేనేమో సింపుల్‌గా ఉన్నాను' 'నేను ఇంగ్లిష్ స్పీడ్‌గా మాట్లాడలేను. నాతో ఎవరైనా స్నేహం చేస్తారా?' 'నేను పల్లెటూరి నుంచి వచ్చాను అని తెలిసి ఎగతాళి చేస్తారేమో' ఫస్ట్ జనరేషన్ స్టూడెంట్స్‌గా అశోకా యూనివర్శిటీలో అడుగు పెట్టిన అమ్మాయిల సంతోషం మాటున దాగిన సందేహాలెన్నో!**



అకాడమిక్ బ్రిడ్జ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఢిల్లీలోని అశోకా యూనివర్శిటీలో 48 మంది మొదటి తరం కాలేజీ విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఈ బ్రిడ్జ్ ప్రోగ్రామ్ 2018లో మొదలైంది. ఈ సంవత్సరం 28 మంది మహిళలు ప్రవేశం పొందారు.

మూడేళ్లలో ఇది అత్యధికం. వీరిలో బెంగళూరుకు చెందిన 18 ఏళ్ల మనీషా ఒకరు. ఆమె తల్లి పని మనిషి, తండ్రి భవన నిర్మాణ కార్మికుడు.

'జిమ్ గురించి వినడమే తప్ప ఎప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. ఇక రోజూ వెళతాను' అంటుంది మనీషా.

ఢిల్లీలోని పెద్ద యూనివర్శిటీలో చదివే అవకాశం వచ్చినా....'అంత దూరం వెళ్లి చదువుతావా!' అన్నారు ఇంటి పెద్దలు. పెద్ద యూనివర్శిటీలో తమ కూతురికి చదివే అవకాశం వచ్చింది అనే సంతోషం కంటే భద్రతకు సంబంధించిన విషయాలే వారిని ఎక్కువ భయపెట్టాయి.

'నా కలను నిజం చేసుకోవడానికి మా అమ్మమ్మను ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆమె ఒప్పుకోవడానికి కొన్ని నెలలు పట్టింది. నన్ను ఇక్కడకు పంపడంలో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయి. దీంతో పాటు ఢిల్లీ రావడానికి అవసరమైన డబ్బులు కూడా మా దగ్గర లేవు. ఎలాగోలా కష్టపడి ఇక్కడికి రాగలిగాను' అంటుంది మనీషా.

డాక్టర్ కావాలనేది మనీషా కల. అయితే ఆర్థిక ఇబ్బందులు తన కలకు అడ్డుపడ్డాయి.

'ఎంబీబీయస్ చదవడానికి ఎంతో డబ్బు కావాలి. అది పూర్తయ్యి ఉద్యోగం రావడానికి చాలా కాలం పడుతుంది. అంత డబ్బు లేదు. ఢిల్లీ రావడానికి అవసరమైన డబ్బు కోసమే ఎంతో కష్టపడ్డ నాకు యంబీబీయస్ అనేది తీరని కల' అంటుంది మనీషా.

'నేను సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చాను. మా కుటుంబంలో ఇప్పటి వరకు ఆడపిల్లను బయటకు పంపలేదు. నేను ఢిల్లీకి వచ్చి ఈ క్యాంపస్‌లోకి అడుగు పెట్టినప్పుడు వేరే దేశానికి వచ్చినట్లు అనిపించింది. నిజంగా ఇది ఒక కలలాగా అనిపిస్తుంది. యూనివర్శిటీలోకి అడుగు పెట్టే అవకాశం లేకపోతే నాకు ఎప్పుడో పెళ్లి జరిగి పోయేది' అంటుంది పుణెకు చెందిన అల్సియా తబ్రేజ్ షేక్.

తబ్రేజ్ షేక్ తల్లి గృహిణి, తండ్రి ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తాడు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్టూడెంట్ అయిన తబ్రేజ్ సొంతంగా వ్యాపారం ప్రారంభించడం ద్వారా చేంజ్ మేకర్ కావాలనుకుంటుంది.

పేద, దిగువ మధ్యతరగతి నేపథ్యాల నుంచి క్యాంపస్‌లోకి అడుగు పెట్టిన ఈ అమ్మాయిలలో ఎన్నో లక్ష్యాలు, కలలు ఉన్నాయి. ఆ కలల ముందు హోమ్‌సిక్ అనేది ఒక సమస్య కానేకాదు కదా!

### ఇన్ ఫర్ ఏ పెన్నీ, ఇన్ ఫర్ ఏ పౌండ్

English Idioms

ఎంత కష్టమైనా సరే, ఎలాగైనా సరే చేసి తీరాల్సిందే అనుకునే సందర్భంలో వాడే మాట...ఇన్ ఫర్ ఏ పెన్నీ, ఇన్ ఫర్ ఏ పౌండ్.

ఉదా: ఆఫ్టర్ ది టీమ్స్ డిఫీట్ లాస్ట్ సీజన్, దే హ్యావ్ డిసైడెడ్ దట్ 'ఇన్ ఫర్ ఏ పెన్నీ, ఇన్ ఫర్ ఏ పౌండ్ దే హ్యావ్ టు విన్ ది టైటిల్ దిస్ సీజన్.

### ఇన్ మింట్ కండీషన్

పర్‌ఫెక్ట్‌గా ఉంది, కొత్తగా ఉంది... ఇలాంటి సందర్భాల్లో వాడే మాట... ఇన్ మింట్ కండీషన్.

ఉదా: షీ వాజ్ సెల్లింగ్ హర్ చైల్డ్‌హుడ్ టాయ్స్ బికాజ్ దే వర్ స్టిల్ ఇన్ మింట్ కండీషన్

● ఏఐ ఏరియా

### గూగుల్ జెమిని కొత్త ఏఐ టూల్స్

స్టూడెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని 'బెటర్ లెర్నింగ్' కాన్సెప్ట్‌తో 'గూగుల్ జెమిని' ఎడ్యుకేషనల్ బేస్డ్ ఏఐ టూల్స్‌ను ఇంట్రడ్యూస్ చేస్తోంది. 'ఇంటరాక్టివ్ క్విజ్' అనేది జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన ఫీచర్. రకరకాల సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రశ్నలు, జవాబులు ఉంటాయి, 'జీకే' మెరుగు పరుచుకోవడానికి ఉపకరించే ఫీచర్ ఇది.




'ట్రస్టెడ్ టెక్స్‌బుక్స్' రకరకాల టెక్స్ట్‌బుక్స్‌కు సంబంధించిన ఇన్‌ఫర్‌మేషన్‌తో యాక్సెస్ కావడానికి, రకరకాల కాన్సెప్ట్‌లను, కాంప్లెక్స్ టాపిక్స్‌ను సులభంగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది.

టెక్ట్స్ బుక్స్, స్టడీ గైడ్‌లకు భిన్నంగా కంటెంట్‌కు సంబంధించిన వీడియోలను, సులభంగా అర్థం చేసుకునే సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువస్తుంది... ఇంప్రూవ్డ్ స్టడీ మెటీరియల్. తమ అవసరాలకు అనుగుణంగా, స్టడీ షెడ్యూల్‌ను పక్కగా రూపొందించుకోవడానికి, టైమ్ సేవ్ చేసుకోవడానికి ఉపకరిస్తుంది పర్సనలైజ్‌డ్ స్టడీ గైడెన్స్. అకాడమిక్ టెక్స్ట్ ఫైల్స్ ఎడిటింగ్ చేయడం నుంచి స్టడీ గైడ్స్....మొదలైన వాటికి సంబంధించి డాక్యుమెంట్స్‌ను అప్‌లోడింగ్ చేసుకోవడానికి న్యూ ఏఐ జెమిని టూల్స్ ఉపకరిస్తాయి.

● గేమింగ్



### యోధుడు వచ్చాడు... గెలిచాడు!

'బికమ్ ది మాస్క్ ఆఫ్ చేంజ్' అంటూ ప్లేయర్స్‌ను ఆహ్వానిస్తోంది ఎనోట్రియా: ది లాస్ట్ సాంగ్. ఈ వీడియో గేమ్ ఈ నెల విడుదల అవుతుంది. ఇటాలియన్ ప్రకృతి అందాల నుంచి ప్రేరణ పొందిన ఒక అందమైన భూభాగం ఎనోట్రియా. ఎనోట్రియాలో ఎన్నో ప్రకాశవంతమైన ద్వారాలు కనిపిస్తాయి. అయితే ఆ వెలుగుల వెనుక ఎన్నో చీకటి రహస్యాలు దాగి ఉన్నాయి. ఆ రహస్యాలను ఛేదించే బాధ్యత ప్లేయర్స్‌పై ఉంటుంది. 'వన్ మాస్క్ మేనీ ఫేసెస్'.... ఇలాంటి వాళ్లు ఎందరో ఈ గేమ్‌లో తారసపడతారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కోవడానికి ప్లేయర్స్ దగ్గర ఉన్నవి ఏమిటి? ఒకదానితో ఒకటి సంబంధం లేని 120 డిఫరెంట్ వెపన్స్.

**మరి మీరు రెడీనా!**

**ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 5; **జానర్స్:** యాక్షన్ రోల్ ప్లేయింగ్ గేమ్, ఇండిగేమ్, అడ్వెంచర్ గేమ్, ఫైటింగ్ గేమ్

● టెక్...టాక్

### శాంసంగ్ గెలాక్సీ రింగ్



బ్లాక్, సిల్వర్, గోల్డ్ కలర్‌లతో వచ్చింది శాంసంగ్ గెలాక్సీ రింగ్. ఈ చిన్న రింగ్‌లో హెల్త్ ట్రాకింగ్ సెన్సర్‌లు, బ్యాటరీ. చార్జింగ్ పిన్‌లు దాగున్నాయి. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా ఈ 10ఏటీఎం వాటర్‌ప్రూఫ్ రింగ్‌ను నిస్సంకోచంగా ధరించవచ్చు. స్విమ్ కూడా చేయవచ్చు.

దీని సైజ్: 7.0 ఎంఎం×2.6 ఎంఎం బరువు: 2.3 గ్రా.

### జెన్ జెడ్ కోసం ఇన్‌స్టాగ్రామ్ కొత్త ఫీచర్‌లు...



జెన్‌జెడ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇన్‌స్టాగ్రామ్ కొత్త ఫీచర్‌లు తీసుకువచ్చింది. అవి: క్రియేటివ్ టెక్స్ట్ టూల్స్ (పోస్ట్స్, రీల్స్, స్టోరీస్), కార్సాల్ సైజ్ ఇంక్రీజ్, మ్యూజిక్ ఇంటిగ్రేషన్. వీటితో పాటు యాడ్ యువర్స్ మ్యూజిక్, ఫ్రేమ్స్‌లాంటి ఇంటరాక్టిక్ ఫీచర్‌లను కూడా లాంచ్ చేసింది. మ్యూజిక్ ఆన్ ప్రొఫైల్, మ్యూజిక్ ఇన్ కంటెంట్ నోట్స్, మల్టీట్రాక్ ఆడియో ఆన్ రీల్స్ ఫీచర్‌లను విడుదల చేసింది.

### ఫ్లెక్సిబుల్ మొబైల్ స్టాండ్


బ్రాండ్: స్వాప్‌కార్ట్ కలర్: మల్టీకలర్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
కంపేటబుల్: స్మార్ట్‌ఫోన్స్, గేమింగ్ కన్సోల్స్, ట్యాబ్స్
● మల్టీ ఫంక్షన్ క్లిప్ ● అమెజాన్‌లో



# సినిమా

## మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

**- 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు**



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న మహిళల భద్రత, రక్షణలను మరింత మెరుగుపరచడం కోసం వారి తరఫున ప్రాతినిధ్యం వహించేలా ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరినట్లుగా 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు పేర్కొన్నారు. ''తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు 'మా' అధ్యక్షుడిగా నాది ఒక విజ్ఞప్తి. తెలుగ చిత్ర పరిశ్రమలోని మహిళల భద్రత, రక్షణ మరింత మెరుగుపడేలా, వారి తరఫున ప్రాతినిధ్యం ఉండేలా ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయండి. కెమెరా ముందు, వెనక ప్రతి ఒక్కరికీ భద్రతతో కూడిన పరిస్థితులు ఉండాలన్న దానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. భద్రత, సాధికారితలకు చలన చిత్ర పరిశ్రమ ప్రతిరూపంగా నిలిపేందుకు తెలుగు ఇండస్ట్రీలో భాగమైన ప్రతి ఒక్కర్నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నాం'' అంటూ గురువారం 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... మలయాళ పరిశ్రమలో జస్టిస్ హేమా కమిటీ నివేదికలోని అంశాలు వెలుగులోకి వచ్చాక ఇతర పరిశ్రమల్లోనూ ఆ తరహా కమిటీ ఏర్పాటు చేయాలని పలువురు స్టార్స్ అంటున్న విషయం తెలిసిందే. తెలుగులో ఉన్న విభాగాల్లో ఓ కీలక విభాగం అయిన 'మా' తరఫున మంచు విష్ణు కమిటీ ఏర్పాటుని ప్రతిపాదించారు.

## గజానన... గజానన...

సుదర్శన్ పరుచూరి హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. వరలక్ష్మీ శరత్‌కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు ఇతర పాత్రల్లో నటించారు. రవికిశోర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎన్. పాండు రంగారావు, చిన్న రెడ్డయ్య నిర్మించారు. వినోద్ యాజమాన్య సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'గజానన..' అంటూ సాగే పాటని వినాయక చవితి స్పెషల్‌గా రిలీజ్ చేశారు. 'ఎక్కడికి పోతావు సిన్నవాడా.. ఏ మూల నక్కావు సిన్నవాడా, పరిగెత్తి పడకోయి సిన్నవాడా.. నీదంటూ ఏముందో సిన్నవాడా, 'నువ్వైనా నేనైనా మిగలాలిలే.. గజానన గజానన గజ్జెల సప్పుడు గజానన..' అంటూ ఈ పాట సాగుతుంది. గణేశ్ సాహిత్యం అందించిన ఈ పాటని మంగ్లీ ఆలపించారు. భక్తి నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ''గజానన..' పాట ఈ వినాయక చవితి నవరాత్రుల్లో మార్మోగిపోయేలా కనిపిస్తోంది. వరలక్ష్మి ఎంతో హుషారుగా డ్యాన్స్ చేశారు. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివ కుమార్ దేవరకొండ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ రెడ్డి.


● వరలక్ష్మి

## నాగచైతన్య @15


● నాగచైతన్య

తెలుగు చిత్ర పరిశ్రమలో పదిహేనేళ్లు పూర్తి చేసుకున్నారు హీరో నాగచైతన్య. అక్కినేని నాగార్జున వారసుడిగా 'జోష్' (2009) సినిమాతో హీరోగా పరిచయమయ్యారు నాగచైతన్య. పదిహేనేళ్ల కెరీర్‌లో విలక్షణమైన పాత్రలతో పలు సూపర్ హిట్‌లను ఖాతాలో వేసుకుని తనకంటూ ప్రత్యేకమైన అభిమానాన్ని సొంతం చేసుకున్నారాయన. పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగ చైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్' నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత నాగ చైతన్య, డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి కలిసి నటిస్తున్న రెండో చిత్రమిది. ''నిజ జీవిత ఘటనల ఆధారంగా 'తండేల్' రూపొందుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుపుకుంటోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

## అర్జున్ సర్కార్ ఆన్ డ్యూటీ


● నాని

అర్జున్ సర్కార్‌గా చార్జ్ తీసుకున్నారు హీరో నాని. 'హిట్: ది ఫస్ట్ కేస్, హిట్: ది సెకండ్ కేస్' వంటి చిత్రాల తర్వాత ఆ ఫ్రాంచైజీలో రూపొందనున్న చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. 'హిట్' ఫ్రాంచైజీలో తొలి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను 'హిట్: ది థర్డ్ కేస్'ని కూడా తెరకెక్కించనున్నారు. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్‌పై ప్రశాంతి తిపిర్నేని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. నాని క్యారెక్టర్‌పై (అర్జున్ సర్కార్) స్నీక్ పీక్ అందిస్తూ, గ్రిప్పింగ్ గ్లింప్స్ ద్వారా ప్రకటించారు మేకర్స్. 'హిట్ ఆఫీసర్ డేంజర్‌లో ఉన్నారు.. ఆయన్ని వెంటనే వెనక్కి వెళ్లమని చెప్పండి' అంటూ ఒక అధికారి మరో అధికారికి ఫోన్ చేసి హెచ్చరించడంతో టెన్షన్ బిల్డ్ అయింది. అయితే తను డేంజర్‌లో లేడని, తనే డేంజర్ అని ఆ పోలీస్ ఆఫీసర్ చెప్పిన తర్వాత అర్జున్ సర్కార్‌గా నాని కనిపిస్తారు. ''2025 మే 1న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

## శాండల్‌వుడ్‌లో 'శ్వా' ఏర్పాటు కావాలి

**- సంజనా గల్రానీ**



చలన చిత్రపరిశ్రమలో మహిళల భద్రత, సమాన గౌరవం, పని హక్కు వంటి అంశాలపై నటి సంజనా గల్రానీ కన్నడ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఓ లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం ఈ విధంగా... ''ఇండస్ట్రీలో ఒక ఉమెన్ ఆర్టిస్టు అసోసియేషన్ ఉండాలి. ఆల్రెడీ ఉన్న ఆర్టిస్టు అసోసియేషన్‌తో కలిసి ఈ ఉమెన్ ఆర్టిస్టు అసోసియేషన్ పని చేయాలి. ఓ నటికి ఉండాల్సిన కనీస హక్కులు గురించిన చర్చ జరగాలి. ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల నిర్వహణ జరగాలి. ప్రస్తుతం తోటి పరిశ్రమల్లో జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. అలాంటి బ్లాక్ మార్క్స్ కన్నడ ఇండస్ట్రీపై పడకూడదు. అందుకే ఈ లేఖ రాస్తున్నాను. కన్నడ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్టిస్టు అసోసియేషన్, ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, డైరెక్టర్స్ అసోసియేషన్, టెక్నీషియన్స్ అసోసియేషన్‌ల విలువైన సలహాలతో 'శాండల్‌వుడ్ ఉమెన్ ఆర్టిస్టు అసోసియేషన్' (ఎస్‌డబ్ల్యూఏఏ - 'శ్వా') ఏర్పాటు కావాలి. ముఖ్యంగా ఈ 'శ్వా'పై కర్ణాటక ప్రభుత్వం పర్యవేక్షణ ఉండాలి'' అని సంజన ఆ లేఖలో రాసుకొచ్చారు. అలాగే ఈ లేఖను పరిశీలించవలసినదిగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, హోం మినిస్టర్ పరమేశ్వర్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ మినిస్టర్ లక్ష్మీ హెబ్బాల్కర్‌లను అడ్రస్ చేశారు సంజన. అలాగే సెట్స్‌లో నటీమణులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక క్యారవేన్ ఉండాలని, ఓ గది అయినా ఉండేలా ఏర్పాట్లు ఉండాలని, రాత్రి షూట్ సమయంలో సరైన పరిస్థితులు ఉండాలని... ఇవన్నీ 'శ్వా'కి ప్రాథమిక నియమాలుగా ఉండాలంటూ మరికొన్ని నియమాలను కూడా స్పష్టం చేశారు సంజన.

## వరద బాధితుల సహాయానికి ప్రత్యేక కమిటీ

**● ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసిన టాలీవుడ్**



''విజయవాడ, ఖమ్మం ప్రాంత ప్రజలు వరదల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి ప్రకృతి విపత్తులు ఎప్పుడు వచ్చినా సాయం చేసేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ముందు ఉంటుంది'' అని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఫిల్మ్ ఛాంబర్ తరఫున ఏపీకి రూ. 25 లక్షలు, తెలంగాణకు రూ. 25 లక్షలు, అలాగే తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ తరఫున ఏపీకి 10 లక్షలు, తెలంగాణకు 10 లక్షలు, అదే విధంగా ఫెడరేషన్ తరఫున ఒక్కో రాష్ట్రానికి రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాం. రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు సంబంధించి అకౌంట్ నంబర్స్‌తో పాటు ఫిల్మ్ ఛాంబర్ నుంచి ఒక అకౌంట్ నంబర్ ఇస్తున్నాం. సాయం చేయాలనుకునేవారు ఈ ఖాతాలకు డబ్బులు పంపవచ్చు'' అన్నారు. ''మా కుటుంబం నుంచి రూ.కోటి విరాళం ఇస్తున్నాం'' అన్నారు నిర్మాత డి. సురేష్‌బాబు. ''కష్టాల్లో ఉన్న తెలుగు ప్రజలను మనమందరం ఆదుకోవాలి'' అని డైరెక్టర్ రాఘవేంద్ర రావు తెలిపారు. ''మా నిర్మాణ సంస్థ నుంచి రెండు రాష్ట్రాలకు చెరో పాతిక లక్షలు ఇస్తున్నాం'' అని నిర్మాత 'దిల్' రాజు చెప్పారు. ''వరద బాధితులను ఆదుకోవడం కోసం ఇండస్ట్రీ నుంచి ఒక కమిటీ ఏర్పాటు చేశాం'' అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. ''అన్ని కార్మిక యూనియన్లు ఒకరోజు వేతనం విరాళంగా ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నాం'' అని ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ పేర్కొన్నారు.



**ఆంధ్ర, తెలంగాణ వరద బాధితులకు తమ వంతు సాయం ప్రకటించారు హీరో వరుణ్ తేజ్, నిర్మాత అంబికా కృష్ణ. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయ నిధికి వరుణ్ తేజ్ రూ. 10 లక్షలు (5 లక్షల చొప్పున), అలాగే ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖకు రూ. 5 లక్షలు విరాళం ప్రకటించారు. అలాగే అంబికా కృష్ణ రూ.10 లక్షలు (5 లక్షల చొప్పున) విరాళం ప్రకటించారు.**

## యాక్షన్ చేయడం సవాల్‌గా అనిపించింది

**- ఫరియా అబ్దుల్లా**



''మత్తు వదలరా 2' చిత్రంలో నా పాత్ర పేరు సన్నిధి. ఇందులో నేను, శ్రీ సింహా, సత్య స్పెషల్ ఏజెంట్స్‌గా కనిపిస్తాం. అయితే వారి పాత్రలపై సాఫ్ట్ కార్నర్ ఉంటుంది. నా పాత్రలో యాక్షన్ ఉంటుంది. గన్స్ పట్టుకుని యాక్షన్ చేయడం సవాల్‌గా అనిపించినా చాలా ఎంజాయ్ చేశాను. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేస్తారు'' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. శ్రీ సింహా కోడూరి హీరోగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మత్తు వదలారా 2'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ– ''థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ఈ సినిమాలోని నటీనటులు ఎదుర్కొనే ట్రాజెడీ నుంచి కామెడీ పుడుతుంది (నవ్వుతూ). రితేష్ రానాగారు చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. కాల భైరవగారి సంగీతం సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నేను ఓ పాటకి లిరిక్స్ రాసి, పాడి, కొరియోగ్రఫీ చేయడం సంతోషంగా ఉంది. ఇక 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో అతిథి పాత్ర చేసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ నాగ్ అశ్విన్‌కి థ్యాంక్స్. ప్రభాస్‌గారితో పెద్ద పాత్ర ఉండే సినిమా చేయాలనుకుంటున్నాను. 'జాతి రత్నాలు' చిత్రంలో నేను చేసిన చిట్టి పాత్ర నా ఇంటిపేరు అయిపోయింది. ఎక్కడికెళ్లినా ఇప్పటికీ చిట్టి అని పిలుస్తుంటారు. అయితే 'జాతి రత్నాలు' తర్వాత మళ్లీ ఆ స్థాయి హిట్ అయితే నాకు రాలేదు. 'మత్తు వదలరా 2'తో వస్తుందని నమ్ముతున్నాను. 'బంగార్రాజు'లో నాగార్జున, నాగ చైతన్యగార్లతో ప్రత్యేక పాట చేశాను. ఆ తర్వాత స్పెషల్ సాంగ్స్ చేయమని కొందరు అడిగారు... కానీ, చేయలేదు. తమిళంలో నేను నటించిన 'వల్లి మయిల్' రిలీజ్‌కి రెడీ అవుతోంది. తెలుగులో తిరువీర్‌కి జోడీగా ఓ సినిమా చేస్తున్నాను. అలాగే మరో తమిళ సినిమా ప్రారంభం కాబోతోంది'' అన్నారు.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 151 | 53 |
| 82,201 | 25,145 |

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 17,158 | △ | 74 |
| డోజోన్స్ | 40,799 | ▽ | 175 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,242 | ▽ | 28 |
| డాక్స్ | 18,577 | ▽ | 15 |
| షాంఘై | 2,784 | △ | 4 |
| నికాయ్ | 36,657 | ▽ | 391 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ రూ.లలో

**ముంబై**

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 71,096 | ▽ | 199 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 70,812 | ▽ | 198 |
| వెండి (కిలో) | 80,839 | ▽ | 498 |

## ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 83.57 | 84.59 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 109.25 | 111.86 |
| € | యూరో | ఎస్‌బీఐ | 91.95 | 94.34 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 57.81 | 59.13 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 55.56 | 57.52 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 62.23 | 66.94 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.50 | 23.05 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.98 | 23.76 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.97 | 12.79 |

# చిటికెలో చాయ్.. బిస్కెట్!

క్విక్ కామర్స్ కొత్త రూట్.. | మార్జిన్ల పెంపే లక్ష్యం | రెడీ-టు-ఈట్ డెలివరీపై ఫోకస్ | ప్రత్యేకంగా కేఫ్ విభాగాలు




> బయట వర్షం కురుస్తోంది.. ఈ టైమ్‌లో పొగలుగక్కే ఇరానీ చాయ్... వేడివేడిగా సమోసా ఉంటేనా? భలే కాంబినేషన్ కదా! మాంచి దూకుడు మీదున్న క్విక్ కామర్స్ కంపెనీలు మేమున్నామంటూ రంగంలోకి దిగాయి. చాయ్.. సమోసా.. బిస్కెట్ ఇలా రెడీ-టు-ఈట్ ఉత్పత్తులేవైనా పదే పది నిమిషాల్లో డెలివరీ చేసేందుకు రెడీ అంటున్నాయి.

క్విక్ కామర్స్ రంగంలో పోటీ హీటెక్కుతోంది. దీంతో కంపెనీలు అధిక మార్జిన్ల కోసం సగటు ఆర్డర్ విలువ (ఏఓవీ)ను పెంచుకోవడంపై దృష్టి పెట్టాయి. ఇందులో భాగంగా టీ, కాఫీ, సమోసా, బిస్కెట్లు, ఇతరత్రా బేకరీ ఉత్పత్తులను కూడా కార్ట్‌లోకి చేరుస్తున్నాయి. ప్రత్యేకంగా కేఫ్ విభాగాలను ఏర్పాటు చేస్తూ... కస్టమర్లకు రెడీ-టు-ఈట్ ఆహారోత్పత్తులను ఫటాఫట్ డెలివరీ చేస్తున్నాయి. గ్రోసరీతో పాటు వీటిని కూడా కలిపి ఇన్‌స్టంట్‌గా అందిస్తున్నాయి. ఉదాహరణకు, జెప్టో ఈ ఏడాది ఏప్రిల్‌లో ముంబైలో ప్రయోగాత్మకంగా జెప్టో కేఫ్‌ను ఏర్పాటు చేసింది. అక్కడ బాగా క్లిక్ కావడంతో బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో కూడా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇతర ప్రధాన నగరాలకు క్రమంగా విస్తరించే ప్రణాళికల్లో ఉంది. ఇక స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సైతం పైలట్ ప్రాతిపాదికన బెంగళూరులో ఇన్‌స్టాకేఫ్‌ను తెరిచింది. ఇక్కడ ప్రధానంగా టీ, కాఫీతో పాటు సూపర్ మార్కెట్లలో రూ.30-300 రేంజ్‌లో లభించే రెడీ-టు-ఈట్ ఉత్పత్తులు లభిస్తున్నాయి.

### ఫుడ్ డెలివరీ యాప్‌లకు భిన్నం...

తక్షణం కోరుకునే ఆహారోత్పత్తులను కస్టమర్లకు అందించడం కోసమే క్విక్ కామర్స్ కంపెనీలు ఈ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. అమెరికాలో 7-ఎలెవన్ స్టోర్స్ మాదిరిగా కస్టమర్లు వెళ్తూ వెళ్తూ కాఫీ లేదా కొన్ని రెడీ-టు-ఈట్ స్నాక్స్‌ను తీసుకెళ్లడం లాంటిదే ఈ మోడల్ అని జెప్టో కో-ఫౌండర్ ఆదిత్ పలీచా చెబుతున్నారు. అయితే, అక్కడ మనమే ఉత్పత్తులను తీసుకెళ్లాల్సి ఉంటే, ఇక్కడ ఇన్‌స్టంట్‌గా హోమ్ డెలివరీ చేయడం వెరైటీ అంటున్నారు. కస్టమర్ల నుంచి ఈ కొత్త ప్రయత్నానికి మంచి స్పందనే వస్తోందట! స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్‌ల మాదిరి కాకుండా, కిరాణా సరుకులతో పాటు స్నాక్స్, టీ, కాఫీ వంటి ఉత్పత్తులను కూడా ఒకేసారి ఆర్డర్ పెట్టుకునే ఆప్షన్ ఉండటం గమనార్హం.

### అదనపు ఆదాయం...

ఇతర దేశాల్లో కూడా ఉదాహరణకు, అమెరికాలో గోపఫ్, యూకేలో డెలివరూ.. లాటిన్ అమెరికాలో రప్పీ వంటి యాప్‌లు ఆదాయాన్ని పెంచుకోవడం కోసం స్నాక్స్‌ను కూడా డెలివరీ చేస్తున్నాయి. మన దగ్గర కూడా క్విక్ కామర్స్ సంస్థలు దీన్ని ఫాలో అవుతున్నాయి. కస్టమర్లు కార్ట్‌లోకి మరిన్ని ఉత్పత్తులను జోడించేలా చేయడం ద్వారా ట్రాన్సాక్షన్ విలువను పెంచుకోవడమే వాటి లక్ష్యం. 'పదేపదే, ఎక్కువ సంఖ్యలో వచ్చే ఇలాంటి ఆర్డర్ల వల్ల కస్టమర్లకు యాప్‌తో అనుబంధం కూడా పెరుగుతుంది. ఆఫ్‌లైన్ బేకరీలు, కాఫీ షాప్‌లను కూడా నెట్‌వర్క్‌లోకి తీసుకొచ్చే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా జొమాటో, స్విగ్గీ వంటి ఫుడ్ అగ్రిగేటర్ల నుంచి కొంత వాటాను దక్కించుకోవడానికి వీలవుతుంది' అని జీప్పీ ఫౌండర్, సీఈఓ మాధవ్ కస్తూరియా పేర్కొన్నారు. డార్క్ స్టోర్ల ద్వారా ఈ స్టార్టప్ దేశవ్యాప్తంగా ఈ-కామర్స్ బ్రాండ్‌ల కోసం ఇన్‌స్టంట్ డెలివరీ సేవలు అందిస్తోంది.

**- సాక్షి, బిజినెస్ డెస్క్**

### అధిక మార్జిన్లు...

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తమ రోజువారీ గ్రోసరీ విభాగానికి స్నాక్స్‌ను జోడించడం వల్ల వాటి స్థూల ఆర్డర్ విలువ (జీఓవీ) పెంచుకోవడానికి దోహదం చేస్తుందని పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్నారు. గ్రోసరీ ఉత్పత్తులతో పోలిస్తే రెడీ-టు-ఈట్‌లో మార్జిన్లు కూడా మెరుగ్గా ఉండటం మరో ప్లస్. 'ప్రస్తుతం క్విక్ కామర్స్‌లో 60 శాతం ఆర్డర్లు కిరాణా ఇతరత్రా గ్రోసరీ విభాగం నుంచే వస్తున్నాయి. స్నాక్స్ ద్వారా 25-30 శాతం నమోదయ్యే అవకాశం ఉంది. అధిక విలువ గల ప్రోడక్టుల వాటా 10 శాతంగా ఉంటుంది' అని ఆర్థా వెంచర్ ఫండ్ మేనేజింగ్ అనిరుధ్ దమానీ అభిప్రాయపడ్డారు.

# రిలయన్స్ 1:1 బోనస్‌కు ఓకే..




**బోనస్ షేర్ల జారీ ఇలా**

| తేదీ | నిష్పత్తి |
|---|---|
| 1980-81 | 3:5 |
| 1983-84 | 6:10 |
| 1997-98 | 1:1 |
| 2009-10 | 1:1 |
| 2017-18 | 1:1 |
| 2024-25 | 1:1 |

* 2020లో రైట్స్ ఇష్యూ

### ప్రతిపాదనకు బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) చైర్మన్ ముకేశ్ అంబానీ వార్షిక సమావేశంలో ప్రతిపాదించిన బోనస్ షేర్ల జారీకి తాజాగా బోర్డు ఆమోదముద్ర వేసింది. దీంతో 1:1 నిష్పత్తిలో షేర్లను జారీ చేయనుంది. అంటే వాటాదారుల వద్దగల ప్రతీ షేరుకి మరో షేరుని ఉచితంగా కేటాయించనుంది. వెరసి ఏడేళ్ల తదుపరి మరోసారి వాటాదారులకు బోనస్ షేర్లను అందించనుంది. కంపెనీ ఇంతక్రితం ఇదే నిష్పత్తి(1:1)లో 2017 సెప్టెంబర్, 2009 నవంబర్‌లోనూ ఉచితంగా షేర్లను జారీ చేసింది. కంపెనీ లిస్టయ్యాక ఇంత వరకూ ఆరు సార్లు బోనస్ షేర్లను ప్రకటించింది. తాజా షేర్ల కేటాయింపునకు రికార్డ్ డేట్‌ను విడిగా ప్రకటించనుంది. కాగా.. అధీకృత మూలధనాన్ని రూ. 15,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్లకు పెంచేందుకు సైతం కంపెనీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. షేరు ధర రూ. 700 స్థాయిలో ఉన్నప్పుడు 2017 సెప్టెంబర్‌లో 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. ఆపై 2020లో రైట్స్ ఇష్యూ చేపట్టింది. ప్రస్తుతం షేరు ధర రూ. 2,990 వద్ద కదులుతోంది. ఇన్వెస్టర్ల పెట్టుబడి గత ఏడేళ్లలో 2.5 రెట్లు బలపడింది. మరోవైపు 2023 జులైలో రిలయన్స్ నుంచి వేరుపడిన జియో ఫైనాన్షియల్ కూడా 35 శాతం ఎగబాకింది.



# అడ్వాన్స్ ట్యాక్స్‌లో 'కింగ్' ఖాన్!

**సెలబ్రిటీల్లో 92 కోట్లు చెల్లించిన షారుఖ్**



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం అత్యధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించిన సెలబ్రిటీల్లో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ అగ్రస్థానంలో నిల్చారు. ఆయన రూ. 92 కోట్లు చెల్లించారు. తమిళ నటుడు విజయ్ రూ. 80 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. 2023-24లో భారీ స్థాయిలో అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించిన సెలబ్రిటీలతో ఫార్చూన్ ఇండియా రూపొందించిన 'ది స్టార్ కాస్ట్' లిస్టులో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం బాలీవుడ్ నటులు సల్మాన్ ఖాన్ (రూ. 75 కోట్లు), అమితాబ్ బచ్చన్ (రూ. 71 కోట్లు) వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నారు. క్రికెటర్లలో విరాట్ కోహ్లి అత్యధికంగా రూ. 66 కోట్లు చెల్లించగా, ఎంఎస్ ధోని రూ. 38 కోట్లు, సచిన్ టెండూల్కర్..సౌరవ్ గంగూలీ వరుసగా రూ. 28 కోట్లు, రూ. 23 కోట్లు చెల్లించారు. పెద్ద మొత్తంలో అడ్వాన్స్ ట్యాక్స్ కట్టిన సినీ ప్రముఖుల్లో అల్లు అర్జున్, మోహన్‌లాల్ చెరో రూ. 14 కోట్లు కట్టగా ఆమిర్ ఖాన్ రూ. 10 కోట్లు చెల్లించారు.

# ఈవీలకు ఇక సబ్సిడీలు అనవసరం..

న్యూఢిల్లీ: కస్టమర్లు ఇష్టంగానే ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ఎంచుకుంటున్న నేపథ్యంలో విద్యుత్ వాహనాల తయారీ సంస్థలకు ఇక సబ్సిడీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర రహదారి, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. తొలి నాళ్లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ వ్యయాలు భారీగా ఉండేవని, డిమాండ్ పెరిగే కొద్దీ ఉత్పత్తి వ్యయాలూ తగ్గాయి కాబట్టి ఇకపైనా సబ్సిడీలు ఇవ్వడం అనవసరమని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఈవీలపై జీఎస్‌టీ కూడా చాలా తక్కువేనని బీఎన్‌ఈఎఫ్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు.

### కస్టమర్లు ఇష్టంగానే కొంటున్నారు: గడ్కరీ

ప్రస్తుతం హైబ్రిడ్‌లు సహా ఇంటర్నల్ కంబినేషన్ ఇంజిన్లతో నడిచే వాహనాలపై జీఎస్‌టీ 28 శాతంగా ఉండగా ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతంగా ఉంది. మరోవైపు వచ్చే రెండేళ్లలో డీజిల్, పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాల వ్యయాలు దాదాపు ఒకే స్థాయికి తగ్గొచ్చని మంత్రి చెప్పారు. తొలినాళ్లలో ఈవీల వ్యయాలు అధికంగా ఉండటం వల్లే తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇవ్వాల్సి వచ్చినట్లు పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలపై అదనపు పన్నులు వడ్డించే యోచనేదీ లేదన్నారు.

# 25,150 దిగువకు నిఫ్టీ



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(1.50%), ఎల్అండ్‌టీ(1%), భారతీ ఎయిర్‌టెల్(1%) షేర్లు పతనమైన సూచీల నష్టాలను ఖరారు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై దెబ్బతీశాయి. ఉదయం సెన్సెక్స్ 82,470 వద్ద మొదలైంది. ప్రథమార్థంలో 264 పాయింట్లు పెరిగి 82,617 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 151 పాయింట్లు నష్టపోయి 82,201 వద్ద ముగిసింది. నిఫ్టీ 53 పాయింట్లు పతనమై 25,150 దిగువన 25,145 వద్ద నిలిచింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.56%, 0.27% చొప్పున లాభపడ్డాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను నిర్ణయించే నిరుద్యోగ రేటు, నాన్ ఫామ్ పేరోల్స్ గణాంకాల(శుక్రవారం)కి ముందు ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మహిళా సాధికారతకు ఆర్‌బీఐ గవర్నర్ పిలుపు | ఎస్‌బీఎఫ్‌సీ ఐపీఓలకు క్యూ..





### ఉగాండా మహిళా అథ్లెట్ విషాదాంతం

నైరోబి: తన భాగస్వామితో ఏర్పడిన స్థల వివాదం చివరకు ఉగాండా మహిళా ఒలింపియన్ అథ్లెట్ రెబెకా చెప్టెగె ప్రాణాలను తీసింది. గత నెలలో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో రెబెకా మారథాన్ ఈవెంట్‌లో పాల్గొని 44వ స్థానంలో నిలిచింది. పలు అథ్లెటిక్ శిక్షణ కేంద్రాలున్న ట్రాన్స్ ఎన్‌జోయా ప్రాంతంలో 33 ఏళ్ల రెబెకా స్థలం కొని ఇల్లు కట్టుకుంది. దీనిపై రెబెకా, ఆమె భాగస్వామి డిక్సన్ డియెమా మధ్య గత ఆదివారం పెద్ద గొడవ జరిగింది. ఆ తర్వాతి రోజు సోమవారం డిక్సన్ తనవెంట గ్యాసోలిన్ (పెట్రోలియం ఉత్పాదన)ను క్యాన్‌లో తీసుకొచ్చి రెబెకాపై పోసి నిప్పంటించాడు. వెంటనే ఆమె శరీరమంతా మంటలు అంటుకోవడంతో పాటు డిక్సన్‌కూ కాలిన గాయాలయ్యాయి. అనంతరం ఇద్దరిని కెన్యాలోని హాస్పిటల్‌లో చేర్పించగా గురువారం ఉదయం రెబెకా మృతి చెందింది. 30 శాతం కాలిన గాయాలున్న డిక్సన్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని స్థానిక పోలీస్ కమాండర్ జెరెమా ఒలీ కొసిమ్ తెలిపారు.

# ధరమ్‌వీర్ ధమాకా

**క్లబ్ త్రోలో స్వర్ణం ● రజతం గెలిచిన ప్రణవ్ సూర్మా**

**జూడోలో భారత్‌కు కాంస్యం ● పారాలింపిక్స్‌లో 25కు చేరిన పతకాల సంఖ్య**

**భారత సీనియర్ పారాలింపియన్లలో అమిత్ కుమార్ సరోహా కూడా ఒకడు. పారా ఆసియా క్రీడల్లో డిస్కస్ త్రోలో రెండు రజతాలతో పాటు క్లబ్ త్రోలో రెండు స్వర్ణాలు సాధించిన రికార్డు అతని సొంతం. దీంతో పాటు క్లబ్ త్రోలో రెండు వరల్డ్ చాంపియన్‌షిప్ రజతాలు కూడా అమిత్ ఖాతాలో ఉన్నాయి. ఈసారి ఒలింపిక్ పతక అంచనాలతో అతను బరిలోకి దిగాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక క్లబ్ త్రో ఈవెంట్ జరిగింది. అయితే 10 మంది పాల్గొన్న ఈ ఈవెంట్‌లో అమిత్ పేలవ ప్రదర్శనతో చివరి స్థానంలో నిలిచాడు. కానీ కొద్ది సేపటికే అతను ఆనందంగా, ఆత్మ సంతృప్తిగా ఆ పోటీల వేదిక నుంచి వెనుదిరిగాడు. ఎందుకంటే ఇందులో స్వర్ణ, రజతాలు సాధించిన అథ్లెట్లు ధరమ్‌వీర్, ప్రణవ్ సూర్మా అమిత్ శిష్యులు కావడం విశేషం. వారిద్దరు పాల్గొన్న ఈవెంట్‌లోనే తానూ పోటీ పడ్డాడు. తాను గెలవకపోతేనేమి... తన శిష్యులిద్దరూ గెలిచి గురు పూజోత్సవం రోజున గురుదక్షిణ అందించారని అమిత్ చెప్పడం విశేషం.**

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. 'క్లబ్ త్రో-ఎఫ్51' ఈవెంట్‌లో భారత్‌కు చెందిన ధరమ్‌వీర్ పసిడి పతకం సాధించాడు. ఇదే ఈవెంట్‌లో మరో భారత అథ్లెట్ ప్రణవ్ సూర్మాకు రజతం దక్కింది. 'క్లబ్'ను 34.92 మీటర్ల దూరం విసిరి ధరమ్‌వీర్ పసిడి పతకాన్ని గెలుచుకోగా... 34.59 మీటర్ల దూరంతో ప్రణవ్ సూర్మా రజతం సొంతం చేసుకున్నాడు. తొలి నాలుగు ప్రయత్నాలు ఫౌల్ అయినా ఐదో త్రోలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి చివరకు ధరమ్‌వీర్ అగ్ర స్థానంలో నిలవడం విశేషం. ఈవెంట్‌లో దిమిత్రిజెవిచ్ (సెర్బియా-34.18 మీటర్లు)కు కాంస్యం దక్కింది. పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలవడం పట్ల చాలా గర్వంగా ఉందని, ఈ పతకాన్ని తన గురువు అమిత్‌కు అంకితం ఇస్తున్నట్లు ధరమ్‌వీర్ ప్రకటించాడు. క్లబ్ త్రో ఈవెంట్‌కు మన దేశంలో పెద్దగా ఆదరణ, గుర్తింపు లేని వేళ దానిని ముందుకు తీసుకెళ్లేందుకు అమిత్ శ్రమించాడు. ఈ క్రమంలో సీనియర్ ప్లేయర్ కమ్ కోచ్‌గా ఆయన తీర్చిదిద్దిన అథ్లెట్లలో ధరమ్‌వీర్, ప్రణవ్ ఉన్నారు. 'క్వాడ్రిప్లెజిక్' బాధితులు ఈ ఎఫ్51 కేటగిరీలో పాల్గొంటారు. ఈ సమస్య వల్ల మెడ కింది భాగం మొత్తం పని చేయకుండా పోతుంది. దాంతో చక్రాల కుర్చీలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి వస్తుంది.

### జూడోలో కపిల్‌కు కాంస్యం...

పురుషుల జూడో 60 కేజీల జే1 ఈవెంట్‌లో భారత ప్లేయర్ కపిల్ పర్మార్ కాంస్యం సాధించాడు. కాంస్య పతక మ్యాచ్‌లో కపిల్ 10-0తో ఒలీవిరా డి ఎలెల్టన్ (బ్రెజిల్)పై విజయం సాధించాడు.

### ఆర్చరీలో చేజారిన కాంస్యం...

భారత ఆర్చరీ మిక్స్‌డ్ జోడీ హర్విందర్-పూజ జత్యాన్ కాంస్య పతకం నెగ్గడంలో విఫలమైంది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో హర్విందర్ -పూజ 4-5తో స్లొవేనియాకు చెందిన జివా లావ్‌రింక్-ఫ్యాబ్‌సిక్ చేతిలో ఓటమి పాలయ్యారు. మరోవైపు షూటింగ్ మిక్స్‌డ్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో మోనా అగర్వాల్ 30వ స్థానంలో, సిద్ధార్థ బాబు 22వ స్థానంలో నిలిచి ఫైనల్ చేరలేకపోయారు. మహిళల 100 మీటర్ల టి12 ఈవెంట్ ఫైనల్లో భారత అథ్లెట్ సిమ్రన్ 12.11 సెకన్లలో రేసు పూర్తి చేసి నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల పవర్ లిఫ్టింగ్ 65 కేజీల విభాగంలో భారత ప్లేయర్ అశోక్ ఆరో స్థానంతో ముగించాడు.



తమ కోచ్‌లు, గెలిచిన పతకాలతో ప్రణవ్ సూర్మా, ధరమ్‌వీర్

హరియాణాలోని సోనేపట్ ధరమ్‌వీర్ స్వస్థలం. సహచర కుర్రాళ్లతో కలిసి కాలువలోకి దూకి ఈత కొట్టే సమయంలో అతను లోతును సరిగా అంచనా వేయలేకపోయాడు. దాంతో దిగువన ఉన్న రాళ్లను ఢీకొనడంతో శరీరానికి బాగా దెబ్బలు తగిలి పక్షవాతానికి గురయ్యాడు. ఆ తర్వాత పరిస్థితి మరింతగా దిగజారింది. 25 ఏళ్ల వయసులో అతను పారా క్రీడల వైపు మళ్లాడు. రెండేళ్లు తిరిగే లోపే అతను రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించగలిగాడు. వరల్డ్ పారా చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన ధరమ్‌వీర్ ఆసియా పారా క్రీడల్లో రెండు రజతాలు సాధించాడు.

ప్రణవ్ సూర్మాకు 16 ఏళ్లు ఉన్నప్పుడు విషాదం ఎదురైంది. అనుకోకుండా సిమెంట్ షీట్ అతనిపై పడటంతో వెన్ను పూసకు తీవ్ర గాయమైంది. ఆరు నెలలు ఆస్పత్రిలో చికిత్స తర్వాత అతను భవిష్యత్తులో నడవలేడని డాక్టర్లు తేల్చేశారు. ఆ తర్వాత పూర్తిగా వీల్‌చెయిర్‌కే పరిమితమయ్యాడు. కామర్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన అతను బ్యాంక్ ఆఫ్ బరోడాలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు. మరోవైపు పారా క్రీడల వైపు ఆకర్షితుడై సాధన చేశాడు. ఈ ఒలింపిక్స్‌కు ముందు ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన అతను వరల్డ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచాడు.



మధ్యప్రదేశ్‌కు చెందిన కపిల్ తండ్రి ట్యాక్సీ డ్రైవర్ కాగా ఐదుగురు సంతానంలో అతను ఒకడు. చిన్నప్పుడు తన అన్న జూడో పోటీల్లో పాల్గొనడం చూసి ఆకర్షితుడయ్యాడు. అయితే పొలంలో వాటర్ పంప్ వద్ద కరెంట్ షాక్‌కు గురై ఆరు నెలల పాటు అతను కోమాలో ఉండిపోయాడు. తర్వాత కోలుకున్నా చూపు చాలా వరకు కోల్పోవాల్సి వచ్చింది. ఆర్థిక సమస్యలతో అతను, సోదరుడు కలిసి టీ స్టాల్ కూడా నడిపారు. పారాలింపిక్స్‌లో 'విజన్ ఇంపెయిర్‌మెంట్' కేటగిరీలోనే అతను పోటీ పడ్డాడు.

# జెస్సికా జోరు



జెస్సికా

**ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్‌పై విజయం | తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు**

స్వియాటెక్

న్యూయార్క్: ఎట్టకేలకు గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్ 'ఫోబియా'ను అమెరికా టెన్నిస్ ప్లేయర్ జెస్సికా పెగూలా అధిగమించింది. సొంతగడ్డపై అద్భుత ఆటతీరుతో అదరగొట్టిన జెస్సికా ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్‌ను బోల్తా కొట్టించింది. ఈ క్రమంలో తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ఈసారి అమెరికా క్రీడాకారులు తమ ఉనికిని చాటుకుంటున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఇద్దరు అమెరికా ఆటగాళ్లు టేలర్ ఫ్రిట్జ్, ఫ్రాన్సెస్ టియాఫో సెమీఫైనల్లోకి అడుగు పెట్టగా... మహిళల సింగిల్స్‌లోనూ ఇద్దరు అమెరికా క్రీడాకారిణులు జెస్సికా పెగూలా, ఎమ్మా నవారో సెమీఫైనల్‌కు చేరుకోవడం విశేషం.



సినెర్

### సినెర్, డ్రేపర్ తొలిసారి...

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ), 25వ ర్యాంకర్ జాక్ డ్రేపర్ (బ్రిటన్) తొలిసారి యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో సినెర్ 6-2, 1-6, 6-1, 6-4తో 2021 చాంపియన్, గత ఏడాది రన్నరప్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలుపొందగా... డ్రేపర్ 6-3, 7-5, 6-2తో పదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన డ్రేపర్ యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకున్న నాలుగో బ్రిటన్ ప్లేయర్‌గా నిలిచాడు. గతంలో గ్రెగ్ రుసెడ్స్కీ (1997), టిమ్ హెన్మన్ (2004), ఆండీ ముర్రే (2008, 2011, 2012) ఈ ఘనత సాధించారు.



డ్రేపర్

### ఏడో ప్రయత్నంలో...


కెరీర్‌లో 23వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్న 30 ఏళ్ల జెస్సికా గతంలో ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే ఈ ఆరుసార్లూ ఆమె క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించడంలో విఫలమైంది. కానీ ఏడో ప్రయత్నంలో జెస్సికా సఫలమైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ నాలుగో క్వార్టర్ ఫైనల్లో జెస్సికా 6-2, 6-4తో టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్)ను కంగుతినిపించింది. 88 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో జెస్సికా ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 12 విన్నర్స్ కొట్టిన జెస్సికా 22 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు స్వియాటెక్ 41 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. 'గతంలో పలుమార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ చేరుకొని ఓడిపోయాను. సెమీఫైనల్ ఎప్పుడు చేరుకుంటావు అని నా శ్రేయోభిలాషులు అడుగుతుండేవారు. వారికి ఏం సమాధానం చెప్పాలో తెలిసేది కాదు. ఎట్టకేలకు క్వార్టర్ ఫైనల్‌ను దాటి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నందుకు సంతోషంగా ఉంది' అని జెస్సికా వ్యాఖ్యానించింది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)తో జెస్సికా; ఎమ్మా నవారో (అమెరికా)తో సబలెంకా (బెలారస్) తలపడతారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# ఆ ఖర్చంతా మార్గదర్శి భరించాల్సిందే

- తేల్చిచెప్పిన తెలంగాణ హైకోర్టు
- చందాదారుల వివరాల కోసం పత్రికల్లో నోటీసులివ్వాలి... దీనికి ఎంత ఖర్చవుతుందో రిజిస్ట్రీ మార్గదర్శికి చెబుతుంది
- అప్పటి నుంచి వారంలోగా ఆ డబ్బు డిపాజిట్ చేయాలి... వెంటనే పత్రికల్లో నోటీసులిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలి
- 'మార్గదర్శి'కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు విచారణ

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్సియర్స్ యాజమాన్యం చందాదారులందరికీ డిపాజిట్ల తాలూకు నగదు తిరిగి చెల్లించిందా?.. లేదా ఎవరికైనా ఎగవేసిందా?.. అనే వివరాలు తెలుసుకునే చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీకి చెబుతూ, దీనికయ్యే ఖర్చంతా ఆ సంస్థే భరించాలని ఆదేశాలు జారీ చేసింది. తెలుగు, హిందీ, ఆంగ్ల పత్రికల్లో విస్తృత ప్రచారం జరిగేలా నోటీసులు జారీ చేయాలని.. దీనికి వ్యయం ఎంతవుతుందో మార్గదర్శికి చెప్పాలని రిజిస్ట్రీ కి స్పష్టం చేసింది. ఖర్చు వివరాలు చెప్పిన వారంలోగా ఆ మొత్తాన్ని రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలని ఫైనాన్సియర్స్‌కు తేల్చిచెప్పింది. డిపాజిట్ అయిన వెంటనే పత్రికల్లో నోటీసులు జారీ చేయాలని జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం గురువారం ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేస్తూ పత్రికల్లో వచ్చిన నోటీసుల కాపీలను ఆ రోజు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.



### వాస్తవాలను నిగ్గు తేల్చాలి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట నిబంధనలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018, డిసెంబర్ 31 (హైకోర్టు విభజనకు ఒక రోజు ముందు)న తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్ జగన్ హయాంలో), మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం 2024, ఏప్రిల్ 9న హైకోర్టు తీర్పును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని చెప్పింది. ఈ నేపథ్యంలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ ప్రారంభించింది. చందాదారుల వివరాల కోసం పత్రికల్లో విస్తృత ప్రచారం కల్పించడం కోసం నోటీసులు జారీ చేయాలని గత విచారణ సందర్భంగా రిజిస్ట్రీని ఆదేశించింది. అయితే దీనికయ్యే ఖర్చు ఎవరు భరించాలన్నది సందిగ్ధంగా మారడంతో రిజిస్ట్రీ ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టి మార్గదర్శి యాజమాన్యమే భరించాలని స్పష్టంగా తేల్చిచెప్పింది.



## త్వరలో విధుల్లోకి యువ ఎస్‌ఐలు

### 11న పాసింగ్ ఔట్ పరేడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖ విధుల్లో చేరేందుకు యువ ఎస్‌ఐలు సిద్ధమవుతున్నారు. పోలీస్ అకాడమీలో సివిల్, ఏఆర్, టీజీఎస్పీ, ఐటీ, కమ్యూనికేషన్స్ విభాగంలో కలిపి మొత్తం 547 మంది ఎస్‌ఐ అభ్యర్థుల శిక్షణ ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 11న పోలీస్ అకాడమీలో పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించనున్నారు. ఇందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్టు పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషబిష్త్ తెలిపారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సహా డీజీపీ జితేందర్, ఇతర సీనియర్ ఐపీఎస్‌లు హాజరవుతారని తెలిపారు.



## సర్వే అకాడమీలో శిక్షణ పొందడానికి దరఖాస్తు చేసుకోండి

### సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ ఎ.భాస్కర్

సాక్షి, హైదరాబాద్: సర్వే అకాడమీ ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందడానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ ఎ.భాస్కర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,500, ఇతర అభ్యర్థులకు రూ.10 వేల కనీస ఫీజు ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ఎంటెక్ సివిల్, బీటెక్ సివిల్, డిప్లొమా సివిల్, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ సివిల్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని, మరిన్ని వివరాలకు 88788 01888, 90002 43409, 72075 95579 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

## వ్యవసాయ గురుకుల డిగ్రీ కాలేజీల్లో తాత్కాలిక అధ్యాపక ఉద్యోగాల భర్తీ

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో వనపర్తి, కరీంనగర్ జిల్లాల్లో ఉన్న వ్యవసాయ డిగ్రీ కాలేజీల్లో తాత్కాలిక ప్రాతిపదికన లెక్చరర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి బి.సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రానమీ (2), లైవ్‌స్టాక్- ఎనిమల్ హస్బెండ్రీ (2), జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ (2), ఎంటోమాలజీ (2), అగ్రికల్చరల్ ఎకనామిక్స్ (2), ప్లాంట్ పాథాలజీ (2), అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ (2) పోస్టుల భర్తీ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ లేదా ఎంఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి నెట్ అర్హతవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 76809 41504 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## 25న చలో హైదరాబాద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన సాధన కోసం ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ నుంచి వేలాది మందితో ఇందిరాపార్కు వరకు కులగణన మార్చ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

## మేం పర్ఫెక్ట్ పేరెంట్స్ కాదు

మేం 'పర్ఫెక్ట్ పేరెంట్స్' కాదు. పర్ఫెక్ట్ పేరెంట్స్‌గా ఉండటం అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న విషయం. సో.. మేం పర్ఫెక్ట్ పేరెంట్స్ కాకపోయినా ఫర్వాలేదు... ఆ విషయాన్ని మేం ఒప్పుకుంటాం. మా తప్పులను మేం ఒప్పుకున్నప్పుడు 'మా అమ్మానాన్న నిజం ఒప్పుకుంటారు' అనే మంచి ఫీల్ పిల్లలకు కలుగుతుంది. సో... తప్పులను ఒప్పుకుంటే అంతా ఈజీగా ఉంటుంది.




● పిల్లలతో విరాట్ కోహ్లి, అనుష్క శర్మ

# మన పిల్లలకు మనమే పెద్ద ఉదాహరణ

**- అనుష్కా శర్మ**

**"అమ్మ చేతి వంట అద్భుతం. ఆ రుచే వేరు" అంటున్నారు నటి అనుష్కా శర్మ. ఇద్దరు పిల్లలకు తల్లయిన ఆమె వంటల విషయంలో తల్లి సలహాలు తీసుకుంటా రట. అది మాత్రమే కాదు.. భర్త విరాట్ కోహ్లి (క్రికెటర్) కూడా వంట విషయంలో సహాయం చేస్తారని అనుష్క అంటున్నారు. 2017లో విరాట్-అనుష్క పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. 2021లో ఒక పాప (వామికా), ఈ ఏడాది ఒక బాబు (అకాయ్)కి జన్మనిచ్చారు అనుష్కా శర్మ. ఇక బుధవారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె తన పిల్లల గురించి పంచుకున్న విశేషాలు ఈ విధంగా...**

### అమ్మ చేతి వంట అద్భుతం

మన అమ్మ మనకు వండి పెట్టిన వంటలను మన తర్వాతి తరానికి రుచి చూపించాల్సిన అవసరం చాలా ఉంది. మేం (విరాట్-అనుష్క) ఇద్దరం ఫుడ్ గురించి చర్చించుకున్నప్పుడు మన అమ్మ మన కోసం వండిన వంటకాల తాలూకు రెసిపీలు మన పిల్లలకు కూడా తెలియాలి అని చెప్పుకున్నాం. అందుకే ఒకసారి తను, ఇంకోసారి నేను వంట చేస్తుంటాం. అచ్చంగా మా అమ్మ మాకు ఎలా వండి పెట్టారో అలాగే చేయడానికి మా వంతు ప్రయత్నం చేస్తాం. ఒక్కోసారి విరాట్‌కి తెలియకుండా నేను మా అమ్మకు ఫోన్ చేసి, రెసిపీలు అడుగుతుంటా. ఆ విధంగా తనని మోసం చేస్తుంటాను (సరదాగా). మన పెద్దల తాలూకు విలువైన విషయాలు మన పిల్లలకు నేర్పడం చాలా ముఖ్యం. సంప్రదాయ వంటకాల గురించి వాళ్లకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

### ఎక్కడికి వెళ్లినా ఆహార నియమాలు తప్పవు

మేం రోజుల తరబడి ఇంటిపట్టున ఉండం. ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటాం. అందుకని మా పిల్లలు చాలా మార్పులకు అలవాటు పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా మనం ప్రయాణాలు చేస్తున్నప్పుడు ఆహార నియమాల్లో తేడా వస్తుంటుంది. కానీ నేను మాత్రం ఆ తేడా రానివ్వను. ఇంట్లో ఉన్నప్పుడు సరైన సమయానికి ఆహారం తీసుకున్నట్లే వేరే ప్రదేశాలకు వెళ్లినప్పుడూ తీసుకుంటాం. ఆ టైమ్ తప్పనివ్వను. అలాగే నిద్రపోయే సమయం కూడా. మేం ఎక్కడ ఉన్నా సరే ఒకే సమయానికి నిద్రపోతాం. ఇలా దినచర్య ప్రాపర్‌గా ఉంటే పిల్లలు వాళ్లను వాళ్లు అందుకు తగ్గట్టుగా మలచుకుంటారు.

### పిల్లల కోసం సమయం కేటాయించాలి

మన పిల్లలు మనకు కొన్ని క్లూస్ ఇస్తుంటారు. అవి మనం గ్రహించగలగాలి. వాళ్ల కోసం మనం తగినంత సమయం కేటాయించాలి. నేనెప్పుడూ పిల్లలకు సమయం కేటాయించడానికి ట్రై చేస్తాను. ఇలా చేయడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

### మనల్ని పిల్లలు అనుసరిస్తుంటారు

పిల్లలకు అమ్మే తొలి టీచర్. అయితే నా కూతురికి ఇప్పుడు ఏమైనా నేర్పించాలంటే తను చాలా చిన్నది. అందుకని తనకు ఏమైనా నేర్పించడం అంటే అది కష్టమే. అయితే మనం మన జీవితాలను ఎలా గడుపుతున్నామన్నది ముఖ్యం. మన దైనందిన జీవితంలో మనం ఇతరుల పట్ల కృతజ్ఞత చూపుతున్నామా? మన జీవితంలో ఉన్న విషయాలకు మనం కృతజ్ఞతతో ఉన్నామా? అనేది ముఖ్యం. మనం అలా ఉంటే మన పిల్లలు కూడా అదే పాటిస్తారు. అందుకే ప్రత్యేకంగా నేర్పించే బదులు మనం చేసేవి పద్ధతిగా చేస్తే అది చూసి వాళ్లు నేర్చుకుంటారు... అనుసరించడానికి ప్రయత్నిస్తారు. ఒక్కోసారి పిల్లలు కొంచెం తేడాగా ప్రవరిస్తారు. అయినా ఫర్వాలేదు. ఎందుకంటే వాళ్లు పిల్లలు కాబట్టి. వాళ్లు అమర్యాదగా నడుచుకున్నప్పుడు మనం వేరేలా అనుకోకుండా కరెక్ట్‌గా గైడ్ చేయడానికి ప్రయత్నించాలి. మనం మాటల రూపంలోనే అన్నీ చెప్పక్కర్లేదు. మన తీరు బాగుంటే అదే వారికి పెద్ద ఉదాహరణ.

# వాట్ నెక్ట్స్?




● అల్లు అర్జున్

**అ**ల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న రిలీజ్ కానుంది. అయితే 'పుష్ప: ది రూల్' తర్వాత అల్లు అర్జున్ ఏ దర్శకుడితో సినిమా చేయనున్నారనే చర్చ కొంతకాలంగా జరుగుతోంది. సందీప్ రెడ్డి వంగా, దర్శకుడు త్రివిక్రమ్‌లతో అల్లు అర్జున్ సినిమాలు చేయనున్నట్లుగా అధికారిక ప్రకటనలు వెల్లడయ్యాయి. అయితే ఈ దర్శకులతో అల్లు అర్జున్ సినిమాలు ప్రారంభం కావడానికి కొంత సమయం పట్టేలా ఉందని, ఈ లోపు అల్లు అర్జున్ మరో దర్శకుడితో సినిమా చేస్తారనే ప్రచారం ఆ మధ్య ఇండస్ట్రీలో వినిపించింది. ఈ క్రమంలో అట్లీ, బోయపాటి శ్రీను, నెల్సన్ దిలీప్ కుమార్, సురేందర్ రెడ్డి... వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే అల్లు అర్జున్ నెక్ట్స్ సినిమా త్రివిక్రమ్‌తోనే ఉంటుందని, ఈ సినిమాకు సంబంధించి ఇటీవల అల్లు అర్జున్-త్రివిక్రమ్‌ల మధ్య చర్చలు జరిగాయని, త్వరలోనే షూటింగ్ షెడ్యూల్‌పై ఓ స్పష్టత రానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ సినిమా భారీ బడ్జెట్‌తో సోషియో ఫ్యాంటసీ మూవీగా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. ఇక అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఇప్పటికే వచ్చిన 'జులాయి' (2012), సన్నాఫ్ సత్యమూర్తి (2015), 'అల.. వైకుంఠపురములో..' (2020) సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో వీరి కాంబినేషన్‌లో రానున్న నాలుగో సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు ప్రస్తుతం తాను ప్రభాస్ 'స్పిరిట్' సినిమాతో బిజీగా ఉన్నానని, ఆ తర్వాత రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' మూవీ సీక్వెల్ 'యానిమల్: ది పార్క్' చేస్తానని, ఇందుకు కనీసం నాలుగు సంవత్సరాల సమయం పడుతుందని ఇటీవల సందీప్ రెడ్డి వంగా పేర్కొన్నారు. దీంతో... అల్లు అర్జున్- సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లోని సినిమా సెట్స్‌పైకి వెళ్లేది ఐదేళ్ల తర్వాత అని తెలుస్తోంది.

# టాప్‌లో షారుక్ ఖాన్



● షారుక్ ఖాన్ ● విజయ్ ● సల్మాన్ ఖాన్

**ఆ**దాయపు పన్ను చెల్లింపుల విషయంలో బాలీవుడ్ బాద్ షా టాప్ లేపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆదాయపు పన్ను చెల్లించిన భారత సెలబ్రిటీల జాబితాను ఫార్చ్యూన్ ఇండియా సంస్థ రిలీజ్ చేసింది. ఈ జాబితా ప్రకారం రూ. 92 కోట్ల ట్యాక్స్ కట్టి తొలి స్థానంలో నిలిచారు షారుక్ ఖాన్. రెండో స్థానంలో తమిళ హీరో విజయ్ (రూ. 80 కోట్లు), మూడో స్థానంలో సల్మాన్ ఖాన్ (రూ. 75 కోట్లు) నిలిచారు. ఇంకా అజయ్ దేవగన్ (రూ. 42 కోట్లు), రణ్‌బీర్ కపూర్ (రూ. 36 కోట్లు), హృతిక్ రోషన్ (రూ. 28 కోట్లు), కపిల్ శర్మ (26 కోట్లు), కరీనా కపూర్ (20 కోట్లు), షాహిద్ కపూర్ (14 కోట్లు), అల్లు అర్జున్ (14 కోట్లు), మోహన్‌లాల్ (14 కోట్లు), కియారా అద్వానీ (12 కోట్లు), కత్రినా కైఫ్ (11 కోట్లు), ఆమిర్ ఖాన్ (10 కోట్లు)... ఇలా మరికొందరు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ అత్యధిక పన్ను చెల్లించిన సెలబ్రిటీల జాబితాలో ఉన్నట్లుగా ఫార్చ్యూన్ ఇండియా రిపోర్ట్ పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

# రహస్య కెమెరాల గురించి మోహన్‌లాల్ అడిగారు

**- రాధికా శరత్‌కుమార్**



నటీమణుల క్యారవేన్‌లో రహస్య కెమెరాలను పెట్టి, హీరోయిన్లు దుస్తులు మార్చుకునే వీడియోలను చూస్తూ కొందరు పురుషులు ఆస్వాదిస్తున్న తీరు చూసి తాను చాలా బాధపడ్డానని ఇటీవల రాధిక వెల్లడించిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి తాను క్యారవేన్‌లో కాకుండా హోటల్‌కి వెళ్లి దుస్తులు మార్చుకునేదాన్నని మోహన్‌లాల్ నటించిన ఓ మలయాళ సినిమా షూటింగ్ సెట్‌లో ఈ ఘటన జరిగిందని రాధిక పేర్కొన్న విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా ఈ విషయమై మోహన్‌లాల్ తనకు ఫోన్ చేశారని రాధిక పేర్కొన్నారు. ఈ అంశం గురించి ఆమె చెన్నై మీడియాతో మాట్లాడినట్లుగా వార్తలు వస్తున్నాయి. ''మలయాళ చిత్ర పరిశ్రమలో నా అనుభవాన్ని షేర్ చేసుకున్న తర్వాత మోహన్‌లాల్ నాకు ఫోన్ చేశారు. రహస్య కెమెరాల గురించి నన్ను అడిగి, ఆ పరిస్థితుల గురించి ఆరా తీశారు. తన ప్రెజెన్స్‌లో ఉన్నప్పుడు ఈ తరహా ఘటనలు ఏమైనా ఉన్నాయా? అని కూడా ఆయన అడిగారు. ఆ ఘటన జరిగినప్పుడు సెట్‌లో ప్రధాన నటులు ఎవరూ లేరని, ఈ ఘటనను సదరు నిర్మాణ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లానని, వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా వారిని కోరాననీ మోహన్‌లాల్‌కు చెప్పాను'' అన్నారు.

# ఆజ్ కీ రాత్ సాంగ్‌కు నో చెప్పాను

**- తమన్నా**



**హీ**రోయిన్ తమన్నా కెరీర్‌లో స్పెషల్‌సాంగ్స్‌కు ప్రత్యేకమైన పాత్ర ఉంది. ఈ బ్యూటీ ఇప్పటివరకు దాదాపు పదికిపైగా స్పెషల్‌సాంగ్స్‌లో నర్తించారు. ఆడియన్స్ నుంచి కూడా మంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఇటీవల 'స్త్రీ 2' సినిమాలో తమన్నా చేసిన 'ఆజ్ కీ రాత్' స్పెషల్‌సాంగ్‌కు మంచి ఆదరణ దక్కింది. యూట్యూబ్‌లో 200 మిలియన్ వ్యూస్ ఈ పాటకు వచ్చాయి. అయితే ఈ స్పెషల్ సాంగ్‌కు తమన్నా మొదట నో చెప్పారు. ఈ విషయంపై తమన్నా ఇటీవల ఓ సందర్భంగా మాట్లాడుతూ- ''రజనీకాంత్‌గారి 'జైలర్'లో నేను చేసిన 'వా నువ్వు కావాలయ్యా' పాటకు సూపర్‌రెస్పాన్స్ వచ్చింది. ఆ సమయంలో నాకు 'ఆజ్ కీ రాత్' చాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ సాంగ్ చేస్తే అందరూ 'వా నువ్వు కావాలయ్యా' పాటతో పోలికలు పెడతారు. సాంగ్ కాస్త అటు ఇటు అయినా సినిమాపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. దీంతో ఇప్పుడు ఈ సాంగ్ ఎందుకులే? అనుకున్నాను. దీంతో 'ఆజ్ కీ రాత్'కు మొదట నో చెప్పాను. కానీ 'స్త్రీ 2' దర్శకుడు అమర్‌కౌశిక్ పట్టుబట్టి ఈ పాటను నాతో చేయించుకున్నారు'' అని మాట్లాడారు తమన్నా. ఇక 'ఆజ్ కీ రాత్' సాంగ్ 'స్త్రీ 2'లో సూపర్‌హిట్‌గా నిలవడమే కాకుండా, ఈ సినిమాకు ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ హీరో హీరోయిన్లుగా పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'స్త్రీ 2'. అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆల్రెడీ ప్రపంచ వ్యాప్తంగా 600 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టిందని బాలీవుడ్ సమాచారం.

# దసరాకు జిగ్రా!



● ఆలియా భట్

**బా**లీవుడ్‌లో వన్నాఫ్ ది టాప్ హీరోయిన్స్‌లో ఒకరైన ఆలియా భట్ నటించిన తాజా చిత్రం 'జిగ్రా'. ఈ చిత్రంలో వేదాంగ్ రైనా మరో లీడ్ రోల్‌లో నటించారు. ఆలియా, వేదాంగ్ ఈ సినిమాలో అక్కా తమ్ముడి పాత్రల్లో కనిపిస్తారని బాలీవుడ్ సమాచారం. కాగా ఈ సినిమాను గతంలో సెప్టెంబరు 27న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. తాజాగా అక్టోబరు 11న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించారు. హిందీలో 'మోనికా ఓ మై డార్లింగ్, పెడ్లర్స్' వంటి సినిమాలు తీసిన వాసన్ బాలా 'జిగ్రా' సినిమాకు దర్శకత్వం వహించారు. తన తమ్ముడి రక్షణ కోసం ఓ అక్క చేసే సాహసోపేతమైన ప్రయాణమే 'జిగ్రా' సినిమా కథ అని టాక్. కాగా ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' సినిమాను హిందీలో కరణ్ జోహార్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారట. అలాగే 'జిగ్రా' సినిమాకు కరణ్ జోహార్ ఓ నిర్మాత. ఒకే ప్రొడక్షన్ హౌస్ నుంచి రెండు సినిమాలను ఒకే రోజు రిలీజ్ చేస్తే బాక్సాఫీస్ లెక్కల పరంగా ఇబ్బంది ఉంటుందేమోనని 'జిగ్రా' సినిమా రిలీజ్‌ను వాయిదా వేశారట కరణ్ జోహార్. ఇలా దసరా ఫెస్టివల్ సమయంలో 'జిగ్రా' సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'దేవర' ఈ నెల 27న కానుంది.

# జోరుగా... హుషారుగా



● పూజా కన్నన్ పెళ్లి దృశ్యాలు..

**మె**ల్ల మెల్లగా వచ్చిండె అంటూ స్టెప్పేసినా, సారంగ దరియా అంటూ డ్యాన్స్ చేసినా, రౌడీ బేబీ అంటూ చిందేసినా... ఎలాంటి మాస్ పాటకి అయినా సాయి పల్లవి స్టెప్స్ అదిరిపోతాయి. సిల్వర్ స్క్రీన్‌పై తన నటనతో, డ్యాన్సులతో ఆకట్టుకునే ఈ బ్యూటీ తాజాగా తన చెల్లెలు పూజా కన్నన్ పెళ్లిలో కూడా డ్యాన్సులతో అదరగొట్టారు. కొన్ని రోజుల క్రితం పూజా కన్నన్-వినీత్‌ల నిశ్చితార్థం జరిగింది. ఆ వేడుకలో బాగానే సందడి చేశారు సాయి పల్లవి. తాజాగా జరిగిన పెళ్లిలో ఓ అక్కగా అన్ని పనులూ దగ్గరుండి చేయడంతో పాటు సాయి పల్లవి పలు హిట్ పాటలకు డ్యాన్స్ చేసినట్లుగా ఓ వీడియో స్పష్టం చేస్తోంది. తమిళనాడులో ఈ వివాహ వేడుక జరిగినట్లుగా తెలుస్తోంది. సంగీత్ కార్యక్రమం, వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి.

## బిజినెస్ రీల్

### జియో నుంచి ప్రత్యేక ఆఫర్లు

న్యూఢిల్లీ: టెలికం ఆపరేటర్ రిలయన్స్ జియో 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్దిష్ట రీచార్జ్ ప్లాన్లలో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. జియో డాట్‌కామ్ వెబ్‌సైట్ ప్రకారం సెప్టెంబర్ 5 నుంచి 10 వరకు రూ. 899, రూ. 999 క్వార్టర్లీ ప్లాన్లు, రూ. 3,599 వార్షిక ప్లాన్లతో రీచార్జ్ చేసుకునే వారికి రూ. 700 విలువ చేసే మూడు ప్రయోజనాలు లభిస్తాయి. రూ. 175 విలువ చేసే 28 రోజుల వేలిడిటీతో 10 జీబీ డేటా ప్యాక్, 10 ఓటీటీలకు సబ్‌స్క్రిప్షన్, జొమాటో గోల్డ్ మెంబర్‌షిప్‌కు 3 నెలల సబ్‌స్క్రిప్షన్ వీటిలో ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 2 జీబీ డేటా పరిమితి ఉండే రూ. 899, రూ. 999 ప్లాన్లు వరుసగా 90 రోజులు, 98 రోజుల వేలిడిటీతో లభిస్తున్నాయి. రూ. 3,599 ప్లాన్‌లో రోజుకు 2.5 జీబీ డేటా, 365 రోజుల వ్యవధి ఉంది.

### 8.5 లక్షల మందికి ఉపాధి: మీషో

న్యూఢిల్లీ: విక్రయాలు, సరుకు రవాణా నెట్‌వర్క్‌లో పండుగ సీజన్ కోసం 8.5 లక్షల మందికి కాలానుగుణ ఉపాధి అవకాశాలను కల్పించినట్టు ఈ–కామర్స్ కంపెనీ మీషో గురువారం వెల్లడించింది. వీరిలో 60 శాతం పైగా తృతీయ ఆపై తరగతి పట్టణాల నుంచి ఉంటారని తెలిపింది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో కాలానుగుణ నియామకాలు 70 శాతం పెరిగాయని కంపెనీ వివరించింది.

### స్టాండర్డ్ చార్టర్డ్ నుంచి ఈ–బ్యాంక్ గ్యారంటీ

న్యూఢిల్లీ: స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ తాజాగా భారత్‌లో ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ (ఈబీజీ) సదుపాయాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఇందుకోసం నేషనల్ ఈ–గవర్నెన్స్ సర్వీసెస్ (ఎన్ఈఎస్ఎల్)తో జత కట్టినట్లు పేర్కొంది. డిజిటల్ ట్రేడ్ ఫైనాన్స్ విభాగంలో ఇది కీలక మైలురాయి కాగలదని స్టాండర్డ్ చార్టర్డ్ వివరించింది. బ్యాంక్ గ్యారంటీ ప్రక్రియను పూర్తిగా డిజిటలీకరించేందుకు ఇది తోడ్పడగలదని, దీనికి సంబంధించి హిటాచీ సిస్టమ్స్ ఇండియా సంస్థ తమకు తొలి క్లయింటని బ్యాంకు పేర్కొంది.

### పీఈబీ ప్లాంటుపై ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ప్రీ–ఇంజినీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) ఉత్పత్తుల తయారీ సంస్థ ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రోడక్ట్స్ ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా అత్తివరంలో తమ అయిదో ప్లాంటును ప్రారంభించినట్లు తెలిపింది. దీనిపై రూ. 95 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించింది. ఈ ప్లాంటుతో రెండు దశల్లో వార్షికంగా 60,000 ఎంటీ ఉత్పత్తి సామర్థ్యం జతవుతుందని, దీనితో మొత్తం కెపాసిటీ వార్షికంగా 2 లక్షల ఎంటీకి పెరగగలదని సంస్థ ఎండీ అరవింద్ నందా తెలిపారు. ప్లాంటు మొదటి దశ అందుబాటులోకి రాగా రెండో దశ పనులు 7–8 నెలల్లో పూర్తి కాగలవని పేర్కొన్నారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 6-9-2024 | |
|---|---|
| విశాఖ | 505–00 |
| చిత్తూరు | 518–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 500–00 |
| విజయవాడ | 505–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 470–00 |
| వరంగల్ | 472–00 |
| రిటైల్ ధర | 5.30 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TITAN | 3,720.00 | 3.11 |
| LTIM | 6,158.60 | 1.44 |
| WIPRO | 525.15 | 1.16 |
| BPCL | 361.2 | 1.11 |
| ITC | 511.25 | 0.97 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| CIPLA | 1,627.70 | -1.46 |
| DRREDDY | 6,700.00 | -1.28 |
| COALINDIA | 497.2 | -1.28 |
| RELIANCE | 2,991.00 | -1.26 |
| BRITANNIA | 5,854.00 | -1.22 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 8,326 |
| ఎన్ఎస్ఈ | 1,19,706 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,72,220 |
| ఎఫ్ఐఐ | -689 |
| డీఐఐ | +2,971 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 69.33 | $ 72.83 |
| బ్రెంట్ | 72.07 | $ 72.03 |

# రూ. 1,000 కోట్లు జమ చేయండి

**సెబీ కేసులో సహారాకు సుప్రీం ఆదేశం ● ముంబైలోని భూ విక్రయం ద్వారా రూ.10,000కోట్ల సమీకరణకు వెసులుబాటు**




న్యూఢిల్లీ: గ్రూప్ సంస్థల రూ.25,000 కోట్ల అక్రమ డిపాజిట్ సమీకరణకు సంబంధించి సెబీ కేసులో 15 రోజుల్లోగా రూ. 1,000 కోట్లను ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని సహారా గ్రూప్ కంపెనీలను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. దీనితోపాటు రూ.10,000 కోట్ల సమీకరణకుగాను ముంబైలోని వెర్సోవాలో తన భూమిని అభివృద్ధి చేయడానికి, ఈ విషయంలో జాయింట్ వెంచర్ ఒప్పందంలోకి ప్రవేశించడానికి సైతం సుప్రీం అనుమతించింది. అత్యున్నత న్యాయస్థానం 2012 ఆదేశాలకు అనుగుణంగా ఇన్వెస్టర్ల సొమ్మును తిరిగి ఇవ్వడానికి రూ. 10,000 కోట్ల మొత్తాన్ని సెబీ–సహారా రిఫండ్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది.

**లేదంటే.. భూమి విక్రయానికి స్వయంగా చర్యలు**


జాయింట్ వెంచర్/డెవలప్‌మెంట్ ఒప్పందాన్ని 15 రోజుల్లోగా కోర్టులో దాఖలు చేయాల్సి చేయాలి. అనంతరం ఈ ఒప్పందానికి అత్యున్నత న్యాయస్థానం ఆమోదముద్ర తప్పనిసరి. లేని పక్షంలో వెర్సోవాలోని 12.15 మిలియన్ చదరపు అడుగుల భూమిని విక్రయించడానికి సుప్రీం తగిన చర్యలు తీసుకుంటుందని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎంఎం సుందరేష్, బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ''సహార సంస్థలు–ఎస్ఐఆర్ఈసీఎల్, ఎస్‌హెచ్ఐసీఎల్ (రెండూ సహారా గ్రూప్ కంపెనీలు)కు మేము 15 రోజుల సమయం మంజూరు చేస్తున్నాము. జాయింట్ వెంచర్/డెవలప్‌మెంట్ ఒప్పందాన్ని 15 రోజులలోపు దాఖలు చేయకపోతే, వెర్సోవా భూమిని విక్రయానికి కోర్టు చర్యలు చేపడుతుంది'' అని బెంచ్ పేర్కొంది. ''ఈ పక్రియ కోసం థర్డ్‌పార్టీ రూ. 1,000 కోట్లు జమచేస్తే, దీనిని సెబీ ఎస్క్రో ఖాతాలో ఉంచడం జరుగుతుంది. ఒకవేళ ఈ కోర్టు ఆమోదం/అనుమతి (జాయింట్ వెంచర్ అగ్రిమెంట్‌కు) మంజూరు చేయకపోతే, ఆ మొత్తాన్ని (జమ చేసిన మొత్తాన్ని) తిరిగి థర్డ్‌పార్టీకి చెల్లించడం జరుగుతుంది''అని కూడా ధర్మాసనం వివరించింది.

### చెల్లింపులకు 10 యేళ్ల సుదీర్ఘ వెసులుబాటు

రూ.25,000 కోట్ల తిరిగి డిపాజిట్ చేయడానికి సహారాకు సుప్రీం దాదాపు 10 సంవత్సరాల సుదీర్ఘ సమయం ఇచ్చి ఎంతో వెసులుబాటు కల్పిస్తున్న విషయాన్ని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా సంస్థ తరపున వాదనలు వినిపిస్తున్న కపిల్ సిబల్‌కు గుర్తు చేసింది. ఇదే కేసులో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతో రాయ్ సుదీర్ఘకాలం తీహార్ జైలులో ఉండాల్సిన పరిస్థితి ఉత్పన్నం కావడం గమనార్హం. తల్లి మరణం అనంతరం అంతిమ సంస్కారాల కోసం జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన, కొద్ది నెలల క్రితం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

## మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి

**ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఉద్ఘాటన**



న్యూఢిల్లీ: మహిళలకు మరింత ఉపాధి అవకాశాలను అందించడానికి ఫైనాన్షియల్ రంగం మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. మహిళలను ప్రోత్సహించే వ్యాపారాలకు అనుకూలమైన పథకాలను రూపొందించడం ద్వారా లింగ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడవచ్చని ఆయన సూచించారు. సమగ్ర వృద్ధి ప్రాముఖ్యతను ఉద్ఘాటిస్తూ వాస్తవ అభివృద్ధి చెందిన భారతదేశం అంటే.. దేశంలోని ప్రతి పౌరుడు సామాజిక–ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఆర్థిక సేవలను పొందాల్సి ఉంటుందని అన్నారు. అవసరమైన ఆర్థిక అక్షరాస్యతను కలిగి ఉండేలా చూడాలని గవర్నర్ సూచించారు. ఫిక్కీ, ఐబీఏ సంయుక్తంగా నిర్వహించిన వార్షిక ఎఫ్ఐబీఏసీ– 2024 ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ, భారత్ శ్రామిక శక్తి భాగస్వామ్యం (మహిళల భాగస్వామ్యం) ప్రపంచ సగటు కంటే తక్కువగా ఉందన్నారు. బాలికల విద్యను మెరుగుపరచడం, నైపుణ్యాభివృద్ధి, పని ప్రదేశంలో భద్రత, సామాజిక అడ్డంకులను పరిష్కరించడం వంటి కార్యక్రమాల ద్వారా ఈ అంతరాన్ని తగ్గించాల్సిన తక్షణ అవసరం ఉందని అన్నారు. వినియోగం, డిమాండ్ సమిష్టిగా పెరగడంతో భారతదేశ వృద్ధి చెక్కుచెదరకుండా ఉందన్నారు. భూమి, కార్మిక, వ్యవసాయ మార్కెట్లలో సంస్కరణల ద్వారా మరిన్ని మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచించారు.

## భారత్‌లో మెర్సిడెస్ ఆల్ ఎలక్ట్రిక్ కారు

పుణే: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఆల్ ఎలక్ట్రిక్ మైబాహ్ ఈక్యూఎస్ 680 ఎస్‌యూవీని భారత్‌లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.2.25 కోట్ల నుంచి ప్రారంభం. ఒకసారి చార్జింగ్‌తో 611 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ వెల్లడించింది. 122 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. 658 హెచ్‌పీ పవర్, 950 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 4.4 సెకన్లలో చేరుకుంటుంది.


## యూనికార్న్‌గా ర్యాపిడో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనికార్న్ క్లబ్‌లోకి రైడ్ షేరింగ్ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో వచ్చి చేరింది. సిరీస్–ఈ ఫండింగ్ రౌండ్‌లో కంపెనీ తాజాగా సుమారు రూ.1,660 కోట్లు సమీకరించింది. ఈ ఫండింగ్ ద్వారా ర్యాపిడోను 1.1 బిలియన్ డాలర్ల కంపెనీగా విలువ కట్టారు. ప్రస్తుత ఇన్వెస్టర్లు వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్‌తోపాటు నూతనంగా థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్వస్ అపార్చునిటీస్ ఈ మొత్తాన్ని సమకూర్చాయి.

## బ్యూరోక్రసీతో కొత్త ఉత్పత్తులకు అనుమతుల్లో జాప్యం

- ఫలితంగా రైతులపై ప్రతికూల ప్రభావం
- వ్యవసాయంలో అనుమతుల ప్రక్రియను ఆధునీకరించాలి
- సింజెంటా సీఈవో జెఫ్ రోవ్



న్యూఢిల్లీ: బ్యూరోక్రసీ విధానాల కారణంగా భారత సాగురంగంలో వినూత్న ఉత్పత్తులకు అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని అగ్రోకెమికల్స్ దిగ్గజం సింజెంటా గ్రూప్ సీఈవో జెఫ్ రోవ్ వ్యాఖ్యానించారు. దీంతో రైతులపై ప్రభావం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత పర్యటన సందర్భంగా ఆయన తెలిపారు. దేశీయంగా సులభతరంగా వ్యాపారాల నిర్వహణ అంశంపై స్పందిస్తూ 'భారత్‌లో ప్రొడక్టుల అనుమతులకు సంబంధించి పాలసీ అంతా బ్యూరోక్రసీమయంగా ఉంటుంది. దీంతో అనుమతులకు చాలా సమయం పట్టేస్తుంది. ఆ ప్రభావం రైతులపై పడుతుంది' అని జెఫ్ పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణల కోసం రైతులు ఎంత ఎక్కువగా నిరీక్షించాల్సి వస్తే అంత ఎక్కువగా రిస్కులు ఎదుర్కొనాల్సి వస్తుందని ఆయన చెప్పారు. వినియోగదారుల వ్యవస్థను డిజిటలీకరించడంలో భారత ప్రభుత్వ కృషిని ప్రశంసించిన జెఫ్.. వ్యవసాయ రంగంలోనూ అదే తరహాలో అనుమతుల ప్రక్రియను ఆధునీకరించాలని కోరారు. వాతావరణ మార్పులతో రిస్కులే కాకుండా అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

**వచ్చే 3 ఏళ్లలో 40 ఉత్పత్తులు..**

రాబోయే 2–3 సంవత్సరాల్లో కొత్తగా 40 పంట సంరక్షణ ఉత్పత్తులను ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు జెఫ్ చెప్పారు. పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాలపై తమ సంస్థ అంతర్జాతీయంగా ఏటా 2 బిలియన్ డాలర్లు వెచ్చిస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో తమ వ్యాపారం ఈ ఏడాది ద్వితీయార్థంలో కాస్త మెరుగుపడగలదని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార అవసరాలు పెరుగుతున్న తరుణంలో సేంద్రియ వ్యవసాయాన్ని భారీ స్థాయిలో విస్తరించడానికి అవకాశాలు తక్కువని జెఫ్ తెలిపారు. సంప్రదాయ సాగుతో పోలిస్తే సేంద్రియ వ్యవసాయ సామర్థ్యాలు 20–30 శాతం మేర తక్కువగా ఉండటమే ఇందుకు కారణమన్నారు. ప్రత్యేకమైన భారత వ్యవసాయ రంగ సవాళ్లను పరిష్కరించడంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించగలదని జెఫ్ వివరించారు.


## 'క్యాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్' కార్యకలాపాల విస్తరణ

- నాలుగేళ్లలో నిర్వహణ నిధి రెట్టింపు
- 2028 నాటికి సాధించనున్నట్టు ప్రకటన




ముంబై: అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ మేనేజర్, సింగపూర్‌కు చెందిన 'క్యాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ (సీఎల్ఐ).. భారత్‌లో తన నిర్వహణలోని ఫండ్ (ఎఫ్‌యూఎం) విలువను 2028 నాటికి రెట్టింపు చేసుకోనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ఈ సంస్థ ఎఫ్‌యూఎం 7.4 బిలియన్ సింగపూర్ డాలర్లు (రూ.46,000 కోట్లు)గా ఉంది. 30 ఏళ్ల క్రితం ఈ సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం గమనార్హం. అప్పటి నుంచి వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో నిర్మించుకుంది. హైదరాబాద్ సహా ఎనిమిది ప్రముఖ పట్టణాల్లో 40 ఐటీ, బిజినెస్, ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్క్‌లు, డేటా సెంటర్లను నిర్వహిస్తోంది. ఐటీ పార్క్‌లు, లాజిస్టిక్స్ పార్క్‌ల వ్యాపారాన్ని విస్తరించనున్నట్టు.. పునరుత్పాదక ఇంధన వ్యాపారంలో అవకాశాలనూ పరిశీలిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. ''భారత్ మాకు వ్యూహాత్మక మార్కెట్. మా మొత్తం వ్యాపారంలో కీలక వాటాను ఆక్రమిస్తోంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్‌లో గడిచిన ఏడేళ్లలో మా పెట్టుబడులు మూడింతలయ్యాయి. 2024లో భారత జీడీపీ 7 శాతం వృద్ధి చెందుతుందని, వచ్చే ఐదేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్న అంచనాలున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ సంస్థలు, ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లను భారత్‌లో నాణ్యమైన రియల్ అసెట్స్ ఆకర్షిస్తున్నాయి''అని సీఎల్ఐ గ్రూప్ సీఈవో లీచీ కూన్ తెలిపారు. భారత మార్కెట్‌లో తమకు ఎంతో అనుభవం కలిగి ఉండడంతో ఈ అవకాశాలను సొంతం చేసుకోగలమని.. తమ నిర్వహణలోని నిధిని 2028 నాటికి 7.4 బిలియన్ డాలర్లకు పెంచుకుంటామని చెప్పారు.

# ఎన్‌బీఎఫ్‌సీ ఐపీవోల క్యూ




- అప్పర్ లేయర్ నిబంధనల ఎఫెక్ట్
- వచ్చే వారం బజాజ్ హౌసింగ్ షురూ
- టాటా క్యాపిటల్, హెచ్‌డీబీ, ఏబీ ఫైనాన్స్ రెడీ

న్యూఢిల్లీ: అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలపై రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిబంధనల కారణంగా ఇకపై పలు పబ్లిక్ ఇష్యూలకు తెరలేవనుంది. ఈ విభాగంలో వచ్చే వారం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూ ప్రారంభం కానుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల వివరాల ప్రకారం కనీసం మరో మూడు కంపెనీలు ఈ జాబితాలో చేరనున్నాయి. వీటిలో టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ ఏడాదిలోగా స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్‌కు ప్రయత్నించనున్నాయి. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అప్పర్‌లేయర్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లు గుర్తింపు పొందిన మూడేళ్లలోగా ఐపీవోలు చేపట్టవలసి ఉంటుంది. ప్రస్తుతం క్యాపిటల్ మార్కెట్లు జోరుమీదుండటంతో నాణ్యతగల బిజినెస్‌లకు డిమాండ్ ఉన్నట్లు ఆనంద్ రాఠీ అడ్వయిజర్స్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ విభాగ డైరెక్టర్ సచిన్ మెహతా పేర్కొన్నారు. దీంతో మంచి విలువలు లభించేందుకు వీలున్నట్లు తెలియజేశారు. ఫలితంగా పలు ఎన్‌బీఎఫ్‌సీలు లిస్టింగ్ బాట పట్టనున్నట్లు అంచనా వేశారు. కేవలం ఆర్‌బీఐ నిబంధనల అమలుకోసమేకాకుండా నిధుల సమీకరణకు సైతం ఐపీవోలను వినియోగించుకోవచ్చని తెలియజేశారు. ఒకసారి లిస్టయితే నిధుల సమీకరణ సులభమవుతుందని వివరించారు.

**క్యూ ఇలా**

ఆర్‌బీఐ అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ నిబంధనల ప్రకారం చూస్తే దిగ్గజాలు టాటా సన్స్, టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ ఏడాదిలోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావలసి ఉంది. వీటిలో పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ పిరమల్ ఎంటర్‌ప్రైజెస్‌లో విలీనంకానుంది. ఇక టాటా సన్స్ లిస్టింగ్‌ను తప్పించుకునే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే టాటా సన్స్ లిస్టింగ్ గేమ్‌చేంజర్‌గా నిలవనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇన్వెస్టర్లు లిస్టింగ్ ద్వారా భారీ లాభాలు అందుకునేందుకు వీలుండటమే దీనికి కారణమని తెలియజేశారు. దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి అధికస్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకోగలదని భావిస్తున్నారు. దేశీయంగా పలు కార్పొరేట్ దిగ్గజాల హోల్డింగ్ కంపెనీగా నిలుస్తున్న టాటా సన్స్‌కు భారీ డిమాండ్ నెలకొంటుందని అంచనా వేశారు.

**కీలక పరిణామం**

ప్రయివేట్ రంగ హోల్డింగ్ దిగ్గజం టాటా సన్స్ లిస్టయితే వేగంగా వృద్ధి చెందుతున్న దేశీ క్యాపిటల్ మార్కెట్లలో ఇది కీలక పరిణామంగా నిలుస్తుందని డీఏఎం క్యాపిటల్ సీఈవో ధర్మేష్ మెహతా పేర్కొన్నారు. భారత్‌లోనే అత్యంత ప్రముఖ గ్రూప్‌లలో ఒకటైన టాటా సన్స్‌కు దేశ, విదేశాల నుంచి గరిష్ట డిమాండ్ పుడుతుందని తెలియజేశారు. వాటాదారులకు భారీ విలువ చేకూరుతుందని మార్కెట్ నిపుణులు పలువురు అభిప్రాయపడ్డారు. వెరసి కనీసం 5 శాతం వాటాను ఆఫర్ చేస్తే రూ. 55,000 కోట్లకుపైగా నిధులు లభించవచ్చని అంచనా వేశారు. లిక్విడిటీతోపాటు.. ట్రేడింగ్ పరిమాణం సైతం భారీగా పెరుగుతుందని తెలియజేశారు. అయితే లిస్టింగ్‌ను తప్పించుకునే యోచనతో టాటా సన్స్ ఇప్పటికే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఆర్‌బీఐకు స్వచ్ఛందంగా సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఆర్‌బీఐ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరమని నిపుణులు పేర్కొన్నారు. కాగా.. 2018లో ఐఎల్అండ్ఎఫ్ఎస్ అనూహ్య పతనానికితోడు.. డీహెచ్ఎఫ్ఎల్ సైతం విఫలంకావడంతో మొత్తం ఫైనాన్షియల్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడింది. కఠిన లిక్విడిటీ సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా 2021 అక్టోబర్‌లో ఆర్‌బీఐ సవరించిన ఎస్‌బీఆర్ మార్గదర్శకాలను జారీ చేసింది. తద్వారా వ్యవస్థాగత రిస్కులను అడ్డుకోవడం, పాలనను మరింత పటిష్టపరచడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చింది.

### ఇవీ నిబంధనలు

ఎస్‌బీఆర్ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలను నాలుగు విభాగాలు(లేయర్లు)గా విభజించింది. ప్రాథమిక(బేసిక్), మాధ్యమిక(మిడిల్), ఎగువ(అప్పర్), అత్యున్నత(టాప్) లేయర్లుగా ఏర్పాటు చేసింది. ఆయా కంపెనీల పరిమాణం, కార్యకలాపాలు, రిస్క్ స్థాయిల ఆధారంగా వీటికి తెరతీసింది. దీనిలో భాగంగా అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలుగా గుర్తింపు పొందిన మూడేళ్ల కాలంలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేలా నిబంధనలను సవరించింది. ఇందుకు అనుగుణంగా 2022 సెప్టెంబర్‌లో 16 సంస్థలను ఈ జాబితాలో చేర్చింది. అయితే 2023లో జాబితా నుంచి సంఫ్వీ ఫైనాన్స్‌ను తప్పించింది. వెరసి 15 సంస్థలు అప్పర్‌లేయర్‌లో చేరాయి. వీటిలో పిరమల్ క్యాపిటల్, టాటాసన్స్‌లను మినహాయిస్తే 9 కంపెనీలు ఇప్పటికే లిస్టయినట్లు మెహతా వెల్లడించారు. బజాజ్ హౌసింగ్ ఐపీవో ప్రారంభంకానున్న కారణంగా మిగిలిన మూడు కంపెనీలు ఏడాదిలోగా లిస్ట్‌కావలసి ఉంటుంది. ఈ మూడు సంస్థలు 2025 సెప్టెంబర్‌లోగా పబ్లిక్ ఇష్యూలను చేపట్టవలసి ఉన్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్వెస్ట్‌మెంట్ చీఫ్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ తెలియజేశారు.

## నిబంధనలే డిపాజిట్లు రూట్ మారడానికి కారణం

- బ్యాంకులకే కఠిన నిబంధనలు
- ఫండ్స్‌కు ఈ తరహా బంధనాల్లేవు
- ఐబీఏ చైర్మన్ ఎంవీ రావు
- ఇందుకు ఫండ్స్‌ను నిందించొద్దు
- కోటక్ ఏఎంసీ చీఫ్ నీలేష్ షా




ముంబై: బ్యాంకుల నుంచి డిపాజిట్లు మ్యూచువల్ ఫండ్స్, ఇతర సాధనాల వైపు మళ్లడానికి సులభతర నిబంధనలే కారణమని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) చైర్మన్ ఎంవీ రావు వ్యాఖ్యానించారు. గడిచిన ఏడాది కాలంగా బ్యాంకుల్లో డిపాజిట్ల వృద్ధి నిదానించిన నేపథ్యంలో.. ఎఫ్ఐబీఏసీ వార్షిక సదస్సులో భాగంగా దీనిపై ఆసక్తికర చర్చ జరిగింది. సెంట్రల్ బ్యాంక్ ఇండియా ఎండీ, సీఈవోగానూ వ్యవహరిస్తున్న ఎంవీ రావు ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. సులభతర నిబంధనల కారణంగా ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ అధిక రాబడులు అందిస్తున్నాయని చెప్పారు. నిధుల నిర్వహణ విషయంలో బ్యాంకులపై ఎన్నో నియంత్రణలు ఉండగా.. మ్యూచువల్ ఫండ్స్‌కు అలాంటి నిబంధనలేవీ లేవన్నారు. ''నిధులను అంతిమంగా ఎందుకు వినియోగిస్తున్నారో తనిఖీ చేయాల్సిన అవసరం మ్యూచువల్ ఫండ్స్‌కు లేదు. మా వద్దే డిపాజిట్ చేయాలని కస్టమర్లను బ్యాంకింగ్ రంగం నిర్దేశించలేదు. ఇన్వెస్టర్ల పెట్టుబడులను ఇన్వెస్ట్ చేసే విషయంలో ఫండ్స్‌కు ఎలాంటి ప్రొవిజనింగ్ లేదు. కానీ ప్రామాణిక రుణ ఆస్తులకు సంబంధించి కూడా నిర్దేశిత మొత్తాన్ని బ్యాంక్‌లు పక్కన పెట్టాల్సి ఉంటుంది. 99 శాతం మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు సంబంధించి ఎలాంటి పరిశోధన చేయడం లేదు. ఆరేడేళ్ల తర్వాత ఈ సైకిల్ తిరగబడితే అది వ్యవస్థాగత ముప్పుకు దారితీయవచ్చు. రానున్న రోజుల్లో డిపాజిటర్లు అధిక రాబడులు సొంతం చేసుకునేందుకు, దేశ వృద్ధికి కావాల్సిన ముడి సరుకు (నిధులు)ను బ్యాంక్‌లు పొందేందుకు ప్రభుత్వం, నియంత్రణ సంస్థల మధ్య చురుకైన భాగస్వామ్యం, చర్చ అవసరం''అని రావు ఈ సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించారు.

**డిపాజిట్ల మందగమనం కారణాలు వేరే..**

కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు కూడా అయిన నీలేష్ షా ఈ అభిప్రాయాలతో విభేదించారు. బ్యాంకుల్లో డిపాజిట్ల వృద్ధి నిదానించడానికి మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమను ఎలా తప్పుబడుతున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ నిధులు సైతం బ్యాంకింగ్ నుంచి బయటకు వెళుతున్నాయని, చిన్న మొత్తాల పొదుపు పథకాలు, నగదు పంపిణీ తదితర అంశాలను ఇందుకు కారణాలుగా ప్రస్తావించారు. ప్రభుత్వ బ్యాలన్స్‌లను (మిగులు నిధులు) బ్యాంకుల్లో ఉంచాలని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్‌ను తాను కోరినట్టు చెప్పారు. ఇలా చేసిన ప్రభుత్వం ఏటా రూ.12,000 కోట్ల ఆదాయం పొందొచ్చన్నారు. కాగా, రావు అభిప్రాయాలతో ఇదే సమావేశంలో పాల్గొన్న హెచ్ఎస్‌బీసీ హితేంద్ర దవే సేతం విభేదించడం గమనార్హం.

## సైబర్‌సెక్యూరిటీ నిపుణుల కొరత సవాలు

**ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి**



ముంబై: సైబర్‌సెక్యూరిటీ నిపుణుల లభ్యత పరిమిత స్థాయిలోనే ఉండటమనేది భవిష్యత్తులో 'పెద్ద సవాలు'గా పరిణమించవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. మొత్తం వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకు సైబర్‌సెక్యూరిటీపై పెట్టుబడులు క్రమంగా పెరుగుతున్నాయని వార్షిక బ్యాంకింగ్ సదస్సు ఫిబాక్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. తాము ప్రతి రోజు దాదాపు 1 లక్ష సైబర్ దాడులను ఎదుర్కొంటున్నామని హెచ్ఎస్‌బీసీ కంట్రీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హితేంద్ర దవే ఈ సందర్భంగా తెలిపారు. మరోవైపు, డిపాజిట్లు నెమ్మదించిన నేపథ్యంలో మార్కెటింగ్‌పై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఎస్‌బీఐ ఎండీ అశ్విని తివారీ తెలిపారు. స్టార్టప్‌లు, చిన్న.. మధ్య తరహా సంస్థలకు మరింతగా తోడ్పాటు అందించడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు సూచించారు.

# ముషీర్ మెరిసె...


ముషీర్ సెంచరీ సంబరం

## అజేయ సెంచరీతో భారత 'బి' జట్టును ఆదుకున్న రైజింగ్ స్టార్

**బెంగళూరు:** దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న రైజింగ్ స్టార్ క్రికెటర్ ముషీర్ ఖాన్ (227 బంతుల్లో 105 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో చెలరేగడంతో దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత్ 'బి' జట్టు మెరుగైన స్కోరు దిశగా సాగుతోంది. గురువారం చిన్నస్వామి స్టేడియంలో భారత్ 'ఎ' జట్టుతో ప్రారంభమైన మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 'బి' జట్టు 79 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (59 బంతుల్లో 30; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (13), సర్ఫరాజ్ ఖాన్ (9), రిషభ్ పంత్ (7), ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (0), వాషింగ్టన్ సుందర్ (0), సాయికిశోర్ (1) విఫలమయ్యారు. దాదాపు రెండున్నరేళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో మ్యాచ్ ఆడిన పంత్ 10 బంతులే ఎదుర్కొని వెనుదిరిగాడు. అండర్–19 ప్రపంచకప్‌తో పాటు రంజీ ట్రోఫీలో చక్కటి ఇన్నింగ్స్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 19 ఏళ్ల ముషీర్ ఖాన్ దులీప్ ట్రోఫీ అరంగేట్ర మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేశాడు. సోదరుడు సర్ఫరాజ్ ఖాన్ విఫలమైన చోట తన విలువ చాటుకుంటూ సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. భారత్ 'ఎ' జట్టు పేసర్లు విజృంభించడంతో ఒక దశలో భారత్ 'బి' 94 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నవ్‌దీప్ సైనీ (74 బంతుల్లో 29 బ్యాటింగ్; 4 ఫోర్లు, ఒక సిక్సర్) అండతో ముషీర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 108 పరుగులు జోడించారు. భారత్ 'ఎ' జట్టు బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ఆకాశ్ దీప్, అవేశ్ ఖాన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

**స్కోరు వివరాలు**

**భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) (సబ్) రావత్ (బి) ఖలీల్ అహ్మద్ 30; అభిమన్యు ఈశ్వరన్ (సి) ధ్రువ్ జురెల్ (బి) అవేశ్ ఖాన్ 13; ముషీర్ ఖాన్ (బ్యాటింగ్) 105; సర్ఫరాజ్ ఖాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ ఖాన్ 9; రిషభ్ పంత్ (సి) శుభ్‌మన్ గిల్ (బి) ఆకాశ్‌దీప్ 7; నితీశ్ కుమార్ రెడ్డి (బి) ఆకాశ్‌దీప్ 0; వాషింగ్టన్ సుందర్ (రనౌట్) 0; సాయికిశోర్ (సి) కేఎల్ రాహుల్ (బి) ఖలీల్ అహ్మద్ 1; నవ్‌దీప్ సైనీ (బ్యాటింగ్) 29; ఎక్స్‌ట్రాలు: 8, **మొత్తం: (79 ఓవర్లలో 7 వికెట్లకు) 202. వికెట్ల పతనం:** 1–33, 2–53, 3–67, 4–80, 5–80, 6–89, 7–94, **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 17–4–39–2; ఆకాశ్‌దీప్ 18–6–28–2; అవేశ్ ఖాన్ 16–5–42–2; శివమ్ దూబే 8–3–10–0, కుల్దీప్ యాదవ్ 14–3–50–0; తనుశ్ కొటియాన్ 6–0–27–0.

## ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్‌కు గాయం

ఆస్ట్రేలియాతో టి20 సిరీస్‌కు దూరం



**లండన్:** ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల ఫార్మాట్ కెప్టెన్ జోస్ బట్లర్ గాయపడటంతో సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు దూరం కానున్నాడు. గురువారం ప్రాక్టీస్ సందర్భంగా అతని కుడికాలి పిక్కకు గాయమైంది. దీంతో ప్రాథమికంగా టి20 సిరీస్‌కు దూరమైనట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించినప్పటికీ... తర్వాత జరిగే వన్డేలకూ అనుమానమేనని బోర్డు వర్గాలు తెలిపాయి. మొదట ఈ నెల 11, 13, 15 తేదీల్లో జరిగే మూడు టి20ల సిరీస్‌కు అతను అందుబాటులో ఉండడు. అనంతరం ఆ వెంటనే 19 నుంచి ఐదు వన్డేల సిరీస్ కూడా జరుగనుంది. దీంతో స్వల్పవ్యవధిలో బట్లర్ పూర్తిస్థాయిలో కోలుకోవడం దాదాపు అసాధ్యం కావడంతో 50 ఓవర్ల ఫార్మాట్‌కూ దూరమయ్యే అవకాశముంది. ఇప్పటికైతే టి20లకు ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో అతని స్థానాన్ని బౌలింగ్ ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్‌తో భర్తీచేశారు. హార్డ్ హిట్టింగ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌కు జట్టు పగ్గాలు అప్పగించారు.



## 29న కొత్త ఎన్‌సీఏ ప్రారంభం

**బెంగళూరు:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో కొత్తగా నిర్మితమైన జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. బెంగళూరు నగర శివారులో సువిశాలమైన ప్రాంగణంలో అత్యున్నత సదుపాయాలతో నిర్మించిన ఎన్‌సీఏను ఈనెల 29వ తేదీన లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజున బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కూడా జరగనుంది. ఈ మీటింగ్ అజెండాలో కార్యదర్శి ఎన్నిక అంశం లేదని బోర్డు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవడంతో బీసీసీఐ కార్యదర్శి పదవి ఖాళీ కానుంది. ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్‌క్లే పదవీ కాలం నవంబర్ నెలాఖరుదాకా ఉంది. డిసెంబర్ 1 తర్వాతే జై షా ఐసీసీ చైర్మన్ బాధ్యతలు చేపట్టాల్సి ఉండటంతో అప్పటిదాకా బోర్డు కార్యదర్శిగా ఆయన కొనసాగుతారు. దీంతో ఎన్నికపై ఇప్పుడప్పుడే నియామక ప్రక్రియ చేపట్టే అవకాశమే లేదని బోర్డు వర్గాలు తెలిపాయి. ఎప్పట్లాగే బోర్డు వ్యవహారాలు, ఆదాయ–వ్యయాలు, వార్షిక బడ్జెట్‌పై చర్చ జరుగుతుందని బోర్డు అధికారులు చెప్పారు.

## 10 పరుగులకే మంగోలియా ఆలౌట్


హర్ష

**బాంగి (మలేసియా):** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో మంగోలియా జట్టు చెత్త రికార్డును మూటగట్టుకుంది. సింగపూర్ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌లో మంగోలియా 10 పరుగులకే ఆలౌటైంది. గత ఏడాది స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు కూడా 10 పరుగులకే ఆలౌట్ కాగా... అంతర్జాతీయ టి20ల్లో అత్యల్ప స్కోరు చేసిన జట్టుగా ఇప్పుడు ఐల్ ఆఫ్ మాన్ జట్టు సరసన మంగోలియా చేరింది. సింగపూర్ లెగ్ స్పిన్నర్ హర్ష భరద్వాజ్ 4 ఓవర్లు వేసి 3 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాడు. హర్ష ధాటికి మంగోలియా 10 ఓవర్లలో 10 పరుగులే చేసి కుప్పకూలింది. అనంతరం సింగపూర్ జట్టు 5 బంతుల్లో ఒక వికెట్ కోల్పోయి 13 పరుగులు చేసి గెలిచింది.

## యూటీటీ ఫైనల్లో గోవా చాలెంజర్స్



**చెన్నై:** అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో గోవా చాలెంజర్స్ జట్టు వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు దూసుకెళ్లింది. సీజన్ మొత్తం నిలకడ ప్రదర్శించిన డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ గురువారం జరిగిన సెమీఫైనల్లో 8–4తో బెంగళూరు స్మాషర్స్‌పై విజయం సాధించింది. తొలి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో గోవా చాలెంజర్స్ ప్యాడ్లర్ మిహాయి బొబిసికా 11–8, 11–7, 7–11తో అల్వారో రొబెల్స్‌పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో యాంగ్జీ లూ 4–11, 11–7, 11–4తో భారత స్టార్ ప్యాడ్లర్ మనిక బాత్రాపై గెలిచింది. అనంతరం మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్ దేశాయ్–యాంగ్జీ లూ జంట 10–11, 7–11, 11–9తో అల్వారో రొబెల్స్–మనికా బాత్రా జోడీ చేతిలో ఓడింది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన రెండో పురుషుల సింగిల్స్‌లో గోవా ప్యాడ్లర్ హర్మీత్ దేశాయ్ 11–5, 11–9, 11–8తో జీత్ చంద్రపై గెలవడంతో గోవా జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. శుక్రవారం జరగనున్న రెండో సెమీఫైనల్లో దబంగ్ ఢిల్లీతో అహ్మదాబాద్ పైపర్స్ తలపడుతుంది.

## సెమీస్‌లో ధ్రువ్–తనీషా జోడీ



**న్యూఢిల్లీ:** తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్–తనీషా ద్వయం 21–13, 22–20తో కో చి చాంగ్–యెన్ లుయ యిన్ (చైనీస్ తైపీ) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో సతీశ్ కుమార్ కరుణాకరన్ 19–21, 19–21తో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో... శంకర్ ముత్తుస్వామి 22–24, 12–21తో రెండో సీడ్ లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు.

## భారత్ 'డి' 164 ఆలౌట్ ● భారత్ 'సి' 91/4 ● దులీప్ ట్రోఫీ

# అక్షర్ ఆల్‌రౌండ్ షో



**సాక్షి, అనంతపురం:** దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో అక్షర్ పటేల్ అటు బ్యాట్‌తో ఇటు బంతితో సత్తా చాటాడు. అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్టేడియంలో గురువారం భారత్ 'సి' జట్టుతో ప్రారంభమైన మ్యాచ్‌లో భారత్ 'డి' జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అక్షర్ పటేల్ (118 బంతుల్లో 86; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) అర్ధశతకంతో మెరిశాడు. టాపార్డర్ విఫలమైన చోట అక్షర్ ఆదుకోవడంతో భారత్ 'డి' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (9), దేవదత్ పడిక్కల్ (0), యశ్ దూబే (10), అథర్వ (4)తో పాటు ఆంధ్ర ఆటగాళ్లు శ్రీకర్ భరత్ (13), రికీ భుయ్ (4) ఆకట్టుకోలేకపోయారు. 76 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన దశలో అక్షర్ పటేల్ ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అర్ష్‌దీప్ సింగ్ (13)తో తొమ్మిదో వికెట్‌కు 84 పరుగులు జోడించి జట్టుకు ఓ మాదిరి స్కోరు అందించాడు. భారత్ 'సి' బౌలర్లలో విజయ్ కుమార్ వైశాఖ్ 3, అన్షుల్ కంబోజ్, హిమాన్షు చౌహాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 'సి' జట్టు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (5), సాయి సుదర్శన్ (7), ఆర్యన్ జుయెల్ (12), రజత్ పాటిదార్ (13) విఫలం కాగా... బాబా ఇంద్రజీత్ (15 బ్యాటింగ్), అభిషేక్ పొరెల్ (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత్ 'డి' బౌలర్లలో హర్షిత్ రాణా, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. చేతిలో 6 వికెట్లు ఉన్న భారత్ 'సి' జట్టు... భారత్ 'డి' స్కోరుకు 73 పరుగులు వెనుకబడి ఉంది.

**స్కోరు వివరాలు**

**భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్:** అథర్వ (సి) విజయ్ కుమార్ (బి) అన్షుల్ 4; యశ్ దూబే (సి) పొరెల్ (బి) అన్షుల్ 10; శ్రేయస్ అయ్యర్ (సి) పొరెల్ (బి) విజయ్ కుమార్ 9; దేవదత్ పడిక్కల్ (సి) రుతురాజ్ గైక్వాడ్ (బి) విజయ్ కుమార్ 0; రికీ భుయ్ (సి) అన్షుల్ (బి) హిమాన్షు 4; శ్రీకర్ భరత్ (సి) ఇంద్రజీత్ (బి) మానవ్ 13; అక్షర్ పటేల్ (సి) మానవ్ సుతార్ (బి) హృతిక్ షోకీన్ 86; సారాంశ్ జైన్ (రనౌట్) 13; హర్షిత్ రాణా (సి) రజత్ పాటిదార్ (బి) హిమన్షు 0; అర్ష్‌దీప్ సింగ్ (సి) మానవ్ సుతార్ (బి) విజయ్ కుమార్ 13; ఆదిత్య (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 12, **మొత్తం: (48.3 ఓవర్లలో ఆలౌట్) 164. వికెట్ల పతనం:** 1–4, 2–23, 3–23, 4–23, 5–34, 6–48, 7–76, 8–76, 9–160, 10–164, **బౌలింగ్:** అన్షుల్ కంబోజ్ 12–0–47–2; విజయ్ కుమార్ వైశాఖ్ 12–3–19–3; హిమాన్షు చౌహాన్ 9–2–22–2; మానవ్ సుతార్ 7–2–34–1; హృతిక్ షోకీన్ 8.3–1–32–1.

**భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్:** రుతురాజ్ గైక్వాడ్ (సి) అథర్వ (బి) హర్షిత్ రాణా 5; సాయి సుదర్శన్ (సి) శ్రీకర్ భరత్ (బి) హర్షిత్ రాణా 7; ఆర్యన్ జుయెల్ (సి అండ్ బి) అక్షర్ పటేల్ 12; రజత్ పాటిదార్ (బి) అక్షర్ పటేల్ 13; బాబా ఇంద్రజీత్ (బ్యాటింగ్) 15; అభిషేక్ పొరెల్ (బ్యాటింగ్) 32; ఎక్స్‌ట్రాలు: 7, **మొత్తం: (33 ఓవర్లలో 4 వికెట్లకు) 91. వికెట్ల పతనం:** 1–11, 2–14, 3–40, 4–43, **బౌలింగ్:** హర్షిత్ రాణా 7–5–13–2; అర్ష్‌దీప్ సింగ్ 8–1–24–0; ఆదిత్య 7–1–18–0, అక్షర్ పటేల్ 6–2–16–2; సారాంశ్ జైన్ 5–1–14–0.



## 2003 తర్వాత...

మెస్సీ, రొనాల్డో లేకుండానే 'బాలన్ డోర్' అవార్డు నామినేషన్లు

**పారిస్:** దిగ్గజాలు లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా), క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్) లేకుండానే ఫుట్‌బాల్‌లో ప్రతిష్టాత్మక పురస్కారంగా భావించే 'బాలన్ డోర్' 2024 అవార్డీల నామినీల జాబితా తయారైంది. యూరోపియన్ ఫుట్‌బాల్ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్లేయర్లకు ప్రతి ఏటా అందించే ఈ అవార్డును ఇప్పటి వరకు 37 ఏళ్ల మెస్సీ 8 సార్లు అందుకోగా... రొనాల్డో ఐదుసార్లు దక్కించుకున్నాడు. ఈ ఏడాది అక్టోబర్ 28న 'బాలన్ డోర్' అవార్డులను ప్రదానం చేయనుండగా... దీని కోసం కుదించిన 30 మంది ప్లేయర్ల జాబితాను ప్రకటించారు. ఇందులో మెస్సీ, రొనాల్డోకు చోటు దక్కలేదు. ఫ్రాన్స్ స్ట్రయికర్ ఎంబాపె, ఇంగ్లండ్ స్టార్ హ్యారీ కేన్, స్పెయిన్ యువ స్ట్రయికర్ లామినె యమాల్ ఇతరులు ఈ జాబితాలో ఉన్నారు. మెస్సీ, రొనాల్డో రేసులో లేకపోవడం 2003 తర్వాత ఇదే తొలిసారి. 2006లో మొదటిసారి 'బాలన్ డోర్' పురస్కారానికి నామినేట్ అయిన మెస్సీ... 2009లో తొలి అవార్డు దక్కించుకున్నాడు. మరోవైపు 2004లో మొదటిసారి నామినేట్ అయిన రొనాల్డో... ఐదుసార్లు అవార్డు అందుకున్నాడు. కాగా యూరోపియన్ లీగ్‌ల్లో ప్రదర్శన ఆధారంగానే ఈ పురస్కారాన్ని అందించడం ఆనవాయితీ. ప్రస్తుతం మెస్సీ అమెరికా లీగ్‌లలో... రొనాల్డో సౌదీ అరేబియాలోని అల్–నాసర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకే వీరిద్దరిని బాలన్ డోర్ అవార్డుకు నామినేట్ చేయలేదు.



# మావోరీలకు కొత్త రాణి

**తండ్రి మరణానంతరం పట్టాభిషిక్తురాలైన ఎన్గావాయ్ హోనోయ్‌తే పాపాకీ**

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్‌లోని మావోరీ తెగకు కొత్త రాణి పట్టాభిషిక్తురాలయ్యారు. తండ్రి, ఏడవ రాజు టుహెటియా పాటటౌ టి వెరోహెరో 69 ఏళ్ల వయసులో గుండెకు శస్త్రచికిత్స తర్వాత శుక్రవారం మరణించడంతో ఎన్గావాయ్ హోనోయ్‌తే పాపాకీ రాణిగా వారసత్వ బాధ్యతలను స్వీకరించారు. నార్త్ ఐలాండ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 27 సంవత్సరాల ఎన్గావాయ్ హోనోయ్‌తే పాపాకీకి మావోరీ అధిపతుల మండలి రాజు బాధ్యతల్ని అప్పగించింది. మావోరీ రాజు ఉద్యమానికి కేంద్రంగా ఉన్న తురంగవేవే మారే వద్ద జరిగిన సభలో ఈ మేరకు ప్రకటించారు. 1858లో మొదటి మావోరీ రాజుకు అభిషేకం చేయడానికి ఉపయోగించిన బైబిల్‌తో ఆమెను ఆశీర్వదించారు. తండ్రి శవపేటిక ముందు తర్వాత ఆమె పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అంతిమ వేడుకల్లో హాకా నృత్యాన్ని ప్రదర్శించారు. తరువాత యుద్ధ పడవల ద్వారా రాజు శవపేటికను వైకాటో నది వెంబడి తీసుకువెళ్లారు. మావోరీలకు పవిత్రమైన తౌపిరి పర్వతం పైన ఖననం చేశారు.

**నిబద్ధత కలిగిన నాయకుడు**

కింగ్ తుహెటియా మరణం మావోరీలకు, మొత్తం దేశానికి విచారకరమైన క్షణమని మావోరీ ఉద్యమ ప్రతినిధి రహుయి పాపా అన్నారు. రాజు మరణంతో దేశం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయిందని న్యూజిలాండ్ ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు క్రిస్ హిప్కిన్స్ అన్నారు. న్యూజిలాండ్ వాసులను ఏకతాటిపైకి తీసుకురావడంపై దృష్టి సారించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాజు టుహీటియా.. మావోరీ, న్యూజిలాండ్ ప్రజలందరి పట్ల నిబద్ధత కలిగిన నాయకుడని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ప్రశంసించారు.

**రెండో రాణి..**

మావోరీ తెగకు రాణిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రెండో మహిళగా ఎన్గావాయ్ పేరు చరిత్రలో నిలిచిపోనుంది. అంతకు ముందు ఆమె నాన్నమ్మ టి అరికినుయి డామ్ టి అటైరంగికహు మొదటి రాణిగా సేవలందించారు. మావోరీలందరినీ సంఘటితం చేసిన గొప్ప నాయకిగా ఆమెకు మంచి పేరుంది. ఆమె కుమారుడు టుహెటియా సైతం తల్లి బాటలోనే పయనించారు. మావోరిని లక్ష్యంగా చేసుకునే విధానాలకు ఎదురు నిలిచిపోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్గావాయ్ మావోరీ సాంస్కృతిక అధ్యయనాలలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. మావోరీల రాచరికం 19వ శతాబ్దం నుంచీ కొనసాగుతోంది. బ్రిటిష్ వారు న్యూజిలాండ్ భూమిని ఆక్రమించకుండా నిరోధించడానికి, మావోరీ సంస్కృతిని పరిరక్షించడానికి వివిధ మావోరీ తెగలు సొంతంగా రాజును ప్రకటించుకోవడం తెల్సిందే.

# మణిపూర్‌లో సాయుధ డ్రోన్ల కలకలం

**వారం రోజుల్లో రెండు గ్రామాలపై దాడి** | **ఇద్దరు మృతి, పలువురికి గాయాలు**

**ఇంఫాల్:** మణిపూర్‌లో దశాబ్దాలుగా కుకీలు, మైతేయ్‌ల జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో కొత్తగా సాయుధ డ్రోన్లు వచ్చిచేరాయి. బాంబులు వేయడానికి డ్రోన్లను వాడుతున్న ఘటనలు దేశంలో చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. వారం రోజుల్లో రెండు గ్రామాలపై జరిగిన డ్రోన్ల దాడుల్లో ఇద్దరు మరణించారు. పలువురు గాయపడ్డారు. కొన్ని నెలలుగా జరుగుతున్న మత ఘర్షణలు ఇప్పటివరకు 200 మందికి పైగా ప్రాణాలు తీశాయి. అయితే దాడుల్లో ఆయుధాలకుతోడు డ్రోన్లు వాడటం పరిస్థితిని అదుపుతప్పలా చేస్తోంది. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని కౌట్రుక్ గ్రామంలో ఆదివారం తొలిసారిగా కనిపించింది. ఈ దాడిలో ఇద్దరు మృతి చెందగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మరుసటి రోజు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంజమ్ చిరాంగ్‌లో మళ్లీ డ్రోన్లను ప్రయోగించారు. డ్రోన్ నుంచి వేసిన బాంబులు స్థానిక నివాసి కుటుంబానికి చెందిన ముగ్గురిని గాయపరిచాయి. దీంతో గ్రామస్తులు తమ ఇళ్లను వదిలి సమీపంలోని కమ్యూనిటీ హాల్లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది.

**ఇంట్లో ఉండాలన్నా భయం..**

ఈ దాడులతో పగటి పూట కూడా ఇంట్లో ఉండలేక భయపడుతున్నారు. దాదాపు 10 కుటుంబాలు సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆశ్రయం పొందాయి. హింస చెలరేగడంతో ప్రజల కదలికలపై నిఘా, ట్రాకింగ్ కోసం కుకీలు, మైతేయ్‌లు ఎవరికి వారు డ్రోన్లను రంగంలోకి దింపారు. రాత్రివేళల్లో ఉపయోగించే హైటెక్ డ్రోన్లను విదేశాల నుంచి తెప్పించినట్లు గ్రామ వలంటీర్ నవోబా సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. తమ గ్రామాలను అన్యమత దాడి నుంచి రక్షించుకోవడానికి మైతేయ్‌లు, కుకీలు ఇద్దరూ సాయుధ స్వచ్ఛంద బృందాలను ఏర్పాటు చేశారు. ఈ డ్రోన్లను దేశం వెలుపల నుంచి కొనుగోలు చేశారా లేదా అనేది నిపుణులు నిర్ధారించగలరని అధికారులు చెబుతున్నా., డ్రోన్లను ఉపయోగించి పౌరులు, భద్రతా దళాలపై బాంబులు వేయడాన్ని ఉగ్రవాద చర్యగా ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ అభివర్ణించారు. డ్రోన్లు లేదా వాటి విడిభాగాల దిగుమతిపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

**కొడుకుతో కలిసి పరిగెత్తినా..**

''ఆదివారం కౌట్రుక్ వద్ద డ్రోన్లతో బాంబులు వేశారని విన్నాం. మరుసటి రోజే మా గ్రామం సెంజమ్ చిరాంగ్ డ్రోన్ దాడికి లక్ష్యంగా మారింది''అని రైతు గంభీర్ తెలిపారు. ''గతంలో అనేక కాల్పులను చూశాం. కాబట్టి డ్రోన్లు నివాస ప్రాంతాలను తనిఖీ చేస్తున్నాయేమోనని భావించాం. క్షణాల్లో భారీ పేలుడు శబ్దం వినిపించింది. నేను నా కొడుకుతో కలిసి ఆవరణలోకి పరిగెత్తా. రెండో బాంబు నా కూతురు ఉన్న గదిపై పడింది. ఆమెకు గాయాలయ్యాయి. దీంతో ముగ్గురం ప్రాణభయంతో దగ్గర్లోని చెట్టు వద్దకు పరిగెత్తాం. కానీ డ్రోన్ మమ్మల్ని వెంబడించి మరీ పేలుడు పదార్థాన్ని జారవిడిచింది. పేలుడు ధాటికి ఎగిరి దూరంగా పడ్డాం. గాయాలయ్యాయి''అని డ్రోన్‌దాడి ఘటనను వివరించారు. గాయపడిన ముగ్గురు ఇంఫాల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## మైక్ 'మ్యూట్'కు కమల సమ్మతి

**డిబేట్‌కు షరతులతో అంగీకారం**

**వాషింగ్టన్:** డొనాల్డ్ ట్రంప్‌తో ఈనెల పదో తేదీన ఏబీసీ ఛానల్‌లో అధ్యక్ష చర్చకు సంబంధించి నిబంధనలకు డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్ అంగీకారం తెలిపారు. ప్రధానంగా మైక్‌ను మ్యూట్‌లో పెట్టడానికి సమ్మతించారు. అధ్యక్ష డిబేట్‌లో ఎవరికి కేటాయించిన సమయంలో వారే మాట్లాడేందుకు వీలుగా ప్రత్యర్థి మైక్‌ను ఆఫ్ చేసి ఉంచుతారు. జో బైడెన్ పుట్టిముంచిన సీఎన్ఎన్ డిబేట్‌లో ఇదే నియమాన్ని పాటించారు. అయితే ట్రంప్ వాచలత్వాన్ని దృష్టిలో పెట్టుకొని.. ఎవరు మాట్లాడినా ఇద్దరి మైక్‌లు ఆన్ చేసి ఉండాలని హారిస్ ప్రచారబృందం పట్టుబట్టింది. అప్పుడే ట్రంప్ అవాకులు చవాకులు, రన్నింగ్ కామెంట్రీ ప్రేక్షకులకు చేరుతాయనే ఉద్దేశంతో మ్యూట్ నిబంధనను వ్యతిరేకించింది. పరస్పర సంవాదంలో ఎవరి భాష, పదప్రయోగం ఎలా ఉన్నాయనేది అమెరికన్లు గ్రహిస్తారనేది డెమొక్రాట్ల ఉద్దేశం. అయితే చివరకు మైక్ మ్యూట్‌లో ఉంచడానికి సమ్మతిస్తూ హారిస్ బృందం బుధవారం ఏబీసీ న్యూస్‌కు లేఖ రాసింది. ఇది తమకు అననుకూల పరిణామేనని పేర్కొంది.



తిమింగలం కళేబరంపై గాయాలు చూపిస్తున్న రెజీనా. ఇన్‌సెట్లో హవాల్దిమిర్

# హవాల్దిమిర్ తిమింగలంపై బుల్లెట్ గాయాలు

**వెలుగులోకి కొత్త విషయాలు**

**సెయింట్‌పీటర్స్‌బర్గ్:** ఆగస్ట్ 31వ తేదీన దక్షిణ నార్వేలోని రిజావికా బే వద్ద విగతజీవిగా కనిపించిన తెల్లని బెలుగా తిమింగలం మరణం వెనుక కొత్త విషయాలు బయటకొస్తున్నాయి. తిమింగలం శరీరంపై బుల్లెట్ల గాయాలున్నట్లు జీవ హక్కుల సంస్థలు ఆరోపించాయి. రష్యా గూఢచారిగా 2019 నుంచి ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తిమింగలానిది సహజ మరణం కాదని ఆరోపించాయి. 14 అడుగుల పొడవు, 1,225 కిలోల బరువున్న హవాల్దిమిర్ ఒంటిపై కెమెరాను అమర్చేందుకు వీలుగా బెల్టు లాంటి ఒక పరికరం అమర్చి ఉండటం, దానిపై 'ఎక్విప్‌మెంట్ సెయింట్ పీటర్స్'అని రాసి ఉండటం తెల్సిందే. దీంతో నార్వే ప్రజలకు అనుమానం మొదలైంది. రష్యాయే నిఘా కోసం ఈ తిమింగలాన్ని పంపి ఉంటుందని భావించారు. అందుకే నార్వేజియన్ పదం 'హ్వాల్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మొదటి పేరును తీసుకుని ఈ తిమింగలానికి హవాల్దిమిర్ అని పేరుపెట్టడం తెల్సిందే. 2019 ఏప్రిల్‌లో రష్యా నార్తర్న్ ఫ్లీట్ ఉన్న ముర్మాన్స్క్‌కు 415 కిలోమీటర్ల దూరంలోని ఇంగోయా ద్వీపం సమీపంలో హవాల్దిమిర్ మొదటిసారి నార్వేజియన్ పడవలకు కనిపించింది. ఆర్కిటిక్‌కు దక్షిణాన అరుదుగా నివసించే బెలుగా తిమింగలం కనిపించడం వారి దృష్టిని ఆకర్షించింది. తిమింగలానికి గోప్రో కెమెరా అమర్చి ఉండటంతో గూఢచర్యంలో భాగంగా దీనిని వాడుతున్నట్లు భావించారు. డాల్ఫిన్లు వంటి సముద్ర క్షీరదాలకు సైనిక ప్రయోజనాల కోసం శిక్షణ ఇచ్చిన చరిత్ర రష్యాకు ఉంది. ముర్మాన్స్క్ వాయువ్య ప్రాంతంలోని నావికా స్థావరాల సమీపంలో తిమింగలం బోనులను బారెంట్స్ అబ్జర్వర్ వెబ్‌సైట్ గుర్తించింది.

**3 వారాల్లో నివేదిక**

తిమింగలం కాల్చివేతపై వన్ వేల్ వ్యవస్థాపకురాలు రెజీనా హాగ్ నార్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మృతదేహాన్ని గుర్తించిన మెరైన్ మైండ్ అనే సంస్థ మాత్రం మరణానికి గల కారణాలను వెంటనే వెల్లడించలేమంది. తాము గుర్తులను చూశామనీ, కానీ మరణానికి కారణం ఏమిటో ఇప్పుడే చెప్పలేమని ఆ సంస్థ డైరెక్టర్ సెబాస్టియన్ స్ట్రాండ్ చెప్పారు. దర్యాప్తు ప్రారంభించడానికి సహేతుకమైన ఉద్దేశాలు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి ఈ విషయాన్ని పరిశీలిస్తామని పోలీసులు చెప్పారు. తిమింగలం కళేబరాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం సోమవారం నార్వే వెటర్నరీ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. మూడు వారాల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు.

## గతంలోనే హంతక టీనేజర్‌ను విచారించి వదిలేసిన పోలీసులు

**విండర్:** అమెరికాలోని జార్జియా రాష్ట్రం విండర్ పట్టణంలో పాఠశాలలో తుపాకీ మోత మోగించి నలుగురిని పొట్టనబెట్టుకున్న టీనేజర్‌ను గతంలోనే పోలీసులు విచారించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. టీనేజీ బాలుడు కోల్ట్ గ్రే గత ఏడాది మే నెలలో స్కూల్‌లో కాల్పులు జరగడం ఖాయమని ఆన్‌లైన్‌లో బెదిరింపు పోస్టులు పెట్టడం మొదలెట్టాడు. అయితే ఆనాడు బెదిరింపులకు పాల్పడింది ఈ పిల్లాడే అనే బలమైన సాక్ష్యాలేవీ లేకపోవడంతో కేవలం విచారించి మిన్నకుండిపోయారు. ఇన్ని నెలల తర్వాత అదే పిల్లాడు దారుణానికి ఒడిగట్టడంతో పోలీసులు విస్మయం వ్యక్తంచేశారు. గత ఏడాది మే నెలలో స్కూల్‌పై దాడి తప్పదంటూ ప్రస్తావిస్తూ తుపాకుల ఫొటోలను కోల్ట్ ఆన్‌లైన్‌లో పోస్ట్‌చేయగా అమెరికా నేషనల్ థ్రెట్ ఆపరేషన్స్ సెంటర్ గుర్తించి ఎఫ్‌బీఐను అప్రమత్తంచేసింది. పిల్లాడి తండ్రిని విచారించగా 'ఇంట్లో వేట తుపాకులు నా కుమారుడికి అందవు'అని చెప్పారు. తర్వాత పిల్లాడిని విచారించగా నాకేం తెలీదు అని సమాధానమిచ్చాడు. దీంతో పోలీసులు పిల్లాడికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలులేక అరెస్టుచేయలేక వెనుతిరిగారు.

## నేడు ఖాళీగా స్టార్‌లైనర్ తిరుగుప్రయాణం



**కేప్‌కనావెరాల్:** సాంకేతిక సమస్యలతో సతమతమైన బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్ శుక్రవారం భూమికి తిరుగుప్రయాణం కానుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి శుక్రవారం సాయంత్రం స్టార్‌లైనర్ విడివడుతుంది. వ్యోమగాములు ఎవరూ లేకుండానే ఆటోపైలెట్ మోడ్‌లో భూమికి తిరుగు ప్రయాణం ప్రారంభిస్తుంది. అంత సవ్యంగా సాగితే ఆరు గంటల తర్వాత న్యూమెక్సికోలోని వైట్‌సాండ్స్ మిస్సైల్ రేంజ్‌లో దిగుతుంది. బోయింగ్ నిర్మిత స్టార్‌లైనర్ నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు తీసుకొని జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి బయలుదేరింది. బోయింగ్‌కు ఇది తొలి అంతరిక్ష ప్రయోగం. స్టార్‌లైనర్‌లో థ్రస్టర్లు మొరాయించడం, హీలియం లీక్ సమస్యలు తలెత్తడంతో సునీత, విల్మోర్‌లు అతికష్టం మీద అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమయ్యారు. ఎనిమిది రోజుల తర్వాత భూమికి తిరిగి రావాల్సిన వీరిద్దరూ ఐఎస్ఎస్‌లోనే చిక్కుబడిపోయారు. పలు పరీక్షల అనంతరం స్టార్‌లైనర్ మానవసహిత తిరుగు ప్రయాణానికి సురక్షితం కాదని నాసా తేల్చింది. ఈనెల ద్వితీయార్ధంలో స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సూల్‌ను ఐఎస్ఎస్‌కు వెళ్లనుంది. ఇందులో సాధారణంగా నలుగురు వ్యోమగాములు అంతరిక్ష కేంద్రానికి వెళుతుంటారు. కానీ తిరుగు ప్రమాణంలో సునీత, విల్మోర్‌లను తీసుకురావడానికి వీలుగా డ్రాగన్‌లో ఇద్దరినే పంపనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరిద్దని, సునీత, విల్మోర్‌లను తీసుకొని డ్రాగన్ భూమికి తిరిగి వస్తుంది. 8 రోజుల కోసం వెళ్లి ఎనిమిది నెలల పైచిలుకు సుదీర్ఘకాలం అంతరిక్షంలో ఉండాల్సి రావడం సునీత ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందనే ఆందోళన నెలకొంది. ఐఎస్ఎస్‌లో డ్రాగన్ పార్కింగ్‌కు వీలుగా శుక్రవారం స్టార్‌లైనర్‌ను అంతరిక్ష కేంద్రం నుంచి వేరుచేస్తున్నారు.

## ప్రతీకారంతో దాడి చేస్తున్నాయేమో!

**యూపీలో తోడేళ్ల దాడిపై అటవీ అధికారుల స్పందన**

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటిదాకా ఏడుగురు చిన్నారులు సహా మొత్తం ఎనిమిది మంది తోడేళ్లు పొట్టనపెట్టుకున్నాయి. క్రూర మృగాలను అధికారులు నియంత్రించడం లేదని జనం మండిపడుతున్నారు. హఠాత్తుగా తోడేళ్ల దాడులు పెరగడానికి కారణం ఏమిటన్న దానిపై ఉత్తరప్రదేశ్ అటవీ శాఖ అధికారులు దృష్టి పెట్టారు. తోడేళ్లకు ప్రతీకారం తీర్చుకొనే అలవాటు ఉంటుందని యూపీ ఫారెస్టు కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సంజయ్ పాఠక్ చెప్పారు. వాటి నివాసాలకు గానీ, వాటి పిల్లలకు గానీ హాని కలిగిస్తే అవి మానవులపై ప్రతీకారం తీర్చుకుంటాయని తెలిపారు. తోడేళ్లు సాధారణంగా చిన్నారులపైనే దాడి చేస్తుంటాయని పేర్కొన్నారు. రాంపూర్ గ్రామంలోని ఓ చెరకు తోట లోపల తోడేళ్ల నివాసాన్ని, పిల్లలను గుర్తించామని స్థానికులు చెప్పారు. ఇటీవల ఘగారా నది ఉప్పొంగి ప్రవహించడంతో చెరకు తోట ధ్వంసమైందని, తోడేళ్ల పిల్లలు సైతం నీటిలో కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాయని అన్నారు. దీంతో తోడేళ్లు ప్రతీకారంతో మనుషులపై దాడులకు దిగుతున్నట్లు అనుమానిస్తున్నారు. బహ్రాయిచ్ జిల్లాలో ఆరు తోడేళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ఇప్పటికే నాలుగు తోడేళ్లను బంధించారు. మిగిలిన వాటి కోసం గాలింపు చేపడుతున్నారు.

## మసీదు నిర్మాణంపై హిందూ సంఘాల ర్యాలీ

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలోని సంజౌలి ప్రాంతంలో చేపట్టిన మసీదు నిర్మాణ అక్రమమంటూ హిందూ సంఘాలు గురువారం భారీ ర్యాలీ చేపట్టాయి. విధాన సభకు సమీపంలోని చౌరా మైదాన్‌లో చేపట్టిన ర్యాలీలో వందలాదిగా నిరసనకారులు పాల్గొన్నారు. శ్రీరాముని చిత్రంలో కూడిన కాషాయ పతాకాలు, బ్యానర్లను ప్రదర్శించారు. 15 రోజుల్లోగా మసీదు అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిందూ జాగరణ్ మంచ్, దేవ భూమి క్షత్రియ సంఘటన్ పిలుపు మేరకు నిరసన చేపట్టారు. రాష్ట్రేతరులు రాష్ట్రంలోకి ప్రవేశించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వీటిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హిందూ జాగరణ్ మంచ్ హిమాచల్ విభాగం అధ్యక్షుడు కమల్ గౌతమ్ డిమాండ్ చేశారు. మంత్రులు విక్రమాదిత్య సింగ్, అనిరుధ్ సింగ్ గురువారం సాయంత్రం సంజౌలి ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను స్వయంగా ఆరా తీశారు.'సంజౌలి అంశం మతానికి సంబంధించినది కాదు, న్యాయం, అన్యాయాలకు సంబంధించింది, అక్రమ నిర్మాణంపై తప్పక చర్యలు తీసుకోవాలి'అని ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ కోరారు.

## రెచ్చగొడితే బుద్ధి చెప్పాలి: రాజ్‌నాథ్

**లక్నో:** ఉక్రెయిన్, గాజాల్లో కొనసాగుతున్న సంక్షోభాలతోపాటు పొరుగుదేశం బంగ్లాదేశ్‌లోని మారుతున్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు విశ్లేషణ జరుపుతూ ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. అలాంటి అనూహ్య సమస్యలు భవిష్యత్తులో మనకూ ఎదురైతే సరైన రీతిలో స్పందించేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. మంత్రి రాజ్‌నాథ్ గురువారం లక్నోలో జరుగుతున్న మొట్టమొటి ఆర్మీ కమాండర్ల సదస్సులో మాట్లాడారు. 'ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్స్'ను రూపొందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్: ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఆర్మ్‌డ్ ఫోర్సెస్'ఇతివృత్తంతో బుధవారం ఈ కార్యక్రమం మొదలైంది. 'భారత్ శాంతికాముక దేశం. అయితే శాంతిని పరిరక్షించేందుకు యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిన అవసరం సాయుధ బలగాలకు ఉంది. రెచ్చగొట్టే చర్యలకు తక్షణమే తగు రీతిలో బుద్ధిచెప్పాలి'అని నొక్కిచెప్పారు. చైనాతో తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తపరిస్థితుల నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

# బలవంతంగా దహనం చేశారు

**ధ్రువీకరించకుండానే ఆత్మహత్య అని ఎందుకు చెప్పారు?**
- పోలీసుల తీరు ఘోరం
- కోల్‌కతా బాధిత వైద్యురాలి తల్లిదండ్రుల ఆవేదన

**కోల్‌కతా:** కూతురు మృతదేహాన్ని భద్రపరచాలని భావించినప్పటికీ పోలీసుల బలవంతం కారణంగానే దహనం చేయాల్సి వచ్చిందని కోల్‌కతాలో హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. వైద్యురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌జీ కర్ వైద్యకళాశాల బయట ఆందోళన చేస్తున్న వైద్యులకు బుధవారం బాధిత వైద్యురాలి తల్లిదండ్రులు, బంధువులు మద్దతు తెలిపారు. 'న్యాయం జరిగేదాకా నిద్రించేది లేదు''అని బాధితురాలి తల్లి అన్నారు. ఈ సందర్భంగా బాధితురాలి తండ్రి మాట్లాడారు.

**డబ్బులు ఇవ్వజూపారు**

కుమార్తె మృతదేహం తమ ముందు ఉండగానే నార్త్ డెప్యూటీ కమిషనర్ తమకు డబ్బు ఆఫర్ చేశారన్నారు. ''మేము మృతదేహాన్ని భద్రపరచాలని అనుకున్నాం. కానీ ఇంటికి వెళ్లి చూడగా బయట 300 మంది పోలీసులు నిల్చుని ఉన్నారు. ఆమెను దహనం చేయాల్సిందేనని మమ్మల్ని తీవ్రంగా ఒత్తిడిచేశారు. దహన సంస్కారాలకు హడావుడి చేసి, దహనసంస్కారాల ఖర్చు కూడా మా వద్ద ఎవరూ వసూలుచేయలేదు. కనీసం దహనసంస్కారాలకు కూడా మా నాన్న దగ్గర డబ్బులు లేవని నా కూతురికి కూడా తెలుసనుకుంటా. అందుకే ఇలా వెళ్లిపోయింది''అని తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. ''కొందరు పోలీసు అధికారులు ఖాళీ కాగితంపై సంతకాన్ని పెట్టాలని నన్ను బలవంతపెట్టారు. కోపంతో నేను ఆ పేపర్‌ను చింపేసి విసిరేశా. అసలు మృతదేహాన్ని పరీక్షించకముందే నా కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆసుపత్రి అధికారులు ఎందుకు చెప్పారు?. మా అమ్మాయి ముఖం చూసేందుకు మూడున్నర గంటలు వేచి చూడాల్సి వచ్చింది. చూడనివ్వాలని తల్లి కాళ్ల మీద పడినా ఎవరూ పట్టించుకోలేదు. పోస్ట్‌మార్టమ్ ఎందుకంత ఆలస్యం చేశారు? పోలీసులు అసహజ మరణం కేసు ఎందుకు నమోదు చేశారు? తాలా పోలీస్ స్టేషన్‌లో రాత్రి 7 గంటలకే ఫిర్యాదుచేస్తే 11.45 గంటల దాకా ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు?'అని తండ్రి ప్రశ్నించారు.

**అన్నీ అనుమానాలే..**

తల్లిదండ్రులు ఆస్పత్రి వచ్చిన 10 నిమిషాలకే వారిని ఘటనాస్థలికి తీసుకెళ్లామని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కోల్‌కతా పోలీసులు పేర్కొన్నారు. అయితే మూడు గంటలకుపైగా వేచి చూశామని, తమ కుమార్తెను కడసారి చూసేందుకు అనుమతించాలని పోలీసులను వేడుకున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. పోలీసులు అసహజ మరణం కేసు నమోదు చేశారని, అయినా ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించడం తెల్సిందే.

## సేవా లోపాలకు భూ యజమానులు కూడా బాధ్యులే

**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు**



**న్యూఢిల్లీ:** ఫ్లాట్ల నిర్మాణంలో లోపాలు, సేవా లోపాలు ఉంటే బిల్డర్లతోపాటు భూ యజమానులు సైతం బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బిల్డర్‌కు, భూ యజమానికి మధ్య పవర్ ఆఫ్ అటార్నీ రద్దయినప్పటికీ జాయింట్ వెంచర్ అగ్రిమెంట్(జేవీఏ) అమల్లోనే ఉంటుందని స్పష్టం చేసింది. ఓ కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. మహారాష్ట్రలో కొందరు బిల్డర్లు భూ యజమానులతో ఒప్పందంతో చేసుకొని భూమిని స్వాధీనం చేసుకొని ఫ్లాట్ల నిర్మాణం చేపట్టారు. గడువులోగా ఫ్లాట్లు అప్పగిస్తామంటూ వినియోగదారులకు సొమ్ము వసూలు చేశారు. అయితే, నిర్దేశిత గడువులోగా అప్పగించకపోవడంతో వినియోగదారులు మహారాష్ట్ర వినయోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. సేవా లోపానికి బిల్డర్లతోపాటు భూ యజమానులు సైతం బాధ్యత వహించాలని, తమకు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీంతో ప్రతి వినియోగదారుడికి రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని కమిషన్ భూ యజమానులను, బిల్డర్లను ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ యజమానులు జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. బిల్డర్ల తప్పిదాలకు తమను బాధ్యులను చేయడం తగదని వాదించారు. అయితే, జాతీయ కమిషన్ సైతం మహారాష్ట్ర కమిషన్ ఆదేశాలు సమర్థించింది. దీంతో భూ యజమానులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. సేవా లోపాలకు బిల్డర్లతోపాటు భూ యజమానులు కూడా బాధ్యులేనని తేల్చిచెప్పింది. పవర్ ఆఫ్ అటార్నీ రద్దు కాకముందే వినియోగదారుల నుంచి బిల్డర్లు డబ్బులు వసూలు చేశారు కాబట్టి భూ యజమానులు కూడా బాధ్యులవుతారని స్పష్టంచేసింది.

## కశ్మీరీలు కేంద్రానికి బానిసలు కారు: ఫరూక్

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ ప్రజలు కేంద్ర పభుత్వానికి బానిసలు కాదని, తమ భూమికి నిజమైన యజమానులని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందని ఆశిస్తున్నారా అని అడగ్గా.. 'నేను మీకొక మాట చెబుతాను వినండి.. మేము వారి బానిసలం కాదు. ఈ రాష్ట్ర ప్రజలు ఇక్కడి నేలకు యజమానులు. అది గుర్తుపెట్టుకోండి' అని ఫరూక్ స్పందించారు. బుద్గాం జిల్లాలో బీర్‌వాహ నియోజకవర్గంలో గురువారం పార్టీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కశ్మీర్‌లో బీజేపీ మద్దతుదారులు సాధ్యమైనంత త్వరగా వాస్తవాన్ని గ్రహించాలన్నారు. 'వారి పెంపుడు కుక్కలకు బుద్ధి తెచ్చుకోవాల్సిందిగా చెబుతున్నాను. తుపాను రానుంది.. వారు దాన్ని ఎదుర్కొనాల్సి ఉంటుంది' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. కొందరు నాయకులు ఎన్సీని వీడటంపై స్పందిస్తూ ఎన్నికల వేళ అది సాధారణమేనన్నారు.

## నీట్-యూజీ అభ్యర్థి బలవన్మరణం

**కోటాలో ఈ ఏడాదిలో ఇది 14వ ఆత్మహత్య**

**కోటా:** రాజస్తాన్‌లోని కోటాలో నీట్-యూజీ అభ్యర్థి ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. పోటీ పరీక్షల శిక్షణకు దేశంలోనే పేరున్న కోటాలో ఈ ఏడాదిలో జరిగిన 14వ ఆత్మహత్య ఇది. గతేడాది ఈ నగరంలో 26 మంది విద్యార్థులు బలవన్మరణం చెందారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మథుర జిల్లా బర్సానాకు చెందిన పరశురాం జాతవ్(21) బుధవారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో తండ్రి కచర్‌మల్‌తో మాట్లాడాడు. తనకు వెంటనే ఇంటికి తిరిగి వచ్చేయాలనుందని చెప్పడంతో కచర్‌మల్ సరేనన్నారు. ఆ తర్వాత ఆయన ఫోన్‌కాల్స్‌కు పరశురాం స్పందించలేదు. అయితే, పరశురాం సాయంత్రం నుంచి నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆ ఇంటి ఓనర్ రాత్రి 11 గంటల సమయంలో గది తలుపు తట్టారు. లోపలి నుంచి స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి లోపల చూడగా సీలింగ్ ఫ్యానుకు పరశురాం విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. ఈ ఏడాది నీట్ రెండోసారి రాసిన పరశురాం మొదటి విడత ఫలితాల్లో 647 మార్కులు సాధించాడని, రివైజ్డు ఫలితాల్లో మాత్రం 247(66%) మార్కులు మాత్రమే వచ్చినట్లు వెల్లడి కావడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడని కచర్‌మల్ తెలిపారు.

## సిక్కింలో రోడ్డు ప్రమాదం.. నలుగురు జవాన్లు మృత్యువాత

**గ్యాంగ్‌టక్:** సిక్కింలోని పక్యోంగ్ జిల్లాలో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బిన్నగురిలోని ఆర్మీ ఎన్‌రూట్ మిషన్ కమాండ్(ఈఎంసీ)విభాగానికి చెందిన నలుగురు జవాన్లతో కూడిన వాహనం రెనోక్-రోంగ్లి హైవేపై వెర్టికల్ ఖిర్ వద్ద అదుపు తప్పి దట్టమైన అటవీ ప్రాంతంలోకి దూసుకుపోయింది. ఘటనలో వాహనంలోని నలుగురు జవాన్లు తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతులను మధ్య ప్రదేశ్ వాసి సిపాయి ప్రదీప్ పటేల్, ఇంఫాల్‌కు చెందిన డబ్ల్యూ పీటర్, హరియాణా వాసి నాయక్ గురుసేవ్ సింగ్, తమిళనాడు వాసి సుబేదార్ కె.తంగపాండిగా గుర్తించారు.


కనకదుర్గనగర్‌లో రోడ్డుకి ఇరువైపులా పడిపోయిన చెట్లు


ఆంధ్రప్రభ కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త


వైపులు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం

# ఎక్కడ చూసినా వ్యర్థాలే..!

- శివారు ప్రాంతాలపై సర్కారు నిర్లక్ష్యం
- బుడమేరులో కొట్టుకు వచ్చిన చెట్లు, కొమ్మలతో నిండిపోయిన ఇళ్లు, రోడ్లు
- మిగిలిన ఆహారాన్ని పారేయటంతో వెదజల్లుతున్న దుర్వాసన
- ప్రధాన రహదారుల్లోనే ఫైర్ ఇంజిన్ల సేవలు

**పటమట(విజయవాడతూర్పు):** ఏ ఇల్లు చూసినా బురదే... ఏ రోడ్డుకు వెళ్లినా కుళ్లిన వ్యర్థాలే.. ఏ సందులో చూసినా కొట్టుకొచ్చిన చెట్ల కొమ్మలే... విసిరిపడేసిన ఆహార పొట్లాలే... వీటితోపాటు రోడ్లపైకి చేరిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మురుగు నీరు.. ఇదీ విజయవాడ అజిత్‌సింగ్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితి. వరద తగ్గుముఖం పట్టినా ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రధాన ప్రాంతాలకే ప్రభుత్వ యంత్రాంగం పరిమితం కావడంతో శివారు ప్రాంతాలన్నీ దుర్వాసనతో అధ్వానంగా మారాయి. వీధులు, ఇళ్లు శుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అగ్నిమాపక వాహనాలు కేవలం ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ప్రాంతాలకు మాత్రమే వస్తున్నాయి. ఆంధ్రప్రభ కాలనీ, కనకదుర్గానగర్, ఎల్‌బీఎస్ నగర్, సుందరయ్యనగర్ ప్రాంతాలను పట్టించుకోవడం లేదు. దీంతో ముంపు బాధితులే వరద నీటితోనే తమ ఇళ్లు, దుకాణాలను శుభ్రం చేసుకుంటున్నారు. మరోవైపు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులను చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 36 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించినా వారంతా కూడా మెయిన్ రోడ్లలో పరిస్థితులను మాత్రమే పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో వరద ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్‌పై కనకదుర్గానగర్ వాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ గోడు వినకుండా ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రచారం చేయటానికి వచ్చారా.. అని ఆయన్ను నిలదీయగా.. నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నారు.

### ఫైర్ ఇంజిన్లు వస్తాయని ఎదురుచూశాం



నాలుగు రోజుల తర్వాత గురువారం మా ఇంట్లో ఇప్పుడే వరద నీరు తగ్గుముఖం పట్టింది. బయట తలదాచుకున్న మేమంతా ఇప్పుడు వచ్చి మా ఇంటి పరిస్థితిని చూస్తే ఏడుపు వస్తోంది. సామాన్లు అన్నీ మునిగిపోయాయి. కొన్ని కొట్టుకుపోయాయి. ఇల్లంతా బురద. అడుగుతీసి అడుగు పెట్టలేని పరిస్థితి. తీవ్ర దుర్వాసన వస్తోంది. ప్రభుత్వమేమో ఫైర్ ఇంజిన్లను పంపిస్తున్నామని చెప్పింది. కానీ, మా ప్రాంతానికి రాలేదు. మేమే రోడ్లపై ఉన్న మురుగునీటితో ఇంటిని శుభ్రం చేసుకుంటున్నాం.

– ప్రశాంతి, ఆంధ్రప్రభ కాలనీ

### ఇదేం ప్రభుత్వం బాబోయ్?



ముంపు ముప్పు నుంచి తప్పించుకునేందుకు ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్న మేం ఇంటికి వచ్చే సరికి మా కష్టార్జితం అంతా వరదపాలైంది. 4 రోజుల నుంచి ఇంటికి వచ్చే స్థితిలేదు. ఇప్పుడొస్తే ఇల్లంతా ఒకటే బురద, వాసన. ఇళ్లు కడుక్కుందామంటే నీరు లేదు. ఫైరింజన్‌లు వస్తాయని చెప్పారు. కానీ గురువారం మధ్యాహ్నం వరకు రాలేదు. ఇక మురుగు నీటితోనే ఇంటిని శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది.–నాగలక్ష్మి, కనకదుర్గనగర్

### ఇల్లంతా ఒకటే వాసన



ఆకస్మికంగా వరద వచ్చింది. ఇంటి నుంచి వెళ్లే అవకాశం కూడా లేదు. మధురానగర్‌లో మా బంధువుల ఇంటికి వెళ్దామన్నా అవకాశం లేదు. ఇంటిలో నానమ్మ అనసూయ, నేనే ఉన్నాం. మొదటి రెండు రోజులు ఆకలికి అలమటించాం. కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న నానమ్మను తీసుకుని బయటకు కూడా వెళ్లలేని స్థితి. ఆహార పొట్లాల కోసం ఆమెను వదిలేసి పీకల్లోతు నీళ్లలో వెళ్లాల్సిన దుస్థితి. కిందసామానులన్నీ వరదకు కొట్టుకుపోయాయి. ఇంటిని కడుగుతామంటే నీరు కూడా లేదు. ఇల్లంతా ఒకటే వాసన వస్తోంది. అధికారులు మాకు సహాయం చేయాలి.

– కుంగిటల అనసూయ, ఆంధ్రప్రభ కాలనీ

### ప్రభుత్వం కనికరం చూపాలి



వికలాంగుడినైన నేను వర్షం కారణంగా ఎక్కడికీ వెళ్లలేని స్థితి. పక్కింటివారి సహాయంతో ఇంటి నుంచి వెళ్లి ఎదురింటిలో తలదాచుకున్నా. ఇంట్లోని నిత్యావసరాలతోపాటు సామాన్లన్నీ పాడయ్యాయి. వంటకు గ్యాస్ సిలిండర్ కూడా కొట్టుకుపోయింది. మాకు గ్యాస్ ఇప్పించాలి. ప్రభుత్వం మాలాంటి వారిపై కనికరం చూపి బియ్యం, సరుకులు ఇవ్వాలి. మా ప్రాంతమంతా కంపు కొడుతుంది. అధికారులు ఒక్కసారి పరిశీలించి ఇక్కడ చెత్తనంతా తీసేయాలి. వాసనకు ఉండలేకపోతున్నాం, తిండి తినలేకపోతున్నాం.

– జి.మంగ, చిన్నా

### జీవితం వరద పాలు



నా జీవితం వరద పాలైంది. ఎన్నో కష్టాలు పడి ఓ చిన్న పచారీ దుకాణం పెట్టుకున్నా. వరదతో కొన్ని సర్దుకుని మంచాలపై పెట్టుకున్నా. అవికూడా తడిచిపోయాయి. దుకాణంలో బియ్యం, రూ.3 లక్షల విలువ చేసే సరుకులు ఉన్నాయి. కొట్టును శుభ్రం చేసుకుందామంటే నీరు కూడా లేదు. మోటార్ల ద్వారా శుభ్రం చేసుకుందామంటే కరెంట్ లేదు. ప్రభుత్వమేమో ఫైర్ ఇంజిన్ల ద్వారా కడిగిస్తామని చెప్పింది. మా ఏరియాకు ఇంత వరకు ఏ అధికారీ రాలేదు. మమ్మల్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

– నాగేశ్వరరావు, కనక దుర్గనగర్

### మా వద్ద ఎలాంటి రుజువులూ లేవు



కావలి నుంచి ఇక్కడికి బతకటానికి వచ్చాం. పూసలు, దారాలు అమ్ముకుంటాం. రోడ్డు పక్కన, ఎవరైనా ఆశ్రయం ఇస్తే ఈ రాత్రికి అక్కడుంటాం. కానీ వరదల కారణంగా మా వ్యాపార సరుకంతా పోయింది. కట్టుబట్టలతోనే ఉన్నాం. ప్రభుత్వమేమో మాలాంటి వారిని పట్టించుకోవటం లేదు. నిత్యావసరాలు ఇచ్చేందుకు గుర్తింపు కార్డులు కావాలని అంటున్నారు. మా వద్ద ఎలాంటి రుజువులు లేవు. సొంతూరికి వెళ్దామన్నా డబ్బులు లేవు. ఎవరినైనా అడుగుదామన్నా ఇక్కడ మాకు ఎవరూ తెలీదు. ఇక యాచకం చేసుకునే మా ప్రాంతానికి వెళ్లాలి.

– పత్తాపు గురవయ్య, వెంకటేష్

# గుర్తులే మిగిలాయి..

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంతరించిపోతున్న పలు పక్షులు, జంతువులు
- క్రూరత్వం అంటే గుర్తొచ్చే తోడేలు కనబడటంలేదు
- సొగసుకు మారుపేరు బట్టమేక పక్షి ఇకలేదు
- అడవికోడి అనే బెంగాల్ ఫ్లోరికన్.. ఉనికే లేదు
- అంతరిస్తున్న పక్షి, జంతుజాతుల్లో 9 రకాలు
- అమాంతంగా పెరిగిన చిరుతలు, జింకల సంఖ్య



అంతరించి పోతున్న లేదా ముప్పు ఉన్న జాతులు జిల్లాల వారీగా ఇలా

| జిల్లా | జాతుల సంఖ్య |
|---|---|
| వైఎస్సార్ కడప | 22 |
| తిరుపతి | 22 |
| నంద్యాల | 20 |
| చిత్తూరు | 19 |
| కర్నూలు | 01 |
| అనంతపురం | 09 |
| శ్రీ సత్యసాయి | 09 |





**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చిట్టడవులు ఎన్నోరకాల జీవరాశులకు శాశ్వత ఆవాసాలు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆ చిట్టడవులు అంతరించిపోతుండగా, జంతువుల ఉనికికే ముప్పు వాటిల్లుతోంది. ఇక్కడ అంతరించిపోతున్న జంతువుల్లో తోడేలు ముందు వరుసలో ఉంది. మూడేళ్లుగా తోడేళ్ల జాతికోసం అటవీ అధికారులు గాలిస్తున్నా ఎక్కడా వాటి జాడ లేదు. ఇక్కడ పలు పక్షి జాతులు కూడా అంతరించిపోయే జాబితాలో చేరాయి.

**హడలెత్తించే తోడేళ్లు.. అందమైన బట్టమేకలు**

క్రూరత్వం పేరెత్తితే గుర్తొచ్చే జంతువు తోడేలు. గొర్రెలు, మేకల సంపదకు ఆలవాలమైన అనంతపురం జిల్లాలో తోడేళ్ల ధాటికి ఒకప్పుడు గొర్రెల కాపరులు హడలెత్తేవారు. గొర్రెల మందపై పడి వాటిని చంపి తీవ్ర నష్టం కలిగించేవి. ఇప్పుడు దాని ఉనికి కనిపించడం లేదు. నెత్తిన కొప్పుతో, ఆకర్షించే రంగులతో ఉండే బట్టమేక పక్షి (లెసర్ ఫ్లోరికన్) జాడ అసలే లేదు. ఇక్కడ గడిచిన మూడు దశాబ్దాలుగా ఈ పక్షి కనిపించడం లేదు. పక్షుల్లో నెమలి తర్వాత అత్యంత సొగసరి పక్షిగా బట్టమేక పక్షికి పేరుంది. దీని తరహాలోనే బెంగాల్ ఫ్లోరికన్ కూడా (అడవి కోడి తరహా పక్షి) ఇప్పుడు లేదు. దీనికోసం కూడా అధికారులు జల్లెడపడుతున్నారు.

**అమాంతంగా పెరిగిన పులులు, జింకలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చిట్టడవులు ఇప్పుడు చిరుత పులులు, జింకలకు నెలవుగా మారాయి. రాష్ట్రంలోనే చిరుతల వృద్ధిలో ఈ అడవులు మొదటి స్థానంలో ఉన్నట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో మైదాన ప్రాంతాల్లోకి వచ్చి చిరుతలు దాడి చేస్తున్న ఘటనలూ లేకపోలేదు. జింకలైతే మరింత భారీగా పెరిగాయి. ఉరవకొండ, పెనుకొండ, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో మందలు మందలుగా కనిపిస్తున్నాయి. జింకల సంఖ్య ఇంతలా పెరగడానికి గడిచిన ఐదేళ్లలో కురిసిన భారీ వర్షాలతో కొండ ప్రాంతాల్లో వాటికి గ్రాసం పుష్కలంగా లభించడమే కారణమని చెబుతున్నారు. ఇక పులులు, జింకలతో పాటు సుమారు 9 రకాల పాములు ఈ కొండల్లో వృద్ధి చెందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అడవి బల్లులు, ఎలుగుబంట్ల జాతికి కూడా ఇబ్బంది లేదు.

**చాలా ఏళ్లుగా అవి కనిపించడం లేదు**

బట్టమేక పక్షి, బెంగాల్ ఫ్లోరికన్ లాంటి పక్షులు చాలా ఏళ్లుగా కనిపించడం లేదు. దీంతో పాటు తోడేళ్ల సంఖ్య పూర్తిగా క్షీణించినట్టు తెలుస్తోంది. గడిచిన మూడేళ్లుగా వీటికోసం గాలిస్తున్నాం. ఎక్కడా వాటి జాడ లేదు. మరోవైపు చిరుత పులులు, జింకల సంఖ్య అమాంతంగా పెరుగుతోంది. ఇక్కడి వాతావరణం వీటికి సానుకూలంగా ఉంది. అడవుల విస్తీర్ణం ఏటికేటికీ తగ్గుతుండటం కూడా కొన్ని జాతులు అంతరించడానికి కారణంగా చెప్పుకోవచ్చు.

– సందీప్ కృపాకర్,
అటవీశాఖ అధికారి, అనంతపురం

## వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

| సంఖ్య | పార్టీ అనుబంధ విభాగం | అధ్యక్షుడి పేరు | జిల్లా |
|---|---|---|---|
| 1 | రజక | ఎస్ రంగన్న | అనంతపురం |
| 2. | దేవాంగ | బి. సురేంద్రబాబు | బాపట్ల |
| 3. | పాల - ఏకారి | ఎంబీ కుమార్ రాజా | చిత్తూరు |
| 4. | వన్నెకుల క్షత్రియ | హెచ్‌ఎం శీను రాజేంద్రప్రసాద్ | చిత్తూరు |
| 5. | విశ్వబ్రాహ్మణ | ఎస్‌ఎం. పవిత్ర మురళీకృష్ణ | చిత్తూరు |
| 6. | గాండ్ల/తెలుకలి | ఎస్ భవానీ ప్రియ | తూర్పు గోదావరి |
| 7. | సూర్యబలిజ | ఎస్ త్యాగరాజా | ఏలూరు |
| 8. | వడ్డీలు | ఎం సంజయ్ కుమార్ | ఏలూరు |
| 9. | క్రిష్ణ బలిజ/ పూసల | కోలా మనికంఠ | గుంటూరు |
| 10. | కుమ్మరి/ శాలివాహన | ఎం. పురుషోత్తం | గుంటూరు |
| 11. | అయ్యరక | ఎ. లక్ష్మీనారాయణ | కాకినాడ |
| 12. | పెరిక | పి. గంగా భవాని | కాకినాడ |
| 13. | గౌడ | ఎం. శివరామకృష్ణా | కృష్ణా |
| 14. | బెస్త | టి. అనిల్ కుమార్ | కర్నూలు |
| 15. | వీరశైవ లింగాయత్ | వై. రుద్ర గౌడ్ | కర్నూలు |
| 16. | నాగవంశం | బి. అప్పలనాయుడు | ఎన్టీఆర్ |
| 17. | వడ్డెర | డి. రేవతి | పల్నాడు |
| 18. | దాసరి | డాక్టర్ ఆర్ గణపతిరావ్ | పార్వతీపురం మన్యం |
| 19. | శిష్టకరణం | ఎస్‌ఎన్‌కే మహంతి | పార్వతీపురం మన్యం |
| 20. | ఆరికటిక/ కటిక | డి. కుమార లక్ష్మీ | ప్రకాశం |
| 21. | చాత్తాద శ్రీవైష్ణవ | టి. మనోజ్ కుమార్ | ప్రకాశం |
| 22. | జంగం | వి. ప్రసన్న | ఎస్‌పీఎస్ నెల్లూరు |
| 23. | ముస్లిం సంచార జాతుల | షకీర్ బాబా | ఎస్‌పీఎస్ నెల్లూరు |
| 24. | కుంచిటి వక్కలిగ | ఆర్ గౌడ | శ్రీసత్యసాయి |
| 25. | వాల్మీకి/బోయ | పి. రామచంద్ర | శ్రీసత్యసాయి |
| 26. | కళింగ | డి. రామారావు(లక్ష్మణరావు) | శ్రీకాకుళం |
| 27. | కళింగ కోమటి/కలింగ వైశ్య | ఎ. సూరిబాబు | శ్రీకాకుళం |
| 28. | కూరాకుల/పొందర | ఆర్ అప్పన్న | శ్రీకాకుళం |
| 29. | రెడ్డిక | డి. లోకేశ్వర రావు | శ్రీకాకుళం |
| 30. | శ్రీశయన | డి. పంకజాక్షణదేవ్ | శ్రీకాకుళం |
| 31. | నాయీబ్రాహ్మణ | టి. పుల్లయ్య | తిరుపతి |
| 32. | మత్స్యకార | పి. విజయచందర్ | విశాఖపట్నం |
| 33. | నగరాలు | పి. శ్రీనివాసరావు | విశాఖపట్నం |
| 34. | యాత | పి. సుజాత | విశాఖపట్నం |
| 35. | తూర్పుకాపు | ఎం శ్రీకాంత్ | విజయనగరం |
| 36. | అగ్నికుల క్షత్రియ | టి. నాగరాజు | పశ్చిమగోదావరి |
| 37. | ఎంబీసీ | పి. వీరన్న(బుజ్జి) | పశ్చిమగోదావరి |
| 38. | నూర్‌బాషా/దూదేకుల | ఓ. రసూల్ సాహేబ్ | వైఎస్సార్ |
| 39. | పద్మశాలీ | జి. విజయలక్ష్మీ | వైఎస్సార్ |
| 40. | సగర/ఉప్పర | జి. శ్రీనివాసులు | వైఎస్సార్ |
| 41. | యాదవ | ఎస్. హరీష్ కుమార్ | వైఎస్సార్ |

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 57,390 మంది స్వామివారిని దర్శించుకోగా 20,628 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

### అప్పన్నకు విశేష ఆర్జిత సేవలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

### అయోధ్య రాముని విల్లుకు పూజలు

**అమలాపురం టౌన్:** అయోధ్యలో కోదండ రామునికి సమర్పించేందుకు హైదరాబాద్ వాసి చల్లా శ్రీనివాసశాస్త్రి వెండి, బంగారంతో తయారు చేయించిన విల్లు, బాణాలను కోనసీమ జిల్లా అమలాపురంలోని భూపయ్య అగ్రహారంలో భక్తుల వీక్షణం నిమిత్తం గురువారం సాయంత్రం ప్రదర్శించారు. వీటిని అనేక మంది భక్తులు సందర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసశాస్త్రి విలేకర్లతో మాట్లాడుతూ ఈ విల్లు, బాణాన్ని చెన్నైలో తయారు చేయించినట్లు చెప్పారు. వీటిని 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో చేయించానన్నారు. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న కోదండ రాముని ఆలయంలో విల్లు, బాణాన్ని అందజేయనున్నట్లు చెప్పారు.

### భక్తి శ్రద్ధలతో గణపతి హోమం

**సామర్లకోట:** కాకినాడ జిల్లా సామర్లకోట బళ్లమార్కెట్ సెంటర్‌లోని పురాతన గణపతి ఆలయంలో గురువారం గణపతి హోమం నిర్వహించారు. పురాతన ఆలయం కావడంతో దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేశారు. ఇందులో భాగంగా హోమం నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకొని పందిరి రాట వేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.




### భక్తిశ్రద్ధలతో పవిత్ర మాలల సమర్పణ

**ఒంటిమిట్ట:** వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండరామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం రఘురాముడికి ఉత్సవ నిర్వాహకులు వీణా మనోజ్ కుమార్‌చార్యులు పవిత్రమాలలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. సీతారామ, లక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. యాగశాలలో విశ్వక్సేన ఆరాధన తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహాపూర్ణాహుతి, పవిత్ర వితరణతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి ప్రాకారోత్సవం ఉంటుంది.

### నేటి నుంచి వేళాంగిణిమాత ఆరాధనోత్సవాలు

**తోటపల్లిగూడూరు:** నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు వేళాంగిణిమాత (మరియమాత) చర్చి ఆరాధనోత్సవాలకు ముస్తాబైంది. ఏసుక్రీస్తు తల్లి అయిన వేళాంగిణిమాత జయంతి సెప్టెంబర్ 8. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం చర్చిలో అదే నెల 6, 7, 8 తేదీల్లో ఆరాధనోత్సవాలు జరుగుతుంటాయి. ఈ చర్చి 1980లో నిర్మించారు. ఒక రాత్రి ఇక్కడ జాగారం చేస్తే కష్టాలు తీరిపోతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో వేలాది మంది విచ్చేస్తుంటారు.

### ఘనంగా ఉరుసు ఉత్సవం

**కడప కల్చరల్:** ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గాలో గురువారం ఉరుసు ఉత్సవం ఘనంగా జరిగింది. హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రి పేరిట జరుగుతున్న ఈ ఉత్సవంలో దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలంకరించిన గంధం కలశాన్ని తలపై ఉంచుకుని ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. దర్గాలోని గురువుల మజార్ వద్దకు చేరుకుని అక్కడ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### గురువులు నవసమాజ నిర్మాతలు


**తిరుపతి సిటీ:** గురువులు నవసమాజ నిర్మాతలని, అధ్యాపకుడు నిరంతర విద్యార్థిగా కొత్తవిషయాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని ఎస్వీయూ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు అన్నారు. గురువారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత మేధావి అని,, ఆయన లోతైన విషయాలపై సమగ్ర విశ్లేషణలతో విద్యార్థులకు బోధన చేశారన్నారు. భావి భారతావనికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం 21మంది అధ్యాపకులకు వీసీ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

### జీతాల కోసం అధ్యాపకుల ఆందోళన

**మలికిపురం:** కోనసీమ జిల్లా మలికిపురం ఎంవీఎస్ జేఎస్అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని గురువారం ఆందోళనకు దిగారు. జీతాల కోసం అడిగితే జీతాల కోసం పని చేయొద్దని కళాశాల కరస్పాండెంట్ మొండిగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేస్తూ కళాశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వినతి పత్రం అందించారు. అనంతరం కరస్పాండెంట్ సత్యనారాయణమూర్తికి కూడా వినతి పత్రం ఇచ్చారు.

### 11న ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటిస్ మేళా

**ఎచ్చెర్ల క్యాంపస్:** శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 11వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. జిల్లాలోని అరబిందో, నాగార్జునా ఆగ్రికెం, స్మార్ట్ కెం, వరుణ్ మోటర్స్ వంటి ఆరు కంపెనీలు హాజరు కానున్నాయని తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




### నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఐటెప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**ఎచ్చెర్ల క్యాంపస్:** శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం (ఐటీఈపీ)కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 13వ తేదీలోపు విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.బీఆర్ఏయూ.ఈడీయు.ఐఎన్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో బీఏబీఈడీలో 50 సీట్లు, బీఎస్సీ బీఈడీలో 50 సీట్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ తర్వాత నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఎన్‌సీఈటీ -2024 పరీక్షలో స్కోర్ సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

### ఆర్జీయూకేటీలో పుస్తకావిష్కరణ

**ఎచ్చెర్ల క్యాంపస్:** శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఎస్ ఎంపురం క్యాంపస్‌లో గురువారం స్థానిక ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహమ్మద్ ఆషిక్, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీన్ సంయుక్తంగా రాసిన 'ఏ హ్యాండ్ బుక్ ఫర్ ప్రాజెక్ట్స్ ఆన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆర్జీయూకేటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీతో కూడిన అధికారులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పరిశోధన, నూతన ఆవిష్కరణకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

## ఏఐతో సెక్యూరిటీ బ్యూరో హెల్ప్‌లైన్

● సీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్


సాక్షి, హైదరాబాద్‌: సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెల్ప్‌లైన్ 1930 సేవలను మరింత విస్తృత పరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ని వాడుకోవాలనుకుంటున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ (ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన హర్షవర్ధన్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అనేది మన శక్తిసామర్థ్యాలను పెంచుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ల మేళవింపుతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఏఐని వాడుకుని పెద్ద సంఖ్యలో సమాచారాన్ని విశ్లేషించడం, ముందస్తుగానే సైబర్ ముప్పును గుర్తించడం సహా ఎన్నో అంశాల్లో పురోగతి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ఐసీటీ కమిటీ చైర్మన్ కె.రామ్మోహన్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విలీనానికి తొందరేంటి?

● హడావుడిగా ఆర్డినెన్స్ ఎందుకు: బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు లోపల, బయట ఉన్న 51 గ్రామ పంచాయతీలను శివారు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ హడావుడిగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావలసిన తొందర ఏమొచ్చిందని బీఆర్‌ఎస్ ప్రశ్నించింది. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేలతో కూడా చర్చించకుండా, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకుండా గ్రామాల విలీనం అనే అతిపెద్ద నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ సీఎం దగ్గరే ఉండటంతో ఎవరితో మాట్లాడకుండా నిర్ణయం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. కనీసం అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చించకుండా నిర్ణయం తీసుకున్నారని, సీఎంకు పురపాలక శాఖ మీద అవగాహన లేకపోతే వేరొకరికి ఆ శాఖను అప్పగించాలని సూచించారు. సీఎం తీరుతో రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఆదాయం నెలకు రూ.300 కోట్ల మేర తగ్గిందని, టోకెన్లు తీసుకున్న వారు సైతం రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదని అన్నారు. కేసీఆర్ హయాంలో శివారు మున్సిపాలిటీలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధికి బాటలు వేశామని అన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు ఎన్‌సీసీ రూ.2 కోట్ల విరాళం



ఏపీ సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్‌ను అందజేస్తున్న సూర్య శ్రీ కృష్ణ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ (ఎన్‌సీసీ) రూ.2 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఎన్‌సీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సూర్య శ్రీ కృష్ణ రూ.కోటి చెక్‌ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. త్వరలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మరో రూ.కోటి చెక్‌ను అందిస్తామని తెలిపారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సాక్షి, హైదరాబాద్‌: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తదితరులు కలిసి పెండింగ్ బిల్లులపై వినతిపత్రం సమర్పించారు. గ్రామాభివృద్ధి పనుల కోసం తాజా మాజీ సర్పంచ్‌లు వడ్డీకి అప్పు తెచ్చి పనులు చేశారని వివరించారు. బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌ల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల బాధ తట్టుకోలేక కొందరు మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య కూడా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మత్తు రహిత సమాజానికి కృషి

సాక్షి, హైదరాబాద్: మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అర్హత గల వైద్యులిచ్చే మందుల చీటీపై మాత్రమే ఔషధాలు కొనుగోలు చేయాలని తెలంగాణ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ కోరారు. దీనికోసం 33 జిల్లాల్లో హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రోగులకు అవసరమైన సేవలందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో ప్రముఖ పాత్ర వహిస్తోందని తెలిపారు. డ్రగ్స్ కంట్రోలర్ అథారిటీ (డీసీఏ) చేపడుతున్న కఠిన చర్యలకు అసోసియేషన్ మద్దతు తెలుపుతోందని వెల్లడించారు. రోగులు వాడే మందులను ఎప్పటికప్పుడు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్‌తో మాత్రమే రాయించుకోవాలని సూచించారు.




## జల సింగారం

భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్ల సింగారం కత్వ అలుగు పారుతోంది. పాలేరు వాగు నుంచి గుండ్ల సింగారం కత్వకు చేరుకొని అలుగుపోస్తూ కనువిందు చేస్తోంది.

ఫోటో: సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

# వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ టాప్

**తెలంగాణాస్ గ్రోథ్ స్టోరీ-ద రోడ్ టు డాలర్స్ 1 ట్రిలియన్ ఎకానమీ' నివేదికలో ఆసక్తికర అంశాలు**

ప్రస్తుత 176 బిలియన్ డాలర్ల ఎకానమీ నుంచి 2036కల్లా ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ వైపు పరుగులు పెట్టొచ్చన్న అంచనాలు

చురుకైన ఆర్థికాభివృద్ధితోపాటు సాంస్కృతిక భిన్నత్వం, పటిష్ట ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఐటీ, జీసీసీ, ఏరోస్పేస్ రంగాలతో ముందడుగు

ఫ్యూచర్ సిటీ, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ రివర్‌ఫ్రంట్ లాంటి ప్రాజెక్టులతో పెరగనున్న నూతన అవకాశాలు

సాక్షి, హైదరాబాద్‌: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో సాగుతోంది. చురుకైన ఆర్థికాభివృద్ధితోపాటు సాంస్కృతిక భిన్నత్వం, పటిష్టమైన ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఐటీ, జీసీసీ, ఏరోస్పేస్ వంటి విభిన్న రంగాల్లో దూసుకుపోతోంది. దీనికితోడు ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), మూసీ రివర్‌ఫ్రంట్ తదితర మౌలిక వసతుల ప్రాజెక్టులు పట్టాలెక్కనుండటంతో కొత్త అవకాశాలు విస్తృతం కానున్నాయి. గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) రంగాల్లో రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్, ట్రేడ్, హోటల్స్, రెస్టారెంట్లు తదితరాలు సింహభాగం అయ్యాయి. అక్షరాస్యత 67 శాతంగా ఉండటంతోపాటు 1.6 కోట్ల మంది (రాష్ట్ర జనాభాలో 66 శాతం) 15–59 ఏళ్ల మధ్య వర్కింగ్ ఏజ్‌లో ఉండటం తెలంగాణకు కలిసొచ్చే అంశం. దీంతో ప్రస్తుతమున్న 176 బిలియన్ డాలర్ల ఎకానమీ నుంచి 2036 కల్లా ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ వైపు పరుగులు పెట్టొచ్చని ట్రేడ్ పండిట్స్ అంచనా వేస్తున్నారు. ప్రభుత్వపరంగా కూడా 'ద మెగా మాస్టర్‌ప్లాన్ 2050' దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రణాళికలను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. తాజాగా డబ్ల్యూటీసీ శంషాబాద్, జీనోమ్ వ్యాలీ ఆధ్వర్యంలో 'తెలంగాణాస్ గ్రోథ్ స్టోరీ–ద రోడ్ టు డాలర్స్ 1 ట్రిలియన్ ఎకానమీ' పేరిట విడుదల చేసిన నివేదికలో పలు ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు.

దేశంలోనే 'యంగెస్ట్ స్టేట్'గా తెలంగాణ ఇప్పటికే పలు రంగాల్లో ఆధిక్యతను కనబరుస్తూ ముందుకు సాగుతోంది. భారత్ అభివృద్ధి, ముందంజలో తన వంతు పాత్ర పోషిస్తూ తెలంగాణ పురోగతి బాటలో నడుస్తోంది. నూతన ఆవిష్కరణలు, సాంకేతికలపై ప్రత్యేక దృష్టి పెడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా అడుగులు వేస్తోంది. కేవలం హైదరాబాద్ మహానగరం, ఇతర నగరాలు, పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొత్త అవకాశాలు అందిపుచ్చుకొనేలా చర్యల ద్వారా ప్రాంతీయంగా వ్యాపార, వాణిజ్యాల వృద్ధికి చర్యలు చేపడుతోంది.

### నివేదిక ముఖ్యాంశాలు

- 2024 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ (కరెంట్) యూఎస్ డాలర్లు 176 బిలియన్లు
- 2024లో తలసరి ఆదాయం 4,160 డాలర్లు
- 2021 జనాభా లెక్కల ప్రకారం 3.8 కోట్ల మంది జనాభా
- 2011 లెక్కల ప్రకారం 39 శాతం పట్టణ జనాభా
- 2011 లెక్కల ప్రకారం స్త్రీ పురుష లింగ నిష్పత్తి 988
- రాష్ట్ర జనాభాలో 66% పనిచేసే వయసు (15 నుంచి 59 ఏళ్ల లోపు) ఉన్న 1.6 కోట్ల మంది
- 2011 లెక్కల ప్రకారం అక్షరాస్యత 67 శాతం
- దేశ భూభాగంలో 3.4 శాతమున్న తెలంగాణ: 1,12,077 చ.కి.మీ.లలో విస్తరణ

### తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా టాప్...

- రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 9.52 లక్షలు
- హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4.96 లక్షలు
- సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3.24 లక్షలు
- మేడ్చల్–మల్కాజిగిరి తలసరి ఆదాయం రూ. 2.97 లక్షలు

### గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్-జీడీడీపీ (బిలియన్ డాలర్లలో) రంగారెడ్డి జిల్లా టాప్..

- రంగారెడ్డి జిల్లా 33.94 బిలియన్ డాలర్లు
- హైదరాబాద్ జిల్లా 27.38 బిలియన్ డాలర్లు
- మేడ్చల్–మల్కాజిగిరిజిల్లా 10.64 బిలియన్ డాలర్లు
- సంగారెడ్డి జిల్లా 7.23 బిలియన్ డాలర్లు


# ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదలతో నష్టం

**వాతావరణ శాఖ హెచ్చరికలను పట్టించుకోలేదు**

ఖమ్మం జిల్లా మంత్రులు జీరోలు ● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ వైఫల్యం వల్లనే వరదల కారణంగా రాష్ట్రంలో అపారనష్టం జరిగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికలను సీఎం, మంత్రులు పట్టించుకోలేదని, అందుకే తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. మొదటి రెండు రోజులు వరదలను ప్రభుత్వం అసలే పట్టించుకోలేదన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. తొమ్మిది మందిని కాపాడిన సుభాన్.. హీరో అయితే, ఆ ముగ్గురు మంత్రులు జీరో అయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి నాలుగైదు హెలికాప్టర్లు వాడారని, కానీ వరద సాయానికి మాత్రం ఒక్క హెలికాప్టర్‌ను కూడా సిద్ధం చేయలేకపోయారని మండిపడ్డారు. కేసీఆర్‌ను విమర్శించే విషయంలో చూపించే శ్రద్ధ వరద బాధితులను ఆదుకోవడంలో చూపడం లేదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నాయన్నారు. సీఎం రేవంత్ వరదల్లోనూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, అయినా ప్రభుత్వం నష్టం వివరాలు వెల్లడించడం లేదన్నారు. కేంద్రాన్ని ఎంత సాయం కోరినా తాము మద్దతిస్తామని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా బాగుచేసిన చెరువులు తెగాయని సీఎం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వట్టెం పంపు హౌజ్ మునక ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్లే జరిగిందన్నారు. పంపు హౌజ్ మునిగాక జిల్లా మంత్రి వెళ్లారన్నారు.

# మ్యూజియం దూలంగా వెయ్యేళ్ల నాటి రాతి తోరణం



మ్యూజియం పైకప్పులో దూలంగా ఉన్న తోరణ భాగం

● గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం



గేట్ వే ఆఫ్ కొలనుపాకగా పేర్కొనే రాతి తోరణం

సాక్షి, హైదరాబాద్‌: వెయ్యేళ్ల క్రితం నాటి జైన శిలా తోరణ భాగం మ్యూజియం పైకప్పు దూలంగా మారిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆలేరు మండలంలోని కొలనుపాకలో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కొలనుపాక ఆలయ సమూహాల ప్రాంగణంలో వారసత్వ శాఖ ఏర్పాటు చేసిన మ్యూజియం ఉన్న విషయం తెలిసిందే. ఈ మ్యూజియం పైకప్పులో ఉన్న ఓ రాతి దూలం ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. అది 8–9 శతాబ్దం క్రితం రాష్ట్రకూటుల కాలంలో ఏర్పాటు చేసిన జైన శిలా తోరణం పైభాగం కావడం విశేషం. ఆ శిలా తోరణం కొలనుపాక ప్రాంతంలో ఉండేది. దాని పైభాగంలో దర్జాగా ఉండాల్సిన తోరణ భాగం ఇలా మ్యూజియంలో రాతి దూలంగా ఉండటాన్ని తాజాగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుర్తించారు. తాజాగా ఆ బృందానికి చెందిన 36 మంది ఔత్సాహిక చరిత్ర పరిశోధకులు కొలనుపాకను సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో పరిశీలిస్తుండగా ఈ రాతి దూలంపై ఉన్న చెక్కడాలు ఆకర్షించాయని, వాటిని తీక్షణంగా పరిశీలించగా అది రాష్ట్రకూటుల కాలంలో ఏర్పాటు చేసిన రాతి తోరణ పైభాగంగా తేలిందని ఆ బృంద కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడించారు. తోరణంపై ఆకృతులను చెక్కేసి చదును చేసి దూలంగా కూర్చోబెట్టినట్టు కనిపిస్తోందని వివరించారు. గేట్ వే ఆఫ్ కొలనుపాకగా పిలుచుకునే రాష్ట్రకూటుల కాలం నాటి భారీ రాతి తోరణం ఇప్పటికీ జైనాలయం వెనకవైపు ఉందని, దాని మీది తోరణ భాగం తరహాలోనే ఈ రాతి దూలం కూడా ఉందని పేర్కొన్నారు. ఇంతకాలం ఈ విషయం వెలుగులోకి రాకపోవటం కొంత ఆశ్చర్యకరంగానే ఉందని తెలిపారు.

# వరద కాలువలోనూ 'విద్యుదుత్పత్తి' చేయాలి

**తెరపైకి వస్తున్న డిమాండ్**

- 13 ఏళ్లుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి క్రమం తప్పకుండా సీజన్‌లో నీటి విడుదల
- మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు పంప్‌హౌస్ నిర్మిస్తే విద్యుదుత్పత్తి
- 22వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వరదకాలువ నిర్మాణం



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మిగులు జలాల సద్వినియోగం కోసం నిర్మించిన వరద కాలువ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మిగులు జలాలను సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో వరద కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ కాలువ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తారు. వరద కాలువ సామర్థ్యం 22 వేల క్యూసెక్కులు. 2010 నుంచి దీని ద్వారా మిడ్‌మానేరుకు నీటిని వదులుతున్నారు. గతంలో ఒక సీజన్‌లో అత్యధికంగా 56 వేల క్యూసెక్కుల నీటిని సైతం వదిలారు. ఈ కాలువ వద్ద పంప్ హౌస్ నిర్మాణం చేస్తే 90 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవకాశముంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటి ఆధారంగా 4 టర్బైన్‌లతో విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మించారు. ఈ కాకతీయ కాలువ సామర్థ్యం 9 వేల క్యూసెక్కులు. ఒక్కో టర్బైన్ నుంచి 2,200 క్యూసెక్కుల నీటి ద్వారా 9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 4 టర్బైన్‌ల ద్వారా 8,800 క్యూసెక్కుల నీటితో 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అయితే 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే వరద కాలువ నుంచి సైతం విద్యుదుత్పత్తి చేసే విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. 13 ఏళ్లుగా వరద కాలువ ద్వారా ప్రతి సంవత్సరం నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో గరిష్టంగా వరద కాలువ ద్వారా ఒక సీజన్‌లో 56 టీఎంసీల నీటిని విడుదల చేసిన సందర్భంగా కూడా ఉంది. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా చేస్తున్న విద్యుదుత్పత్తికి మూడు రెట్లు ఉత్పత్తి చేయవచ్చని తెలుస్తోంది. కాకతీయ కాలువ టర్బైన్లతో పోలిస్తే వరద కాలువకు ఇలాంటి 10 టర్బైన్‌లు నిర్మించే అవకాశాలున్నాయి. శ్రీరాంసాగర్ జలాశయంలో పూడిక పేరుకుపోతుండడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. దీంతో గత పదేళ్లుగా 42 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. మరోవైపు వరద కాలువ ద్వారా కూడా నీటిని మిడ్‌మానేరుకు విడుదల చేస్తున్నారు. ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రతిఏటా భారీగా వరద నీరు వస్తోంది. భవిష్యత్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో వరదకాలువ వద్ద పంప్‌హౌస్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్‌తో వరద కాలువ ద్వారా నీటిని శ్రీరాంసాగర్ జలాశయంలోకి తరలించారు. కాగా 1,091 అడుగుల పూర్తి నీటిమట్టం ఉన్న ఎస్సారెస్పీకి 1,075 అడుగుల మేర నీటిమట్టం చేరగానే వరద కాలువ ద్వారా నీటి విడుదల చేస్తున్నారు.

# మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ..!

**కర్కగూడెం గ్రామ సమీపంలో ఎన్‌కౌంటర్‌తో భారీ నష్టం**

- బీకే–ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ దాదాపు ఏరివేసిన తెలంగాణ పోలీస్
- సెంట్రల్ కమిటీ సభ్యుడు జగన్ ఎన్‌కౌంటర్ జరిగిన రోజుల వ్యవధిలోనే మరో ఆరుగురి ఎన్‌కౌంటర్
- తెలంగాణ సరిహద్దులో ముప్పేట దాడి




సాక్షి, హైదరాబాద్‌: మావోయిస్టులకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఓ వైపు మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా ఎన్‌కౌంటర్లలో మృతి చెందడం, మరోవైపు మావోయిస్టుల కీలక ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు పట్టుసాధిస్తుండటం మావోయిస్టులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మూడు రోజుల క్రితం దంతెవాడ–బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు తొలితరం అగ్రనాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు హతమైన విషయం తెలిసిందే. తాజాగా గురువారం రఘునాథపాలెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

**దళం తుడిచిపెట్టుకుపోయినట్లే...**

కర్కగూడెం గ్రామానికి అతి సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీస్ పార్టీ టీంకు తారసపడిన బీకే–ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ సభ్యుడు లచ్చన్న, లచ్చన్న సతీమణి తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌తో తెలుగు ప్రాంతాల్లో మావోయిస్టులకు చెందిన అత్యంత కీలకమైన భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే–ఏఎస్‌ఆర్) దాదాపు తుడిచిపెట్టుకుపోయినట్లయింది. ఇటీవల కాలంలో తెలంగాణ సరిహద్దులోపల ఇదే భారీ ఎన్‌కౌంటర్ కావడం గమనార్హం. ఇదే డివిజన్ కమిటీకి చెందిన మరో మావోయిస్టు విజయేందర్‌ను సైతం పోలీసులు ఈ ఏడాది జూలైలో గుండాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు.ఇలా దెబ్బమీదదెబ్బతో బీకే–ఏఎస్‌ఆర్ డివిజన్‌కు తీవ్ర నష్టం జరిగింది.

**క్రమంగా పట్టుసాధిస్తున్న పోలీసులు..**

మరోవైపు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో మావోయిస్టులకు అత్యంత పట్టు ఉన్న ప్రాంతాల్లోనూ ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర, స్థానిక పోలీస్ బలగాలు చొచ్చుకుపోతున్నాయి. కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లోనూ వరుస ఎన్‌కౌంటర్లలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు మావోయిస్టులపై పట్టు సాధిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు తెలంగాణ నుంచి ప్రాణహిత నది దాటి మహారాష్ట్రంలోకి అడుగుపెడుతుండగా హతమార్చారు. ఈ ఏడాది జూన్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లోనూ 8 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. ఇలా వరుస దాడులతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ వైపు ఒత్తిడి పెరగడంతో తెలంగాణలోకి ప్రవేశించేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు.

అయితే ఈ ప్రయత్నాలను తెలంగాణ గ్రేహౌండ్స్, టీజీఎస్పీ, స్థానిక పోలీసు బలగాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయి. మావోయిస్టులు తెలంగాణ వైపు రాకుండా ముమ్మర కూంబింగ్ నిర్వహిస్తూ వారిని అడ్డుకుంటున్నాయి. ఏ మాత్రం సమాచారం దొరికినా వెంటనే బలగాలు రంగంలోకి దిగుతున్నాయి. అయితే, తాజాగా గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంద్‌కు మావోయిస్టులు పిలుపునివ్వడంతో ఆ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# వైవిధ్య భరితం.. భారతదేశ శీతోష్ణస్థితి!!

**నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో కేరళ రాష్ట్రాన్ని తాకుతాయి. తర్వాత ఇవి దేశమంతటా విస్తరించడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. దేశ వార్షిక సగటు వర్షపాతంలో సుమారు మూడింట రెండొంతులు నైరుతి రుతుపవన కాలంలోనే సంభవిస్తుంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి వీచే ఆర్ద్ర రుతుపవనాలు విస్తారంగా వర్షాన్నిస్తాయి. పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదవుతుంది.**

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

**భారతదేశ శీతోష్ణస్థితిలో ప్రతి రెండు నెలలకు ఒకసారి గుణాత్మక మార్పులు సంభవిస్తాయి. రుతుపవన పూర్వకాలాన్ని నడివేసవిగా పరిగణిస్తాం. రుతు పవన కాలంలో మాత్రం దేశమంతటా వర్షాలు విస్తారంగా కురుస్తాయి. దేశంలోని చిరపుంజి, మాసిన్‌రామ్‌లలో అత్యధిక వర్షపాతం కురిస్తే... థార్, కచ్‌లలో అత్యల్ప వర్షపాతం నమోదవుతోంది!!**



## భారతదేశ శీతోష్ణస్థితి

రుతుపవన ప్రక్రియ చాలా సంక్లిష్టమైంది. రుతుపవన ప్రక్రియ ఆవిర్భావాన్ని కింది సిద్ధాంతాల ద్వారా వివరించవచ్చు. అవి:

ఎ) థర్మల్ సిద్ధాంతం
బి) ఫ్లాన్ సిద్ధాంతం
సి) జెట్‌స్ట్రీమ్ సిద్ధాంతం
డి) టిబెటన్ హీట్ ఇంజిన్ సిద్ధాంతం
ఇ) ఎల్‌నినో సిద్ధాంతం
ఎఫ్) ఈక్వినో, ఐవోడీ దృక్పథం

థర్మల్ సిద్ధాంతం ప్రకారం.. నైరుతి రుతుపవనాలు సముద్ర పవనాల లాంటివి. ఖండ-సముద్ర భాగాల ఉష్ణ ప్రవర్తనలో వ్యత్యాసం వల్ల ఇవి ఏర్పడతాయి. నైరుతి రుతుపవనాలను భారత ఉపఖండంలోకి ఆకర్షించే అల్పపీడన మండలం వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడిందని ఈ సిద్ధాంతం ప్రతిపాది స్తుంది. ఫ్లాన్ సిద్ధాంతం ప్రకారం ఆగ్నేయ రుతుపవనాలు దక్షిణాసియా ప్రాంతంలో రూపాంతరం చెంది.. నైరుతి రుతుపవనాలుగా భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. సూర్యుడి సాపేక్ష గమనం వల్ల భూమధ్యరేఖా అల్పపీడన మండలం కర్కటక రేఖ వద్దకు స్థానభ్రంశం చెంది నైరుతి రుతుపవనాలను ఆకర్షిస్తుంది. వేసవి కాలంలో టిబెట్ పీఠభూమి దాదాపు కొలిమిగా మారుతుంది. పర్వత పరివేష్టిత పీఠభూమి కావడంతో ఇక్కడ ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. దీంతో టిబెటన్ పీఠభూమి నుంచి సంవహన వాయువులు దక్షిణంగా వీచి దక్షిణ హిందూ మహాసముద్రంలో అవనతం చెందుతాయి. దాంతో దక్షిణ హిందూ మహాసముద్రంలో అధిక పీడనం ఏర్పడుతుంది. దక్షిణ హిందూ మహాసముద్రానికి వాయవ్య భారత దేశానికి మధ్య పీడన ప్రవణత ఏర్పడటంతో దక్షిణ హిందూ మహాసముద్రం నుంచి కవోష్ణ ఆర్ద్ర పవనాలు భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. ఉప ఆయనరేఖా పశ్చిమ జెట్‌స్ట్రీమ్ జూన్ మొదటి వారంలో హిమాలయాలకు ఉత్తరంగా స్థానభ్రంశం చెందడం వల్ల నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. ఆఫ్రికా తూర్పు తీరంలోని సోమాలియా నుంచి అరేబియా సముద్రం మీదుగా.. కేరళ తీరం వైపు వీచే సోమాలియా నిమ్న స్థాయి జెట్‌స్ట్రీమ్ నైరుతి రుతుపవనాలను బలోపేతం చేస్తుంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుందని వాతావరణ నిపుణుల అభిప్రాయం. ఈ కారణంతోనే రుతుపవనాల భవిష్యత్తు నమూనాలో ఎల్‌నినో చలనరాశులకు పెద్దపీట వేశారు. అయితే గ్లోబల్ వార్మింగ్ వల్ల ఇటీవల ఎల్‌నినో నైరుతి రుతుపవన వ్యవస్థల మధ్య సంబంధం బలహీనపడుతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూమధ్యరేఖా ప్రాంత హిందూ మహాసముద్రంలో.. పీడనంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మార్పులు, సముద్ర ప్రవాహాల్లో సంభవిస్తున్న మార్పులు నైరుతి రుతుపవనాలను ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. అందువల్ల రుతుపవన భవిష్యత్తు నమూనాలో సమూల మార్పులు చేశారు.

## ఆయనరేఖా రుతుపవన శీతోష్ణస్థితి

భారతదేశం వైవిధ్య శీతోష్ణస్థితిని కలిగి ఉంది. స్థూలంగా భారతదేశ శీతోష్ణస్థితిని 'ఆయనరేఖా రుతుపవన శీతోష్ణస్థితి'గా అభివర్ణిస్తారు. ఇక్కడ సంవత్సరాన్ని ఆరు రుతువులుగా విభజించడం సంప్రదాయం. అంటే.. ప్రతి రెండు నెలలకొకసారి శీతోష్ణస్థితిలో గుణాత్మక మార్పులు సంభవిస్తాయి. అయితే శాస్త్రీయంగా భారతదేశ శీతోష్ణస్థితి సంవత్సరాన్ని నాలుగు రుతువులుగా విభజిస్తారు. అవి :

ఎ) రుతుపవన పూర్వకాలం (మార్చి 15 - జూన్ 15)
బి) నైరుతి రుతుపవన కాలం (జూన్ 15 - సెప్టెంబర్ 15)
సి) ఈశాన్య రుతుపవన కాలం (సెప్టెంబర్ 15 - డిసెంబర్ 15)
డి) రుతుపవన అనంతర కాలం (డిసెంబర్ 15 - మార్చి 15)

రుతుపవన పూర్వకాలాన్ని నడివేసవిగా పరిగణిస్తాం. ఈ కాలంలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ముఖ్యంగా వాయవ్య భారతదేశం, దక్కన్ పీఠభూమి అంతర్భాగాల్లో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 45°Cలకు పైగా నమోదవుతాయి. ఈ కాలంలో సంవహన ప్రక్రియ వల్ల మధ్యాహ్నం గాలిదుమ్ములు, చిరుజల్లులతో కూడిన స్థానిక పవనాలు వీస్తాయి. వీటిని దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. ఉదాహరణకు ఆంధీలు(ఉత్తరప్రదేశ్), లూ (పంజాబ్, హర్యానా), కాల బైశాఖి(బిహార్, పశ్చిమబెంగాల్), మామిడి జల్లులు(దక్షిణ భారతదేశం). నైరుతి రుతుపవన కాలంలో దేశమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక సగటు వర్షపాతంలో సుమారు మూడింట రెండొంతులు ఈ నాలుగు నెలల కాలంలోనే సంభవిస్తుంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి వీచే ఆర్ద్ర రుతుపవనాలు విస్తారంగా వర్షాన్నిస్తాయి. పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం కురుస్తుంది. ఇక్కడ సగటు వర్షపాతం 250 సెం.మీ.కు పైగా నమోదవుతుంది. ఈ మండలానికి చెందిన చిరపుంజి, మాసిన్‌రామ్‌లలో ప్రపంచంలోకెల్లా అత్యధిక వర్షపాతం నమోదవుతుంది. ఈ కాలంలో వర్షపాత విస్తరణలో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తాయి. సహ్యాద్రి పర్వతాలకు పవన పరాన్ముఖ దిశలో ఉన్న దక్కన్ పీఠభూమి అంతర్భాగాల్లో వర్షపాతం 50-70 సెం.మీ. ఉంటుంది. ఇది వర్షచ్ఛాయా ప్రాంతం కావడంతో పాక్షిక శుష్క మండలంగా ఏర్పడింది. ఆరావళి పర్వతాలకు పశ్చిమంగా ఉన్న పశ్చిమ రాజస్థాన్ (థార్), ఉత్తర గుజరాత్ (కచ్) ప్రాంతాల్లో వర్షపాతం 30 సెం.మీ. కంటే తక్కువగా) నమోదవుతుంది. ఆరావళి పర్వతాలు నైరుతి రుతుపవనాలకు సమాంతరంగా ఉండటంతో పర్వతీయ వర్షపాతం సాధ్యం కాదు. సహజంగా ఉండే అస్థిరత కారణంగా నైరుతి రుతుపవనాలు ఈ ప్రాంతంలో ఉద్ధాతనం చెందడానికి ప్రయత్నించినప్పటికీ, ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలోని శీతల స్థిర వాయురాశులు వాటిని అడ్డుకుంటాయి. దీంతో పశ్చిమ రాజస్థాన్ ప్రాంతంలో తక్కువ వర్షపాతం కురిసి థార్ ఎడారిగా మారింది. నైరుతి రుతుపవనాలు భారతదేశ ప్రధాన భూభాగాన్ని తొలుత జూన్ మొదటి వారంలో తాకుతాయి. ఇవి దేశమంతటా విస్తరించడానికి సుమారు 45 రోజులు పడుతుంది.

## రుతుపవనాల తిరోగమనం

సెప్టెంబర్ 15 కల్లా భారతదేశం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమన రుతుపవనాలు శీతల శుష్కఖండ వాయురాశులతో కూడి ఉంటాయి. ఇవి బంగాళాఖాతం మీదకు రాగానే సముద్ర నీటిఆవిరిని పీల్చుకొని ఆర్ద్రంగా తయారవుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఈశాన్య వ్యాపార పవనాలు బలంగా వీస్తుంటాయి. ఈశాన్య వ్యాపార పవనాల ప్రభావం వల్ల తిరోగమన రుతుపవనాలు,ఈశాన్య రుతుపవనాల రూపంలో తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్ర తీరాన్ని తాకుతాయి. ఈ ప్రాంతంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ కాలంలో దేశమంతటా ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోతాయి. ముఖ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు ఉత్తర, వాయవ్య భారతదేశంలో 10°C కంటే తక్కువగా ఉంటాయి. హిమాలయ ప్రాంతంలో మంచు విస్తారంగా కురుస్తుంది. పశ్చిమ పవనాల ప్రభావం వల్ల మధ్యధరా సముద్రం, ఎర్ర సముద్రం ప్రాంతాల నుంచి వచ్చే బలహీన కవోష్ణ సమశీతోష్ణ మండల చక్రవాతాలు, వాయవ్య భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల పంజాబ్, హర్యానా, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో జల్లులు కురుస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. ఇవి భారతదేశంలోకి ప్రవేశించడంలో ఉప ఆయన రేఖా పశ్చిమ జెట్‌స్ట్రీమ్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇదే కాలంలో.. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడే స్థానిక అల్పపీడన ద్రోణులు మరింత తీవ్రమై వాయుగుండాలు తుఫాన్లుగా రూపాంతరం చెంది భారతదేశ తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో నవంబర్, డిసెంబర్‌లో వర్షాలు కురుస్తాయి. జనవరికల్లా ఈశాన్య రుతుపవనాలు బలహీన పడతాయి. జనవరి-మార్చి మధ్య వాతావరణం అనిశ్చితంగా ఉంటుంది. ఈ కాలంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, పవన దిశలు క్రమబద్ధమైన రీతిలో ఉండవు. జనవరి నుంచి సూర్యుడి సాపేక్ష గమనం ఉత్తరార్ధ గోళం దిశగా ప్రారంభమవుతుంది. దాంతో భారతదేశంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ కాలంలో దేశంలో పవనాలు ఒక స్థిర దిశలో వీయవు. మొత్తం మీద దేశమంతటా సమశీతోష్ణ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

## రుతుపవనాలు

భారతదేశ వాతావరణాన్ని రుతుపవనాలు సంవత్సరం పొడవునా ప్రభావితం చేస్తాయి. దక్షిణ హిందూ మహాసముద్ర ప్రాంతంలో నిమ్న ట్రోపో ఆవరణంలో ఏర్పడే విశిష్టమైన పవన వ్యవస్థను రుతుపవన వ్యవస్థగా అభివర్ణిస్తారు. ఇది దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాల శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తుంది. శీతాకాలంలో భారత ఉపఖండంపై విస్తరించి ఉన్న శీతల, శుష్క ఖండ వాయురాశిని జూన్-సెప్టెంబర్ మధ్యకాలంలో కవోష్ణ, ఆర్ద్ర సముద్ర వాయురాశి స్థానభ్రంశం చెందిస్తుంది. శీతాకాలంలో ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పవనాల స్థానంలో జూన్-సెప్టెంబర్ మధ్యకాలంలో నైరుతి దిశ నుంచి పవనాలు వీస్తాయి. ఈ దృగ్విషయాన్నే రుతుపవన వ్యవస్థ అంటారు.

## రుతుపవనాలు-ముఖ్య లక్షణాలు

- రుతువులను అనుసరించి పవన దిశలో సుమారు 180 డిగ్రీల మార్పు
- వేసవి, శీతాకాలాల్లో పరస్పర విరుద్ధ లక్షణాలున్న వాయురాశులు
- దేశంలోకి అకస్మాత్తుగా ప్రవేశించడం
- క్రమపద్ధతిలో దేశమంతటా విస్తరించడం
- క్రమపద్ధతిలో తిరోగమించడం
- అనిశ్చితత్వం

### మాదిరిప్రశ్నలు

1. రుతుపవన శీతోష్ణస్థితి ఉన్న దేశాలను గుర్తించండి.
   1) భారతదేశం 2) శ్రీలంక
   3) బంగ్లాదేశ్ 4) పైవన్నీ
2. నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని ఎప్పుడు తాకుతాయి?
   1) జూన్ మొదటి వారంలో
   2) జూన్ మూడో వారంలో
   3) మే చివరి వారంలో 4) జూన్ చివర్లో
3. నైరుతి రుతుపవనాల వల్ల దేశంలోకెల్లా అత్యధిక వర్షపాతం పొందే ప్రాంతాలు?
   1) దక్కన్ పీఠభూమి
   2) ఆరావళి పర్వతాలు
   3) పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి
   4) కేరళ తీరం
4. దక్షిణ భారతదేశంలో వేసవిలో కురిసే చిరు జల్లులను ఏమని పిలుస్తారు?
   1) ఆంధీలు 2) లూ
   3) కాలబైశాఖి 4) మామిడి జల్లులు
5. పశ్చిమ అలజడుల వల్ల వర్షపాతం పొందని రాష్ట్రం ఏది?
   1) ఉత్తరప్రదేశ్ 2) రాజస్థాన్
   3) పంజాబ్ 4) మహారాష్ట్ర
6. నైరుతి రుతుపవనాలు సముద్ర పవనాల లాంటివని తెలిపే సిద్ధాంతం ఏది?
   1) థర్మల్ సిద్ధాంతం 2) ఫ్లాన్ సిద్ధాంతం
   3) ఎల్‌నినో సిద్ధాంతం 4)జెట్‌స్ట్రీమ్ సిద్ధాంతం
7. పవన మార్గానికి పర్వతాలు అడ్డుగా వచ్చినప్పుడు సంభవించే వర్షపాతం?
   1) పర్వతీయ వర్షపాతం
   2) చక్రీయ వర్షపాతం
   3) సంవహన వర్షపాతం
   4) పైవేవీ కాదు
8. భారతదేశంలో టైగా శీతోష్ణస్థితిని ఏ రాష్ట్రంలో గుర్తించవచ్చు?
   1) కేరళ 2) రాజస్థాన్
   3) ఉత్తరాఖండ్ 4) అస్సాం
9. సాంద్ర వ్యవసాయం ఏ శీతోష్ణస్థితిలో ఎక్కువగా అభివృద్ధి చెందింది?
   1) రుతుపవన 2) సవన్నా
   3) తురానియన్ 4) బ్రిటిష్

#### సమాధానాలు

1) 4 2) 1 3) 3 4) 4 5) 4
6) 1 7) 1 8) 3 9) 1

# న్యూటన్ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?



డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్ మెథడాలజీ

## బోధన ఉపగమాలు

కమ్యూనికేషన్ అనే పదం కమ్యూనిస్ అనే లాటిన్ పదం నుంచి పుట్టింది. లాటిన్‌లో కమ్యూనిస్ అంటే కామన్.

- భావ ప్రసార ప్రక్రియలోని దశల సంఖ్య – 4.
- భావ ప్రసార ప్రక్రియలో సందేశం అంటే చెప్పాల్సిన విషయం.
- భావ ప్రసార ప్రక్రియలో మాధ్యమం అంటే చెప్పే విధానం.
- బోధనాభ్యసన ప్రక్రియకు మూలాధారాలు – చర్య, పరస్పర చర్య – పునర్బలనం.
- ఉపాధ్యాయుడు, విద్యార్థుల మధ్య జరిగే పరస్పర చర్యా ప్రక్రియే బోధన అని పేర్కొన్నవారు – ఎడ్మండ్ ఎమిడాన్.
- బోధన ఒక పరస్పర చర్యా ప్రక్రియ అని పేర్కొన్నది – ఎ. ఫ్లాండర్స్.
- బోధనలో అతి తక్కువ స్థాయికి చెందింది – శిక్షణ
- బోధనలో ఉన్నత స్థాయికి చెందింది – ఉపదేశం.
- స్మృతి స్థాయి బోధన నమూనాను రూపొందించింది – జె.ఎస్. హెర్బర్ట్.
- అవగాహన స్థాయి బోధన నమూనాను రూపొందించింది – మోరిసన్.
- పర్యాలోచక స్థాయి బోధన నమూనాను ప్రతిపాదించింది – హంట్.
- మెథడ్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది.
- పద్ధతి అంటే అర్థం – విధం లేదా మార్గం.
- బోధన పద్ధతులు రెండు రకాలు.

**బోధన పద్ధతులు – రకాలు**

**ఉపాధ్యాయ కేంద్రక పద్ధతులు**

1. ఉపన్యాస పద్ధతి
2. ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
3. చారిత్రక పద్ధతి

**విద్యార్థి కేంద్రక పద్ధతులు**

1. అన్వేషణ పద్ధతి 2. ప్రకల్పన పద్ధతి
3. ప్రయోగశాల పద్ధతి 4. ఆగమన,నిగమన పద్ధతి
5. సమస్యా పరిష్కార పద్ధతి

- ముఖతః విషయ పరిజ్ఞానాన్ని బోధించే పద్ధతి – ఉపన్యాస పద్ధతి.
- చారిత్రక పద్ధతిని ఉపయోగించే పద్ధతులు – ఉపాఖ్యాన పద్ధతి, జీవిత చరిత్ర పద్ధతి, పరిణామ పద్ధతి, సాంఘిక పద్ధతి.
- అన్వేషణ పద్ధతికి మరోపేరు-హ్యూరిస్టిక్ పద్ధతి
- గ్రీకు భాషలో హ్యూరిస్కో అంటే కనిపెట్టడం లేదా పరిశోధించడం.
- హ్యూరిస్టిక్ పద్ధతిని రసాయన శాస్త్ర బోధనలో తొలిసారిగా ప్రవేశపెట్టింది – ఆర్మ్‌స్ట్రాంగ్.
- అన్వేషణ పద్ధతిని ఒక ప్రధాన విజ్ఞాన శాస్త్ర బోధన పద్ధతిగా అంగీకరించని రిపోర్ట్ – థామ్సన్ రిపోర్ట్.
- జాన్ డ్యూయీ ప్రతిపాదించిన వ్యవహారిక సత్తావాదాన్ని అనుసరించి రూపొందించిన పద్ధతి – ప్రకల్పన పద్ధతి.
- ప్రకల్పన పద్ధతిని మొదటిసారిగా ఆచరణలో పెట్టిన విద్యావేత్త -కిల్‌పాట్రిక్.
- అనువైన సహజ పరిసరాల్లో పూర్తి చేసే సమస్యా కృత్యం..ప్రకల్పన అని నిర్వచించింది-స్టీవెన్‌సన్
- పాఠశాలలోకి దిగుమతి చేసిన నిజ జీవిత భాగం ప్రకల్పన అని పేర్కొన్నది – బెల్లార్డ్
- ప్రాజెక్ట్ పద్ధతిలో ఇమిడి ఉన్న సూత్రాలు.
  1) వాస్తవికత సూత్రం
  2) క్రియాత్మకతా సూత్రం
  3) ఉపయుక్తతా సూత్రం 4) స్వేచ్ఛా సూత్రం
  5) పొదుపు 6) సహ సంబంధం
- థార్న్‌డైక్ అభ్యసన సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్న పద్ధతి – ప్రాజెక్టు పద్ధతి.
- ప్రయోగశాల పద్ధతిని 3 రకాలుగా నిర్వహించవచ్చు.
- ప్రయోగశాలలోని ప్రయోగాలను 5 రకాలుగా విభజించవచ్చు.
- సమస్యా పరిష్కార పద్ధతిలో మొదటి సోపానం – సమస్యను గుర్తించడం.
- లెక్చర్ అంటే – బిగ్గరగా చదవడం.
- అన్వేషణ పద్ధతిలో పాటించాల్సిన నియమాలు
  1. చేయడం ద్వారా నేర్చుకొనే నియమం
  2. పరిశోధన నియమం
  3. తార్కికంగా ఆలోచించే నియమం
  4. అభ్యసనా నియమాల నియమం
  5. ప్రజాస్వామ్య వాతావరణ నియమం
  6. ప్రయోజనాత్మక అనుభవాల నియమం
- ఉపాధ్యాయ కేంద్రక పద్ధతుల ప్రయోజనాలు
  1. బోధనోపకరణాలు – ప్రయోగశాలల ఆవశ్యకత లేదు.
  2. సకాలంలో సిలబస్ పూర్తవుతుంది.
  3. ఎక్కువ తరగతి గదులు, ఉపాధ్యాయులు అవసరం లేదు.
  4. పాఠ్య పరిచయం, ముగింపు, సింహావలోకనం, సాధారణీకరణం చేసేటప్పుడు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు మొదలైనవాటిని బోధించేటప్పుడు ఇవే ఉత్తమ పద్ధతులు.
- విద్యార్థి కేంద్రక పద్ధతుల ప్రయోజనాలు.
  1. ప్రత్యక్ష అనుభవం,ఇంద్రియ శిక్షణ కారణంగా విద్యార్థుల్లో మూర్త భావనలు కలుగుతాయి.
  2. ఈ పద్ధతులు సమస్యా పరిష్కార శక్తిని పెంపొందిస్తాయి.
  3. విద్యార్థుల మానసిక అవసరాలను తృప్తి పరుస్తాయి.
  4. ఇవి మనో వైజ్ఞానిక పద్ధతులు.

### మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో అన్వేషణ పద్ధతిలో పాటించాల్సిన నియమం కానిది ఏది?
   1) పరిశోధనా నియమం
   2) అభ్యసనా నియమాల నియమం
   3) ఉపయుక్తతా నియమం
   4) చేయడం ద్వారా నేర్చుకొనే నియమం
2. కింది వాటిలో విద్యార్థి కేంద్రీకృత పద్ధతి ఏది?
   1) ప్రకల్పనా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
   3) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
   4) చారిత్రక పద్ధతి
3. కింది వాటిలో చారిత్రక పద్ధతిని ఉపయోగించే పద్ధతులు?
   1) ఉపఖ్యాన పద్ధతి 2) జీవిత చరిత్ర పద్ధతి
   3) సాంఘిక పద్ధతి 4) పైవన్నీ
4. విద్యార్థి కేంద్రీకృత పద్ధతుల వల్ల ప్రయోజనం ఏమిటి?
   1) ప్రత్యక్షానుభవం
   2) సమస్యా పరిష్కార శక్తిని పెంపొందించుట
   3) విద్యార్థుల మానసిక అవసరాలను తృప్తి పరుచుట 4) పైవన్నీ
5. స్మృతి స్థాయి బోధన నమూనాను రూపొందించింది?
   1) మోరిసన్ 2) హంట్
   3) జె.ఎస్. హెర్బర్ట్ 4) ఎమిడాన్
6. థార్న్‌డైక్ అభ్యసన సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్న పద్ధతి?
   1) అన్వేషణ పద్ధతి 2) ప్రాజెక్టు పద్ధతి
   3) చారిత్రక పద్ధతి 4) ఉపన్యాస పద్ధతి
7. అన్వేషణ పద్ధతిని ఒక ప్రధాన విజ్ఞాన శాస్త్ర బోధనా పద్ధతిగా అంగీకరించని రిపోర్ట్?
   1) మోరిసన్ రిపోర్ట్ 2) స్టీవెన్‌సన్ రిపోర్ట్
   3) థామ్సన్ రిపోర్ట్ 4) బెల్లార్డ్ రిపోర్ట్
8. న్యూటన్ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
   1) ప్రాజెక్టు పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
   3) చారిత్రక పద్ధతి 4) ఉపన్యాస పద్ధతి
9. గ్రీకు భాషలో హ్యూరిస్కో అంటే?
   1) కనిపెట్టడం 2) ప్రకల్పన
   3) పరిశోధించడం 4) 1, 3
10. కింది వాటిలో భావ ప్రసార ప్రక్రియలో చెప్పే విధానం దేనిని సూచిస్తుంది?
    1) సందేశం 2) మాధ్యమం
    3) పునర్బలనం 4) ఏదీకాదు
11. పరస్పర భావాలను పంచుకొనే విధానాన్ని ఏమంటారు?
    1) కమ్యూనికేషన్ 2) చర్చ
    3) ప్రక్రియ 4) సందేశం
12. లాటిన్‌లో కమ్యూనిస్ అంటే?
    1) మాధ్యమం 2) ప్రత్యక్షం
    3) కామన్ 4) అన్నీ
13. భావ ప్రసార ప్రక్రియలోని దశల సంఖ్య?
    1) రెండు 2) మూడు
    3) ఐదు 4) నాలుగు
14. బోధన ఒక పరస్పర చర్యా ప్రక్రియ అని పేర్కొన్నది?
    1) ఫ్లాండర్స్ 2) ఎడ్మండ్ ఎమిడాన్
    3) బి.ఒ. స్మిత్ 4) మోరిసన్
15. ప్రవర్తన అలవాట్లలో మార్పు తీసుకొని రావడానికి ప్రయత్నించే ప్రక్రియనేమంటారు?
    1) ఉద్దీపన 2) శిక్షణ
    3) నిబంధనం 4) ప్రక్రియ
16. బోధనలో అతి తక్కువ స్థాయికి చెందింది?
    1) ఉపదేశం 2) నిబంధనం
    3) శిక్షణ 4) సిద్ధాంతీకరణ
17. బోధనలో ఉన్నత స్థాయికి చెందింది?
    1) నిబంధనం 2) ఉపదేశం
    3) శిక్షణ 4) సిద్ధాంతీకరణ
18. హ్యూరిస్టిక్ పద్ధతిని రూపొందించినవారు?
    1) జాన్ డ్యూయీ 2) పెస్టాలజీ
    3) కిల్‌పాట్రిక్ 4) హెచ్.ఎ.ఆర్మ్‌స్ట్రాంగ్
19. ఉపాధ్యాయ కేంద్రక పద్ధతికి ఉదాహరణ?
    1) అన్వేషణ పద్ధతి 2) ప్రకల్పన పద్ధతి
    3) చారిత్రక పద్ధతి 4) ప్రయోగాల పద్ధతి
20. రేడియో ధార్మికత పాఠ్యాంశాన్ని బోధించడానికి మిక్కిలి అనుసరణీయమైన పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
    3) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
    4) ప్రయోగశాల పద్ధతి
21. సహజమైన సన్నివేశంలో పూర్తి చేసిన సమస్యాత్మక కార్యకలాపమే ప్రాజెక్టు అని నిర్వచించినవారు?
    1) కిల్‌పాట్రిక్ 2) బెల్లార్డ్
    3) బైనింగ్ అండ్ బైనింగ్ 4) జె.ఎ.స్టీవెన్‌సన్
22. సహజ వాతావరణంలో పూర్తి చేసే సమస్యాత్మక ప్రక్రియ ___ అనే వాక్యం దేన్ని ఉద్దేశించింది?
    1) ప్రయోగం 2) ప్రకల్పన
    3) ప్రదర్శన 4) సిద్ధాంతం
23. దత్తాంశాలను ప్రతిక్షేపించడం అనేది ఏ పద్ధతిలోని సోపానం?
    1) ప్రదర్శన పద్ధతి
    2) శాస్త్రీయ/వైజ్ఞానిక పద్ధతి
    3) ఉపన్యాస పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి
24. బోధనలో అతి తక్కువ స్థాయికి చెందింది?
    1) ఉపదేశం 2) నిబంధనం
    3) శిక్షణ 4) సిద్ధాంతీకరణ
25. ఎక్కాలు, గ్రామర్ సూత్రాలు, చిహ్నాలు, గుర్తులు లాంటివి నేర్చుకోవడం?
    1) పర్యాలోచక స్థాయి బోధన
    2) అవగాహన స్థాయి బోధన
    3) సమస్యాత్మక బోధన
    4) స్మృతిస్థాయి బోధన
26. విద్యార్థులు తాము గుర్తించిన సమస్యలను విడిగా, గ్రూపుల్లో పరిశోధించి పరిష్కారాన్ని కనుగొనే పద్ధతి?
    1) చారిత్రక పద్ధతి 2) నియోజన పద్ధతి
    3) ప్రదర్శన పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి
27. ఉపాధ్యాయ కేంద్రక పద్ధతికి ఉదాహరణ?
    1) అన్వేషణ పద్ధతి 2) ప్రకల్పన పద్ధతి
    3) చారిత్రక పద్ధతి 4) ప్రయోగశాల పద్ధతి
28. తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ విశేషాంశాలను బోధించడానికి ఉపయోగపడే పద్ధతి?
    1) అన్వేషణ పద్ధతి 2) ప్రకల్పన పద్ధతి
    3) ఉపన్యాస పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
29. హ్యూరిస్టిక్ పద్ధతిలో విద్యార్థి పాత్ర?
    1) నాయకుడు 2) యోజనకర్త
    3) అనుచరుడు 4) పరిశోధకుడు
30. సహజ పరిసరాల్లో సమస్యను సాధించే పద్ధతి?
    1) ప్రకల్పన పద్ధతి 2) హ్యూరిస్టిక్ పద్ధతి
    3) ఉపన్యాస పద్ధతి 4) నియోజన పద్ధతి
31. విజ్ఞాన శాస్త్రాన్ని మిగిలిన అన్ని శాస్త్రాలతో సహసంబంధ పరుస్తూ బోధించే పద్ధతి?
    1) హ్యూరిస్టిక్ పద్ధతి 2) ప్రాజెక్టు పద్ధతి
    3) సమస్యా పరిష్కార పద్ధతి
    4) ప్రయోగశాల పద్ధతి
32. ఎలక్ట్రాన్ విన్యాసం రాసే విధానం బోధించేందుకు ఉపాధ్యాయుడు ఉపయోగించాల్సిన బోధన పద్ధతి?
    1) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
    2) ఉపన్యాస పద్ధతి
    3) హ్యూరిస్టిక్ పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి

#### సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 4 5) 3
6) 2 7) 3 8) 3 9) 4 10) 2
11) 1 12) 3 13) 4 14) 1 15) 3
16) 3 17) 2 18) 4 19) 3 20) 1
21) 4 22) 2 23) 2 24) 3 25) 4
26) 4 27) 3 28) 3 29) 4 30) 1
31) 2 32) 2

## ఉద్యోగాలు

### కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 14 పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** ఔట్‌ఫిట్ అసిస్టెంట్-ఫిట్టర్(పైప్, ప్లంబర్)-02, మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్-12.
» **అర్హత:** పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ఔట్‌ఫిట్ అసిస్టెంట్ పోస్టుకు మొదటి ఏడాదికి రూ.23,300, రెండో ఏడాది రూ.24,000, మూడో ఏడాది రూ.24,800. -మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్ పోస్టుకు మొదటి ఏడాది రూ.22,100, రెండో ఏడాది రూ.22,800, మూడో ఏడాది రూ.23,400.
» **ఎంపిక విధానం:** ఫేజ్-1, 2 రాత పరీక్షలు, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**13.09.2024
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

### సీసీఆర్‌హెచ్-ఎన్‌హెచ్‌ఆర్‌ఐఎంహెచ్‌లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

కొట్టాయం(కేరళ)లోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (సీసీఆర్‌హెచ్)కి చెందిన నేషనల్ హోమియోపతి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ మెంటల్ హెల్త్(ఎన్‌హెచ్‌ఆర్‌ఐఎంహెచ్).. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** క్లినికల్ సైకాలజిస్ట్-01, ఆక్యుపేషనల్ థెరపిస్ట్-01, సైకియాట్రిక్ సోషల్ వర్కర్-01, థెరపీ అసిస్టెంట్(ఆక్యుపేషనల్)-01, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు క్లినికల్ సైకాలజిస్ట్ పోస్టుకు రూ.50,000, ఆక్యుపేషనల్ థెరపిస్ట్ పోస్టుకు రూ.40,000, మిగతా పోస్టులకు రూ.30,000
» **వయసు:**క్లినికల్ సైకాలజిస్ట్ పోస్టుకు 62 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది ఆఫీస్ ఇన్‌ఛార్జ్, నేషనల్ హోమియోపతి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ మెంటల్ హెల్త్, సచివోత్తమపురం, కొట్టాయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.ccrhindia.nic.in

# కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

## వాయు కాలుష్యం

మానవ మనుగడకు గాలి, నీరు, నేల అత్యంత ప్రధానమైనవి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో మనకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ మానవ కార్యకలాపాల వల్ల గాలి, నీరు, నేల వాటి సహజత్వాన్ని కోల్పోతున్నాయి. ఈ సహజ వనరులపై మనకెంత అధికారం ఉందో, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.

### గాలి - వాతావరణం

భూఉపరితలం నుంచి సుమారు 1000 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాయు మండలాన్ని వాతావరణం అంటారు. గాలి వివిధ వాయువుల మిశ్రమం. ఇందులో ప్రధాన అనుఘటకం నైట్రోజన్. తర్వాతి స్థానంలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరి ఉన్నాయి. వీటితోపాటు ఆర్గాన్, హీలియం, నియాన్ అనే జడవాయువులు ఉన్నాయి.

**గాలి సంఘటనం**

| గాలిలోని వాయువు | సంఘటనం |
|---|---|
| నైట్రోజన్ | 78% |
| ఆక్సిజన్ | 21% |
| ఆర్గాన్ | 0.9% |
| నీటిఆవిరి | 0.04% |
| కార్బన్ డై ఆక్సైడ్ | 0.03% |

గాలిలోని ఈ వాయువులు వాటి సహజ ధర్మాన్ని కోల్పోకుండా ఉంటాయి. అయితే ఈ సంఘటనం అన్ని వేళలా, అన్ని ప్రదేశాల్లో స్థిరంగా ఉండకపోవచ్చు. పారిశ్రామిక వాడల్లో శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం తదితర పదార్థాలను ఎక్కువగా మండిస్తారు. అందువల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం పెరుగుతుంది. శ్వాసక్రియలో భాగంగా మానవులు, ఇతర జంతుజాలం ఆక్సిజన్‌ను గ్రహించి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి. వెంటిలేషన్ సరిగా లేని తరగతి గదిలో శ్వాసించేందుకు సరిపడా ఆక్సిజన్ లభించదు. దీంతో ఆవలింతలు వస్తాయి. మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా పిండి పదార్థాలను తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను వినియోగించుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందుకే వృక్ష సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లోని గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ సమతుల్యంగా ఉంటుంది. 'లెగ్యుమినేసి' మొక్కలు ఉన్న ప్రాంతాల్లోని గాలిలో నైట్రోజన్ పరిమాణం సాధారణం కంటే తక్కువగా ఉంటుంది. ఈ మొక్కల వేర్ల బుడిపెల్లో బ్యాక్టీరియా ఉంటుంది. ఇది గాలిలోని నైట్రోజన్‌ను గ్రహించి మొక్కలకు ఉపయోగకరమైన నైట్రేట్ ఎరువుల రూపంలోకి మారుస్తుంది.

జంతు, వృక్ష సంబంధ పదార్థాలు బ్యాక్టీరియా వల్ల కుళ్లిపోయి, వాటి ప్రొటీన్ సంబంధిత సంయోగ పదార్థాలు వియోగం చెంది నైట్రోజన్ విడుదలవుతుంది. ఇలా విడుదలైన నైట్రోజన్ గాలిలోకి చేరుతుంది.

గాలిలోని నీటిఆవిరి కూడా అన్ని ప్రదేశాల్లో ఒకేలా ఉండదు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, సముద్ర తీర ప్రాంతాల్లో గాలిలో నీటిఆవిరి ఎక్కువగా ఉంటుంది. పీఠభూమి ప్రాంతాల్లో తేమ(నీటిఆవిరి) తక్కువగా ఉంటుంది. శీతాకాలంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిఆవిరి అధికంగా ఉండటం వల్ల నీటిమంచు, పొగమంచు ఏర్పడతాయి.

మనం పీల్చే గాలి సహజ సంఘటనంలో ఉండటం లేదు. వాహనాలు, పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు విష వాయువులను వెలువరిస్తున్నాయి. బొగ్గును మండించటం, వంటచెరకు కాల్చడం తదితర చర్యల వల్ల కూడా అనేక విష వాయువులు గాలిలో చేరుతున్నాయి. ఇలా వాతావరణంలో చేరే వాటిలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, ఫ్రియాన్, ఓజోన్, మీథేన్ లాంటి వాయువులు; ఫ్లైయాష్, మెర్క్యురీ, జింక్, క్రోమియం, కాడ్మియం తదితర లోహాలు ముఖ్యమైనవి.

### వాతావరణ కాలుష్యం - పదాల వివరణ

**కాలుష్యం:** మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల వల్ల విడుదలై, పరిసరాల మీద దుష్ప్రభావం చూపే పదార్థాన్ని కాలుష్యం అంటారు.

**ఉదాహరణ:** సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువులు. లెడ్, మెర్క్యురీ తదితర లోహాలు. పుప్పొడి రేణువులు, దుమ్ము, ధూళి, రేడియోధార్మిక పదార్థాలు, పురుగు మందులు మొదలైనవి.

**మలినం:** ప్రకృతిలో సహజంగా లభించని, మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల ద్వారా పరిసరాల్లోకి విడుదలైన పదార్థాన్నే మలినం అంటారు.

**ఉదాహరణ:** భోపాల్ దుర్ఘటనకు కారణమైన మిథైల్ ఐసోసయనేట్. ఢిల్లీ దుర్ఘటనకు కారణమైన పైరో సల్ఫ్యూరిక్ ఆమ్లం. హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమైన క్లోరో ఫ్లోరో కార్బన్లు (ఫ్రియాన్‌లు). ఈ వాయువులు ప్రకృతిలో సహజసిద్ధంగా లభించవు. మానవ కార్యకలాపాల ద్వారా గాలిలో చేరాయి.

**గ్రాహకం:** కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమాన్ని గ్రాహకం అంటారు. **ఉదా:** ఆటోమొబైల్ గ్యారేజిలో, రోడ్లపై వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా మన కళ్లు ఎర్రబారి మండుతాయి. ఈ సందర్భంలో కళ్లను గ్రాహకాలు అనవచ్చు.

**సింక్:** కాలుష్యాలతో చర్య జరిపే మాధ్యమాన్ని సింక్ అంటారు. ఉదాహరణకు అడవులు, సముద్రాలు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని సింక్‌లుగా పనిచేస్తాయి.

### వాతావరణ విభాగాలు

భూమిపై సుమారు 500 కి.మీ. వరకు వ్యాప్తి చెంది ఉన్న వాతావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. భూమి ఉపరితలం నుంచి పైకి పోయే కొద్దీ గాలి సాంద్రత, పీడనం, ఉష్ణోగ్రత తగ్గుతాయి. అందుకే ఎత్తయిన కొండ ప్రాంతాల్లో త్వరగా వంట చేయలేం. పర్వతారోహకులకు ఆక్సిజన్ సరిగా అందదు.

ట్రోపో ఆవరణం (0-11 కి.మీ), స్ట్రాటో ఆవరణం (11-50 కి.మీ.), మీసో ఆవరణం (50-85 కి.మీ.), థర్మో ఆవరణం (85-500 కి.మీ.) అనేవి వాతావరణంలోని పొరలు.

స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ పొర ఉంటుంది. ఇది సూర్యరశ్మిలోని చర్మ క్యాన్సర్‌ను కలిగించే అతినీలలోహిత కిరణాలను భూమికి చేరకుండా అడ్డుకుంటుంది. కానీ ఫ్రియాన్లు ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతున్నాయి. స్ట్రాటో స్ఫియర్‌లోనే విమానాలు ప్రయాణిస్తాయి. అంతరిక్షం నుంచి భూమివైపు వేగంగా దూసుకొచ్చే ఉల్కలు మీసో ఆవరణంలో మండిపోతాయి. భూమి నుంచి ఉద్గారమైన రేడియో తరంగాలు థర్మోస్ఫియర్ ద్వారా తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి.

### ప్రధాన వాయు కాలుష్యాలు



**కార్బన్ మోనాక్సైడ్ (CO):** ఇది విషపూరితమైంది. పెట్రోల్ లాంటి శిలాజ ఇంధనాలు తక్కువ గాలి(ఆక్సిజన్) సమక్షంలో అసంపూర్తిగా మండటం వల్ల ఇది వాతావరణంలోకి విడుదలవుతుంది. వాహనాలు, ఐరన్, స్టీల్ పరిశ్రమలు, ఘన వ్యర్థాల నుంచి కూడా ఇది విడుదలవుతుంది. కార్బన్ మోనాక్సైడ్‌ను పీల్చడం ప్రమాదకరం. ఇది హిమోగ్లోబిన్‌తో కార్బాక్సీ హిమోగ్లోబిన్‌ను ఏర్పర్చి రక్తంలో ఆక్సిజన్ సరఫరా కాకుండా చేస్తుంది. హిమోగ్లోబిన్‌తో ఆక్సిజన్ ఏర్పరిచే బంధం కంటే CO బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. వాతావరణంలో ఆమోదింపదగిన CO స్థాయి 7 పీపీఎం. దీని పరిమాణం ఎక్కువైతే దృష్టి కోల్పోవడం (10 పీపీఎం), తలనొప్పి (100 పీపీఎం), స్పృహ కోల్పోవడం (250 పీపీఎం), కోమాలోకి వెళ్లడం (750 పీపీఎం), తక్షణ మరణం (1000 పీపీఎం) లాంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. కార్బన్ మోనాక్సైడ్‌కు నేల ప్రధానమైన సింక్. నేలలోని కొన్ని రకాల సూక్ష్మజీవులు వాతావరణంలోని COను తొలగిస్తాయి.

**కార్బన్ డై ఆక్సైడ్ ($CO_2$):** ఇది విషపూరితం కాని కాలుష్యకారకం. శ్వాసక్రియ, శిలాజ ఇంధనాల దహనం, సిమెంట్ పరిశ్రమలు (సున్నపురాయిని కాల్చడం ద్వారా), మొక్కలు కుళ్లిపోవడం, అగ్నిపర్వతాల విస్ఫోటనం తదితర కారణాల వల్ల $CO_2$ వాతావరణంలో కలుస్తుంది. అడవులను ప్రధాన కార్బన్ డై ఆక్సైడ్ సింక్‌లుగా పేర్కొనవచ్చు. సముద్రాలు కూడా కార్బన్ డై ఆక్సైడ్‌ను కరిగించుకొని కార్బొనేట్లు, బైకార్బొనేట్లను ఏర్పరుస్తూ మరో ప్రధాన సింక్‌లుగా పనిచేస్తాయి. సూర్యరశ్మి సమక్షంలో క్లోరోఫిల్ ఉన్న మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి పిండిపదార్థాలను తయారుచేసుకుంటాయి. ఇవి $CO_2$ స్థాయిని తగ్గిస్తాయి. హరిత గృహ ప్రభావం (భూగోళ తాపం) కలిగించే వాయువుల్లో కార్బన్ డై ఆక్సైడ్ ప్రధానమైంది.

**ఇతరవాయువులు:** నీటి ఆవిరి, ఫ్రియాన్లు, ఓజోన్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్.

**సల్ఫర్ డై ఆక్సైడ్:** ఇది ఘాటైన వాసన ఉన్న, రంగు లేని వాయువు. నేలబొగ్గును మండించటం (ఉదా: థర్మల్ పవర్ ప్లాంట్లు), పెట్రోలియం రిఫైనరీలు, అగ్నిపర్వతాలు, పైరైటిస్ ఖనిజాల (ఐరన్, కాపర్, జింక్ సల్ఫైడ్‌లు) భర్జనం, కుళ్లిన పదార్థాల నుంచి విడుదలైన హైడ్రోజన్ సల్ఫైడ్ ఆక్సీకరణం తదితర కారణాల వల్ల ఇది వాతావరణంలోకి చేరుతుంది. ఇది నైట్రోజన్ ఆక్సైడ్‌తో కలిసి ఆమ్ల వర్షానికి కారణమవుతుంది. ఆమ్ల వర్షాల వల్ల నేల pH తగ్గుతుంది. ఫలితంగా నేల నిస్సారమవుతుంది. పాలరాయి లేదా చలువరాయి/సున్నపురాయితో నిర్మించిన కట్టడాలకు సల్ఫర్ డై ఆక్సైడ్ వల్ల నష్టం వాటిల్లుతుంది. పాలరాతి కట్టడమైన తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి మధురలోని చమురు శుద్ధి కర్మాగారం విడుదల చేసే సల్ఫర్ డై ఆక్సైడే కారణం. ఈ వాయువు ఊపిరితిత్తుల వ్యాధిని కలిగిస్తుంది. మొక్కల పెరుగుదలను క్షీణింపజేస్తుంది.

**నైట్రోజన్ ఆక్సైడ్‌లు:** నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్‌లు కాలుష్యాన్ని కలిగించే ప్రధాన నైట్రోజన్ ఆక్సైడ్‌లు. ఇవి గ్రీన్‌హౌస్ వాయువులు. నైట్రోజన్ ఆక్సైడ్ స్ట్రాటోస్ఫియర్‌లో కాంతి రసాయన చర్యల్లో పాల్గొని ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతుంది. ఇది నేలలోని సూక్ష్మజీవుల వల్ల కూడా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ ఒకదానితో మరొకటి చర్య జరపవు. కానీ మెరుపులు ఏర్పడినప్పుడు అధిక ఉష్ణోగ్రతల (1483 K కంటే అధికం) వద్ద ఈ రెండు వాయువులు చర్య జరపుతాయి. ఫలితంగా నైట్రోజన్ ఆక్సైడ్‌లు వాతావరణంలోకి విడుదలవుతాయి. నైట్రోజన్ డై ఆక్సైడ్ సూర్యరశ్మి సమక్షంలో విఘటనం చెంది చర్యాశీలత ఉన్న ఆక్సిజన్ పరమాణువును ఏర్పరుస్తుంది. ఇది బాష్పశీల హైడ్రోకార్బన్లు, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ లాంటి సమ్మేళనాలతో కలిసి 'కాంతి రసాయన స్మాగ్'కు కారణమవుతుంది.

### మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసే ప్రక్రియలేవి?
ఎ. అగ్ని పర్వతాల విస్ఫోటనం
బి. జంతు శ్వాసక్రియ
సి. కిరణజన్య సంయోగక్రియ
డి. మొక్కలు కుళ్లిపోవడం
1) ఎ,బి మాత్రమే
2) ఎ, సి, డి మాత్రమే
3) ఎ, బి, డి మాత్రమే 4) పైవన్నీ
2. స్టీల్ పరిశ్రమ వాతావరణంలోకి విడుదల చేసే కాలుష్య కారక వాయువులేవి?
1) సల్ఫర్ డై ఆక్సైడ్
2) కార్బన్ డై ఆక్సైడ్
3) కార్బన్ మోనాక్సైడ్ 4) పైవన్నీ
3. మెరుపులు ఏర్పడినప్పుడు విడుదలయ్యే వాయువు ఏది?
1) నైట్రస్ ఆక్సైడ్ 2) కార్బన్ డై ఆక్సైడ్
3) సల్ఫర్ డై ఆక్సైడ్
4) నైట్రోజన్ డై ఆక్సైడ్
4. కాంతి రసాయన పొగమంచుకు కారణమైన పదార్థాలేవి?
1) నైట్రస్ ఆక్సైడ్ 2) పొగ
3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
4) పైవన్నీ
5. వాతావరణంలో అనుమతించదగ్గ కార్బన్ మోనాక్సైడ్ స్థాయి?
1) 10 పీపీఎం 2) 7 పీపీఎం
3) 50 పీపీఎం 4) 100 పీపీఎం
6. కింద ఇచ్చిన వాటిలో గాలిని కలుషితం చేయనిది?
1) ఫ్లై యాష్ 2) ఫ్రియాన్
3) హైడ్రోజన్ సల్ఫైడ్ 4) ఫ్లోరైడ్
7. అంటార్కిటికాలో ఓజోన్ క్షీణతకు కారణమైన పదార్థం?
1) ఎక్రోలిన్ 2) PAN
3) CO, $CO_2$ 4) క్లోరిన్ నైట్రేట్
8. కార్బన్ మోనాక్సైడ్ (CO) విడుదలకు ప్రధాన కారణం?
1) పరిశ్రమలు 2) వాహనాలు
3) అడవులు 4) అగ్నిపర్వతాలు
9. రేడియో తరంగాలను పరావర్తనం చేసే వాతావరణ పొర?
1) స్ట్రాటో ఆవరణం
2) మీసో ఆవరణం
3) ట్రోపో ఆవరణం
4) థర్మో ఆవరణం
10. వాతావరణం పై పొరల్లో ఓజోన్ పొర క్షీణతకు కారణమైన వాయువులేవి?
1) ఫుల్లరీన్లు 2) ఫ్రియాన్లు
3) పాలిహాలోజన్లు
4) ఫెర్రోసీన్

**సమాధానాలు**

1) 3; 2) 4; 3) 1; 4) 4; 5) 2;
6) 4; 7) 4; 8) 2; 9) 4; 10) 2.

# What did the government do right?

**MODEL QUESTIONS**

***Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.***


1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a near month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

***Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.***

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
1) Disdainful 2) respectful
3) deferential 4) referential
5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
1) Servile 2) imply
3) comply 4) entail
5) authoritative
8. Punishment is ____in deterring from crime only if it be certain and ____.
1) Useless, slow
2) futile, leisurely
3) ineffectual, dawdling
4) vain, sluggish
5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
1) simple, bustling
2) basic, docile
3) ambiguous, serene
4) undetectable, quite
5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
1) hefty 2) paltry
3) substantial 4) generous
5) considerable

***Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.***

11. <u>She recommended that John should take the ferry.</u>
1) She recommended that John takes the ferry.
2) She recommended that John is taking the ferry.
3) She recommended that John has taken the ferry.
4) She recommended that John take the ferry.
5) No correction required
12. After the attack on the World



BANK EXAMS

GENERAL ENGLISH

Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
1) would do the preparation of lists of America's most wanted terrorists
2) preparing lists of most wanted terrorists in America
3) the preparing of a list of the most wanted terrorists in America
4) to prepare lists of the most wanted terrorists in America
5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
1) all the paintings a tiny etched landscape inside their
2) all the paintings a tiny etched landscape inside its
3) every painting a tiny etched landscape inside their
4) each painting a tiny etched landscape inside their
5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
1) like insects flitting gracefully from one flower to another
2) as insects do that flit gracefully from one flower to others
3) like insects do that flit gracefully from one flower to others
4) as do insects that flit gracefully from one flower to some other one
5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
1) are priced to sell, and they have
2) are priced to sell, and they do
3) are being priced to sell, and have
4) had been priced to sell, and they have
5) No correction required

***Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.***

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C
4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D
4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D
4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C
4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C
4) D 5) F

***Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.***

Sardar Patel had no time for religious extremists of any kind. It didn't matter whether you were Muslim or Hindu; if you were misusing religion and religious sentiments to further your political power, Patel was not your friend. While he may have had more sympathy towards some Hindu traditions than Jawaharlal Nehru, neither Nehru nor Patel was blind to the fact that the Rashtriya Swayamsevak Sangh and Hindutva lot consistently bowed to the British rulers while Congress leaders, like themselves, were slammed into jail where some of them even died. After the murder of Bapu, Patel's anger towards the RSS was unimaginable, and he banned the organization. He lifted the ban only after the group signed an agreement saying they would stay away from politics. That assurance was given in shameless bad faith, and today we have the irony of that same RSS trying to hollow out the legacies of Gandhi, Nehru, Patel and Ambedkar even while building the gigantic Trojan Horse in Narmada district.

I'm sure there are people in Nagpur chortling into their falangist white shirts, thinking this is sweet revenge, that this statue of Patel will actually be a mausoleum of Gandhi's and Sardar's principles and ideology. The statue itself stares over a land destroyed to make the Narmada Dam and so-called Sardar Sarovar, where thousands of people were ripped out of their traditional lands to create an irrigation project that would benefit only a very few, a project that has failed dismally. To erect this obscene pile on the site of that robbery and disastrous planning is to add insult to injury. The insult is as much to the poor people of Gujarat as it is to Sardar Patel, one of their greatest champions. This statue may be intended as the means to inter Patel's idea of India, but in time, when history kicks back, it might well become the mausoleum for the toxic ideology of Hindutva.

21. Which of the following statements is true?
1) Sardar Patel was tolerant towards Hindutva
2) Sardar Patel entertained religious extremists
3) Those who were misusing religion and religious sentiments occupied the coterie of Sardar
4) all the above
5) None of the above
22. What is the odd one out from the following options?
1) Rip out 2) Relegate
3) Expunge 4) Ratify
5) Efface
23. The writer is ____
1) Comparing Gandhi and Patel
2) Demonstrating the strength of RSS
3) Talking about Trojan horse
4) Vehement about the project
5) Disparaging the project
24. The synonym of dismal is:
1) Drab 2) Grab
3) Clutch 4) Dangle
5) Droop
25. The antonym of obscene is:
1) Profane 2) Pure
3) Prurient 4) Ribald
5) Wanton

**KEY**

| | | | | |
|---|---|---|---|---|
| 1) 4 | 2) 2 | 3) 3 | 4) 4 | 5) 2 |
| 6) 1 | 7) 1 | 8) 5 | 9) 5 | 10) 2 |
| 11) 4 | 12) 4 | 13) 5 | 14) 2 | 15) 2 |
| 16) 1 | 17) 2 | 18) 3 | 19) 5 | 20) 3 |
| 21) 5 | 22) 4 | 23) 5 | 24) 1 | 25) 2 |